

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 166

మంగళవారం 5-9-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



టీమిండియా అలవోకగా..

నేపాల్‌పై 10 వికెట్ల తేడాతో నెగ్గిన భారత్.. ఆసియాకప్ సూపర్-4కు అర్హత - 14లో



'ప్రకృతి' ప్రాజెక్టులపై పెట్టుబడులు

భారత్‌లో 3 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్న అమెజాన్ - 15లో



మరోసారి 'విక్రమ్' ల్యాండింగ్

చంద్రయాన్-3లో భాగంగా జాబిల్లి దక్షిణ ధ్రువం ఉపరితలంపై ల్యాండర్ 'విక్రమ్'ను ఇస్రో మరోసారి సాఫ్ట్ ల్యాండింగ్ చేసింది.

వివరాలు 6లో ▸



నేడు కాంగ్రెస్ సమావేశం

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ పార్లమెంటరీ వ్యూహ కమిటీ నేడు సమావేశం కానుంది.

వివరాలు 6లో ▸



68 ఏళ్ల సాల్వేకు మూడో పెళ్లి

మాజీ సొలిసిటర్ జనరల్ హరీష్ సాల్వే(68) లండన్‌లో త్రినా అనే మహిళను వివాహం చేసుకున్నారు. సాల్వేకు ఇది మూడో వివాహం.

వివరాలు 6లో ▸



నాస్కామ్ చైర్‌పర్సన్‌గా రాజేశ్

కాగ్నిజెంట్ ఇండియా సీఎండీ రాజేశ్ నంబియార్‌ను తమ చైర్‌పర్సన్‌గా నియమించినట్లు నాస్కామ్ ప్రకటించింది.

వివరాలు 15లో ▸

చిట్టాలో చినబాబు!

మీ కుమారుడి సన్నిహితులకు ముట్టిన ముడుపులకు ఆధారాలివిగో

చంద్రబాబుకు ఇచ్చిన నోటీసుల్లో వెల్లడించిన ఐటీ శాఖ

- లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడు కిలారు రాజేశ్‌కు చేరిన ముడుపులు
- టీడీపీ కార్యాలయంలో కిలారుకు రూ.4.5 కోట్లు అందించామన్న మనోజ్ వాసుదేవ్
- ఆర్‌వీఆర్ ఇన్‌ఫ్రాకి చెందిన రఘు రేలా ద్వారా మరో రూ.20.18 కోట్లు
- నారాయణ, కృష్ణ అనే వ్యక్తుల ద్వారా నగదు తరలింపు
- ఎన్నికల అనంతరం కూడా అక్రమ సంపాదన వసూలులో బాబు బిజీ



చంద్రబాబుకు ఇచ్చిన నోటీస్‌లో ఆయన తనయుడు నారా లోకేశ్ పేరును ప్రస్తావించిన ఐటీ శాఖ

సాక్షి, అమరావతి: రాజధాని పేరుతో తాత్కాలిక భవన నిర్మాణ సంస్థల నుంచి ముడుపులు పిండుకోవడంలో 'చినబాబు' కూడా చేతివాటం చూపిన విషయం ఐటీ నోటీసులతో వెలుగులోకి వచ్చింది. ఈమేరకు మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడుకు జారీ చేసిన 46 పేజీల సుదీర్ఘ నోటీసుల్లో నారాలోకేశ్ పేరును కూడా ఆదాయపు పన్ను శాఖ ప్రస్తావించింది. లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడు, టీడీపీ కార్యదర్శిగా ఉన్న కిలారు రాజేశ్

మిగతా 3వ పేజీలో ▶

ఆ బంధం ఎంత బలమైనదంటే..

నగదు తరలింపులో కీలకంగా వ్యవహరించిన మనోజ్ వాసుదేవ్ పార్థసాని 2019 సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు ఓడిపోవడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. టీడీపీ ఘోరంగా ఓడిపోయి చంద్రబాబు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతో ఆయన పీఏ శ్రీనివాస్‌కు మనోజ్ వాసుదేవ్ ఒక మెసేజ్ పంపారు. తన జీవితంలో ఇటువంటి దారుణమైన రాజీనామా లేఖను చూడలేదని అందులో పేర్కొన్నారు. వీరి మధ్య బంధం ఎంత బలంగా ఉందనేందుకు ఆ మెసేజ్ నిదర్శనమని ఐటీ శాఖ తన నోటీసులో పేర్కొంది. నిర్మాణ రంగ సంస్థల నుంచి నగదును అక్రమంగా తరలించారనేందుకు ఇవి తిరుగులేని సాక్ష్యాలని, నగదు తరలింపులో మీ తనయుడు లోకేశ్ సన్నిహితులు కీలక పాత్ర పోషించారనేందుకు ఇవన్నీ నిదర్శనమని చంద్రబాబుకు జారీ చేసిన నోటీసుల్లో ఐటీ శాఖ స్పష్టంగా పేర్కొంది.

ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద తనిఖీ చేస్తున్న డాగ్‌స్క్వాడ్



శిఖరాగ్ర భేటీకి ప్రపంచ స్థాయి భద్రత

- జీ-20 సమావేశాలకు 1.30 లక్షల మంది భద్రతా సిబ్బందితో కట్టుదిట్టమైన రక్షణ వ్యవస్థ
- ఏరోస్పేస్ రక్షణ కోసం సమగ్ర చర్యలు..
- పలు ప్రాంతాల్లో యాంటీ డ్రోన్ రక్షణ వ్యవస్థ ఏర్పాటు.. 1.20 లక్షల సీసీటీవీ కెమెరాలతో ప్రత్యేక నిఘా
- ఢిల్లీ అంతటా మొదలైన విస్తృత తనిఖీలు

6 లో

జీ20కి జిన్‌పింగ్ దూరం

జీ20 శిఖరాగ్ర భేటీకి అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరుకావడం లేదని చైనా తెలిపింది. ప్రధాని లీ క్వియాంగ్ చైనా ప్రతినిధి బృందానికి సారథ్యం వహిస్తారని స్పష్టం చేసింది.



సరిహద్దుల్లో విన్యాసాలు

జీ20 సదస్సు నేపథ్యంలో భారత వైమానిక దళం చైనా, పాకిస్తాన్ సరిహద్దుల్లో సోమవారం త్రిశూల్ పేరిట భారీ సైనిక విన్యాసాలకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 14 వరకు ఇవి కొనసాగనున్నాయి. ఆర్మీ విభాగాలు లద్దాఖ్‌లో ప్రత్యేక విన్యాసాలు నిర్వహించనున్నాయి.

ఫ్యాక్ట్ చెక్

పేద పిల్లలకు ఇచ్చే ట్యాబ్‌లపైనా ఏడుపేనా?

- ప్రభుత్వ విద్యార్థులకు ట్యాబ్‌లు ఇవ్వొద్దనేనా మీ బాధ రామోజీ?
- విద్యార్థుల ఆసక్తి మేరకే పెద్ద తెర ఉన్నవి కొనుగోలు
- జ్యుడిషియల్ ప్రివ్యూకు పంపడంతోపాటు రివర్స్ టెండరింగ్ నిర్వహిస్తున్నది తెలియదా?
- ట్యాబ్‌ల నిర్వహణకు ప్రత్యేక యంత్రాంగం ఉందన్న విషయం తెలుసా.. లేదా?
- స్కూళ్లకే డిజిటల్ అసిస్టెంట్లు వెళ్తున్న విషయం మరిచారా?

2 లో

విద్యుత్ వినియోగానికి పరిమితులు లేవు



- 'రాష్ట్రంలో పవర్ హాలిడే లేదు. ఆదివారం అన్ని రంగాలకు ఎలాంటి కోతలు, పరిమితులు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేశాం. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా పరిస్థితి మెరుగుపడినందున పరిశ్రమలకు కూడా విద్యుత్ సరఫరాపై ఎలాంటి పరిమితులు అమలు చేయడం లేదు' అని విద్యుత్ పంపిణీ సంస్థలు సోమవారం ప్రకటించాయి.

11 లో

లొంగిపోయిన టీడీపీ నేత చల్లా బాబు



- పుంగనూరు విధ్వంసం కేసులో ప్రధాన నిందితుడు
- పోలీసులపై దాడి అనంతరం టీడీపీ మూకలతో కలిసి పరారీ
- బెయిల్ నిరాకరించిన హైకోర్టు
- ఎన్నిసార్లు మకాం మార్చినా పోలీసులు సమీపిస్తుండటంతో లొంగిపోయిన చల్లా బాబు
- మరో 66 మంది టీడీపీ నేతలు, కార్యకర్తలూ లొంగుబాటు

16 లో

కొత్త రిజిస్ట్రేషన్ల విధానంపై.. అపోహలొద్దు

భౌతికంగా దస్తావేజులు ఉండవనేది నిజం కాదు

- వినియోగదారులకు 2 ఆప్షన్లు
- ఆన్‌లైన్ ఆప్షన్, భౌతికంగా దస్తావేజులు పొందే ఆప్షన్ ఉంటాయి
- అత్యంత పారదర్శకంగా కార్డ్ ప్రైమ్ 2.0 రూపొందించాం
- ఇప్పుడున్న వ్యవస్థ కంటే ఇది అత్యంత సురక్షితం..
- ప్రజలు ఆన్‌లైన్‌లో నేరుగా డాక్యుమెంట్లు తయారు చేసుకోవచ్చు
- డాక్యుమెంట్ రైటర్లు కూడా ఈ విధానాన్ని ఉపయోగించుకోవచ్చు
- మీడియాతో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్




సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్త రిజిస్ట్రేషన్ల విధానంపై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ ప్రజలను కోరారు. ఈ విధానం అత్యంత సురక్షితమైంది.. పారదర్శకమైందని చెప్పారు. భౌతికంగా దస్తావేజులు ఉండవనే విషయంలో వ్యక్తమవుతున్న అభిప్రాయాల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. దస్తావేజులు భౌతికంగా కావాలనుకునే వారు ఇప్పుడు కూడా పొందే అవకాశం ఉందని ఆయన స్పష్టంచేశారు. వెలగపూడి సచివాలయంలో

మిగతా 2వ పేజీలో ▶

ఊరూరా ఆటల పండుగ..

రాష్ట్రంలో 38 రోజుల పాటు ఆడుదాం ఆంధ్ర




- దేశ చరిత్రలోనే మెగా క్రీడా టోర్నీకి శ్రీకారం.. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం
- పోటీల్లో 34.20 లక్షల మందికిపైగా క్రీడాకారులు
- ప్రతి సచివాలయం నుంచి 228 మంది ప్రాతినిధ్యం
- క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ విభాగాల్లో బాలబాలికలకు పోటీలు.. ఐదుదశల్లో నాకౌట్ పద్ధతిలో టోర్నీ నిర్వహణ
- అక్టోబర్ 2 నుంచి నవంబర్ 8వ తేదీ వరకు పోటీలు.. వివిధ స్థాయిల్లో నిర్వహణ కమిటీల ఏర్పాటు

16 లో

వైద్య విద్య పీజీ సీట్ల కేటాయింపు

- తొలి దశలో నాన్ సర్వీస్ విద్యార్థులకు..
- కన్వీనర్ కోటాలో 1,085కు 999 సీట్లు భర్తీ
- 8న కళాశాలల్లో రిపోర్ట్ చేయాలి



- వివరాలు 16లో



ప్రస్తుతానికి వరుస భేటీలలో గ్రాండ్ సక్సెస్ అయ్యాం.. హ్యాపీ!!

క్లుప్తంగా...

ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు విశాఖ ఆతిథ్యం

నేడు ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు పురస్కారాలు

ఏయూ క్యాంపస్ (విశాఖ): రాష్ట్ర స్థాయిలో ఈ ఏడాది నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు విశాఖ ఆతిథ్యం ఇస్తోంది. విద్యల నిలయంగా బాసిల్లుతున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సీఆర్ రెడ్డి స్నాతకోత్సవ మందిరంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం కానుంది. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి పురస్కారాలను ప్రదానం చేసి సత్కరిస్తారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర మంత్రులు విడదల రజని, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, గుడివాడ అమర్నాథ్, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్, మేయర్ జి.హరివెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, సత్యవతి పాల్గొంటారు. రాష్ట్ర స్థాయిలో అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులను, అధ్యాపకులను సత్కరిస్తారు.

యూఎస్ వర్సిటీల అధికారులతో మంత్రి బొత్స భేటీ



మంత్రి బొత్స సత్యనారాయణకు జ్ఞాపికను అందిస్తున్న వర్సిటీ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక అటవీ విశ్వవిద్యాలయం (ఫారెస్ట్ యూనివర్సిటీ) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి బొత్స అలబామాలోని ప్రసిద్ధ ఆబర్న్ యూనివర్సిటీ అధికారులతో భేటీ అయ్యారు. ఏపీ ప్రభుత్వ విదేశీ విద్యా కో–ఆర్డినేటర్ డాక్టర్ కుమార్ అన్నవరపు మంత్రికి స్వాగతం పలికి ఆబర్న్ యూనివర్సిటీ అధికారులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం ఉన్నత విద్యకు ఇస్తున్న ప్రాధాన్యం, విద్యారంగంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను ఆబర్న్ వర్సిటీ అధికారులకు వివరించారు. వ్యాక్సిన్ల అభివృద్ధి పరిశోధన, కేస్ స్టడీస్ రంగాల్లో విశేషమైన కృషి చేస్తున్న అట్లాంటాలోని సుప్రసిద్ధ ఎమరే యూనివర్సిటీ అధికారులు ఈ రంగంలో ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆ యూనివర్సిటీ ప్రొఫెసర్ రామారావు అమరాతో భేటీ అయిన మంత్రి బొత్స ఏపీలో వ్యాక్సిన్స్ అభివృద్ధి సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ఈ పర్యటనలో ఆబర్న్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అలవలపాటి జానకిరామిరెడ్డి, ఏపీ ప్రభుత్వ అమెరికా ప్రతినిధి రత్నాకర్ పండుగల తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీఆర్ఐలో 8న ఓపెన్‌డే

ఉప్పల్: జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ (ఎన్‌జీఆర్ఐ) చేస్తున్న పనులు.. శాస్త్రవేత్తలు చేసే పరిశోధనలు సామాన్య ప్రజలకు తెలియజెప్పడానికి ప్రత్యేకంగా 'ఒకవారం.. ఒక ప్రయోగశాల' అనే వినూత్న కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు. ఇది సోమవారం ప్రారంభం కాగా, భారత ప్రభుత్వ విజ్ఞాన శాఖ మాజీ ముఖ్యకార్యదర్శి డాక్టర్ పీఎస్. గోయల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందులో విద్యార్థులను కూడా భాగస్వామ్యులు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 8వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 వరకు వారు ఎన్‌జీఆర్ఐను సందర్శించవచ్చు.

రైతులకు ఒకరోజు

వివిధ రాష్ట్రాలకు చెందిన రైతులకు ఎన్‌జీఆర్‌లో 7వ తేదీని కేటాయించారు. శాస్త్రవేత్తలు రైతులకు ఎలా ఉపయోగపడతారో తెలియజేస్తారు. ఆయా ప్రాంతాల్లోని రైతులు నీటివనరులు లేక ఇబ్బందులు పడుతున్నారు. వారి కోసం శాస్త్రవేత్తలు నీటినిల్వలను అన్వేషించి రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తారు.

సిరిధాన్యాలపై అంతర్జాతీయంగా ఆసక్తి

సాక్షి, హైదరాబాద్/శంషాబాద్: ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి అనుకూలమైన సిరిధాన్యాలపై ఇప్పుడు అంతర్జాతీయంగానూ ఆసక్తి పెరుగుతోందని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. భారత్ అధ్యక్షతన జరుగుతున్న జీ–20 సమావేశాల్లో భాగంగా సోమవారం హైదరాబాద్‌లో మొదలైన 'క్లైమేట్ రెసిలియెంట్ ఫార్మింగ్ టెక్నికల్ వర్క్‌షాప్‌కు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జీ–20 సమావేశాల్లో పాల్గొంటున్న అనేక దేశాల ప్రతినిధులు, సిరిధాన్యాలపై ఆసక్తికనబరుస్తున్నారని, విత్తనాలతో పాటు ఉత్పత్తులు, తయారీ పద్ధతుల గురించి వాకబు చేస్తున్నారని తెలిపారు. విదేశీ ప్రతినిధుల ఆసక్తి ముఖ్యంగా రాగి విత్తనాలపై కనిపించిందని, మరికొందరు ఇతర ధాన్యాల గురించి కూడా అడిగారని, దేశంలోనూ ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు కూడా సిరిధాన్యాలు సాగు దిశగా అడుగులేస్తున్నాయని వివరించారు.

అవ్వాతాతల చేతికి రూ.1,719.46 కోట్లు

సాక్షి, అమరావతి: అవ్వాతాతల పింఛన్ల పంపిణీ 97.44 శాతం పూర్తయింది. గ్రామ, వార్డు వలంటీర్లు లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి సోమవారం సాయంత్రం వరకు 62,40,803 మంది లబ్ధిదారులకు రూ.1,719.46 కోట్లు అందజేశారు. అత్యధికంగా తిరుపతి జిల్లాలో 98.2 శాతం మందికి పంపిణీ పూర్తయినట్లు సెర్ప్ అధికారులు వెల్లడించారు.



ఒంగోలు నగరం గొడుగుపాలెంలో పాలుట్ల శివరామకోటేశ్వరరావుకు పింఛను అందజేస్తున్న వలంటీర్ నాగసుధ



గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఏటీ అగ్రహారానికి చెందిన నాంచారమ్మకు పింఛను అందజేస్తున్న వార్డు వలంటీర్ జగదీష్



తిరుపతి బర్డ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తొట్టంబేడు మండలం సిద్ధిగుంటకు చెందిన రంగయ్యకు పింఛను ఇస్తున్న వలంటీర్ బాలాజీ



కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పెద్దాపురం మండలం పులిమేరుకు చెందిన సత్తిబాబుకు పింఛను ఇస్తున్న వలంటీర్ చిన్నారి

పేద పిల్లలకు ఇచ్చే ట్యాబ్‌లపైనా ఏడుపేనా?

ప్రభుత్వ విద్యార్థులకు ట్యాబ్‌లు ఇవ్వొద్దనేనా మీ బాధ రామోజీ?

సాక్షి, అమరావతి: 'అసలే కోతి.. ఆపై కల్లు తాగింది.. ఆపై తేలు కుట్టింది.. ఆ తర్వాత దానికి దెయ్యం పట్టింది'... ఇక ఆ కోతి ఏం చేస్తుందో ప్రత్యేకంగా చెప్పాలా?! ఈనాడు అధినేత రామోజీరావు కూడా రోజురోజుకు ఇలాగే తయారవుతున్నారు. ఆయనకు ఒకటే ఏకసూత్ర అజెండా.. తనకు నచ్చిన చంద్రబాబు అధికారంలో ఉంటే ఆయన ఏం చేసినా 'ఓహో.. అద్భుతం.. పరమాద్భుతం.. మహాద్భుతం' అంటూ తన విషపత్రిక ఈనాడులో రాసేస్తారు. అదే చంద్రబాబు కాకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉంటే రామోజీలో పది తలల రావణుడు నిద్ర లేస్తాడు. ప్రజలకు ప్రభుత్వం ఎంత మంచి చేసినా అందులో ఆయనకు తప్పులు మాత్రమే కనిపిస్తాయి.. అంతా అవినీతిలా అనిపిస్తోంది. దీంతో అగ్గిమీద గుగ్గిలమైపోయి ప్రభుత్వంపైన యథేచ్ఛగా దుష్ప్రచారం చేసేస్తారు. ఈ కోవలోనే సోమవారం ఈనాడులో 'పెద్ద తెరపైనే ప్రభుత్వ పెద్దల మోజు' అంటూ ఎప్పటిలానే ఒక విష కథనాన్ని వండివార్చారు. ఈ కథనానికి సంబంధించి వాస్తవాలు ఇవిగో..





వైఎస్ జగన్ 2019లో అధికారంలోకి చేపట్టాక విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారు. ముఖ్యంగా టీడీపీ హయాంలో కునారిల్లిపోయిన విద్యా రంగాన్ని ప్రభుత్వ ప్రాధాన్యత రంగాల్లో ఒకటిగా చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు కింద పది రకాల వసతులను కల్పించారు. అంతేనా.. జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, జగనన్న అమ్మ ఒడి వంటి పథకాలను అందిస్తున్నారు. ప్రస్తుతం టెక్నాలజీ ప్రపంచాన్ని ఏలుతుండటంతో ప్రభుత్వ విద్యార్థులు వెనుకపడిపోకుండా ప్రభుత్వమే ఉచితంగా వారికి బైజూస్ కంటెంట్‌ను నింపి ట్యాబ్‌లను అందజేస్తోంది. దీన్ని రామోజీరావు జీర్ణించుకోలేకపోతున్నారు. ముఖ్యంగా పేద పిల్లలు ప్రభుత్వం అందిస్తున్న అంతర్జాతీయ ప్రమాణాలతో ఎదిగిపోవడం ఆయనకు నచ్చడం లేదు. అందుకే గుడ్డు మీద ఈకలు పీకినట్టు.. ప్రభుత్వం ఏ తప్పు చేయకపోయినా ఈనాడులో విష కథనాలు వండివారుస్తున్నారు.

విద్యార్థులకే స్వేచ్ఛనిచ్చిన ప్రభుత్వం..

వాస్తవానికి ట్యాబ్‌ల విషయంలో విద్యార్థులకే ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛనిచ్చింది. వారు కోరుకుంటే 9 అంగుళాల తెర ఉన్న ట్యాబ్‌లు ఇవ్వాలని విక్రేతలకు సూచించింది. గతేడాది ఎనిమిదో తరగతి విద్యార్థులకు 8.7 అంగుళాల ట్యాబ్‌లను ప్రభుత్వం పంపిణీ చేసింది. వాటిని విద్యార్థులు బాగున్నాయి అని చెప్పడంతో ఈ సంవత్సరం కూడా అలాంటి ట్యాబ్‌లనే అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పైగా ట్యాబ్‌లను సరఫరా చేసే చాలా కంపెనీలు 8.7 అంగుళాల సైజులోనే తయారు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో 8.7 అంగుళాలు, 9 అంగుళాల ట్యాబ్‌ల ధరల్లో పెద్ద వ్యత్యాసం లేదు. వీటిని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) ద్వారా కొనుగోలు చేస్తోంది. ఈ క్రమంలో కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి తప్పులు జరగకుండా జ్యుడిషియల్ ప్రివ్యూకు పంపడంతోపాటు రివర్స్ టెండరింగ్ కూడా నిర్వహిస్తోంది. ఇక ఇందులో అక్రమాలు అనే మాటకు తావే లేదు. కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ నిబంధనలను అనుసరించి 8 అంగుళాలు, అంతకంటే ఎక్కువ సైజు తెర ఉండాలని 'ఈనాడు' తన కథనంలోనే చెప్పుకొచ్చింది. ఆ నిబంధన ప్రకారం చూసినా అంతకంటే పెద్ద సైజు 8.7 అంగుళాల తెర ఉన్న ట్యాబ్‌లనే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించింది. మరి దీన్ని రామోజీరావు తప్పుపడుతూ విషం చిమ్మడం ఎంతవరకు సమంజసం?

సాంకేతిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక యంత్రాంగం

విద్యార్థులకు అందించిన ట్యాబ్‌ల్లో ఏ చిన్న సాంకేతిక సమస్య తలెత్తినా ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు వెంటనే సరిచేసి ఇస్తున్నారు. సాధారణంగా తలెత్తే చిన్న సమస్యలపై స్థానిక ఉపాధ్యాయులకు నిపుణులతో పలుమార్లు శిక్షణ కూడా ఇచ్చారు. వారి స్థాయిలో సమస్య పరిష్కారం కాకపోతే వార్డు సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ వాటిని సరిచేసి ఇస్తారు. పొరపాటున ట్యాబ్ స్క్రీన్ పాడైపోతే డిజిటల్ అసిస్టెంట్ ఇన్వెంటరీ లాగిన్‌లో టికెట్ నమోదు చేసి ఆ విద్యార్థి ట్యాబ్‌కు కొత్త స్క్రీన్ వేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లు అందరికీ ఈ ట్యాబ్‌లపై ఎన్నోసార్లు అవగాహన సదస్సులు కూడా నిర్వహించారు. సమస్య ఉన్న ట్యాబ్‌ను విద్యార్థి/తల్లిదండ్రులు/ఉపాధ్యాయులు.. డిజిటల్ అసిస్టెంట్‌కు ఇస్తే రశీదు ఇచ్చి, ట్యాబ్‌ను రిపేర్ చేసి మూడు రోజుల్లో తిరిగి ఇస్తున్నారు. ప్రతి నెలా ఆయా డిజిటల్ అసిస్టెంట్లు తమకు కేటాయించిన పాఠశాలలను సందర్శించి ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కలిగించడంతో పాటు సమస్యలను సరిచేస్తున్నారు. అయితే 'ఇవన్నీ నాకెందుకు.. నాకు నచ్చింది మాత్రమే నేను రాస్తా' అనే రీతిలో రామోజీరావు ట్యాబ్‌ల కొనుగోలుపై ఒక విషకథనం వండివార్చారు.

ప్రపంచ ఆర్థిక ప్రగతిలో ఐదో స్థానానికి భారత్

- ఈ ఘనత సాధించడంలో ఏపీకి భాగస్వామ్యం ఉంది
- భవిష్యత్‌లో పోర్టు కార్యకలాపాల్లో క్రూయిజ్ టెర్మినల్ కీలక పాత్ర
- క్రూయిజ్ టెర్మినల్ ప్రారంభోత్సవంలో కేంద్ర పోర్టుల శాఖ మంత్రి శర్బానంద్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శర్బానంద్ సోనోవాల్. వేదికపై మంత్రి అమర్‌నాథ్ తదితరులు

దొండపర్తి (విశాఖ దక్షిణ): ప్రపంచ ఆర్థిక ప్రగతిలో భారతదేశం ఐదో స్థానానికి చేరుకుందని కేంద్ర పోర్టులు, షిప్పింగ్ శాఖ మంత్రి శర్బానంద్ సోనోవాల్ పేర్కొన్నారు. ఈ ఘనతను సాధించడంలో ఆంధ్రప్రదేశ్ కూడా భాగస్వామిగా ఉందని చెప్పారు. విశాఖ పోర్టులో జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకునే విధంగా రూ.96 కోట్లతో నిర్మించిన క్రూయిజ్ టెర్మినల్‌ను రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. పోర్టులో రూ.237 కోట్లతో పూర్తి చేసిన ట్రక్ పార్కింగ్ టెర్మినల్, కవర్డ్ స్టోరేజ్ షెడ్లతోపాటు ఓఆర్ బెర్తుల ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ ప్రధాని మోదీ 2015లో ప్రారంభించిన సాగరమాల కార్యక్రమం ద్వారా రూ.5.60 లక్షల పెట్టుబడులతో పోర్టుల ఆధునికీకరణను చేపట్టినట్టు వెల్లడించారు. ఫలితంగా ఆధునిక మౌలిక సదుపాయాలతో భారతీయ ఓడరేవులు ప్రపంచంలోనే అత్యుత్తమంగా మారుతున్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో సహజ వనరులు పుష్కలంగా ఉన్నాయని గుర్తు చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందని వెల్లడించారు. విశాఖను క్రూయిజ్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ క్రూయిజ్ టెర్మినల్‌లో ఒకేసారి 2 వేల మంది ప్రయాణికులకు సేవలందించే అవకాశం ఉందన్నారు. కేంద్ర షిప్పింగ్, టూరిజం శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ వై.నాయక్ మాట్లాడుతూ విశాఖ క్రూయిజ్ టెర్మినల్‌ను దేశంలోనే ప్రముఖ క్రూయిజ్ టూరిజం డెస్టినేషన్‌గా తీర్చిదిద్దాలన్ని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ పరిశ్రమ వివిధ రంగాల్లో ఉద్యోగాలను సృష్టిస్తోందని తెలిపారు.

క్రూయిజ్ టెర్మినల్ విశాఖకు మైలురాయి

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ.. విశాఖ చరిత్రలో క్రూయిజ్ టెర్మినల్ ఒక మైలురాయిగా మిగిలిపోతుందన్నారు. సిటీ ఆఫ్ డెస్టినీగా గుర్తింపు పొందిన విశాఖలో పర్యాటకాభివృద్ధికి ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో పోర్టులు కీలక భూమిక పోషిస్తున్నాయని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కొత్త పోర్టులు, హార్బర్లు ఏర్పాటు కానున్నాయని చెప్పారు. నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, సత్యవతి, జీవీఎల్ నరసింహారావు, విశాఖ పోర్ట్ అథారిటీ చైర్మన్ ఎం.అంగముత్తు, డిప్యూటీ చైర్మన్ దుబే, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, గణబాబు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు రుణాల్లో భారీగా ఏపీ 'ముద్ర'

- రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా లక్ష్యానికి మించి ముద్ర రుణాలు
- నాలుగేళ్లలో 44.63 లక్షల మందికి రూ. 49,313 కోట్ల రుణం
- ఇందులో మహిళలకే అత్యధికం.. రుణాలతో వ్యాపారాభివృద్ధి
- 2022–23 ఆర్థిక సంవత్సరంలో 135 శాతం మేర రుణాలు
- లక్ష్యానికి మించడంపై కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అభినందన


సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గత నాలుగేళ్లలో ప్రధానమంత్రి ముద్ర యోజన (పీఎంఎంవై) కింద చిన్న వ్యాపారులకు రుణాల మంజూరులో భారీగా వృద్ధి నమోదైంది. స్వయం ఉపాధి కోసం ముద్ర యోజన కింద ఎటువంటి పూచీ కత్తు లేకుండా రాష్ట్రంలో గత నాలుగేళ్లలోనే 44.63 లక్షల మందికి రూ. 49,313 కోట్ల మేర రుణాలను బ్యాంకులు మంజూరు చేశాయి. ఇందులో అత్యధికంగా మహిళలకే మంజూరయ్యాయి. ఇప్పటికే చేస్తున్న వ్యాపారాలను మరింత విస్తరించడానికి లేదా కొత్తగా వ్యాపారం చేసేందుకు ముద్ర రుణాలను మంజూరు చేశారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి కోవిడ్ సమయంలో తిరిగి రాష్ట్రానికి వచ్చిన వారికి జీవనోపాధి కల్పించడానికి ముద్ర రుణాలను రాష్ట్ర ప్రభుత్వం విరివిగా ఇప్పించింది. గత మూడేళ్లుగా లక్ష్యానికి మించి చిన్న వ్యాపారాలకు బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి మించి 135 శాతం మేర ముద్ర రుణాలను మంజూరు చేశారు. ఆ ఆర్థిక సంవత్సరంలో రూ.12,000 కోట్లు రుణంగా ఇవ్వాలని లక్ష్యం కాగా రూ.16,212 కోట్లను మంజూరు చేశారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ. 10,838 కోట్లు రుణాలు ఇవ్వాలనేది లక్ష్యమైతే రూ. 11,445 కోట్లు మంజూరు చేశారు. ఆంధ్రప్రదేశ్ లక్ష్యాన్ని మించడం పట్ల ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కరద్ అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో మహిళల రుణాల రికవరీ బాగుందని, మహిళల రుణాల్లో నిరర్థక ఆస్తులు కూడా చాలా తక్కువగా ఉన్నాయని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో పాటు ముద్ర యోజన ద్వారా మహిళలు స్వయం ఉపాధి రంగంలో ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. ముద్ర కింద మూడు రకాల రుణాలను మంజూరు చేస్తున్నారు. శిశు పథకం కింద రూ. 50 వేల వరకు, కిశోర్ పథకం కింద రూ. 50 వేల నుంచి రూ. 5 లక్షల వరకు, తరుణ్ పథకం కింద రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు బ్యాంకులు రుణాలను మంజూరు చేస్తున్నాయి.

టైర్ల ఫిట్ షాపుతో స్వయం ఉపాధి

- రాజమహేంద్రవరానికి చెందిన యోగిత సింహాచలం పీఎంఎంవై కింద పది లక్షల రూపాయల రుణం తీసుకుని పరమేశ్వర బెస్ట్ ఫిట్ టైర్ షాపు ఏర్పాటు చేశారు. తొలుత ఒక్కరితో ప్రారంభమైన ఆ షాపులో తరువాత మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నారు. ప్రస్తుతం కార్లకు టైర్లు ఫిట్ చేస్తున్నామని, త్వరలోనే మరింత విస్తరించడం ద్వారా మరో పది మందికి కూడా ఉపాధి కల్పిస్తామని సింహాచలం పేర్కొన్నారు.

కర్టెన్ డిజైనర్ యూనిట్

- తిరుపతికి చెందిన సులోచన డిజైనింగ్‌పై ఆసక్తిని వ్యాపారంగా మార్చుకోవాలనే ఆలోచనతో కెనరా బ్యాంక్‌లో తరుణ్ పథకం కింద రుణం కోసం దరఖాస్తు చేసుకుంది. కెనరా బ్యాంకు రూ. 7.5 లక్షల రుణం మంజూరు చేసింది. దీంతో ఆమె కర్టెన్ డిజైనర్ పేరుతో యూనిట్‌ను ప్రారంభించింది. మైక్రో మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌లో కర్టెన్ల రూపకల్పనతో పాటు గృహోపకరణాలను తయారు చేయడం ప్రారంభించింది. మరో ఐదుగురికి ఉపాధి కూడా కల్పించారు.



'స్థానిక' ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ హవా

- మచిలీపట్నం మేయర్ పదవి గెలుచుకున్న అధికార పార్టీ
- నందిగామ వైస్ చైర్మన్ పదవి కూడా వైఎస్సార్‌సీపీ ఖాతాలోకే
- లింగాల, పెద్దపప్పూరు ఎంపీపీలుగా అధికార పార్టీ వారే
- మూడు మండలాల్లో ఉపాధ్యక్ష ఎన్నికల్లోనూ అదే ఫలితం



సాక్షి, అమరావతి: ఎన్నికలు ఏవైనా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ హవా కొనసాగుతోంది. కృష్ణా జిల్లా మచిలీపట్నం నగర కార్పొరేషన్ మేయర్ స్థానంతో పాటు నందిగామ మున్సిపల్ వైస్ చైర్మన్, రెండు ఎంపీపీ, మూడు వైస్ ఎంపీపీ స్థానాలకు సోమవారం జరిగిన ఉప ఎన్నికల్లో అధికార వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. మచిలీపట్నం నగర కార్పొరేషన్ మేయర్‌గా వైఎస్సార్‌సీపీకి చెందిన 43వ వార్డు మెంబర్ సీహెచ్ వెంకటేశ్వరమ్మ ఎన్నికయ్యారు. నందిగామ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా వైఎస్సార్‌సీపీ తరుపున గెలిచిన ఒకటో వార్డు మెంబర్ పాకాలపాటి కృష్ణ ఎన్నికైనట్టు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం వెల్లడించింది. పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం, లింగాల ఎంపీపీగా అలవాలపాటి రమాదేవి (వైఎస్సార్‌సీపీ), తాడిపత్రి నియోజకవర్గం, పెద్దపప్పూరు మండలాధ్యక్షుడిగా జి.వెంకటరామిరెడ్డి (వైఎస్సార్‌సీపీ), అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం గాలివీడు మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా గాలి శ్రీనివాసులు (వైఎస్సార్‌సీపీ), రాప్తాడు నియోజకవర్గం, చెన్నేకొత్తపల్లి మండల పరిషత్ ఉపాధ్యక్షులుగా పి.జ్యోతి (వైఎస్సార్‌సీపీ), అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం ఎస్.రాయవరం మండల ఉపాధ్యక్షుడిగా బొలిశెట్టి గోవిందరావు (వైఎస్సార్‌సీపీ)లు ఎన్నికైనట్టు అధికారులు వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలంలో పార్టీ రహితంగా జరిగిన కోఆప్షన్ సభ్యుని ఎన్నికలో సయ్యద్ మునాఫ్ గెలిచినట్లు అధికారులు వెల్లడించారు.

170 గ్రామాల్లో ఉప సర్పంచి ఎన్నిక పూర్తి..

రాష్ట్ర వ్యాప్తంగా 186 గ్రామాల్లో ఉప సర్పంచి పదవులకుగాను సోమవారం 170 గ్రామాల్లో ఎన్నిక పూర్తయినట్టు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయం అధికారులు పేర్కొన్నారు. 11 గ్రామాల్లో ఎన్నికలు వాయిదా పడగా.. మరో చోట స్థానిక వార్డు మెంబర్ చనిపోయిన కారణంగాను, ఇంకో నాలుగు గ్రామ పంచాయతీల్లో కోరం లేక తాత్కాలికంగా ఉప సర్పంచ్ ఎన్నిక వాయిపడినట్టు అధికారులు వివరించారు. వాయిదా పడిన 11 గ్రామాల్లో మంగళవారం మరో విడత ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

కొత్త రిజిస్ట్రేషన్ల విధానంపై.. అపోహలొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

సోమవారం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ అండ్ ఐజీ వి. రామకృష్ణతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.

వినియోగదారులకు రెండు ఆప్షన్లు ఉంటాయని, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తోపాటు భౌతికంగా దస్తావేజులు పొందే ఆప్షన్ కూడా అందుబాటులో ఉందని తెలిపారు. డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి టైమ్‌స్లాట్ బుక్ చేసుకున్న వారు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి తమకు భౌతికంగా డాక్యుమెంట్లు కావాలంటే అక్కడే వారి సంతకాలు తీసుకుని గతంలో మాదిరిగా డాక్యుమెంట్లు ఇస్తారని చెప్పారు. ఇందుకు సంబంధించిన కార్డ్ ప్రైమ్ 2.0 విధానాన్ని అత్యంత కట్టుదిట్టంగా ఎంతో అధ్యయనం చేసిన తర్వాతే రూపొందించామన్నారు. ఈ కొత్త విధానం గతం కంటే ఎంతో మెరుగైందని, సురక్షితమైనదని తెలిపారు. ప్రస్తుతం ఉన్న కార్డ్ 1.0 విధానం 1999లో రూపొందించారని.. అప్పట్లో ఏడాదికి రెండు లక్షల రిజిస్ట్రేషన్లు జరిగేవని, ఇప్పుడు ఏడాదికి 25 లక్షల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా కొత్త టెక్నాలజీ, భద్రత, ప్రజల సౌలభ్యం వంటి అన్ని అంశాలతో కార్డ్ 2.0ను అందుబాటులోకి తీసుకువచ్చామని ఆయన చెప్పారు.

ఆటో సబ్ డివిజన్.. ఆటో మ్యుటేషన్..

కొత్త విధానంలో పబ్లిక్ డేటా ఎంట్రీ ద్వారా అమ్మేవాళ్లు, కొనేవాళ్లు తమ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిస్తే ఒక మోడల్ డాక్యుమెంట్ (దస్తావేజు) జనరేట్ అవుతుందన్నారు. అందులో ఇంకా అదనంగా ఏమైనా వివరాలు చేర్చాలనుకుంటే అందుకు అవకాశం ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన సర్వే నెంబర్‌ను ఎంటర్ చేయగానే దానికి సంబంధించిన లింకు డాక్యుమెంట్లు, రెవెన్యూ వెబ్‌ల్యాండ్‌లో ఎవరి పేరు ఉందో చూపిస్తుందని తెలిపారు. గతంలో నాలుగు రకాల చలానాలు కట్టే పరిస్థితి ఉండగా, ఇప్పుడు ఆన్‌లైన్‌లో ఆ సర్వే నెంబర్‌కు సంబంధించి ఎంత స్టాంప్ డ్యూటీ కట్టాలో చూపిస్తుందని.. దాన్ని వెంటనే ఆన్‌లైన్‌లోనే చెల్లించవచ్చని సాయిప్రసాద్ చెప్పారు. వ్యవసాయ భూములైతే ఈ దశలోనే సబ్ డివిజన్ అవసరమైతే ఆటోమేటిక్‌గా జరిగిపోతుందన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తవగానే మ్యుటేషన్ కూడా ఆటోమేటిగ్గా జరిగిపోతుందని, గతంలో మాదిరిగా మళ్లీ రెవెన్యూ శాఖ దగ్గరకు వెళ్లాల్సిన అవసరం ఉండదని తెలిపారు. భూముల రీసర్వే అయిన గ్రామాల్లో అయితే అమ్మేవాళ్లు ముందుగానే సబ్ డివిజన్ చేయించుకోవాలని, అప్పుడే రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారని చెప్పారు.

ఐటీ చట్టం మార్పుతో ఈ–సైన్‌లు చెల్లుబాటవుతున్నాయి

ఇక గత సంవత్సరం అక్టోబర్ నుంచి ఆస్తుల రిజిస్ట్రేషన్లకు సైతం ఈ–సైన్‌లు చెల్లుబాటయ్యేలా ఐటీ చట్టంలో కేంద్రం మార్పులు చేసిందని సాయిప్రసాద్ గుర్తుచేశారు. ఆస్తి అమ్మేవాళ్ల నుంచి బయోమెట్రిక్ అథెంటికేషన్ ద్వారా ఈ–సైన్ తీసుకుంటారని, సబ్ రిజిస్ట్రార్ కూడా అదే విధంగా ఈ–సైన్ చేస్తారని తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను వినియోగదారులకు ఇస్తారని, అది ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంటుందన్నారు. ఒకవేళ ఎవరైనా భౌతికంగా తమకు డాక్యుమెంట్ కావాలంటే వాళ్లతో సంతకాలు చేయించుకుని గతంలో మాదిరిగా డాక్యుమెంట్ ఇస్తారని తెలిపారు. ఇందులో ఎలాంటి అనుమానాలకు ఆస్కారంలేదన్నారు. ఆన్‌లైన్ డాక్యుమెంట్‌వల్ల కూడా ఎవరికీ అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదని, ఐటీ రిటర్నులన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయన్నారు.

అలాగే, అనేక ప్రభుత్వ సేవలు ఆన్‌లైన్‌లోనే జెనరేట్ అవుతున్నాయని, రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్లు కూడా అంతేనన్నారు. ఆన్‌లైన్ దస్తావేజులు పొందిన వారికి బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి ఎటువంటి ఇబ్బందులు ఉండవని సాయిప్రసాద్ స్పష్టంచేశారు.

ఆన్‌లైన్ ప్రక్రియను డాక్యుమెంట్ రైటర్లూ చెయ్యొచ్చు..

ఇక గతంలో దస్తావేజులు పోతే కేసులు పెట్టి అనేక అవస్థలుపడాల్సి వచ్చేదని, కొత్త విధానంలో అలాంటి వాటికి ఆస్కారం ఉండదని, ఎప్పుడైనా ప్రజలు తమ ఆస్తుల డాక్యుమెంట్‌ను పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కానీ, భౌతికంగా దస్తావేజులు కావాలనే ప్రజల సెంటిమెంట్‌ను దృష్టిలో ఉంచుకుని వారికి ఆ ఆప్షన్ కూడా ఇచ్చామన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను డాక్యుమెంట్ రైటర్లు కూడా చేయవచ్చని, వారి స్కిల్‌ను అక్కడ కూడా ఉపయోగించవచ్చని చెప్పారు. ఆటోమ్యుటేషన్ విధానం నెలరోజుల్లో మున్సిపాల్టీల్లోనూ అమలుచేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రేషన్ల శాఖ అదనపు ఐజీ ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల ఆంధ్రా!

రాష్ట్రంలో పెరుగుతున్న బాలికల నిష్పత్తి




2014–15లో ప్రతి వెయ్యి మంది బాలురకు 921 మంది బాలికలు

2022–23లో ప్రతి వెయ్యి మంది బాలురకు 945 మంది బాలికలు

దేశానికి మించి ఏపీలో బాలికల నిష్పత్తి పెరుగుదల

కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలో, రాష్ట్రంలో జననాల్లో బాలికల సంఖ్య పెరుగుతోంది. 2014–15 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే.. దేశంలో ప్రతి వెయ్యి మంది బాలురకు 2022–23లో బాలికల నిష్పత్తి 15కు పెరగ్గా, రాష్ట్రంలో 24కు పెరిగింది. దేశం మొత్తంతోపాటు చాలా రాష్ట్రాల్లో గతంలో కన్నా జననాల్లో బాలికల నిష్పత్తి పెరుగుతోందని, ఇది శుభపరిణామమని కేంద్ర మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ పేర్కొంది. అయితే బిహార్‌తో పాటు మిజోరాం, నాగాలాండ్‌లలో గతం కన్నా బాలికల నిష్పత్తి తగ్గడం ఆందోళన కలిగిస్తోందని తెలిపింది. బేటీ బచావో బేటీ పఢావో పథకం ద్వారా బాలికలు, మహిళా సాధికారతకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖతో కలిసి ప్రయత్నాలు చేస్తున్నట్టు కేంద్ర మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ పథకం కింద జనన సమయంలో లింగ నిర్ధారణను గుర్తించే చర్యలను ప్రభుత్వం నిలుపుదల చేసిందని, ఆడపిల్లల జననాల పట్ల అవగాహన పెంచేందుకు చర్యలు చేపట్టిందని తెలిపింది.

ఆడపిల్లల అభివృద్ధికి ప్రోత్సాహం

ఆడపిల్లల విద్య, పెరుగుదల, అభివృద్ధి, హక్కులకు మద్దతుగా సానుకూల చర్యలను ప్రోత్సహించడానికి అన్ని స్థాయిల్లో ప్రయత్నాలు చేస్తున్నట్టు కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ వెల్లడించింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు తగిన మార్గదర్శకాలతో కూడిన కార్యాచరణ క్యాలెండర్ జారీ అయినట్లు తెలిపింది. దానిని జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు పేర్కొంది. లింగ నిష్పత్తి తగ్గకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాసినట్టు తెలిపింది.

క్లుప్తంగా...

టీడీపీ, ఎల్లో మీడియా దుష్ప్రచారం

డాక్టర్ కోనేరు సత్యప్రియ



సాక్షి, అమరావతి: టీడీపీ, ఆ పార్టీకి కొమ్ముకాసే ఎల్లో మీడియా శునకానందం కోసం దుష్ప్రచారం చేస్తోందని ఉమ్మడి ఏపీ మాజీ ఉప ముఖ్యమంత్రి కోనేరు రంగారావు మనవరాలు డాక్టర్ కోనేరు సత్యప్రియ సోమవారం మండిపడ్డారు. 'నా పుట్టినరోజు, రాఖీ పండుగ సందర్భంగా ఇటీవల నేను టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఇంటికి వెళ్లి.. ఆయన ఆశీస్సులు తీసుకున్నాను. ఇంతలో ఫోన్ కాల్ రావడంతో ఆయన మాట్లాడుతూ ఉన్నారు. అదే సమయంలో నేను ఆ పక్కనే ఉన్న సీఎం జగన్ ఫోటో దగ్గర కూర్చొని ఫొటో దిగాను. అయితే ఆ ఫొటోను పెట్టి దళితులకు కుర్చీ వేయరా అంటూ సోమవారం ఎల్లో మీడియా తప్పుడు రాతలు రాసింది. దానిని పట్టుకొని టీడీపీ నాయకులు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం మొదలుపెట్టారు' అని డాక్టర్ సత్యప్రియ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు ఆపి.. చంద్రబాబుకు ఆదాయపు పన్ను శాఖ ఇచ్చిన నోటీసులపై కథనాలు రాయాలని ఎల్లో మీడియాకు డాక్టర్ సత్యప్రియ హితవు పలికారు.

బాబుకు ఐటీ నోటీసులపై స్పందించవేం పవన్?:

కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు



సాక్షి, అమరావతి: అధికారంలో ఉండగా అవినీతి, అక్రమాలకు పాల్పడిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు ఆదాయపు పన్ను శాఖ(ఐటీ) నోటీసులు ఇవ్వడంపై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఎందుకు స్పందించట్లేదో చెప్పాలని ఆంధ్రప్రదేశ్ కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ కార్యాలయంలో అడపా శేషు సోమవారం మీడియాతో మాట్లాడారు. ఒక మహిళా పోలీస్‌పై ఫిర్యాదు చేసేందుకు తిరుపతికి ప్రత్యేక విమానంలో వెళ్లిన పవన్ కళ్యాణ్.. పుంగనూరులో టీడీపీ మూకలు పోలీసులపై దాడి చేసి విధ్వంసం సృష్టిస్తే మాత్రం స్పందించలేదన్నారు. ఇప్పుడు చంద్రబాబుకు ఐటీ నోటీసులపైనా పవన్ మౌనం వహించడం చూస్తుంటే.. వారి బంధం ఎలాంటిదో అర్థమవుతోందన్నారు. చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసమే పవన్ జనసేన పార్టీ పెట్టారని విమర్శించారు. కాపు నేస్తంపైనా టీడీపీ, ఎల్లో మీడియా విషం చిమ్మడం సిగ్గు చేటన్నారు.

టీడీపీ ఎమ్మెల్యేలూ.. సైకోలే!

టీడీపీ నేత నారా లోకేశ్



ఉండి: టీడీపీ ఎమ్మెల్యేలను కూడా సైకోలుగా సంబోధించి మరోసారి నాలుక్కరుచుకున్నాడు ఆ పార్టీ నేత నారా లోకేశ్. ఆయన నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం కోలమూరు నుంచి ప్రారంభమైంది. మధ్యాహ్నం వాండ్రం గ్రామంలో ఆక్వా రైతుల పేరుతో టీడీపీ నాయకులను కూర్చోపెట్టి ముఖాముఖి నిర్వహించారు. లోకేశ్ మాట్లాడుతూ జగన్ మాటలు నమ్మి మీరంతా నియోజకవర్గానికో సైకోను గెలిపించారంటూ.. పక్కనే కూర్చున్న స్థానిక టీడీపీ ఎమ్మెల్యేను కూడా కలిపి విమర్శించారు. ఉండి ఎమ్మెల్యే టీడీపీ నాయకుడని గుర్తుచేయడంతో లోకేశ్ క్షమాపణలు చెప్పారు. అనంతరం లోకేశ్ కోలమూరులో బయలుదేరి పాములపర్రు, ఉండి, ఎన్నార్పీ అగ్రహారం మీదుగా భీమవరం వెళ్లారు.

నేడు శ్రీవారిని దర్శించుకోనున్న షారుక్



తిరుమల: బాలీవుడ్ ప్రముఖ నటుడు షారుక్ ఖాన్ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. సోమవారం రాత్రి తిరుమలకు చేరుకున్న షారుక్ ఖాన్ దంపతులకు రాధేయం అతిథిగృహం వద్ద టీటీడీ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వారికి దర్శన ఏర్పాట్లు చేశారు.

బాబు స్కిల్డ్ క్రిమినల్..

- కుట్రలు, కుతంత్రాలతో కూడిన రాజకీయ జీవితం ఆయనది
- ఆర్థిక నేరాలపై ఇచ్చిన నోటీసులకు స్పందించవే బాబూ!
- ఆయన బండారాన్ని ఈడీ బయట పెట్టాలి
- సీబీఐ విచారణ జరిపి వారిని జైలుకు పంపాలి
- ఇలాంటి గజదొంగలకు అధికారమిస్తే రాష్ట్రం సర్వనాశనం
- చంద్రబాబు ఇప్పుడు దొరికిన దొంగ
- మంత్రులు ధర్మాన, గుడివాడ, రోజా, మాజీ మంత్రి కొడాలి నాని ఫైర్

సాక్షి, విశాఖపట్నం/కోటబొమ్మాళి/తిరుమల/చిలకలపూడి (మచిలీపట్నం): ఆర్థిక నేరాల్లో అడ్డంగా దొరికిపోయినా.. తాను ఇంకా నిజాయితీపరుడినంటూ చంద్రబాబు తప్పించుకు తిరుగుతున్నాడని.. ఆయనొక 'స్కిల్డ్' క్రిమినల్ అని వైఎస్సార్‌సీపీ నేతలు ఘాటుగా విమర్శించారు. చంద్రబాబు ఆర్థిక నేరాలను అంకెలతో సహా ఆదాయ పన్నుశాఖ అధికారులు రుజువు చేసినా, వాటితో తనకు సంబంధంలేదని ఆయన బుకాయించడం విడ్డూరంగా ఉందన్నారు. రికార్డు రూపంగా చంద్రబాబు ఇప్పుడు దొరికిన దొంగన్నారు. బాబు, లోకేశ్ ఇద్దరూ సైకోల్లా తయారై రాష్ట్రాభివృద్ధికి అనుక్షణం అడ్డుతగులుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబుకు ఐటీ నోటీసులు జారీచేసిన నేపథ్యంలో మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ధర్మాన ప్రసాదరావు, ఆర్కే రోజా, మాజీమంత్రి కొడాలి నాని సోమవారం వేర్వేరుచోట్ల మీడియాతో మాట్లాడారు.

బాబు, లోకేశ్ పెద్ద అవినీతిపరులు: ధర్మాన



ప్రపంచంలోనే చంద్రబాబు, లోకేశ్‌లు పెద్ద అవినీతిపరులని, దోచుకుని పంచుకోవడమే పనిగా పెట్టుకున్నారని, రానున్న ఎన్నికల్లో వారికి ఓటు అడిగే అర్హత లేదని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 14 ఏళ్లు సీఎంగా ఉన్న బాబు ఒక్క పేదవాడికి సెంటు భూమి ఇవ్వలేదని, ఒక్క శాశ్వత పథకం కూడా తీసుకురాలేకపోయారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి గజదొంగలకు అధికారమిస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తారన్నారు. ఇక అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు శ్రీకాకుళం జిల్లాకు చేసిందేమీ లేదని, చంద్రబాబు ముందు చేతులు కట్టుకుని నిలబడడం తప్ప జిల్లాకు ఒక్క ప్రాజెక్టు కూడా వీరు తీసుకురాలేకపోయారన్నారు.

బాబుది అంతా చీకటి చరిత్ర: అమర్‌నాథ్



అసలు చంద్రబాబు రాజకీయ జీవితమంతా.. కుట్రలు, కుతంత్రాలు, అవినీతితో నిర్మితమైందని, ఆయనదంతా చీకటి చరిత్ర అని విశాఖలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. దేశంలోని ఏ రాజకీయ నాయకుడిపై లేనన్ని అవినీతి ఆరోపణలు, కుంభకోణాలు చంద్రబాబుపై ఉన్నాయని చెప్పారు. నేరుగా రాజకీయాల్లో ఎదగలేక, వెన్నుపోటు పొడిచి దొడ్డిదారిన ముఖ్యమంత్రి అయ్యాడన్నారు. తాను నిజాయితీపరుడిని అని రోజూ ప్రవచనాలు వల్లించే చంద్రబాబు రూ.118 కోట్లు ఎలా బొక్కేశాడని ప్రశ్నించారు. చంద్రబాబు తాజా ఆర్థిక నేరాలపై పత్రికలు, టీవీ చానళ్లు అనేక కథనాలు వెల్లడిస్తున్నా.. చంద్రబాబు ఎందుకు స్పందించడంలేదని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు పీఏ శ్రీనివాస్ బాబు ఆర్థిక నేరాలను స్పష్టంగా ఐటీ అధికారులకు వివరించాడని ఆయన తెలిపారు. దుబాయ్ నుంచి కూడా అక్కడి కరెన్సీలో రూ.15 కోట్ల వరకు దండుకున్నారని మంత్రి ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో చంద్రబాబు అధికారులను, మంత్రివర్గాన్ని తప్పుదోవ పట్టించి సుమారు రూ.350 కోట్లు కొట్టేశాడని ఆయన వివరించారు. చంద్రబాబు ఆర్థిక నేరాల విషయంలో ఈడీ జోక్యం చేసుకోవాలని అమర్‌నాథ్ డిమాండ్ చేశారు.

తండ్రీకొడుకులను జైలుకు పంపాలి: రోజా



చంద్రబాబు, లోకేశ్‌పై సీబీఐ విచారణ జరిపించి, జైలుకు పంపాలని మంత్రి ఆర్‌కే రోజా తిరుమలలో మీడియాతో అన్నారు. గతంలో 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఈ రాష్ట్రానికి ఏమీ చేయలేదని, రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారన్నారు. ఏపీలో చంద్రబాబుకి ఆధార్ కార్డుగానీ, ఓటరు కార్డు గానీ, ఇల్లుగానీ లేకపోయినా హైదరాబాదు నుంచి అప్పుడప్పుడు వచ్చి వైఎస్సార్‌సీపీ నేతలపై విమర్శలు చేసి వెళ్లిపోతుంటారన్నారు. అలాగే, చంద్రబాబుకు ఐటీ నోటీసులిస్తే ఎందుకు ఎవరూ నోరు మెదపడంలేదని ఆమె ప్రశ్నించారు. కాంట్రాక్టు పనుల్లో కోట్లాది రూపాయల కమీషన్లు దండుకున్నారని రోజా ఆరోపించారు. చంద్రబాబుకు ఐటీ అధికారులు నోటీసులిస్తే ఆయన దత్తపుత్రుడు ఎందుకు ట్వీట్ చేయలేదని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్‌ను సైతం సీబీఐ అధికారులు విచారణ చేయాలని రోజా డిమాండ్ చేశారు.

బాబు అత్యంత అవినీతిపరుడు: కొడాలి నాని



చంద్రబాబు అత్యంత అవినీతిపరుడు, స్వార్థపరుడు, నమ్మక ద్రోహి అని మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన మచిలీపట్నంలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ఇప్పుడు రికార్డులతో సహా దొరికిన దొంగని చెప్పారు. 2024 ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థికి రూ.40 కోట్ల నుంచి రూ.50 కోట్లయినా ఖర్చుపెడదామని ఆయన చెబుతున్నారన్నారు. చంద్రబాబు హయాంలో ఇప్పటివరకు నిర్వహించిన ఎన్నికల్లో రూ.10 వేల కోట్లు వరకు ఖర్చుచేశారని, ఈ డబ్బంతా ఇలా కమీషన్లు తీసుకోకపోతే ఎక్కడి నుంచి వచ్చిందని కొడాలి నాని ప్రశ్నించారు. ఇన్ని కోట్ల రూపాయల ఖర్చు ఎలా చేస్తున్నారో రాష్ట్ర ప్రజలకు తెలుసునన్నారు. చట్టాలు, రాజ్యాంగాలను అనుసరించి ఏ విధంగా డబ్బులు దోచుకోవాలో ఆయనకు బాగా తెలుసునన్నారు. ఇప్పుడు ఐటీ శాఖాధికారులు ఇచ్చిన నోటీసుల నుంచి తప్పించుకునేందుకు బీజేపీ నాయకుల కాళ్లు పట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బాబు అవినీతి బాగోతం బయటపడిందని ఇప్పుడు తప్పించుకోలేరని నాని అన్నారు.

నోటీసులపై నోరు విప్పు

- చంద్రబాబు ఓ పొలిటికల్ స్కామ్‌స్టర్: ఎంపీ మార్గాని భరత్
- బాబు అక్రమార్జనలో రూ.118 కోట్లు చిన్న భాగమే



సాక్షి, అమరావతి: ఐటీ శాఖ జారీ చేసిన నోటీసులకు మాజీ సీఎం చంద్రబాబు తక్షణమే సమాధానం చెప్పాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్ డిమాండ్ చేశారు. విజనరీగా చెప్పుకునే ఆయన పొలిటికల్ స్కామ్‌స్టర్ అని ధ్వజమెత్తారు. కమీషన్లుగా దండుకున్న రూ.118.98 కోట్లపై నోరు మెదపకుండా నీతులు వల్లిస్తున్నారని మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అక్రమార్జనలో ఇది చిన్న భాగం మాత్రమేనని, క్షుణ్నంగా విచారిస్తే భారీ కుంభకోణాలు బహిర్గతం కావడం ఖాయమన్నారు.

- ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు కుంభకోణాలను అప్పట్లోనే తెహల్కా బయటపెట్టింది. అక్రమార్జనపై 17 కేసుల్లో చంద్రబాబు విచారణ ఎదుర్కోకుండా వ్యవస్థలను మేనేజ్ చేసి స్టేలు తెచ్చుకున్నారు.
- ఢిల్లీలో రూ.700–రూ.800 కోట్లతో అత్యద్భుతమైన పార్లమెంట్ భవనాన్ని కేంద్రం నిర్మిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం రూ.500 – రూ.600 కోట్లతో సచివాలయ భవనాన్ని నిర్మించింది. ఏసీ, ఇంటీరియర్స్ సహా చదరపు అడుగు నిర్మాణానికి రూ.2 వేల నుంచి రూ.మూడు వేలు వ్యయం అవుతుంది. చంద్రబాబు మాత్రం చదరపు అడుగుకు రూ.13 వేల నుంచి రూ.14 వేలు ఖర్చు పెట్టి రేకుల షెడ్డు లాంటి తాత్కాలిక సచివాలయాన్ని నిర్మించారు. దీన్ని బట్టి చూస్తే షాపూర్‌జీ పల్లోంజీ, ఎల్ అండ్ టీ సంస్థల నుంచి చదరపు అడుగుకు రూ.పది వేలకుపైగా ముడుపులు హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసానికి చేరాయి.
- పోలవరంలో వరదను మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను నిర్మించకుండానే ప్రధాన డ్యామ్ పునాది డయాఫ్రమ్ వాల్‌ను చంద్రబాబు చేపట్టారు. దీంతో 2019–20లో గోదావరికి వచ్చిన భారీ వరదలు ఎగువ కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గుండా అధిక ఉధృతితో ప్రవహించడంతో డయాఫ్రమ్ వాల్ కోతకు గురైంది. ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో అగాధాలు ఏర్పడ్డాయి. వాటిని యథాస్థితికి తేవడం, డయాఫ్రమ్ వాల్ నిర్మాణం కోసం రూ.2 వేల కోట్లు ఖర్చు అవుతుంది. ఇంత నష్టానికి కారకుడు చంద్రబాబే. ఈ పాపానికి చంద్రబాబు పాల్పడకుంటే పోలవరం ఈ పాటికి ఎప్పుడో పూర్తయ్యేది. చంద్రబాబు పాపాలను సీఎం వైఎస్ జగన్ ప్రక్షాళన చేస్తూ ప్రణాళికాబద్ధంగా పోలవరాన్ని పూర్తి చేస్తున్నారు. తొలి దశ పూర్తికి అవసరమైన నిధులు ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. రాష్ట్రంలో 2014–19 మధ్య పేదరికం 11.66 శాతం ఉండగా, సీఎం జగన్ సంక్షేమ పథకాల వల్ల 6 శాతానికి తగ్గింది.

సాంస్కృతిక విప్లవ యోధుడు గద్దర్

దళిత ఉద్యమ నేత డాక్టర్ కత్తి పద్మారావు



కత్తి పద్మారావుతో వెన్నెల

సాక్షి, అమరావతి: సాంస్కృతిక విప్లవ యోధుడు గద్దర్ గొప్ప క్రమశిక్షణ, వ్యక్తిత్వం కలిగిన నాయకుడని దళిత ఉద్యమ నేత డాక్టర్ కత్తి పద్మారావు కొనియాడారు. ఇటీవల పొన్నూరులోని అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో గద్దర్ కుమార్తె వెన్నెలతో కలిసి ప్రజా గాయకుడు గద్దర్ వ్యక్తిత్వంపై మూడు గంటలపాటు సుదీర్ఘ చర్చ నిర్వహించారు. తనకు గద్దర్‌తో ఉన్న అనుబంధాన్ని పద్మారావు గుర్తుచేసుకున్నారు. గద్దర్ రాసిన 100కు పైగా పాటలు ముద్రణకు నోచుకోలేదని వెన్నెల చెప్పగా.. ఆ రచనలను లోకాయత పబ్లికేషన్స్ ద్వారా తామే ముద్రిస్తామని పద్మారావు తెలిపారు. గద్దర్ అనుచరుడు యాదగిరి, లోకాయత పబ్లికేషన్స్ కో–ఆర్డినేటర్ కత్తి చేతన్, దళిత మహాసభ ఉపాధ్యక్షుడు అంథోని పాల్గొన్నారు.

చిట్టాలో చినబాబు!

▶ మొదటి పేజీ తరువాయి

అక్రమ నగదు తరలింపులో కీలకపాత్ర పోషించినట్లు ఐటీ శాఖ స్పష్టమైన సాక్ష్యాధారాలతో వెల్లడించింది. 'మీ కుమారుడు నారా లోకేష్ సన్నిహితులు నగదు తీసుకున్నారనేందుకు పక్కా ఆధారాలివీ.. వీటిపై మీరు ఏం సమాధానం చెబుతారు?' అంటూ బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన ఎక్సెల్ షీట్లు, నగదు తరలింపు సమయంలో జరిపిన వాట్సాప్ మెసేజ్‌లను స్క్రీన్‌షాట్ల రూపంలో అందించి మరీ నోటీసులను జారీ చేసింది. విశాఖకు చెందిన ఆర్‌వీఆర్ నిర్మాణ రంగ సంస్థకు చెందిన రఘు రేలా ఆయన సన్నిహితుల ద్వారా కూడా భారీ మొత్తాలను తరలించినట్లు సాక్ష్యాలతో స్పష్టం చేసింది. ఈ చాటింగ్‌లన్నీ మీ వ్యక్తిగత కార్యదర్శి పెండ్యాల శ్రీనివాస్ ఇంట్లో 2020 ఫిబ్రవరిలో సోదాలు జరిపినప్పుడు స్వాధీనం చేసుకున్న శ్యాంసంగ్ ఫోన్ నుంచి సేకరించినవని, వీటిని శ్రీనివాస్ కూడా ధ్రువీకరించినట్లు ఐటీ శాఖ చంద్రబాబుకు జారీ చేసిన నోటీసుల్లో పేర్కొంది.

కిలారుకు రూ.4.5 కోట్లు.. అయితే ఓకే!

లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడైన కిలారు రాజేష్‌కు రూ.4.5 కోట్లను నగదు రూపంలో ఎలా చేరవేశారో ఐటీ శాఖ పూర్తి సాక్ష్యాధారాలతో నోటీసుల్లో వివరించింది. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా వీరు ముడుపుల వ్యవహారాన్ని యథేచ్ఛగా కొనసాగించారు. 2019 మే 22న చంద్రబాబు పీఏ పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ వాసుదేవ్ పార్థసాని మధ్య జరిగిన వాట్సాప్ సంభాషణలు దీన్ని ధ్రువీకరిస్తున్నాయి. ఆ రోజు చంద్రబాబు పీఏ శ్రీనివాస్ డబ్బుల పంపిణీ గురించి అడగ్గా కిలారు రాజేష్‌కు రూ.4.5 కోట్లను పార్టీ ఆఫీసులో అందించినట్లు పార్థసాని పేర్కొన్నాడు. అంకిత్ బలదూత ద్వారా రూ.2.2 కోట్లు పంపగా, రఘు రేలాకు సన్నిహితుడైన శ్రీకాంత్ ద్వారా మిగిలిన మొత్తాన్ని పంపినట్లు చెప్పడంతో "అయితే ఓకే.." అంటూ చంద్రబాబు పీఏ శ్రీనివాస్ బదులిచ్చాడు. ఈ మేరకు నగదు తరలింపులకు సంబంధించి శ్రీకాంత్ ఫోన్ నుంచి జరిగిన వాట్సాప్ సంభాషణలను కూడా ఐటీ అధికారులు జత చేశారు. వాంగ్మూలం నమోదు సమయంలో ఈ సంభాషణలను మనోజ్ వాసుదేవ్‌కు చూపగా అది నిజమేనని అంగీకరించినట్లు ఐటీశాఖ పేర్కొంది. డేటా చౌర్యం ఐటీ గ్రిడ్ కేసులో కూడా కిలారు రాజేష్ కీలక పాత్రధారిగా వ్యవహరించిన విషయం విదితమే.



లోకేశ్ సన్నిహితుడు కిలారు రాజేష్ సూచించిన వ్యక్తి శ్రీకాంత్‌తో నగదు లావాదేవీలకు సంబంధించిన మేసేజ్

రఘు ద్వారా రూ.20.18 కోట్లు తరలింపు..

విశాఖకు చెందిన రఘు రేలా ఆర్‌వీఆర్ పేరుతో రియల్ ఎస్టేట్‌తో పాటు 18కిపైగా కంపెనీలను ఏర్పాటు చేసి వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నాడు. షాపూర్జీ పల్లోంజీ నుంచి అక్రమంగా నగదు తరలింపులో రఘు రేలా కీలకపాత్ర పోషించినట్లు గుర్తించిన ఐటీ అధికారులు ఆర్‌వీఆర్ గ్రూపులో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాధీనం చేసుకున్న సాక్ష్యాల ఆధారంగా మనోజ్ వాసుదేవన్‌ను విచారించారు. చంద్రబాబు పీఏ శ్రీనివాస్ ఆదేశాల మేరకు రఘు రేలా ద్వారా మొత్తం రూ.20.18 కోట్లను తరలించినట్లు మనోజ్ పార్థసాని అంగీకరించాడు. ఈ నగదు తరలింపులో రఘుకు సన్నిహితులైన కృష్ణ, నారాయణ అనే ఇద్దరు వ్యక్తులు కీలకంగా వ్యవహరించారని, అయితే వారి గురించి తనకు ఎటువంటి వివరాలు తెలియవని పేర్కొన్నాడు. విశాఖ, విజయవాడ, హైదరాబాద్‌కు ఈ మొత్తాన్ని తరలించారని, ఇందుకు ఎక్సెల్ షీట్ స్పష్టమైన ఆధారమని ఐటీ శాఖ వెల్లడించింది.



మీ మనసు మీద మీకు అధికారం ఉన్నది. అంతేగానీ బాహ్య ఘటనల మీద కాదు. ఇది అర్థం చేసుకోగలిగితే, మీకు శక్తి దొరుకుతుంది.

– మార్కస్ అరీలియస్

సాక్షి
మంగళవారం, 5 సెప్టెంబర్ 2023

గైర్హాజరీ సందేశం!

అనుకున్నదే అయింది. రానున్న 'జీ20' దేశాధినేతల శిఖరాగ్ర సదస్సుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అసాధారణ రీతిలో హాజరు కాకపోవచ్చంటూ కొద్ది రోజులుగా వినిపిస్తున్న ఊహాగానాలు నిజమయ్యాయి. చైనా ప్రధాని లీ కియాంగ్ ఆ సదస్సుకు హాజరవుతారంటూ ఆ దేశ విదేశాంగ శాఖ సోమవారం మధ్యాహ్నం ప్రకటించింది. అధ్యక్ష, ప్రధానులిద్దరూ ఏకకాలంలో విదేశాల్లో ఉండడం, అందులోనూ ఒకే కార్యక్రమంలో ఉండడమనేది చైనా ఎన్నడూ చేయని పని గనక 'జీ20'కి షీ గైర్హాజరు ఖాయమని తేటతెల్లమైంది. వెరసి, 'జీ–20' అధ్యక్ష హోదాలో భారత్ ఈ నెల 9, 10 తేదీల్లో ఆతిథ్యమిస్తున్న 18వ వార్షిక శిఖరాగ్ర సదస్సు ఇప్పుడు కొత్త కారణంతో వార్తల్లో నిలిచింది. ఇంట ఆర్థికవ్యవస్థలో ఇక్కట్లు, బయట అమెరికా – భారత్‌లతో క్షీణసంబంధాలు, పొరుగుదేశాలతో కొనితెచ్చుకున్న తగాదాల మధ్య చైనా అధినేత కావాలనే మొహం చాటేస్తున్నట్టు కనిపిస్తోంది.

ఆహ్వానించినప్పుడు వెళ్ళడానికి కొన్ని కారణాలుంటే, వెళ్ళాల్సి ఉన్నా వెళ్ళకపోవడానికి అంతకు మించే కారణాలుంటాయి. చైనా అధినేత గైర్హాజరు కథా అంతే! భారత్‌తో చైనా ద్వైపాక్షిక సంబంధాలు నానాటికీ దిగజారుతున్నాయి. లద్దాఖ్‌లో మూడేళ్ళ క్రితం సైనికుల కొట్లాట నుంచి ఇదే ధోరణి. సరిహద్దుకు ఇరువైపులా మోహరించిన సైన్యం ఉద్రిక్తతలకు అద్దంపడుతోంది. వాణిజ్యంపై విభేదాలు ఉండనే ఉన్నాయి. బద్ధశత్రువైన అమెరికాతో వ్యూహాత్మక సంబంధాలను భారత్ పెంచుకోవడంతో డ్రాగన్‌కి పుండు మీద కారం రాసినట్టుంది. చైనాను వెనక్కినెట్టి అత్యధిక ప్రపంచ జనాభా గల దేశంగా భారత్ ఇప్పటికే ముందుకొచ్చింది. సాంకేతిక విజ్ఞానం, అంతరిక్ష శోధన, ప్రపంచ వాణిజ్యంలో పోటాపోటీ సరేసరి. ఇవి చాలదన్నట్టు ప్రామాణిక దేశపటమంటూ భారత భూభాగాల్ని కలిపేసుకున్న వక్రీకరించిన మ్యాప్‌ను చైనా తాజాగా విడుదల చేసి కొత్త రచ్చ రేపింది.

చైనా అధినేత మొహం చాటేయడానికి ఇలా చాలా కారణాలే! ఈ తాజా పరిణామం చైనా – భారత సంబంధాల మెరుగుదలకు తోడ్పడదు. మరోపక్క అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో షీ సంభాషించే అవకాశం తప్పిపోతోంది. నిజానికి, అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ సహా పలువురు ఈ మధ్య బీజింగ్‌కు సందర్శనలు జరిపారు. అయినప్పటికీ అగ్రదేశాలైన అమెరికా, చైనాల మధ్య సంబంధాలు మునుపెన్నడూ లేనంత క్షీణించి ఉన్నాయి. గత నవంబర్‌లో ఇండొనేషియాలోని బాలిలో జరిగిన గత 'జీ20' తర్వాత షీ, బైడెన్‌లు కలసి మాట్లాడుకున్నది లేదు. ఇప్పుడు మళ్ళీ కలసి, సంబంధాలను సరిదిద్దుకొనే అవకాశాన్ని చైనా చేతులారా జారవిడుస్తోంది. బైడెన్ సైతం ఈ పరిణామంతో నిరాశకు లోనయ్యాననడం గమనార్హం. షీ ఒక్క 'జీ20'నే కాదు, జకార్తాలో జరగనున్న ఏషియాన్ (వాయవ్య ఆసియా దేశాల సంఘం), ఈస్ట్ ఏషియా సదస్సులూ ఎగ్గొడుతున్నారు. వాటికీ చైనా ప్రధానే హాజరు కానున్నారు.

2008 నుంచి ఇప్పటి వరకు మొత్తం 16 సార్లు భౌతికంగానూ, ఒకసారి వర్చ్యువల్‌గానూ (సౌదీ అరేబియా– 2020) జీ20 సదస్సులు జరిగాయి. వాటిలో మొదటి మూడు మినహా 2010 నుంచి ఇప్పటి వరకు ఏ ఇతర సదస్సులోనూ అన్ని దేశాల అధినేతలూ పాల్గొన్న దాఖలా లేదు. అయితే, చైనా అధినేత మాత్రం ఏ జీ20 సదస్సుకూ ఇప్పటి దాకా గైర్హాజరవలేదు. కరోనా ఆంక్షలున్న రెండేళ్ళూ వర్చ్యువల్‌గానైనా హాజరయ్యారు. గత నెల దక్షిణాఫ్రికాలో ప్రధాన వర్ధమాన ఆర్థిక వ్యవస్థల బృందమైన 'బ్రిక్స్' సదస్సు జరిగినప్పుడూ షీ వచ్చారు. మరి, ఇప్పుడు మాత్రం తన బదులు ప్రధానిని పంపుతున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ తన బదులు విదేశాంగ మంత్రిని పంపుతున్నట్టు ఇప్పటికే చెప్పేశారు. అధ్యక్షుడి గైర్హాజరుకు కారణాలు చైనా బయటకు చెప్పకపోయినా, ఇదంతా సహజమేనన్నట్టు భారత అధికార వర్గాలు చిత్రిస్తున్నా... విషయం మాత్రం అసాధారణమే. షీ రాజనీతి పట్ల సందేహాలు రేపుతున్నాయి.

మావో తర్వాత మరే ఇతర చైనా నేతకూ లేనంతటి అధికారం షీ సొంతం. ప్రాదేశిక ప్రయోజనాల పేరు చెప్పి, తైవాన్, దక్షిణ చైనా సముద్రం సహా అన్నీ చైనావేనంటూ ఆయన అంతకంతకూ దూకుడు చూపుతున్నారు. సహజంగానే పాకిస్తాన్ లాంటి ఒకట్రెండు దేశాల్ని మినహాయిస్తే, పొరుగున మిత్రుల కన్నా ఎక్కువగా శత్రువుల్ని చేసుకున్నారు. నిజానికి, జీ20 దేశాలంటే ప్రపంచ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 85 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 75 శాతం, ప్రపంచ జనాభాలో మూడింట రెండొంతులకు ప్రాతినిధ్యం వహిస్తున్న బృందం. ఇంత కీలకమైనా సరే, దీని కన్నా తమ చైనా ఆధిపత్యం ఉన్న 'బ్రిక్స్' వగైరాల వైపే షీ మొగ్గుతున్నారనుకోవచ్చు. ఇటీవల ఆయన ప్రయాణించినదల్లా సౌదీ అరేబియా, రష్యా, సౌతాఫ్రికా లాంటి స్నేహపూర్వక స్వాగతం లభించే దేశాలకే అని విశ్లేషించవచ్చు. అటు అమెరికా, ఇటు భారత్‌లతో ఉద్రిక్తతలు తగ్గించడమూ తన షరతుల ప్రకారమే జరగాలని చూస్తున్నారనుకోవచ్చు.

డ్రాగన్ బుసలు కొడుతున్నందునే అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లతో కూడిన భద్రతా కూటమి 'క్వాడ్'లో భారత్ చేరిందని గమనించాలి. ఇక, బైడెన్‌తో ఇప్పుడు భేటీ తప్పిందంటే మళ్ళీ నవంబర్‌లో శాన్‌ఫ్రాన్సిస్కోలో ఆసియా–పసిఫిక్ ఆర్థిక సహకార సదస్సు దాకా వారు కలిసే ఛాన్స్ లేదు. ప్రస్తుత చైనా వైఖరి చూస్తుంటే, అప్పుడైనా షీ హాజరవుతారన్న గ్యారెంటీ లేదు. జీ20లోనూ దేశాధినేతలు చేయాల్సిన సమష్టి ప్రకటనకు గండికొట్టి, భారత పాలకుల విశ్వగురు ప్రచారాన్ని దెబ్బ తీశారనుకోవచ్చు. ప్రధానిని పంపుతున్నా, సదస్సులోని నిర్ణయాలకు చైనా కట్టుబడేలా చూసేందుకు సదరు వ్యక్తికి ఏపాటి అధికారం ఉంటుందో చెప్పలేం. వెరసి, షీ గైర్హాజరీ సందేశం సుదీర్ఘమైనదే!

నిజమైన ప్రత్యామ్నాయం కావాలంటే!

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

అత్యధిక బీజేపీయేతర పార్టీలు కలిసి 'ఇండియా' కూటమిగా ఏర్పడటం మంచి ప్రయత్నమే. భిన్న స్వభావాలు, భిన్న అభిప్రాయాలున్న రాజకీయ పార్టీలు ఒక సమన్వయానికి ప్రయత్నించడమూ గొప్ప విషయమే. అయితే, ప్రత్యామ్నాయ రాజకీయ ప్రణాళిక రూపకల్పనలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుంటున్నామని ఈ పార్టీలు చెప్పడం లేదు. భారతదేశంలో ఈనాటికీ అస్పృశ్యత, నిరక్షరాస్యత ఉన్నాయి. కులం వేళ్లను పెకిలించకుండా నూతన భారతదేశ ఆవిష్కరణ జరగడం అసంభవం. అందుకే అంబేడ్కర్ చూపిన మార్గంలో ప్రత్యామ్నాయ ప్రణాళికను రూపొందించుకోవలసిన చారిత్రక బాధ్యత ఈ పార్టీలపై ఉంది. అప్పుడే అది నిజమైన ప్రత్యామ్నాయ రాజకీయ కూటమి అవుతుంది.

భారత జాతీయ అభివృద్ధి సమ్మిళిత కూటమి (ఇండియా) పేరుతో ప్రతిపక్షాలు సెప్టెంబర్ 1, 2023న ముంబైలో సమావేశమవటం భారత రాజకీయాలలో చారిత్రక ఘటనగా చెప్పుకోవచ్చు. 28 బీజేపీయేతర పార్టీలు హాజరై వచ్చే ఎన్నికల నాటికి చేయవలసిన ఉమ్మడి పోరు సన్నద్ధతపై చర్చించటం ముదావహం. 14 మంది సభ్యులతో ఒక సమన్వయ కమిటీని వేయడం కూడా ముందడుగే. వివిధ రాష్ట్రాలలో సీట్ల భాగస్వామ్య ఏర్పాటుకు ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో వెళదామనేది కూడా మంచి ప్రయత్నమే. దీనికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను అభినందించాలి.

అంబేడ్కర్ ఆదర్శమని చెప్పరా?

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే– బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్‌కు ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపకల్పన ఇక్కడ మృగ్యమైంది. ముంబైలో జరిగిన కూటమి మూడవ సమావేశం కేవలం రాజకీయ సమన్వయంగానే సాగింది. భిన్న ప్రణాళికలు, భిన్న స్వభావాలు, భిన్న అభిప్రాయాలు కలిగినటువంటి రాజకీయ పార్టీలన్నీ ఒక చోట కూర్చుని సమన్వయానికి ప్రయత్నించడం గొప్ప విషయమే కానీ, ప్రత్యామ్నాయ రాజకీయ ప్రణాళిక రూపకల్పనలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుంటున్నామని అవి చెప్పలేదు. దీంతో దీన్ని ఉదార హిందూవాద సమన్వయ కమిటీగానే భావించాల్సి ఉంటుంది. మతోన్మాద హిందూ భావజాల పక్షాల కంటే ఈ కూటమి మెరుగైనది అయినప్పటికీ, రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి అంబేడ్కర్ ఆశయాల్లో తాము నడుస్తామని వీరు అనలేకపోతున్నారు. కారణం ఇందులో అంబేడ్కరైట్‌లు ఎవరూ లేరు. కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన మమతా బెనర్జీ, బీజేపీ పొత్తు నుంచి బయటికి వచ్చిన నితీష్ కుమార్, కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన శరద్ పవార్, అంబేడ్కర్‌ను ఇప్పటివరకు తమ ఎజెండాలోకి తీసుకోని సీపీఎం, సీపీఐ నాయకులు ఈ కూడికలో ఉన్నారు. ఓబీసీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న తేజస్వి యాదవ్, బిహార్‌లో రాజకీయ ప్రాధాన్యత ఉన్న లాలూ ప్రసాద్ యాదవ్ లాంటివాళ్ళు కూడా అంబేడ్కర్‌ను తమ ఎజెండాలోకి ఇంతవరకూ తీసుకోలేదు.

అదే ప్రత్యామ్నాయ ఎజెండా

అలాగే రాహుల్ గాంధీ నోట అంబేడ్కర్ పేరు రాకపోవడం కూడా ఆశ్చర్యం. ఎందుకంటే అధికార పక్షానికి ఆయన ప్రధానమైన రాజకీయ ప్రత్యర్థిగా ఉన్నారు. భారతదేశంలో ఈనాటికీ అస్పృశ్యత, నిరక్షరాస్యత ఉన్నాయి. కులం వేళ్లను పెకిలించకుండా భారతదేశం నూతన భారతదేశంగా ఆవిష్కరించబడటం కష్టమని శశి థరూర్ లాంటివాళ్లు రాశారు. చిదంబరం, శశి థరూర్ లాంటి కాంగ్రెస్ నాయకులు అంబేడ్కర్ గురించి రాసినవాటిని అయినా రాహుల్ గాంధీ చూసి ఉండవచ్చు. కానీ ఆయనలో ఉన్న ఉదార బ్రాహ్మణుడు కుల నిర్మూలనను తమ ఎజెండాలో ప్రకటించడానికి అడ్డు పడుతున్నాడని అనక తప్పదు. కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి భారతదేశం వెళ్లిందని వామపక్ష పార్టీలు గగ్గోలు పెడతాయి కానీ కులం ఊబిలో దేశం కూరుకుపోయిందని చెప్పవు.



అంబేడ్కర్ ఎజెండా లేకుండా ఇండియా కూటమి విజయం అసాధ్యమని మనకి అర్థమవుతుంది. అంబేడ్కర్ చెప్పిన కుల నిర్మూలనా వాదమే భారత దేశానికి ప్రత్యామ్నాయ ఎజెండా. అంబేడ్కర్ అస్పృశ్యతా నివారణ మీద స్పష్టమైన ఆలోచనలు పొందుపర్చారు. అస్పృశ్యత వల్ల భారతదేశ నాగరికత, సంస్కృతి, శాస్త్రజ్ఞానం కుంటుపడ్డాయి. అస్పృశ్యులుగా చెప్పబడుతున్న ఉత్పత్తి శక్తులు, శ్రమజీవులు, మాతృస్వామ్య భావం కలవారిని నిర్లక్ష్యం చేయడమే భారత దేశ దారిద్ర్యానికి మూలం. ఈ రోజున మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన మీటింగులు జరుగుతున్నాయి. కానీ నోరు తెరచి ఒక్కళ్ళు కూడా ఆయన మనకు ప్రధానమంత్రి కావాలని అనడం లేదు. ఎందుకు? వారందరి మనసులో కులం ఉంది.

శుభసూచనే కానీ...

ప్రతి ఒక్కరికీ మతం మారే హక్కు ఉండాలన్నారు అంబేడ్కర్. ప్రజలు మతం నుండి బయట పడకుండా తమ బానిసత్వం నుండి విముక్తి కాలేరని చెప్పారు. 'మీ బానిసత్వాన్ని మీరే రద్దు చేసుకోవాలి. దేవుడో, మరొక సూపర్‌మానో వచ్చి చేస్తాడని వారిపై ఆధారపడకండి. పవిత్ర గ్రంథాలను పూజించడం వల్ల మీరు బానిసత్వం నుంచి, దరిద్రం నుంచి విముక్తం కాలేరు. తరతరాలుగా మీ తాతముత్తాతలు అదే చేస్తూ వస్తున్నారు. అయినా మీ దుర్భర జీవితంలో లేశమాత్రమైనా మార్పు రాలేదు. మీ తాత ముత్తాతల్లానే మీరూ పీలికలు ధరిస్తున్నారు. వారిలాగ విసిరేసిన ఎంగిలి మెతుకులపై ఆధారపడుతున్నారు. వారిలాగే మీరు మురికివాడల్లోనూ, గుడిసెల్లోనూ జీవిస్తున్నారు. వారిలాగే తేలికగా రోగాల బారిన పడుతున్నారు. మీ మతపరమైన ఉపవాసాలు, ఆచారాలు, దీక్షలు మిమ్మల్ని ఆకలి నుంచి కాపాడలేకపోయాయి. మీకు కూడు, గుడ్డ, గూడు, విద్య, మందులు, జీవికకు అవసరమైన ఉపాధిని కల్పించడం శాసనసభ బాధ్యత. మీ అంగీకారం, సహాయం, ఇష్టంతో శాసనాలు రూపొందించడం, వాటిని అమలు చేయడం జరగాలి. క్లుప్తంగా చెప్పాలంటే భౌతిక ఆనందాలన్నింటికీ చట్టమే ఆధారం. చట్టాలు చేసే అధికారాన్ని గెలుచుకోండి. కనుక మీ దృష్టిని ఉపవాసాలు, ఆరాధనలు, దీక్షల నుంచి మళ్ళించి, శాసనాలు చేసే అధికారాన్ని దక్కించుకోవడంపై పెట్టండి. ఈ మార్గంలోనే మీ ముక్తి ఉంది. ఈ మార్గమే మీ ఆకలి సమస్యకు పరిష్కారమిస్తుంది. మీ జనాభా మెజారిటీలో ఉండడం సరిపోదని గ్రహించండి. ఎప్పుడూ అప్రమత్తంగా, బలంగా, విద్యావంతులై, ఆత్మగౌరవంతో ఉన్నప్పుడే విజయాన్ని సాధించి, దాన్ని నిలబెట్టుకోగలరు' అన్నది అంబేడ్కర్ బోధనల సారాంశం. కులాధిపత్యాన్ని, మతోన్మాదాన్ని ఖండించి నూతన భారతదేశాన్ని ఆవిష్కరించడానికి తగిన పునాదులు వేశారు అంబేడ్కర్. ఆయనను పరిగణనలోనికి తీసుకోకుండా ఒక రాజకీయ కూటమిని నిర్మించడం అంటే కళ్ళకు గంతలు కట్టుకుని గుంతల్లో నడవడమే.

రాజ్యాంగంలోని 21వ అధికరణ భారతదేశ ప్రజలకు ఊపిరి లాంటిది. ఒక వ్యక్తి జీవించి ఉంటేనేకదా ప్రాథమిక హక్కులను అనుభవించేది. రాజ్యాంగం ప్రసాదించిన ఈ ప్రాథమిక హక్కును హరించివేస్తున్నది కూడా ప్రభుత్వం, పోలీసులు, రక్షణ బలగాలే. రాజ్య హింసకు దర్పణం ఈ అధికరణ. రాజ్య హింస రెండు రకాలు. ప్రత్యక్ష హింస, పరోక్ష హింస. బూటకపు ఎన్‌కౌంటర్లు, లాకప్ హత్యల లాంటివి ప్రత్యక్ష హత్యలు. రైతుల ఆత్మహత్యలు, అర్ధాకలి మరణాలు, పోషకాహారం లేక శిశువులు, పిల్లల మరణాలు, సరైన వైద్య సదుపాయం లేక గాలిలో కలిసిపోతున్న బడుగు జీవుల ప్రాణాలు, వివిధ రకాల కాలుష్యాల ప్రభావంతో మరణాలు మొదలైనవన్నీ పరోక్ష హత్యలు. వీటన్నింటికీ బాధ్యత ప్రభుత్వానిదే కనుక. అందుకే ఇండియా కూటమి జీవించే హక్కుకు భరోసా ఇవ్వాలి.

భారతీయుడైన ప్రతివాడు ఆర్థిక, సాంఘిక స్వాతంత్ర్యాలను పొందాలని నొక్కి వక్కాణించారు అంబేడ్కర్. ప్రతి మనిషికి నిర్భయంతో కూడిన స్వేచ్ఛను అందించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. స్వేచ్ఛ, సమానత్వ, సౌభ్రాతృత్వాలను ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ ప్రణాళిక అణగద్రొక్కబడ్డ వారి సాంఘిక సమానత్వాన్ని నొక్కి చెప్పింది. ఆయన ఆలోచనలను వందకు వంద శాతం ముందుకు తీసుకుని వెళ్లాలి. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని దించాలని ప్రజాస్వామ్య వాదులు, లౌకికవాదులు అందరూ అనుకుంటున్నారు. ఇది ఇండియా కూటమికి శుభసూచన. కానీ వీళ్ళు అంబేడ్కర్ మార్గంలో ప్రత్యామ్నాయ ప్రణాళికను రూపొందించుకోవలసిన చారిత్రక బాధ్యతను కలిగి ఉన్నారు. అప్పుడే అది నిజమైన ప్రత్యామ్నాయ రాజకీయ కూటమి అవుతుంది.

వ్యాసకర్త దళితోద్యమనేత | 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

బతకనీయరా?



జీ20 ప్రపంచ నాయకుల సదస్సు కోసం ఢిల్లీ సిద్ధమవుతోంది. నాయకుల దృష్టిలో పేద కార్మికులు పడకుండా భారీ ఎత్తున మురికివాడలను పడగొడుతున్నారు. నిరాశ్రయులకు నిలువనీడ లేకుండా చేస్తున్నారు. పేద కార్మికులే నగరాన్ని నడిపేది. తన పేద కార్మికుల పట్ల సిగ్గుపడే ప్రభుత్వాన్ని చూసి నేను సిగ్గుపడుతున్నాను.

– హర్ష్ మందర్, యాక్టివిస్ట్

శాశ్వత ధర్మం



ఎలా జీవించాలి? అంతరాత్మ, ఉనికి లాంటి శాశ్వత సత్యాల కోసం నిలబడేది సనాతన ధర్మం. తమను అంతం చేయడానికి దురాక్రమణదారులు జరిపిన దాడులను సనాతనులు తట్టుకోవడమే కాదు, వర్ధిల్లారు. దేశానికి పునాది అయిన సనాతన ధర్మం అన్ని విశ్వాసాలనూ, విలక్షణతలనూ కలుపుకొనేది. దాన్ని నిందించేవాళ్లు అది దేనికి నిలబడుతుందో తెలియనివాళ్లే!

– ప్రియాంక చతుర్వేది, రాజ్యసభ ఎంపీ


అతి – అపార్థం



సనాతన ధర్మం గురించి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ స్పందన అతిగా ఉంది. అతను సామూహిక హత్యాకాండ గురించి మాట్లాడలేదు. కానీ కుల దురాచారాలకూ, ఉనికిలో ఉన్న అత్యంత అధునాతనమైన మత భావనకూ మధ్య గందరగోళ పడ్డారు.

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

మళ్లీ తెలుసుకోవాలా?



సూర్యుడి రహస్యాలను తెలుసుకోవడానికి ఇండియా నాలుగు నెలల దూరంలో ఉందని వార్తాపత్రికలు చెబుతున్నాయి. కానీ మనకు ఈ రహస్యాలన్నీ వేదాలు ఎప్పుడో వెల్లడించాయి. అవునా?

– ధ్రుతిమన్ చటర్జీ, నటుడు

సరిపోయారు!



హిందువులతో బీజేపీ: మాకు ఓటేయడం తప్ప మీకు ఇంకో దారి లేదు. హిందువులతో ప్రతిపక్ష పార్టీలు: బీజేపీకి ఓటేయడం తప్ప మీకు ఇంకో దారి లేదు.

– సి. రామ్‌ప్రసాద్ ఆంత్రప్రెన్యూర్

లెఫ్ట్ ఫ్రంట్ ఏర్పాటే ఆయన ధ్యేయం

ప్రజాయుద్ధ నౌకగా పేరుగాంచి, గోర్కీ, లూసన్‌ల మాదిరిగా ప్రపంచ ప్రజల మన్ననలు పొందిన కామ్రేడ్ గద్దర్ 75 ఏళ్ళ సుదీర్ఘ జీవితంలో నడచిన బాట, సృష్టించిన ప్రజా సాహిత్యం, నిర్మించిన ప్రజా కళా సౌధం అనితర సాధ్యం. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు పూడ్చలేని వెలితి. జీవిత చరమాంకంలో ఆయన కొన్ని విమర్శలు కూడా ఎదుర్కోవలసి వచ్చింది. ఆయన మంది బిడ్డలను రెచ్చగొట్టి తుపాకులకు బలిచేశాడనీ, తానూ, తన బిడ్డలు మాత్రం పది లంగా ఉన్నారనేదీ విమర్శ. మనువాదుల నుండి అనేకమంది వ్యతిరేకుల దాకా చేసిన ఈ దాడి చాలా కుటిలమైన వాదన కనుక మేము దీనిని చర్చించబోవడం లేదు. అయితే ఏ పార్టీ కోసమైతే కా॥ గద్దర్ అర్ధ శతాబ్దం పాటు తన సర్వస్వాన్నీ అర్పించి పాటు పడ్డాడో, ఏ పార్టీ ప్రతినిధిగా ప్రభుత్వంతో జరి గిన చర్చల్లో పాల్గొన్నాడో ఆ పార్టీయే ఆయనను తన మనిషిగా ప్రకటించలేక పోవడం తీవ్ర చర్చ నీయాంశమయ్యింది. తెలుగు సమాజంలోనే కాదు, యావత్తు దేశంలోని అన్ని వర్గాలూ, పార్టీలూ, గద్దర్ పాటలతో హోరెత్తుతుండగా మావోయిస్టు పార్టీ నిశ్శబ్దంగా ఉండడం నిజంగా కలత పెట్టే విషయం.



గద్దర్

తెలంగాణ ప్రజల బానిసత్వం, దొరల దౌర్జన్యాలు గద్దర్‌ను ప్రజా కవిగా మార్చినాయి. ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమాల్లో ముందు పీఠిన నిలిచేలా చేశాయి. దొరలంతా ఊళ్లు వదిలి పారిపోతుంటే ఆయన ఉగ్రాతలూగాడు. మలి తెలంగాణ ఉద్యమం రావడం, అనేకమంది కమ్యూనిస్టులు అందులో ముందు వరుసలో నిలవడం జరిగింది. తలచింది ఒకటి, జరిగింది మరొకటి. పారిపోయిన దొరలంతా తెలంగాణ ఉద్యమం ముసుగులో టీఆర్ఎస్ జెండాతో ఊళ్ళల్లో చొరబడ్డారు. అన్ని సమస్యలూ మరచిపోయి తెలంగాణ అంతటా ధూంధాంలు సాగాయి. గద్దర్ మిత్రులు ఎందరో టీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణలో ప్రజా స్వామ్యం వెల్లివిరుస్తుందని కా॥ గద్దర్ ఆశించారు. నిద్రలేచి చూసే సరికి తెలంగాణ రావణకాష్టం అయింది. నీళ్ళు పారుతాయని ఆశిస్తే అవినీతి వరదలై పారింది. తొలి తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారుల్ని కా॥ కేవీఎస్ కమ్యూనిస్టులుగా మార్చితే... మలి తెలంగాణ ఉద్యమంలో కమ్యూనిస్టులు ఎలా తెరాస పరమైనారో, తెలంగాణ ఎందుకు నెత్తురోడుతున్నదో విశ్లేషించే మార్క్సిస్టు మేధావులు కరువైనారు. గద్దర్ గుండె చెరువైంది. తెలంగాణ ఉద్యమ ఫలితాలను తన్నుకుపోతుంటే, ఎన్నికల బహిష్కరణ నినాదంతో పోరు బిడ్డల కాళ్ళకు సంకెళ్ళు పడగా... పోరు తెలంగాణ చేష్టలుడిగి నిల్చుంటే గద్దర్ సంఘర్షణ పడ్డాడు.

ఉద్యమం ఆటుపోట్లను ఎదుర్కొంటున్న సమయంలో కమ్యూనిస్టు పార్టీ మీద జరిగిన అనేక దాడుల్లో భాగంగానే కుల సమస్యను పట్టించుకోలేదని 'అంబేడ్కరిస్ట్'ల పేరుతో పెద్ద దాడి జరిగింది. ఈ దాడిని సైద్ధాంతికంగా ఎదుర్కోవడంలో మావోయిస్ట్ పార్టీతో సహా అన్ని ఎమ్ఎల్ పార్టీలూ విఫలమయ్యాయి. ఎర్రజెండా నీడలో కుల నిర్మూలన వైపు సాగడంలోను విఫలమైంది. పార్టీయే స్పష్టత కోల్పోయిన ఈ తరుణంలో ఎంతో సంఘర్షణకు గురైనప్పటికీ, గద్దర్ ఏనాడూ లక్ష్యాన్ని మరువలేదు, కుల తత్వానికి తాను బలి కాలేదు. గద్దర్ అంతిమ యాత్రలో 'సియాసత్' పత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ ఖాన్ మరణం... గద్దర్ జీవితాంతం తపించిన 'హిందు–ముస్లిం' ఐక్యతకు ఒక హృద యాన్ని ద్రవింపచేసే సింబాలిజం.


జరిగిపోతున్న సంఘటనలతో రాజీపడలేక, ఆప్తులయిన వారు సహరించక కా॥ గద్దర్ తీవ్రమైన మానసిక సంఘర్షణకు లోనయినాడు. ఆయన ఎన్నికల రంగాన్ని ఉపయోగించుకోవ డంతో సహా ప్రజా పంథాను స్వీకరించాలనుకున్నాడే తప్ప తన లక్ష్యాన్ని వీడలేదు. తాను రాజకీయ నాయకుడో, సిద్ధాంతకర్తనో కాకపోవడం వల్ల తన ఆలోచన సరిగా వ్యక్తీకరింపబడి ఉండకపోవచ్చు. నిజానికి ఆ పని చేయ వలసింది కమ్యూనిస్టు పార్టీయేనన్న విషయం మరువరాదు.

– డాక్టర్ కె. విజయకుమార్, ప్రొఫెసర్; సి.హెచ్.ఎల్.ఎన్. మూర్తి, అడ్వకేట్

గురువు 'లఘువు' కాకూడదు!

'తరగతి గది ప్రపంచానికి అద్దం వంటిది. విద్యార్థి అభివృద్ధి అక్కడ నుంచే మొదలవుతుంది. నిజమైన ఉపాధ్యాయుడు ప్రపంచాన్ని తన తరగతి గదిలోకి తీసుకురాగలడు' అంటాడు ఓ ప్రముఖ తత్వవేత్త. ఉపాధ్యాయుని 'గురు'తర బాధ్యతనూ, వృత్తి గౌరవాన్నీ వ్యక్తం చేసేందుకు ఈ ఒక్కమాట చాలు. అయితే చదువుకు కేంద్ర బిందువు అయిన 'గురువు' మాత్రం 'లఘువు'గా మారాడన్న అపవాదు మోస్తున్నాడు.

గురు భావన వేద కాలం నుంచి ప్రస్తావనలో ఉంది. తమ గురించి తాము బాగా తెలిసిన గురువులు మంచి శిష్యుల కోసం చూసేవారట. శిష్యులు కూడా అటువంటి గురువునే ఆశ్రయించి శుశ్రూష చేస్తూ జ్ఞానార్జన చేసేవారట. 'నిజమైన గురువు జ్ఞాన రంగంలో నిష్ణాతుడు కావాలి. వేదాలు అభ్యసించిన వాడవ్వాలి. అసూయ లేనివాడు, యోగం తెలిసినవాడు, సరళమైన జీవితాన్ని గడిపేవాడు, ఆత్మజ్ఞానాన్ని పొందినవాడు అయివుండాలి' అంటూ నాటి సమాజం గురువుకు అత్యున్నత స్థానం కట్టబెట్టి గౌరవించింది. గురువు నైపుణ్యాల బోధకుడు. మానసిక విశ్లేషకుడు. విలువలు అలవర్చడం, అనుభవాలను వివరించడం అతని బాధ్యత. అన్ని విషయాలపై అవగాహన కల్పించి శిష్యుడిని సర్వసమగ్రంగా తీర్చిదిద్దే శిక్షకుడు గురువు. అక్షర జ్ఞానం నుంచి ఆధ్యాత్మిక అంశాల వరకు, యుద్ధ కళల నుంచి సంగీత, సాహిత్య, చిత్రకళల వరకు గురుకులాల్లో బోధన జరిగేది. ఊహ తెలిసిన తర్వాత గురుకులంలోకి ప్రవేశించిన విద్యార్థి యుక్తవయసు నాటికి అన్ని కళల్లో ఆరితేరి తిరిగి తల్లిదండ్రుల వద్దకు చేరేవాడు. సూర్యునిలా ప్రకాశించే గురువు అంతే ప్రకాశవంతంగా శిష్యుని తీర్చిదిద్దేవాడని వేదాలు చెప్పాయి.



నేటి కాలానికి వస్తే – ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు తమ బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహించడం, లక్ష్యం మేరకు విధులు నిర్వహించడంలో పలు సవాళ్లు ఎదుర్కోవాల్సి రావడం వాస్తవమే అయినా... ఉన్నంతలో తమ విధులు నిర్వహించడంలో చాలామంది ఉపాధ్యాయులు విఫలమవుతూ చిన్న చూపుకు గురవుతున్నారు.

చదువుకోవడం ఒకప్పుడు గౌరవ ప్రదమైన కార్యక్రమం. ఇప్పుడు ప్రాథమిక హక్కు. ఉచిత నిర్బంధ విద్యతో మొదలైన ప్రభుత్వాల కృషి నేడు 'హక్కు' అమలుకు పటిష్ఠంగా కొనసాగుతోంది. కనీస సదుపాయాలు లేవనో, ఉపకరణాలు అందుబాటులో ఉండడం లేదనో, సరిపడే సిబ్బందిని నియమించడం లేదనో చెప్పి ఉపాధ్యాయులు నిందను ప్రభుత్వం మీదకు తోసేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. సమస్యలు లేవని చెప్పలేకున్నా గతకాలంతో పోల్చితే ఇప్పుడు విద్యపై ప్రభుత్వాల శ్రద్ధ పెరిగింది. నిధుల కేటాయింపు అధికమయ్యింది. సదుపాయాలు, ఉపకరణాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ పరిస్థితుల్లో విద్యాప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని ప్రభుత్వం ఒత్తిడి పెంచుతోంది. మొక్కుబడి ఫలితాలపై కాకుండా వాస్తవ అభివృద్ధి సాధించాలని కోరుతోంది.

ఆధునిక విద్య అందరికీ అందించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. కానీ పెట్టుబడి పెట్టడం వరకే ప్రభుత్వం చేయగలదు. క్షేత్ర స్థాయిలో అమలు బాధ్యత ఉపాధ్యాయులదే. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులను తీర్చి దిద్దినప్పుడు వారికి ఆత్మసంతృప్తితోపాటు ప్రజల నుంచి హర్షామోదాలు వ్యక్తమవుతాయి. ఇందుకు ఆధునిక బోధనా విధానాలు, మూల్యాంకనా విధానాలతో పాటు జాతి నిర్మాణానికి ఉపయుక్తమయ్యే తాజా కరికులంపై పూర్తిస్థాయి అవగాహన ఏర్పర్చుకుని లక్ష్య సాధనకు ఉపాధ్యాయులు సిద్ధపడాలి.

ఉపాధ్యాయుడు నిరంతర అభ్యాసకుడు, పరిశోధకుడు అయినప్పుడు మాత్రమే మంచిఫలితాలు సాధ్యమవుతాయి. ఆధునిక అవసరాలు, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని తమను తాము అందుకు సన్నద్ధం చేసుకుంటూ భావి భారత పౌరులను తీర్చిదిద్దేందుకు సిద్ధం కావాలి. క్షేత్ర స్థాయిలో ఇది కనిపించినప్పుడే ఉపాధ్యాయులకు గౌరవం.


– బి.వి. రమణమూర్తి, టీచర్, విశాఖపట్నం

(నేడు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి; ఉపాధ్యాయ దినోత్సవం)

శరీర ధర్మం

మహాపురుష లక్షణాలతో, అసమాన సౌందర్యంతో బుద్ధుడి భౌతిక కాయం విరాజిల్లుతుండేది. అట్టి కాయాన్ని దర్శించినంత మాత్రాన, ప్రశంసించినంత మాత్రాన, అర్హంత సిద్ధి లభించదనే మాట సత్యం. అతడు ప్రవచించిన అష్టాంగ మార్గం అనుసరించటం వల్లనే అది లభిస్తుంది. అయినప్పటికీ, ఆయన సౌందర్యమే చాలామందికి ప్రథమ ఆకర్షణ కారణమవ్వటం 'తిపిటకా'ల్లో మనం చూస్తాము.

నవజాత శిశువు తథాగత సిద్ధార్థుని రూప సౌందర్యం చూసి సంతోషంతో కాలదేవుడు అనే ఋషి 'ఇతడు శ్రేష్ఠ వర్ణంతో, దీపశిఖలా ప్రజ్వలిస్తున్నాడు. పసుపు రంగు కంబళిపై పెట్టిన బంగారు ముద్రిక వలె ఉన్నాడు' అంటాడు. యువకుడైన సిద్ధార్థ గౌతముని అపూర్వ సౌందర్యం, ప్రజల మనసుల్ని అయస్కాంతంలా ఆకర్షించేదిగా ఉండేది. శాక్య వనిత కిసా గౌతమి అతని సౌందర్యం చూసి ముగ్ధురాలైందని అట్ఠ కథ ఒకటి చెబుతోంది. ఇల్లు విడిచి సత్యాన్వేషణలో బయలుదేరిన సిద్ధార్థుడు, రాజగృహం నగర వీధిలో పోతుంటే, మగధ రాజైన బింబిసారుడు చూసి అనుకొంటాడు 'ఇతడు దీర్ఘకాయుడు, పవిత్రుడు' అని.



బుద్ధత్వం ప్రాప్తించిన తర్వాత భగవానుడు తండ్రి శుద్ధోదనుడి ఆహ్వానం మేరకు కపిలవస్తు చేరుకొంటాడు. యశోధర, పదేండ్ల ప్రాయం గల పుత్రుడు రాహులునికి అప్పటిదాకా అతడు చూడని తండ్రిని మొదటిసారి చూపించి, ఈ విధంగా పరిచయం చేస్తుంది: ''మహా పురుష లక్షణాలతో పరిపూర్ణమైన శరీరంగల, చక్రాంకితమైన ఎర్రని పాదాలు గల, కాటుక వంటి నీలి వర్ణ కేశాలు గల, ప్రకాశవంతమైన నుదురుగల, నరులలో సింహంలా కనపడే ఇతడే నీ తండ్రి''.

బాగా అలంకరించిన రాజ రథం కూడా కాలం సమీపించినప్పుడు, కూలిపోయినట్లే శరీరం కూడా జీర్ణమైపోతుంది అని సుత్త పిటకం, సంయుత్త నికాయం, జరాధమ్మసుత్తం చెప్పుంది. అలాగే, బంగారు ఛాయతో మెరిసే బుద్ధుని శరీరం కూడా వృద్ధాప్యంలో జీర్ణావస్థకు లోనైంది. ముడుతలు పడింది. ఒక సందర్భంలో బుద్ధుడు తన ప్రియ శిష్యుడు ఆనందుడుతో అంటాడు, ''నాకిప్పుడు ఎనభైయవ ఏడు నడుస్తోంది. అరిగి పోయిన పాత బండిని ఏ విధంగా కట్టి, బిగించి నడిపిస్తారో, నేను కూడా నా శరీరాన్ని ఆ విధంగా నడిపిస్తున్నాను.''

బుద్ధుడు సామాన్య వ్యక్తుల కంటే ఎక్కువ ఆరోగ్యంగా ఉండేవాడు. అయినప్పటికీ, ముసలితనం ఎలాగో, వ్యాధి కూడా అలాగే శరీర ధర్మం. అందువల్ల బుద్ధుడు అప్పుడప్పుడు వ్యాధిగ్రస్తుడు అవుతుండేవాడు. మలబద్ధకంతో, వాతంతో, వీపు నొప్పితో పీడింపబడేవాడు. అప్పుడప్పుడు భగవానుని శరీరం రోగగ్రస్తమై ఉండినప్పటికీ, చిత్తం ఎల్లప్పుడూ నిరోగియై ఉండేది.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** బ.షష్ఠి రా.8.45 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** భరణి ప.2.46 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** రా.2.44 నుండి 4.20 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.07 వరకు, తదుపరి రా.10.48 నుండి 11.34 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.04 నుండి 11.34 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.49, **సూర్యాస్తమయం:** 6.08.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి


ఆలయం వెలుపల కుటుంబ సభ్యులతో జస్టిస్ సి.సుమలత

తిరుమల: తిరుమల శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.సుమలత సోమవారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. కాగా, శ్రీవారిని దర్శించుకున్న వారిలో సినీతారలు కృతి శెట్టి, నిరోషా, ఉత్తరప్రదేశ్ మంత్రి సంజీవ్ కుమార్ తదితరులు ఉన్నారు.


తిరుమల ఆలయం వెలుపల సినీనటి కృతి శెట్టి

'ఆలివ్‌రిడ్లే'కు ప్రత్యేక రక్షణ



- మరబోట్ల రెక్కలు తగలకుండా ప్రత్యేక పరికరాల ఏర్పాటు
- మత్స్యకారులకు అవగాహన కార్యక్రమాలు
- వన్యప్రాణులకు ముప్పు కలిగిస్తే క్రిమినల్ కేసులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: సముద్రంలో చేపల వేటకు వెళ్లే మరబోట్ల ఫ్యాన్ రెక్కలు తగిలి ప్రాణాలు కోల్పోతున్న అరుదైన ఆలివ్‌రిడ్లే తాబేళ్లను కాపాడేందుకు కృష్ణా జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇకనుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లే మరబోట్లకు లైసెన్స్‌లు తప్పనిసరి చేసింది. మరబోట్లు, మెకనైజ్డ్ బోట్ల ఫ్యాన్ల రెక్కలు ఆలివ్ రిడ్లే తాబేళ్లకు తగలకుండా ప్రత్యేక పరికరాలను అమర్చాలని నిర్ణయించింది. కొత్త మరబోట్లకు అనుమతిచ్చే సమయంలోనే ఆలివ్‌రిడ్లే తాబేళ్ల రక్షణకు ప్రత్యేక షరతులు విధించనుంది. ఈ తాబేళ్లకు ముప్పు కలిగిస్తే వన్యప్రాణి చట్టం–1972 ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయనుంది. తాజా నిర్ణయాలపై సముద్రంలో చేపలవేటకు వెళ్లే మత్స్యకారులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించనుంది. ఈ మేరకు కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మన దగ్గర ఎక్కువగానే..

ఆలివ్‌రిడ్లే తాబేళ్లలో ఏడు రకాల జాతులు ఉన్నాయి. వాటిలో జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఐదు రకాల జాతులు ఉండగా, మన దేశంలో రెండు రకాలు ఉన్నాయి. మన దేశంలో ఒడిశా తీరప్రాంతంలో ఆలివ్‌రిడ్లే తాబేళ్లు ఎక్కువగా ఉంటాయి. ఆ తర్వాత మన రాష్ట్రంలోని కాకినాడ జిల్లా ఉప్పాడ తీరం, హోప్ ఐలాండ్, కోరంగి అభయారణ్యం, కృష్ణాజిల్లా కోడూరు మండలం పాలకాయతిప్ప నుంచి నాగాయలంక మండలం జింకపాలెం వరకు, బాపట్ల జిల్లా సూర్యలంక, నిజాంపట్నం తీర ప్రాంతాల్లో ఆలివ్‌రిడ్లే తాబేళ్లు ఎక్కువగా ఉన్నాయి. ఒక్కో తాబేలు 50 కిలోల వరకు బరువు పెరుగుతుంది. వీటి సంరక్షణకు అటవీశాఖ కూడా ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ప్రతి సంవత్సరం ఈ తాబేళ్ల గుడ్లను సేకరించి సముద్రంలోకి వదులుతుంది. ఈ సంవత్సరం కూడా 46,840 గుడ్లను సముద్రంలోకి వదిలింది. 2009 నుంచి ఇప్పటి వరకు కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 5.18లక్షల ఆలివ్ రిడ్లే తాబేళ్లను సముద్రంలోకి వదిలింది.


మరబోటు ఫ్యాన్ రెక్క తగిలి కోడూరు మండలం పాలకాయతిప్ప వద్ద సముద్రం ఒడ్డుకు కొట్టుకొచ్చిన ఆలివ్‌రిడ్లే తాబేలు (ఫైల్)

రూ.1,800 కోట్లతో క్యాన్సర్ బాధితులకు వైద్యం

ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబు


డయాలసిస్ చేయించుకున్న పేషెంట్‌తో మాట్లాడుతున్న అశోక్‌బాబు

చీమకుర్తి: రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం రూ.1800 కోట్లు ఖర్చు చేసిందని ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబు తెలిపారు. సోమవారం చీమకుర్తి అర్బన్ హెల్త్ క్లినిక్‌ను ఆయన సందర్శించారు. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు పొందిన క్రిస్టియన్‌పాలెం, రాజీవ్‌నగర్‌లోని డయాలసిస్, క్యాన్సర్, మోకాళ్ల ఆపరేషన్లు చేయించుకున్న పేషెంట్ల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్యం గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 2.60 లక్షల మంది క్యాన్సర్ పేషెంట్లు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలు పొందినట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా క్యాన్సర్ వ్యాధికి కీమో చేయించుకున్న వారికి వైఎస్సార్ ఆసరా డబ్బులతో పాటు రవాణా చార్జీలు, ఉచితంగా మందులను కూడా అందిస్తున్నట్లు తెలిపారు.

దారుణమైన వ్యాఖ్యలు దేనికి?

- ఉదయనిధి క్షమాపణలు చెప్పాల్సిందే
- శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి



సింహాచలం: సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు, ఆ రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్‌పై విశాఖ శ్రీశారదా పీఠం అధిపతి స్వరూపానందేంద్ర మండిపడ్డారు. సనాతన ధర్మంపై ఉదయనిధి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను స్వరూపానందేంద్ర సరస్వతి తీవ్రంగా ఖండించారు. సనాతన ధర్మం యావత్ ప్రపంచానికి తలమానికంగా ఉంటే ఉదయనిధి స్టాలిన్ మైనారిటీ ఓట్ల కోసం ఇలాంటి దారుణమైన వ్యాఖ్యలు చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. భారతదేశం ఎవరబ్బ సొత్తు కాదని.. రాజకీయ నాయకుల సొత్తు అసలే కాదని అన్నారు. ఐదేళ్లు పరిపాలించమని ప్రజలు ఉద్యోగం ఇస్తే.. దానిని దుర్వినియోగం చేసుకుని యావత్ హిందువులందరికీ అవమానం కలిగేలా సనాతన ధర్మాన్ని ఉదయనిధి స్టాలిన్ హేళన చేశాడన్నారు. 'నీ తల్లి పేరు దుర్గ అని గుర్తుంచుకో. ఆమె ప్రతి ఆలయానికి వెళుతుంది. సనాతన ధర్మాన్ని దూషించిన నువ్వు.. నీ తల్లిని కూడా దూషించినట్టే అవుతుంది' అని ఉదయనిధి స్టాలిన్‌ను హెచ్చరించారు. ఇలాంటి పనికిమాలిన వ్యాఖ్యలను చేయడం మానాలని హితవు పలికారు. ఈ విషయంపై ఉదయనిధి స్టాలిన్ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే యావత్ హిందువులంతా ఉదయనిధి స్టాలిన్‌కు ఎలాంటి రాజకీయ అభివృద్ధి లేకుండా చేస్తారని హెచ్చరించారు.

ఒకే కుటుంబంలో నలుగురి హత్య

- తమ ఇంటివద్ద మద్యం తాగొద్దన్నందుకు కత్తులతో దాడి
- తమిళనాడులో ఘాతుకం

సాక్షి, చెన్నై: తమ ఇంటివద్ద మద్యం తాగుతున్న వారిని ప్రశ్నించిన ఓ కుటుంబం దారుణ హత్యకు గురైంది. తమిళనాడులో ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తిరుప్పూర్ జిల్లా పల్లడం కళ్లల్ కెనరు ప్రాంతానికి చెందిన సెంథిల్‌కుమార్ స్థానికంగా పశువుల దాణా దుకాణం నడుపుతున్నాడు. ఆయన వద్ద గతంలో తూత్తుకుడికి చెందిన వెంకటేశన్ డ్రైవర్‌గా పని చేసి మానేశాడు. ఆదివారం రాత్రి వెంకటేశన్ తన మిత్రులతో కలిసి సెంథిల్‌కుమార్ ఇంటిముందు ఉన్న గార్డెన్‌లో కూర్చుని మద్యం తాగుతుండగా సెంథిల్‌కుమార్ ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన వెంకటేశన్‌తో పాటు అతని మిత్రులు తొలుత సెంథిల్ కుమార్‌ను, ఆ తర్వాత సోదరుడు మోహన్‌ను, తల్లి పుష్పవతిని, పిన్ని రత్నమ్మాల్‌ను విచక్షణా రహితంగా నరికి చంపేశారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. నిందితులను అరెస్ట్ చేయాలని కోరుతూ తిరుప్పూర్, పల్లడంలలో సోమవారం ఉదయం నుంచి ఆందోళనలు కొనసాగుతున్నాయి. కాగా.. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను తీసుకునేందుకు బంధువులు నిరాకరించారు.

ఆక్వా జోన్ విధానం తెచ్చింది చంద్రబాబే..

- డిస్కంలకు ఎగ్గొట్టిన బకాయిలను మేమే చెల్లించాం
- యూనిట్ రూ.1.50కే విద్యుత్ సరఫరా చేస్తున్నాం
- నాలుగేళ్లుగా ఆక్వా రైతులకు అండగా నిలిచిందీ ప్రభుత్వం
- లోకేశ్‌పై అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం ఆగ్రహం



సాక్షి, అమరావతి: ఆక్వా రంగం గురించి కనీస అవగాహన లేకుండా మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్ వడ్డి రఘురాం టీడీపీ నేత నారా లోకేశ్‌ను హెచ్చరించారు. భీమవరంలో ఆక్వా రైతుల సమావేశంలో లోకేశ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. సోమవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ 'ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ అంటే ఏంటో తెలుసా? ఈ జోన్ విధానం తెచ్చిందే మీ తండ్రి చంద్రబాబు హయాంలో కాదా.. ఈ విధానాన్ని 2018లో ప్రారంభించి, మీ తండ్రి చంద్రబాబు మధ్యలో గాలికొదిలేస్తే, వైఎస్ జగన్ సీఎం అయ్యాక సర్వే ద్వారా జోన్, నాన్ జోన్ పరిధిని నిర్ధారించారని తెలిపారు. రాష్ట్రంలో 4.65 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతుండగా, ఆక్వా జోన్ పరిధిలో 10 ఎకరాల్లోపు 3.27 లక్షల ఎకరాలను తీసుకొచ్చి, యూనిట్ రూ.1.50కే విద్యుత్ సబ్సిడీ అందిస్తూ సన్న, చిన్నకారు ఆక్వా రైతులకు అండగా నిలుస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎన్నికలకు ఆర్నెల్ల ముందు యూనిట్ విద్యుత్ రూ.2కే ఇస్తానని ఆక్వా రైతులకు నమ్మబలికి, డిస్కంలకు చెల్లించాల్సిన సబ్సిడీని ఎగ్గొట్టిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మీ తండ్రి ఎగ్గొట్టిన బకాయిలు చెల్లించడమే కాదు, రైతుల తరఫున డిస్కమ్‌లకు చెల్లించాల్సిన మొత్తాన్ని అణాపైసలతో సహా చెల్లిస్తున్నట్టు తెలిపారు. నరసాపురంలో దేశంలోనే మూడో మత్స్య యూనివర్సిటీ ఉందన్న విషయాన్ని కూడా మరచి 'మాకు అధికారాన్నిస్తే ఆక్వా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తా' అంటూ హామీ ఇవ్వడం లోకేశ్ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. వెనామియా కల్చర్‌కు అనుమతి లేకున్నా కేంద్రంతో మాట్లాడి రైతులను ఆదుకున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఆక్వా రైతుల సంక్షేమం కోసం చంద్రబాబు ఒక్కటంటే ఒక్క కార్యక్రమాన్నైనా అమలు చేశారా.. అని ప్రశ్నించారు. మీ తండ్రి హయాంలో రొయ్యల ధరలు గంటకో రీతిలో ఉండేవి. ధరలు పతనమైనప్పుడు ఏనాడైనా జోక్యం చేసుకుని ప్రాసెసింగ్ కంపెనీలు, ఎగుమతిదారులను పిలిపించి మాట్లాడారా.. అంటూ నిలదీశారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కరోనా లాక్‌డౌన్ సమయంలోనూ రొయ్య రైతులకు ఇబ్బంది లేకుండా రవాణ, ఎగుమతులు కొనసాగేలా చర్యలు తీసుకోవడమే కాదు... గిట్టుబాటు ధర దక్కేలా సీఎం వైఎస్ జగన్ కృషి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అంతేకాదు ప్రాసెసింగ్ ప్లాంట్స్, రైతులతో మాట్లాడి ప్రతి 10 రోజులకోసారి రేట్లు నిర్ణయించి, కచ్చితంగా అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఆక్వా రైతుల కోసం తమ ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుందని వాటిని వివరించారు.

సీతమ్మకొండపై హర్ శిఖర్ తిరంగా

జాతీయ జెండాను ఆవిష్కరించిన ఆర్మీ బృందం

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): రాష్ట్రంలో అత్యంత ఎత్తయిన సీతమ్మ కొండపై 'హర్ శిఖర్ తిరంగా'కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కొండపై ఆర్మీ బృందం జాతీయ జెండాను విజయవంతంగా ఆవిష్కరించింది. దీంతో సీతమ్మకొండకు జాతీయస్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ (నిమాస్) డైరెక్టర్ కల్నల్ రణవీర్‌సింగ్ జమ్వాల్ ఆధ్వర్యంలో 14 మందితో కూడిన ఆర్మీ బృందం సోమవారం మధ్యాహ్నం హుకుంపేట మండలంలోని మారుమూల ఓలుబెడ్డ గ్రామానికి చేరుకుంది. సర్పంచ్ పాంగి బేస్ ఆధ్వర్యంలో గిరిజనులంతా వారికి పూలమాలలతో స్వాగతం పలికారు. థింసా నృత్యాలతో ఆర్మీ బృందం కూడా సందడి చేసింది. మధ్యాహ్నం 1.30గంటలకు సీతమ్మ కొండపైకి బయలుదేరిన ఆర్మీ బృందం... గంటన్నరలో కొండపైకి చేరుకుని జాతీయ జెండాను ఎగురవేసింది. ఈ సందర్భంగా కల్నల్ రణవీర్‌సింగ్ జమ్వాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎత్తయిన శిఖరంగా గుర్తించిన సీతమ్మ కొండపై జాతీయ జెండాను ఎగురవేయడం సంతోషంగా ఉందన్నారు. తమ యాత్ర, జాతీయ జెండా ఆవిష్కరణకు రాష్ట్ర ప్రభుత్వం, పర్యాటకశాఖ, స్థానిక గిరిజనులు ఎంతో సహకరించినట్లు తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు ఒకటో తేదీన హర్ శిఖర్ తిరంగా యాత్రను ప్రారంభించామన్నారు. సీతమ్మ కొండతో కలిపి ఇప్పటి వరకు 22 రాష్ట్రాల్లోని ఎత్తయిన పర్వత శిఖరాల్లో జాతీయ జెండాను విజయవంతంగా ఎగురవేశామన్నారు. మరో 6 రాష్ట్రాల్లో హర్ శిఖర్ తిరంగాను అక్టోబర్ 15వ తేదీకి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎవరెస్ట్ అధిరోహకుడు ఆనంద్‌కుమార్, టూరిజం అడ్వంచర్ స్పోర్ట్స్ ప్రతినిధి కుంతూరు కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

సీతమ్మ కొండపై జాతీయ జెండాను ఆవిష్కరించిన బృందం సభ్యులు



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 7 నుంచి 9 వరకు శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని కణ్ణన్ తిరునక్షత్ర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో గీతారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మూడ్రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఈనెల 9న శ్రీకృష్ణ జయంతి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సాయంత్రం 5గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అదేరోజు రాత్రి శ్రీస్వామి వారి ఆలయంలో రుక్మిణీ కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. 7వ తేదీన నిత్య, శాశ్వత కల్యాణం, బ్రహ్మోత్సవం, శ్రీసుదర్శన నారసింహ హోమం రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా...

ఒక్క రోజైనా సెలవు తీసుకోని ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: తొమ్మిదేళ్ల క్రితం ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీ అప్పటి నుంచి ఇప్పటిదాకా ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదు. నిత్య శ్రామికుడిలాగా పని చేస్తున్నారు. ప్రధానమంత్రి తీసుకున్న సెలవుల వివరాలు ఇవ్వాలంటూ మహారాష్ట్రలోని పుణేకు చెందిన ప్రఫుల్ పి.సార్దా అనే సామాజిక కార్యకర్త సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కింద దరఖాస్తు చేశారు. గత తొమ్మిదేళ్లలో మోదీ ఇప్పటిదాకా ఒక్క సెలవు కూడా పెట్టలేదని, నిత్యం విధి నిర్వహణలోనే ఉంటున్నారని ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ) తాజాగా సమాచారమిచ్చింది. ప్రధానమంత్రి హోదాలో మోదీ ఎన్ని కార్యక్రమాలకు హాజరయ్యారో చెప్పాలని ప్రఫుల్ పి.సార్దా మరో ప్రశ్న అడిగారు. భారత్ సహా విదేశాల్లో మోదీ 3,000కుపైగా కార్యక్రమాల్లో పాల్గొన్నారని పీఎంఓ బదులిచ్చింది. ఒక్క రోజైనా సెలవు తీసుకోకుండా పని చేస్తున్న ప్రధానమంత్రిపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. దేశ అభివృద్ధి పట్ల ఆయన అంకితభావాన్ని నెటిజన్లు కొనియాడుతున్నారు. అందరికీ ఆయనొక మార్గదర్శి అని చెబుతున్నారు.

ఒడిశాలో పిడుగుల వర్షం



భువనేశ్వర్: శక్తివంతమైన పిడుగులు ఒడిశా రాష్ట్రాన్ని వణికించాయి. శనివారం కేవలం రెండు గంటల వ్యవధిలో ఏకంగా 61,000కుపైగా పిడుగుపాట్లు సంభవించడం గమనార్హం. పిడుగుల ధాటికి 12 మంది మరణించారని, మరో 14 మంది గాయాలపాలయ్యారని స్పెషల్ రిలీఫ్ కమిషనర్ సత్యబ్రత సాహూ చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున నష్ట పరిహారం చెల్లిస్తామన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావంతో ఒడిశాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు జిల్లాల్లో 'ఎల్లో వార్నింగ్' జారీ చేశారు. ఈ నెల 7వ తేదీదాకా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది.

ఒకే వసుధ ఒకే కుటుంబం ఒక సదస్సు



జీ20 సదస్సుకు ఢిల్లీ ముస్తాబు | వసుధైక కుటుంబమే నినాదం

అంతర్జాతీయ స్థాయిలో జరిగే అత్యంత కీలకమైన జీ20 సదస్సుకు నభూతో అనే స్థాయిలో ఘనంగా ఆతిథ్యం ఇచ్చేందుకు భారత్ పూర్తిస్థాయిలో సిద్ధమవుతోంది. అమెరికా మొదలుకుని 20 అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల అధినేతలు ఒకే వేదిక మీదికి రానున్నారు. ఆర్థిక అసమానతలు మొదలుకుని వాతావరణ మార్పుల దాకా ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న పలు ప్రధాన సమస్యలపై సెప్టెంబర్ 9 నుంచి రెండు రోజుల పాటు లోతుగా చర్చించనున్నారు. ఐక్యత, సమష్టి కార్యాచరణే ఆయుధాలుగా పరిష్కార మార్గాలు అన్వేషించనున్నారు.

అంతర్జాతీయంగా భారత్ పలుకుబడి, పేరు ప్రతిష్టలు కొన్నేళ్లుగా పెరుగుతూ వస్తున్నాయి. దేశాల మధ్య అతి జటిలమైన సమస్యల పరిష్కారానికైనా, వివాదాల్లో మధ్యవర్తిత్వానికైనా అన్ని దేశాలూ భారత్ వైపే చూసే పరిస్థితి! ఇప్పుడు జీ20 శిఖరాగ్రానికి భారత్ వేదికగా నిలుస్తుండటాన్ని అందుకు కొనసాగింపుగానే భావిస్తున్నారు. మన దేశ వ్యవహార దక్షతను నిరూపించుకోవడానికి మాత్రమే గాక అంతర్జాతీయ స్థాయిలో సంలీన వృద్ధి, సుస్థిర అభివృద్ధి సాధన యత్నాలకు అజెండా నిర్దేశించేందుకు కూడా ఇది చక్కని అవకాశంగా నిలవనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెరపైకి తెచ్చిన వసుధైవ కుటుంబకం (ఒక వసుధ, ఒకే కుటుంబం, ఒకటే భవిత) నినాదమే సదస్సుకు మూలమంత్రంగా నిలవనుంది.

రెండు రోజులు.. మూడు సెషన్లు

దేశ రాజధాని ఢిల్లీలో చారిత్రక ప్రగతి మైదాన్‌లో సదస్సు జరగనుంది.

వేదికకు **భారత్ మండపం** అని నామకరణం చేశారు.

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ 7వ తేదీనే భారత్‌కు రానున్నారు. 8న మిగతా దేశాధినేతలు వస్తారు. దాంతో వారితో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలకు కావాల్సినంత సమయం చిక్కనుంది.

8న బైడెన్‌తో మోదీ భేటీ అవుతారని సమాచారం. ఈ భేటీ ఎజెండా ఏమిటన్నది ఇప్పటికైతే సస్పెన్సే.

తొలి రోజు ఇలా...

- సదస్సు 9న మొదలవుతుంది.
- ప్రతి దేశాధినేతకూ భారత్‌మండపం వద్ద మన సంప్రదాయ రీతుల మధ్య ఘన స్వాగతం లభించనుంది.
- రెండు రోజుల సదస్సులో మొత్తం మూడు సెషన్లు జరుగుతాయి.
- ఒకే వసుధ (వన్ ఎర్త్) పేరుతో తొలి సెషన్ శనివారం ఉదయం 9కి మొదలవుతుంది.
- దానికి కొనసాగింపుగా దేశాధినేతల మధ్య అధికార, అనధికార భేటీలుంటాయి.
- అనంతరం ఒకే కుటుంబం (వన్ ఫ్యామిలీ) పేరుతో రెండో సెషన్ మొదలవుతుంది.

రెండో రోజు ఇలా...

- సదస్సు రెండో రోజు ఆదివారం కార్యక్రమాలు త్వరగా మొదలవుతాయి.
- దేశాధినేతలంతా ముందు రాజ్‌ఘాట్‌ను సందర్శిస్తారు. గాంధీజీ సమాధి వద్ద నివాళులర్పిస్తారు.
- అనంతరం భారత్ మండపం వేదిక వద్ద మొక్కలు నాటుతారు. పర్యావరణ పరిరక్షణకు పునరంకితం అవుతామని ప్రతినబూనుతారు.
- ఒకే భవిత (వన్ ఫ్యూచర్) పేరిట జరిగే మూడో సెషన్‌తో సదస్సు ముగుస్తుంది.
- జీ20 అధ్యక్ష బాధ్యతలను వచ్చే ఏడాది శిఖరాగ్రానికి ఆతిథ్యం ఇస్తున్న బ్రెజిల్‌కు అప్పగించడంతో సదస్సు లాంఛనంగా ముగుస్తుంది.



మరెన్నో విశేషాలు...

- ప్రతినిధుల షాపింగ్ కోసం క్రాఫ్ట్స్ బజార్ పేరిట వేదిక వద్ద జీ20 జాబ్ ఫెయిర్ ఏర్పాటు చేస్తారు.
- ప్రజాస్వామ్యాలకు తల్లి భారత్ థీమ్‌తో హాల్ నంబర్ 14లో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తారు.

ప్రథమ మహిళల సందడి

జీ20 సదస్సులో ఆయా దేశాధినేతల సతీమణులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు.

పలు ప్రత్యేక కార్యక్రమాలతో సందడి చేయనున్నారు.

శనివారం తొలి రోజు వాళ్లు పూసా లోని వ్యవసాయ పరిశోధన సంస్థ, నేషనల్ మోడర్న్ ఆర్ట్ గ్యాలరీ సందర్శిస్తారు.

తృణ ధాన్యాల పరిరక్షణ, వృద్ధిలో భారత్ చేస్తున్న కృషిని స్వయంగా గమనిస్తారు.

చివరగా పలు రకాల షాపింగులతో సేదదీరుతారు.

రెండో రోజు ఆదివారం దేశాధినేతల అనంతరం వాళ్లు కూడా రాజ్‌ఘాట్‌ను సందర్శిస్తారు.

షడ్రసోపేత విందు

- శనివారం తొలి రోజు సదస్సు అనంతరం రాత్రి ఆహూతులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఘనంగా విందు ఇవ్వనున్నారు.
- ఇందులో దేశాధినేతలు మొదలుకుని రాయబారులు దాకా 400 మంది దాకా పాల్గొంటారు.
- విందు కూడా అధినేతల చర్చలకు వేదిక కానుంది. కాన్ఫరెన్స్ గదుల రొటీన్‌కు దూరంగా ఆరుబయట వారంతా మనసు విప్పి మాట్లాడుకుంటారు.

సాక్షి, నేషనల్ డెస్క్

జీ20 శిఖరాగ్రానికి జిన్‌పింగ్ దూరం

- బదులుగా ప్రధాని లీ క్వియాంగ్
- చైనా విదేశాంగశాఖ స్పష్టీకరణ
- నిరాశ కలిగించిందన్న అమెరికా అధ్యక్షుడు బైడెన్

బీజింగ్: ఈ నెల 9, 10వ తేదీల్లో ఢిల్లీలో జరగనున్న జీ20 శిఖరాగ్ర భేటీకి అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరుకావడం లేదని చైనా తెలిపింది. ఆయన స్థానంలో ప్రధాని లీ క్వియాంగ్ చైనా ప్రతినిధి బృందానికి సారథ్యం వహిస్తారని స్పష్టం చేసింది. అందరితో కలిసి పనిచేసి శిఖరాగ్ర సదస్సును విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపింది. 18వ జీ20 భేటీకి రావాలంటూ భారత ప్రభుత్వం పంపిన ఆహ్వానం మేరకు ప్రధాని లీ క్వియాంగ్ హాజరవుతారని చైనా విదేశాంగ ప్రతినిధి మావో నింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'అతి ముఖ్యమైన అంతర్జాతీయ ఆర్థిక సహకార వేదికైన జీ20కి చైనా ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. జీ20 కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుంది' అని వివరించిన మావో..ఈ భేటీకి జిన్‌పింగ్ హాజరు కాకపోవడానికి గల కారణాలను మాత్రం వెల్లడించలేదు. ఈ పరిణామంపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పందించారు. భారత్‌లో జరిగే జీ20 శిఖరాగ్రంలో పాల్గొనేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. అయితే, ఈ కార్యక్రమానికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రాకపోవడం నాకు నిరాశ కలిగించింది. కానీ, ఆయన్ను కలుసుకోబోతున్నా' అని చెప్పారు. జిన్‌పింగ్‌తో భేటీ ఎప్పుడుంటుందనే విషయాన్ని మాత్రం ఆయన తెలపలేదు. గత ఏడాది నవంబర్‌లో ఇండోనేసియాలోని బాలిలో జరిగిన భేటీకి కూడా జిన్‌పింగ్ హాజరుకాలేదు. ఇటీవల జకార్తాలో జరిగిన ఆసియాన్, తూర్పు ఆసియా శిఖరాగ్ర భేటీలకు సైతం చైనా అధ్యక్షుడు దూరంగా ఉన్నారు. కాగా, ఉక్రెయిన్‌లో 'స్పెషల్ మిలటరీ ఆపరేషన్'పైనే తన దృష్టంతా ఉన్నందున జీ20 శిఖరాగ్రానికి హాజరు కాలేకపోతున్నట్లు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇప్పటికే ప్రధాని మోదీకి స్వయంగా ఫోన్ చేసి చెప్పిన విషయం తెలిసిందే.

ప్రపంచ స్థాయి భద్రత

సాక్షి, న్యూఢిల్లీ: ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన నాయకులు హాజరవుతున్న జీ20 శిఖరాగ్ర సదస్సుకు కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 9, 10వ తేదీల్లో జరగనున్న శిఖరాగ్ర సదస్సుకు 20 దేశాల అధినేతలు సహా 14 అంతర్జాతీయ సంస్థల అధిపతులు హాజరు కానున్నారు. సదస్సు సందర్భంగా 80,000 మంది ఢిల్లీ పోలీసులతో సహా దేశ రాజధానికి సుమారు 1,30,000 మంది భద్రతా సిబ్బంది రక్షణ కల్పిస్తారని కేంద్రం వెల్లడించింది. సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) సహా, విదేశీ నేతలకు సంబంధించిన భద్రత కోసం సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్), నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ), స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) కమెండోలను నియమించారు. వీరికి అదనంగా పారామిలిటరీ బలగాలు, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా) సైతం భద్రతా చర్యల్లో పాలుపంచుకోనున్నాయి. అదనంగా, ప్రపంచ నాయకుల జీవిత భాగస్వాములు, కుటుంబ సభ్యుల రక్షణ బాధ్యతను సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) దళాలకు అప్పగించారు. అమెరికాకు చెందిన సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (సీఐఏ), చైనా భద్రతా శాఖ (ఎంఎస్ఎస్), యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ఎంఐ-6, ఇతర విదేశీ గూఢచార సంస్థలు సైతం ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నాయి.

రాఫెల్‌లు.. హెలికాప్టర్‌లు.. యాంటీ డ్రోన్‌లు

దేశాధినేతల భద్రతా వ్యవస్థలో బాగంగా గగనతల దాడులను సైతం సమర్థంగా ఎదుర్కొనేలా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్), ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీఎస్), ఇతర ఏజెన్సీలు జాగ్రత్తలు తీసుకున్నాయి. అత్యవసర సమయాల్లో ఎన్ఎస్‌జీ కమెండోలు, ఐఏఎఫ్ సిబ్బందిని తరలించేలా హెలికాప్టర్లను మోహరించింది. ఢిల్లీ, దాని సమీప ప్రాంతాలలో సమగ్ర ఏరోస్పేస్ రక్షణ కోసం ఇప్పటికే పారాగ్లైడర్లు, పారామోటర్లు, హ్యాంగ్-గ్లైడర్లు, మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, రిమోట్‌గా పైలట్ చేసిన ఎయిర్‌క్రాఫ్ట్, హాట్ ఎయిర్ బెలూన్‌లు, చిన్న విమానం, క్వాడ్‌కాప్టర్లు నిర్వహణను నిషేధించారు.

అప్పటి దాకా ధాన్యం ఒప్పందం ఉండదు

మాస్కో: యుద్ధం కొనసాగుతున్న వేళ నల్ల సముద్రం మీదుగా ఉక్రెయిన్ ధాన్యం రవాణా కారిడార్‌ను పునరుద్ధరించాలంటే పశ్చిమ దేశాలు ముందుగా తమ డిమాండ్లను అంగీకరించాల్సిందేనని రష్యా అధ్యక్షుడు పుతిన్ చెప్పారు. దీంతో, ఆఫ్రికా, మధ్య ప్రాచ్యం, ఆసియా దేశాలకు ఎంతో కీలకమైన ఆహార ధాన్యాల సరఫరాపై నీలినీడలు అలుముకున్నాయి. టర్కీ, ఐరాస మధ్యవర్తిత్వంతో కుదిరిన ధాన్యం రవాణా కారిడార్ ఒప్పందం నుంచి జూలైలో వైదొలిగింది. ఈ ఒప్పందం పునరుద్ధరణపై చర్చించేందుకు సోమవారం రష్యాలోని సోచిలో తుర్కియే అధ్యక్షుడు తయ్యిప్ ఎర్డోగన్‌తో ఆయన సమావేశమయ్యారు. రష్యా నుంచి ఆహారధాన్యాలు, ఎరువుల ఎగుమతులకు గల అవరోధాలను తొలగిస్తామన్న వాగ్దానాలను పశ్చిమదేశాలు నిర్లక్ష్యం చేశాయని ఈ సందర్భంగా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడాది వరకు రికార్డు స్థాయిలో ఉన్న వ్యవసాయ ఉత్పత్తుల వాణిజ్యం ఓడల రాకపోకలు, బీమాకు సంబంధించిన అవరోధాల కారణంగా తీవ్రంగా దెబ్బతిందన్నారు. పశ్చిమదేశాలు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చిన పక్షంలో కొద్ది రోజుల్లోనే ఒప్పందంపై సంతకాలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంలో త్వరలోనే పురోగతి సాధిస్తామని ఎర్డోగన్ చెప్పారు.


జాబిల్లిపై మరోసారి 'విక్రమ్' ల్యాండింగ్

40 సెం.మీ. పైకి లేచి..
40 సెం.మీ. దూరంలో దిగిన ల్యాండర్

- చంద్రుడిపై లూనార్ నైట్ నేపథ్యంలో స్లీప్ మోడ్‌లోకి ల్యాండర్
- ల్యాండర్, రోవర్ మళ్లీ పనిచేస్తాయో లేదో చెప్పలేమంటున్న సైంటిస్టులు



ఆగస్ట్ 25న ల్యాండర్ చంద్రుడిపై దిగిన చోటు



సెప్టెంబర్ మూడున దిగిన చోటు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): చంద్రయాన్-3 మిషన్ ప్రయోగం విజయవంతంగా కొనసాగుతోంది. జాబిల్లి దక్షిణ ధ్రువం ఉపరితలంపై ల్యాండర్ 'విక్రమ్'ను మరోసారి సాఫ్ట్ ల్యాండింగ్ చేశారు. మొదట దిగిన ప్రాంతంలో కాకుండా మరో చోట విక్రమ్ క్షేమంగా దిగినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) 'ఎక్స్'లో వెల్లడించింది. తాము ఇచ్చిన ఆదేశాలకు విక్రమ్ చురుగ్గా స్పందించినట్లు తెలియజేసింది. ల్యాండర్ తొలిసారిగా ఆగస్టు 23న చందమామ ఉపరితలంపై విజయవంతంగా దిగిన సంగతి తెలిసిందే. చంద్రయాన్-3 మిషన్ లక్ష్యంలో భాగంగా ల్యాండర్‌ను తాజాగా మరోచోట దించారు. కమాండ్ ఇచ్చిన తర్వాత ల్యాండర్‌లోని ఇంజిన్లు ఫైర్ అయ్యాయని, తర్వాత ల్యాండర్ 40 సెంటీమీటర్ల మేర పైకి లేచిందని, 30 నుంచి 40 సెంటీమీటర్ల దూరంలో సురక్షితంగా ఉపరితలంపై దిగిందని ఇస్రో స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ మానవ సహిత ప్రయోగాలను నిర్వహించినపుడు వ్యోమగాములను క్షేమంగా తిరిగి భూమిపైకి తీసుకురావడానికి కిక్ స్టార్ట్ వంటిదని ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ల్యాండింగ్‌కు సంబంధించిన వీడియోను ఇస్రో విడుదల చేసింది.

నిద్రాణ స్థితిలోకి 'విక్రమ్'

చందమామపై మరో రెండు మూడు రోజుల్లో లూనార్ నైట్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ల్యాండర్ విక్రమ్‌ను నిద్రాణ స్థితి(స్లీప్ మోడ్)లోకి మార్చినట్లు ఇస్రో ప్రకటించింది. సోమవారం ఉదయం 8 గంటలకు ఈ ప్రక్రియ చేపట్టినట్లు తెలియజేసింది. ల్యాండర్‌ను స్లీప్ మోడ్‌లో ఉంచడంతో అందులోని పేలోడ్స్ డీయాక్టివ్ అయినట్లు వివరించింది. ల్యాండర్ రిసీవర్స్ మాత్రం చురుగ్గా పని చేస్తున్నట్లు తెలిపింది. చంద్రుడి ఉపరితలంపై సౌరశక్తి తగ్గిపోయి, బ్యాటరీ అయిపోయిన తర్వాత ల్యాండర్ విక్రమ్, రోవర్ ప్రజ్ఞాన్ పూర్తిగా స్లీప్ మోడ్‌లో ఉంటాయని ఇస్రో స్పష్టం చేసింది. చంద్రుడిపై రాత్రి ముగిసిపోయి, తిరిగి పగలు మొదలయ్యాక 22న ల్యాండర్, రోవర్ స్లీప్ మోడ్ నుంచి బయటకు వస్తాయని ఇస్రో అంచనా వేస్తోంది. లూనార్ డే మొదలైన తర్వాత ల్యాండర్, రోవర్ మళ్లీ పనిచేస్తాయా అంటే చెప్పలేమని ఇస్రో సైంటిస్టులు అంటున్నారు. మళ్లీ పని చేస్తే చంద్రయాన్-3 ప్రయోగం కొనసాగుతుంది. లేనిపోతే కథ ముగిసినట్లే.

నేడు కాంగ్రెస్ పార్లమెంటరీ వ్యూహ కమిటీ సమావేశం

ప్రత్యేక సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ



న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహంపై విపక్ష కాంగ్రెస్ దృష్టి పెట్టింది. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్లమెంటరీ వ్యూహ కమిటీ మంగళవారం సాయంత్రం 5 గంటలకు సమావేశం కానుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 18 నుంచి ఐదు రోజులపాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో లేవనెత్తాల్సిన అంశాలపై కాంగ్రెస్ పార్లమెంటరీ వ్యూహ కమిటీ భేటీలో చర్చిస్తారు. స్వల్ప జ్వరంతో బాధపడుతూ చికిత్స కోసం ఢిల్లీలోని సర్ గంగారాం ఆసుపత్రిలో చేరిన సోనియా గాంధీ సోమవారం డిశ్చార్జి అయ్యారు. ఇంటికి చేరుకున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగుపడినట్లు సమాచారం. విపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే త్వరలో సమావేశం కానున్నారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కూటమి తరపున అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చిస్తారు.

68 ఏళ్ల హరీశ్ సాల్వేకు మూడో పెళ్లి



న్యూఢిల్లీ: ప్రముఖ న్యాయవాది, మాజీ సొలిసిటర్ జనరల్ హరీశ్ సాల్వే మూడోసారి పెళ్లి కొడుకయ్యారు. 68 ఏళ్ల జనరల్ హరీశ్ సాల్వే లండన్‌లో త్రినా అనే మహిళను వివాహం చేసుకున్నారు. అత్యంత వైభవంగా ఈ పెళ్లి వేడుకకు నీతా అంబానీ, సునీల్ మిట్టల్, లలిత్ మోదీ తదితర ప్రముఖులు హాజరయ్యారు. హరీశ్ సాల్వేకు ఇది మూడో వివాహం. ఆయన మొదట మీనాక్షిని వివాహమాడారు. వారికి ఇద్దరు కుమార్తెలు సాక్షి, సానియా ఉన్నారు. దాదాపు 30 సంవత్సరాల తర్వాత మీనాక్షి నుంచి విడిపోయారు. 2020 జూన్‌లో విడాకులు తీసుకున్నారు. అదే సంవత్సరం కరోలిన్ బ్రోసార్డ్‌ను పెళ్లి చేసుకున్నారు. కొంత కాలానికి ఆమె నుంచి దూరమయ్యారు. ఇప్పుడు మూడోసారి త్రినాను పెళ్లాడారు. హరీశ్ సాల్వే 1999 నవంబర్ నుంచి 2002 నవంబర్ వరకూ ఇండియా సొలిసిటర్ జనరల్‌గా పనిచేశారు. టాటా గ్రూప్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ గ్రూప్ వంటి ప్రఖ్యాత సంస్థల కేసులను వాదించారు. భారత ప్రభుత్వం 2015లో హరీశ్ సాల్వేకు 'పద్మ భూషణ్' పురస్కారం ప్రకటించింది. 'ఒకే దేశం -ఒకే ఎన్నిక'పై అధ్యయనం చేయడానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీలో హరీశ్ సాల్వే సభ్యుడిగా ఉన్నారు.

'శివలింగం' వివాదంలో యూపీ మంత్రి

బారాబంకీ: సనాతన ధర్మాన్ని అవమానించారంటూ ఇండియా కూటమిపై గగ్గోలు పెడుతూ బీజేపీ నేతలు కూడా అలాంటి తప్పులే చేస్తున్నారని ప్రతిపక్షాల నేతలు విమర్శిస్తున్నారు. యూపీ మంత్రి ఒకరు శివలింగం వద్ద చేతులు కడుక్కోవడంపై వారు మండిపడుతున్నారు. మంత్రి సతీశ్ శర్మ ఆగస్ట్ 27వ తేదీన లోధేశ్వర్ మహాదేవ్ ఆలయంలో పూజలు చేశారు. ఈ సమయంలో ఆయన శివలింగం మొదట్లో చేతులు కడుక్కున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి బయటకు రావడంతో తాజాగా విమర్శలు వెల్లువెత్తాయి. సనాతన ధర్మాన్ని అవమానించిన మంత్రి సతీశ్ శర్మ పదవి నుంచి వైదొలగాలని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు డిమాండ్ చేశాయి. అయితే, తను ఏ తప్పూ చేయలేదని మంత్రి అంటున్నారు.

ఇండియా కూటమికి తొలి సవాల్

నేటి ఉపపోరులో కొన్ని చోట్ల ఉమ్మడిగా, మరికొన్ని చోట్ల విడివిడిగా..

లక్నో/అగర్తలా: దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాల్లోని ఏడు అసెంబ్లీ స్థానాలకు మంగళవారం జరగనున్న ఉప ఎన్నికలు ప్రతిపక్ష ఇండియా కూటమికి తొలి పరీక్షగా నిలిచాయి. ఇండియా కూటమి కొన్ని చోట్ల ఉమ్మడిగా పోటీ చేస్తుండగా, మరికొన్ని చోట్ల పరస్పరం పోటీపడుతున్నాయి. యూపీలోని ఘోసి, జార్ఖండ్‌లోని దుమ్రి, త్రిపురలోని ధన్‌పూర్, బొక్సానగర్, ఉత్తరాఖండ్‌లోని బాగేశ్వర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతిపక్ష ఇండియా కూటమి ఉమ్మడిగా అభ్యర్థులను బరిలోకి దించింది. పశ్చిమబెంగాల్‌లోని ధుప్‌గురి, కేరళలోని పుత్తుపల్లిల్లో ఇవే కూటమి పార్టీలు పరస్పరం తలపడుతుండటం గమనార్హం. ధుప్‌గురిలో టీఎంసీ, బీజేపీ, కాంగ్రెస్ బలపరిచిన సీపీఎం అభ్యర్థుల మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది. ఓట్ల లెక్కింపు ఈ నెల 8న ఉటుంది.

ఇండియా కూటమి హిందూ వ్యతిరేకి

- సనాతన ధర్మ వ్యాఖ్యలపై బీజేపీ మండిపాటు
- అన్ని మతాలను గౌరవిస్తామన్న కాంగ్రెస్



పట్నాలో బీజేపీ కార్యకర్తల నిరసన

న్యూఢిల్లీ: సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. దీనిపై బీజేపీ నేతలు, కేంద్రమంత్రులు ప్రతిపక్ష ఇండియా కూటమిపై విరుచుకుపడుతున్నారు. ఇటీవల ముంబైలో జరిగిన ఇండియా కూటమి నేతల సమావేశం హిందూమతమే లక్ష్యంగా జరిగిందని ఆరోపించారు. అయితే, తాము అన్ని మతాలను, ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవిస్తామని, అదేసమయంలో ఇతరులకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉంటుందని కాంగ్రెస్ పేర్కొంది. మనుషుల్ని సమానంగా చూడలేని మతం మతమే కాదని కర్ణాటక మంత్రి, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే కొడుకు ప్రియాంక్ ఖర్గే పేర్కొన్నారు. అటువంటి మతం రోగంతో సమానమన్నారు. అయితే, కాంగ్రెస్ సీనియర్ నేత కరణ్ సింగ్ మాత్రం ఉదయనిధి వ్యాఖ్యలను ఖండించారు. దేశంలోని కోట్లాదిమంది ఆచరించే సనాతనధర్మంపై ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు అసంబద్ధం, అత్యంత దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన రాజకీయ నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయరాదని కరణ్ సింగ్ అన్నారు.

క్షమాపణ చెప్పాలి

ఉదయనిధి వ్యాఖ్యలపై ఇండియా కూటమి నేతలు సోనియాగాంధీ, రాహుల్, అశోక్ గెహ్లాట్ తదితరులు మౌనంగా ఎందుకున్నారని బీజేపీ ప్రశ్నించింది. ఆ కూటమి హిందూ మతానికి వ్యతిరేకమని ఆరోపించింది. కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, ప్రహ్లాద్ జోషి,అనురాగ్ ఠాకూర్ ఉదయనిధి వ్యాఖ్యలను ఖండించారు. ఇండియా కూటమి నేతలు క్షమాపణ చెప్పకుంటే దేశం వారిని క్షమించబోదన్నారు హిందువుల మనోభావాలు దెబ్బతీశారంటూ ఉదయనిధిపై ముజఫర్‌పూర్‌కు చెందిన లాయర్ సుధీర్ కుమార్ ఓఝా కోర్టులో పిటిషన్ వేశారు.

అమెరికాలో అయ్యో పాపం మన పిల్లలు...

21 ఏళ్లు నిండితే ఇండియాకే!.. ముప్పు జాబితాలో 1.34 లక్షల మంది

న్యూఢిల్లీ: అమెరికాలో ఉంటున్న భారతీయులకు మరో చేదు వార్త. వారి పిల్లల్లో చాలామంది 21 ఏళ్లు నిడగానే దేశం వీడాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఆరి హెచ్4 కేటగిరీ వీసాల ప్రాసెసింగ్‌కు దశాబ్దాలకు పైగా వెయిటింగ్ జాబితా ఉండటమే ఇందుకు కారణం. వీరి సంఖ్య లక్షకు పైగా ఉంటుందన్న అంచనాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. అమెరికాలో శాశ్వత నివాసానికి వీలు కల్పించే గ్రీన్ కార్డుల కోసం ఉద్యోగాధారిత కేటగిరీ కింద దరఖాస్తు చేసుకుని వెయిటింగ్ లో ఉన్న భారతీయుల సంఖ్య 10.7 లక్షలకు పైగా ఉంది. ఇది చాలదన్నట్టు ఒక్కో దేశం నుంచి ఏటా ప్రాసెస్ చేసే వీసా దరఖాస్తుల సంఖ్యను 7 శాతానికి పరిమితం చేయడం సమస్యను జటిలం చేసింది. ప్రస్తుత వేగంతో మన వాళ్లందరికీ గ్రీన్ కార్డులు రావాలంటే హీన పక్షం 135 ఏళ్లు పడుతుంది. 21 ఏళ్ల కంటే తక్కువ వయసు వారు అమెరికాలో ఉండేందుకు వీలు కల్పించేదే హెచ్4 వీసా. ఈ కారణంగా కనీసం 1.34 లక్షల మంది భారతీయ పిల్లలు 21 ఏళ్లు నిండగానే అమెరికా వీడాల్సి ఉంటుందని డిసైడ్ మెయిర్ అనే ఇమిగ్రేషన్ వ్యవహారాల నిపుణుడు చేసిన అధ్యయనంలో తేలింది. హెచ్ 1బీ కేటగిరీ కింద అమెరికాలో ఉండే విదేశీయుల పిల్లలకు హెచ్4 వీసా ఇస్తారు. 21 ఏళ్లు వచ్చేదాకా అమెరికాలో ఉండేందుకు ఇది వీలు కల్పిస్తుంది. ఆ తర్వాత వాళ్లు హెచ్4 కేటగిరీ కింద అక్కడ ఉండేందుకు వీల్లేదు. వారక్కడే ఉండాలంటే స్టూడెంట్ (ఎఫ్) వీసా సంపాదించాలి. అవి చాల పరిమిత సంఖ్యలో మాత్రమే దొరుకుతాయి. దొరకని వారంతా అమెరికా వీడాల్సి ఉంటుంది. పిల్లలుగా అమెరికా వెళ్లి, అక్కడే పెరిగి పెద్దయిన వారికి ఇలా తల్లిదండ్రులను వదిలి దేశం వీడటం నరకప్రాయమే. పైగా భారత్ లోని తమ కుటుంబాలతో వారికి పెద్ద బంధాలేవీ ఉండే అవకాశం పెద్దగా ఉండదు. కనుక వెనక్కు వచ్చి ఇక్కడ, ఎలా ఉండాలన్నది మరో పెద్ద సమస్య కాగలదు.



గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించిన ప్రపంచంలోనే అతి పెద్ద స్ట్రింగ్ చీజ్ బంతి ఇది. దీని బరువు ఏకంగా 558 కేజీలు. దీని తయారీకి 6,000 లీటర్ల పాలను వినియోగించారు. దక్షిణ మెక్సికోలోని చియాపాస్ రాష్ట్రంలో దీనిని తయారుచేశారు.

సరిహద్దుల్లో భారీ సైనిక విన్యాసాలు

న్యూఢిల్లీ: చైనా, పాకిస్తాన్‌తో సరిహద్దుల్లో భారత వైమానిక దళం(ఐఏఎఫ్) త్రిశూల్ పేరిట భారీ సైనిక విన్యాసాలకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 4 నుంచి 14వ తేదీ వరకు ఇవి కొనసాగనున్నాయి. త్రిశూల్‌లో భాగంగా రఫేల్ వంటి యుద్ధ విమానాలను, ఎస్-400, ఎంఆర్‌సామ్, స్పైడర్ వంటి గగనతల రక్షణ వ్యవస్థలను ఎయిర్‌ఫోర్స్ రంగంలోకి దించనుంది. దీంతోపాటు, లద్దాఖ్‌లో ఆర్మీ విభాగాలు వేరుగా విన్యాసాలు చేపడతాయి. దేశ ఉత్తర సరిహద్దులతోపాటు ఢిల్లీలో, ఢిల్లీ వెలుపల ఐఏఎఫ్ పలు రక్షణ వ్యవస్థలను మోహరించనుంది. జీ20 సదస్సుకు సమగ్ర గగనతల రక్షణను కల్పించడమే త్రిశూల్ ఉద్దేశమని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అదేవిధంగా, లద్దాఖ్‌లో ఆర్మీ విభాగాలు ప్రత్యేక విన్యాసాలు నిర్వహిస్తాయి. పారా ట్రూపర్లు, పర్వత ప్రాంత యుద్ధ విద్యలో ఆరితేరిన విభాగాలు సైతం ఇందులో పాల్గొంటాయి. త్వరలో జరిగే జీ20 శిఖరాగ్రానికి 20 మందికి పైగా ప్రపంచ దేశాల నేతలు రానున్న దృష్ట్యా దేశ రాజధాని ఢిల్లీలో అత్యంత పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు జరుగుతున్న వేళ ఈ విన్యాసాలు జరుగుతుండటం గమనార్హం.

సాక్షి విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023



దుర్గమ్మ సేవలో..
ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు మహారాష్ట్ర ఉప లోకాయుక్త, ఐఏఎస్ సంజయ్ భాటియా దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు.



కృష్ణాష్టమి వేడుకలు
కృష్ణాష్టమి సందర్భంగా నగరంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు స్వామి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు విజయవాడ ఇస్కాన్ మందిర అధ్యక్షుడు చక్రధారి తెలిపారు. -8లో▸

దసరా సందడి షురూ
ఇంద్రకీలాద్రిపై దుర్గగుడిలో అక్టోబర్ 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే దసరా ఉత్సవాలకు అవసరమైన పనులు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ఏర్పాట్లు, భక్తుల రద్దీ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ఈ నెల 8వ తేదీన సమన్వయ సమావేశం జరగనుంది. -8లో▸



న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



విజయవాడ స్పోర్ట్స్: విశాఖపట్నంలో గత నెల 31వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జరిగిన బ్యాడ్మింటన్ సబ్ జూనియర్(అండర్-15) రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయవాడ క్రీడాకారులు సత్తా చాటారు. బాలికల డబుల్స్‌లో బి.విజయలక్ష్మి-కె.గంగశ్రీ జోడి, మిక్స్‌డ్ డబుల్స్‌లో టి.చరణ్‌రామ్-కె.గంగశ్రీ జోడి విజేతలుగా నిలిచి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను ఉమ్మడి కృష్ణాజిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పరసా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు బి.లక్ష్మీనారాయణ, కోశాధికారి దుర్గాప్రసాద్ అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు సోమవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. విజయవాడ శ్రీరామచంద్రనగర్‌కు చెందిన డాక్టర్ ఎన్. గోపీచంద్ దంపతులు రూ. 1,11,116 విరాళాన్ని ఆలయ అధికారులకు ఇచ్చారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

యార్డుకు 32,439 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 32,439 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 30,793 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.13,500 నుంచి 24,000 వరకు లభించింది.

ఎన్టీఆర్ జిల్లాలో 97.63 శాతం పింఛన్ల పంపిణీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుకను 97.63 శాతం మందికి పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 2,30,662 మంది పెన్షనర్లకు 2,25,193 మంది పింఛన్ కానుక అందుకున్నారు. జిల్లాలో అత్యధికంగా జి. కొండూరు మండలంలో 98.7 శాతం, ఇబ్రహీంపట్నంలో 98.61 శాతం, వీరులపాడులో 98.45 శాతం, విజయవాడ అర్బన్‌లో 98.02, జగ్గయ్యపేట అర్బన్‌లో 97.92 శాతం పంపిణీ చేశారు.

అమరేశ్వరుని పవిత్రోత్సవాలు ప్రారంభం

అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రం అమరావతి అమరేశ్వరాలయంలో సోమవారం పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. తొలిరోజు వేదపండితులు ఉదకశాంతి, ఆలయశుద్ధి, ప్రధాన, ఉపాలయాలమూర్తులకు అభిషేకాలు, అర్చనలు కలశారాధన, అగ్నిమథనం, హోమాలు, గోపూజ నిర్వహించారు. మంగళవారం రెండోరోజు మండప పూజలు, దీక్షాహోమాలు, మూలమంత్ర హవనములు, రుద్రహోమం, పవిత్రారోపణం, చండీహోమం నిర్వహిస్తామని ఆలయ ఈఓ వేమూరి గోపీనాథశర్మ తెలిపారు.

జ్ఞాన జ్యోతులు



శ్రీ గురుభ్యోనమః
- తల్లిదండ్రుల తర్వాత స్థానం ఉపాధ్యాయులదే..
- వారి బోధనతో విద్యార్థులకు వెలుగు బాట
- జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి కృషి
- విద్యార్థుల కోసం సొంత నిధులు వెచ్చిస్తున్న వైనం

జ్ఞానామృతాన్ని అందించే దైవం.. చీకట్లు పారదోలి వెలుగులు పంచే దివ్వె.. జీవన గమ్యానికి మార్గనిర్దేశం చేసే మహర్షి.. గురువు. 'దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే పురుడు పోసుకుంటుంది' అని నాడు పెద్దలు చెప్పారు. ఈ ప్రపంచంలో గురువే సమస్తం. రేపటి పౌరుల బంగరు భవితను అందించే మహత్తర శక్తి ఉపాధ్యాయులకే ఉంది. పురాణేతిహాసాలు సైతం పిల్లల భవితవ్యాన్ని తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుదే అని చెబుతున్నాయి. రేపటి పౌరుల అందమైన జీవితాల్లో వారు జ్ఞాన జ్యోతులు వెలిగిస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో అనేక మంది ఉత్తమ ఉపాధ్యాయులు విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తూ జేజేలు అందుకుంటున్నారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఆదర్శఉపాధ్యాయుడు ప్రేమ్‌చంద్



పాఠశాల స్థలం కొనుగోలుకు రూ.50 వేల సొంత నగదును ఎంఈఓకు అందిస్తున్న ప్రేమ్‌చంద్

కోడూరు: మండలంలో ఉపాధ్యాయుడు మన్నె ప్రేమ్‌చంద్ తోటి మాస్టర్లకు ఆదర్శం. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచడానికి ప్రేమ్‌చంద్ కృషి చేయడంతో పాటు పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తున్నారు. మండలంలోని స్వతంత్రపురం ప్రాథమిక పాఠశాలలో ప్రేమ్‌చంద్ 2013లో ప్రధానోపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. ఆ పాఠశాలలో కేవలం 21మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ప్రేమ్‌చంద్ తోటి ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచడానికి గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్వతంత్రపురంతో పాటు హరిపురం, ఉల్లిపాలెం, ముందడుగు నుంచి కూడా పాఠశాలలో విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చారు. 21మంది విద్యార్థుల సంఖ్యను 131కు పెంచి, తల్లిదండ్రులకు ప్రభుత్వ బడులపై బలమైన నమ్మకాన్ని కల్పించారు.

సొంత నిధులు, దాతల సహకారంతో స్థలం కొనుగోలు

రాష్ట్రంలోనే తొలిసారిగా 2018లోనే స్వతంత్రపురం ఎంపీపీ పాఠశాలలో ప్రేమ్‌చంద్ సహకారంతో ఇంగ్లిష్ మీడియం విద్యకు శ్రీకారం చుట్టారు. పాఠశాల పేరును సైతం 'స్వతంత్రపురం ఆదర్శ పాఠశాల'గా మార్పు చేశారు. దాతలు, ఎన్ఆర్ఐల సహకారంతో విద్యార్థులకు ఇంగ్లిష్ వర్క్ బుక్స్, మెటీరియల్స్‌ను అందించారు. పాఠశాల ఆవరణలో ఖాళీ స్థలం లేకపోవడంతో ప్రేమ్‌చంద్ రూ.3 లక్షల నగదుతో విద్యార్థులకు ఉపయోగపడేలా ఐదు సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశారు. రూ.2.50 లక్షల నగదును దాతల నుంచి సమకూర్చగా, సొంత నగదు రూ.50 వేలను స్థలం కొనుగోలుకు అందించారు. దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఆటోలను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన 'నాడు-నేడు' పథకం ద్వారా ప్రేమ్‌చంద్ పర్యవేక్షణలో స్వతంత్రపురం పాఠశాలను మరింతగా అభివృద్ధి చేశారు.

అవార్డులు, పురస్కారాలు

ప్రేమ్‌చంద్‌కు జిల్లాస్థాయి, మండలస్థాయిలో అనేక అవార్డులు లభించాయి. 2007లో జిల్లా ఉత్తమ రిసోర్స్ పర్సన్‌గా, 2018లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు అందుకున్నారు. 2016, 2018లో మండల ఉత్తమ ఉపాధ్యాయఅవార్డును ప్రేమ్‌చంద్ సొంతం చేసుకున్నారు. స్వతంత్రపురం పాఠశాలలో కల్పిస్తున్న వసతులకు 2022లో ఈ పాఠశాలకు జిల్లా స్వచ్ఛ పురస్కారాన్ని ఇచ్చారు. ఇటీవల బదిలీల్లో ప్రేమ్‌చంద్ మండలంలోని రామకృష్ణాపురం ఎంపీయూపీ పాఠశాలకు బదిలీపై వెళ్లారు. అక్కడ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.

సొంత నిధులతో విద్యార్థులకు శిక్షణ



పురస్కారం అందుకున్న వెంకయ్య మాస్టారు


మైలవరం: ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చారు వ్యాయామోపాధ్యాయుడు కె.వెంకయ్య. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాయామోపాధ్యాయుడుగా చేస్తున్న వెంకయ్య మాస్టారు ప్రభుత్వ పాఠశాలల్లో ఫెన్సింగ్, సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రవేశ పెట్టి, సొంత నిధులు కూడా వెచ్చించి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-19 ఫెన్సింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో 'లకిరెడ్డి' ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.విజయలక్ష్మి ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించి భిలాయ్, చత్తీస్‌ఘడ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలుకు ఎంపికవడం ఆయన శిక్షణకు తార్కాణం. వెంకయ్య మాస్టారు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును అందుకున్నారు. ఆయన కృషిని గుర్తించి ఆచరిత్వా ఫౌండేషన్ రాష్ట్ర స్థాయి మదర్ థెరీస్సా సేవా పురస్కారం అందుకున్నారు. అభ్యుదయ సామాజిక సేవాసంస్థ ఏర్పాటు చేసి ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

విద్యార్థుల మనసు చూరగొన్న గురువులు



తిరువూరు: తిరువూరు మండలం గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎం.రాంప్రదీప్ ఆంగ్లభాష అంటే విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టడానికి సులభరీతిలో పాఠ్యాంశాలను నేర్పేందుకు కృషి చేస్తున్నారు. ఆటపాటలతో ఆంగ్ల భాషా బోధన ఆయన ప్రత్యేకత. మన ఊరు మన గ్రంథాలయం కార్యక్రమం నిర్వహించారు. పేద విద్యార్థులు 9 మందికి ఎంబీబీఎస్ చదివేందుకు దాతల నుంచి ఆర్థికసాయాన్ని అందజేశారు. పిల్లలను బడిలో చేర్పించడం, విద్యార్థులకు శస్త్ర చికిత్సలు చేయించడం, రచయిత పైడిమర్రి జీవిత విశేషాలపై పరిశోధన చేసి తెలంగాణ, ఏపీలో గుర్తింపు పొందారు.

వినూత్న రీతిలో విద్యార్థులకు బోధన



2006 డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపికై ఏకొండూరు మండలం పాతకొండూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న భీమాల సురేష్‌బాబు సృజనాత్మక రీతిలో బోధన అందిస్తున్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చే శిక్షణ కార్యక్రమాలైన ఆనందలహరిలో మాస్టర్ కోచ్‌గా వినూత్న రీతిలో విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనపై శిక్షణ ఇచ్చారు. శాలసిద్ధి, సంగ్రహణాత్మక మదింపు పేపర్ల తయారీలో కీలక పాత్ర పోషించారు. 2018లో మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా సురేష్ ఎంపికయ్యారు.

ప్రత్యేక రీతిలో ఆంగ్ల బోధన



రెడ్డిగూడెం: కుదప జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా చేస్తున్న చిరివెళ్ల కృపావతి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డుకు ఎంపికయ్యారు. విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించడానికి ఆమె కృషి చేస్తున్నారు. ఉపాధ్యాయ కుటుంబంలో జన్మించిన ఆమెకు చిన్నప్పుడు ఆంగ్లమంటే ఆందోళన ఉండేది. ఆంగ్లంపై పట్టు సాధించాలనే దృఢ సంకల్పంతో ఇంటర్మీడియట్ విద్యను ఇంగ్లిష్ మీడియంలో చదువుకున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చారు. విద్యార్థుల్లో ఆంగ్లమంటే ఉన్న భయాన్ని పారదోలడానికి ఆమె ప్రత్యేక రీతిలో బోధన చేస్తున్నారు. పొయిటిక్స్, రైమ్స్‌ను అభినయంతో అర్థవంతంగా బోధిస్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా మొత్తం తిరిగి టీచింగ్ ఎట్ లెవల్ కార్యక్రమాన్ని విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించడానికి వినియోగించారు. సామర్థ్యం పెంపొందించేందుకు వినియోగించానని తెలిపారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికైన వారి వివరాలను కలెక్టర్ ప్రకటించారు. జిల్లాలో ప్రిన్సిపాల్ స్థాయిలో ఎ.వీరరాజు (ఏపీఎంఎస్ మద్దులపర్వ), ప్రధానోపాధ్యాయుల స్థాయిలో పి.నాగేశ్వరరావు (జగ్గయ్యపేట మండలం), జి.శివ పార్వతి (మైలవరం), షేక్ ఉమర్‌అలీ (విజయవాడ అర్బన్), ఎం. రవికుమార్ (విజయవాడ అర్బన్), జి.పుష్పలత (విజయవాడ అర్బన్), కె.ప్రేమ్‌సాగర్ (విజయవాడ అర్బన్), వి.భూపాల్ రెడ్డి (విజయవాడ రూరల్), స్కూల్ అసిస్టెంట్ స్థాయిలో ఉన్న జీవీటీ రాజశేఖర్ (జగ్గయ్యపేట), మామిడి శ్రీనివాసరావు (విజయవాడ అర్బన్), లంక దుర్గాప్రసాద్ (విజయవాడ రూరల్), బి. కిరణ్‌కుమార్ (గంపలగూడెం మండలం), షేక్ మొహమూద్ (విజయవాడ రూరల్), టి.కృష్ణారావు (జగ్గయ్యపేట మండలం), బి.రమాదేవి (వత్సవాయి), అనసూయ (విజయవాడ అర్బన్), తెహరబేగం (కంచికచర్ల), డీసీహెచ్ మెర్లో (చందర్లపాడు), ఆర్‌వీఎస్ రామకృష్ణ (మైలవరం), ఎస్ రామకుమార్ (ఎ.కొండూరు), కె.గోపాలకృష్ణ (రెడ్డిగూడెం), శ్రీపతిరావు (విజయవాడ అర్బన్), టీ విజయకుమార్ (విజయవాడ రూరల్), కే ఝాన్సీలక్ష్మి (విజయవాడ అర్బన్), ఆర్ సిజర్‌రెడ్డి (జి.కొండూరు), ఎం.శ్రీనివాసరావు (జగ్గయ్యపేట), సాంబశివరావు (నందిగామ), ఎం రాజకుమార్ (విజయవాడ అర్బన్), కె.మార్తమ్మ (మైలవరం), ఎం.రుత్తమ్మ (విజయవాడ అర్బన్) గుడివాడ అరుణకుమారి (మైలవరం), కె.విజయలక్ష్మి(విజయవాడరూరల్), సెకండరీ గ్రేడ్ టీచర్లలో ఎస్.రాము (పెనుగంచిప్రోలు), ఎస్‌కే జీనతమ్మ (పెనుగంచిప్రోలు), జి.జాన్‌రవి (ఏ కొండూరు), రెహన సుల్తానా (విజయవాడ అర్బన్), అల్లా ఉద్దీన్‌ఖాన్ (నందిగామ), ఎండీ ఇక్బాల్‌పాషా (విజయవాడ అర్బన్), షేక్ ముజాద్దీన్ (విజయవాడ అర్బన్), షేక్ హుస్సేన్ (విజయవాడ అర్బన్), కె.నెహ్రూ (విజయవాడ రూరల్), ఎ.వినేష్ వాణి (విజయవాడ రూరల్), అస్మా తబ్సుమ్ (విజయవాడ అర్బన్) అలాగే సెంట్ అవార్డులకు సంబంధించి తేజోమయి (ఇబ్రహీంపట్నం), జయశంకర దేసు (గంపలగూడెం), ఎస్ఆర్‌పీఎస్ రెడ్డి (జగ్గయ్యపేట), సురేష్‌బాబు భీమల (ఎ. కొండూరు) అవార్డులకు ఎంపికైనట్లు అధికారులు ప్రకటించారు.

నేడు ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలను అందజేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ఎంజీ రోడ్డు రాఘవయ్య పార్కు సమీపంలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 5వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యాన జిల్లా స్థాయి ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి సత్కరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ. 3.12 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్లకు భక్తులు హుండీల ద్వారా రూ. 3.12 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడుల రూపంలో సమర్పించారు. ఆది దంపతులకు భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను సోమవారం లెక్కించారు. 19 రోజులకు రూ.3,12,45,632 నగదు వచ్చింది. రోజుకు రూ.16.44 లక్షలు చొప్పున హుండీల ద్వారా ఆదాయం లభించిందని ఆలయ ఈవో భ్రమరాంబ పేర్కొన్నారు. లెక్కింపును కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ, పర్యవేక్షించారు. నగదుతో పాటు 800 గ్రాముల బంగారం, 6.600 కిలోల వెండితో పాటు విదేశీ కరెన్సీ లభించిందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. 715 యూఎస్ డాలర్లు, 210 కెనడా, 225 ఆస్ట్రేలియా, 120 సింగపూర్ కరెన్సీ, చైనా యువాన్లు వెయ్యి, ఇంగ్లండ్‌వి 10 పౌండ్లు, మలేషియాకు చెందిన 23 రింగెట్లు, ఒమాన్‌కు చెందిన 2.5 రియాల్, కతర్‌కు చెందిన 142 రియాల్, స్వీడెన్‌కు చెందిన 120 క్రోనార్, యూఏఈకి చెందిన 1.75 దీనార్లు, 1 సౌదీ రియాల్ లభించాయి. ఆన్‌లైన్ ద్వారా రూ.1,07, 275 విరాళాలు వచ్చాయి.

జాప్యం లేకుండా అర్జీల పరిష్కారం



విజయవాడలోని కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్పందన అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. అర్జీలను నిర్దేశిత గడువులో పరిష్కరించాలన్నారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'స్పందన' జరిగింది. కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, డీఆర్వో కె.మోహన్ కుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ అర్జీదారుడు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. రీ ఓపెన్ అవుతున్న అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీదారులు స్పందనతోపాటు జగనన్నకు చెబుదాం పోర్టల్‌లోనూ అర్జీలు సమర్పిస్తారని, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీకి ఎండార్స్‌మెంట్ తప్పనిసరిగా అందజేయాలని చెప్పారు. కొన్ని అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారు. అర్జీలపై వర్చువల్‌గా అధికారులతో మాట్లాడారు.

స్పందనలో 103 అర్జీలు

స్పందనలో 103 అర్జీలు నమోదయ్యాయని, వీటిలో రెవెన్యూ 50, మున్సిపల్ శాఖ 12, పోలీస్ 11, వ్యవసాయం 8, పంచాయతీరాజ్ 8, డీఆర్‌డీఏ 3, పౌరసరఫరాలు 2, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 2, బ్యాంకు 1, విభిన్న ప్రతిభావంతులు 1, ఖజానా 1, విద్య 2, సోషల్ వెల్ఫేర్ 1, కార్పొరేషన్ ఒకటి చొప్పున అర్జీలు అందాయి. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె. శ్రీనివాస్, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ విజయభారతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రుక్మాంగదయ్య, హౌసింగ్ పీడీ రజనీకుమారి, పశుసంవర్ధక శాఖ జేడీ కె.విద్యాసాగర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలాజీ కుమార్, ఆర్అండ్‌బీ ఎస్ఈ వి.కె. విజయశ్రీ, ఇరిగేషన్ ఎస్ఈ విష్ణు మోహన్‌రావు, ఎల్డీఎం కె. ప్రియాంక, డ్వామా పీడీ జె. సునీత, వివిధ శాఖల ధికారులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రామకృష్ణయ్య



చిలకలపూడి(మచిలీపట్నం): జాతీయ లోక్ అదాలత్‌తో కక్షిదారులు సత్వరమే కేసులు పరిష్కరించుకునే అవకాశం ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. ఆయన కార్యాలయంలో సోమవారం సాయంత్రం విలేకర్ల సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక సూచనల ప్రకారం ఈ నెల 9న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. దీని కోసం జిల్లాలో 40 బెంచ్‌లు ఏర్పాటు చేస్తున్నామని, ఎక్కువ కేసులు పరిష్కరించుకోవచ్చని చెప్పారు. లోక్‌అదాలత్‌లో సివిల్, రాజీపడదగిన క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్, మోటారు వాహన ప్రమాద క్లయిమ్‌లు పరిష్కరించుకోవచ్చని వివరించారు. జిల్లాలో రాజీ పడదగిన 18 వేల కేసులను గుర్తించామని తెలిపారు. మే లో జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 40 వేలకు పైగా కేసులు పరిష్కరించామని న్యాయమూర్తి తెలిపారు. ప్రస్తుత లోక్‌అదాలత్‌లో అంతకు మించి కేసులు పరిష్కరించేలా దృష్టి సారించామన్నారు. లోక్‌అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని న్యాయమూర్తి సూచించారు.

మేయర్‌గా వెంకటేశ్వరమ్మ ప్రమాణ స్వీకారం

- మచిలీపట్నంలో ఎన్నిక నిర్వహించిన ప్రిసైడింగ్ అధికారి, కలెక్టర్ రాజాబాబు
- జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్యే పేర్ని నాని, ప్రజాప్రతినిధుల అభినందనలు



చిటికిన వెంకటేశ్వరమ్మతో మేయర్‌గా ప్రమాణస్వీకారం చేయిస్తున్న కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ రెండో మహిళా మేయర్‌గా చిటికిన వెంకటేశ్వరమ్మ సోమవారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్, మేయర్ ఎన్నిక ప్రిసైడింగ్ అధికారి రాజాబాబు.. ఎన్నికను నిర్వహించారు. మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ.. మేయర్ అభ్యర్థిగా చిటికిన వెంకటేశ్వరమ్మ పేరును ప్రతిపాదించగా, మాజీ డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత బలపరిచారు. ఎవరూ పోటీ లేకపోవడంతో చిటికిన వెంకటేశ్వరమ్మ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కలెక్టర్ ప్రకటించారు. అనంతరం ఆమెకు నియామకపత్రాన్ని అందజేసి ప్రమాణస్వీకారం చేయించారు. వెంకటేశ్వరమ్మకు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక రాము, ముడా చైర్‌పర్సన్ బొర్రా దుర్గాభవాని విఠల్, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, కమిషనర్ జి.చంద్రయ్య, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా శుభాకాంక్షలు తెలిపారు.

నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాలి: పేర్ని నాని

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్ని నాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీపై నమ్మకం ఉంచి మేయర్ పదవిని అప్పగించారని ఆయన మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలన సాగించాలని మేయర్ వెంకటేశ్వరమ్మకు సూచించారు. ఓసీ జనరల్ మహిళకు మేయర్ సీటును కేటాయించగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మనసుతో మత్స్యకార సామాజికవర్గానికి చెందిన మోకా వెంకటేశ్వరమ్మకు, గౌడ సామాజిక వర్గానికి చెందిన చిటికిన వెంకటేశ్వరమ్మకు అవకాశం కల్పించారన్నారు. ఓ బీసీ మహిళ మేయర్‌గా ప్రమాణస్వీకారం చేస్తుంటే తమది బీసీ పార్టీగా చెప్పుకునే టీడీపీ కార్పొరేటర్లు శుభాకాంక్షలు తెలపాల్సింది పోయి గైర్హాజరుకావడంలోని ఆంతర్యం ఏమిటని పేర్ని నాని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, కేడీసీసీబీ డైరెక్టర్ గడిదేశి బాలజేసు, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత వెంకటేశ్వరమ్మ ఇంటి నుంచి కౌన్సిల్ హాలు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పలు కూడళ్లలో వెంకటేశ్వరమ్మకు గజమాలలు క్రేన్ల సాయంతో వేశారు.

నదీపాయపై జోడెడ్ల సవారీ



తోట్లవల్లూరు వద్ద కృష్ణానది పాయ ఒడ్డున ఉన్న పొలాల్లో రైతులు వ్యవసాయం చేస్తుంటారు. ఈ క్రమంలో పనులు ముగించుకొని సోమవారం సాయంత్రం జోడెడ్ల బండిపై రైతు ఇంటి బాట పడుతున్న దృశ్యమిది.
- విశాల్, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా

రేపటి నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



విజేతలకు అందించే ట్రోఫీని చూపిస్తున్న చక్రధారిదాస్, వేణుదారి కృష్ణదాస్

ఆటోనగర్(విజయవాడతూర్పు): శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఈ నెల 6 నుంచి 8 వరకు స్వామి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్టు విజయవాడ ఇస్కాన్ మందిర అధ్యక్షుడు చక్రధారిదాస్ తెలిపారు. ఇస్కాన్ మందిరంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధ, గురువారాల్లో 16వ డివిజన్‌లోని పాత వీబీఎం డిగ్రీ కాలేజీ ఇస్కాన్ మందిర ఆవరణలో స్వామివారికి సుమారు రెండు వేల కిలోల పువ్వులతో పుష్పాభిషేకం చేస్తామని చెప్పారు. అలానే జిల్లా స్థాయిలో భక్తులకు ఉట్టి మహోత్సవం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. స్వామి వారికి 108 రకాల భోగాలను సమర్పిస్తున్నట్టు చెప్పారు. 7న మహా శంఖాభిషేకం నిర్వహిస్తున్నామని తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని శ్రీరాధాశ్యామ్ సుందరుల మందిరంలో మహా శంఖాభిషేకంతో పాటు ఉట్టిమహోత్సవం... మహా హారతులు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. 8న ఉదయం 9 గంటల నుంచి నందోత్సవంతో పాటు ఇస్కాన్ సంస్థాపకచార్యులు వేదాంతస్వామి వారి జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాల్లో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఇస్కాన్ మందిర మేనేజర్ శ్రీకాంత్ నరసింహదాస్, వ్రజదాందాస్, శ్యామసుందర అచ్యుతదాస్ తదితరులు పాల్గొన్నారు.

దసరా సందడి షురూ!

- 8న కోఆర్డినేషన్ సమావేశం
- రాజగోపురం పెయింటింగ్ పనులకు శ్రీకారం
- ఉత్సవాల ఏర్పాట్లకు అంచనాలు



ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అక్టోబర్ 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే దసరా ఉత్సవాలకు అవసరమైన పనులు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ఏర్పాట్లు, భక్తుల రద్దీ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ఈ నెల 8వ తేదీన కో ఆర్డినేషన్ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఉత్సవాలకు ఆయా శాఖలు చేయబోయే ఏర్పాట్లు గురించి చర్చిస్తారు. అలానే ఆయా శాఖల మధ్య సమన్వయంపై మాట్లాడతారు. వివిధ విభాగాల ముఖ్య అధికారులకు దుర్గగుడి దేవస్థాన అధికారులు ఇప్పటికే సమాచారం అందించారు. ఇక దసరా ఉత్సవాలకు అవసరమైన పనులకు పాలక మండలి ఆమోదం తెలిపింది. దీంతో ఆయా పనులు టెండర్ల దశకు చేరుకోగా, నాలుగైదు రోజుల్లో తుది దశకు చేరుకునే అవకాశం ఉంది. ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి సన్నిధిలో నిర్వహించే ప్రత్యేక పూజలు, సేవల వివరాలను దేవస్థానం రెండు రోజుల కిందట విడుదల చేసింది. అమ్మవారి ఆలయం పరిసరాలతో పాటు రాజగోపురాన్ని అందంగా ముస్తాబు చేసేందుకు అవసరమైన పెయింటింగ్ పనులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. రాజగోపురం వద్ద పెయింటింగ్ పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

రూ. 3.34 కోట్లతో అంచనాలు....

ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో క్యూలైన్లు, షామియానాలు, వాటర్ ప్రూఫ్ షెడ్లు, వీఐపీల వాహనాల ఏర్పాటుకు సుమారు రూ. 3.34 కోట్ల అంచనాలతో పనులకు పాలక మండలి ఆమోదం తెలిపింది. వీటిలో రూ. 1.18 కోట్లతో ఆలయ పరిసరాల్లో విద్యుద్దీపాలతో అలంకరణ, కొండ దిగువన విద్యుత్ అలంకరణకు రూ. 60 లక్షలు, కొండపైన అమ్మవారి ఆలయ పరిసరాలలో విద్యుత్ అలంకరణ పనులకు రూ. 58 లక్షలతో అంచనాలు రూపొందించారు. ఆలయ ప్రాంగణంలో తాత్కాలిక షామియానాలు, వాటర్ ప్రూఫ్ షెడ్లు ఏర్పాటుకు రూ. 73 లక్షలు, కొండ దిగువన తాత్కాలిక క్యూలైన్ల ఏర్పాటుకు రూ. 37 లక్షలు, మైక్ ప్రచారానికి రూ. 10 లక్షలు, కొండపై తాత్కాలిక క్యూలైన్ పనులకు రూ. 11 లక్షలతో అంచనాలు రూపొందించారు. కొండపై తాత్కాలిక షెడ్డు నిర్మాణానికి రూ. 17 లక్షలు, మహా మండపం లైటింగ్‌కు రూ. 27 లక్షలతో అంచనాలు సిద్ధం చేశారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం

స్పందనలో ఎస్పీ జాషువా



స్పందనలో బాధితుల సమస్యలు ఆలకిస్తున్న ఎస్పీ జాషువా

కోనేరుసెంటర్:స్పందనలో అర్జీలు అందించే ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, బాధితులు అధైర్యపడాల్సిన అవసరం లేదని జిల్లా ఎస్పీ పి.జాషువా తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో బాధితుల నుంచి ఆయన అర్జీలు అందుకున్నారు. ఈ సందర్భంగా జాషువా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలన్నదే పోలీసుల కర్తవ్యమన్నారు. అన్యాయానికి గురైన బాధితులకు పోలీసుశాఖ అండగా ఉంటుందన్నారు. ఏఎస్పీ వీరబాబు, డీఎస్పీలు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు....

మచిలీపట్నంకు చెందిన సరిత అనే బాధితురాలు స్పందనలో ఎస్పీని కలిసి తమ బాధను విన్నవించుకుంది. 2021లో తనకు వివాహం జరిగినట్లు చెప్పింది. కట్నకానుకల కింద కుటుంబసభ్యులు భారీగా ముట్టజెప్పినట్లు తెలిపింది. అయితే మరింత డబ్బు తీసుకురావాలంటూ అత్తమామలు నిత్యం వేధిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేసింది. రెండు నెలల గర్భిణి అయినప్పటికీ కనికరం లేకుండా మానసికక్షోభకు గురిచేస్తున్నారంటూ వాపోయింది. ఆఖరికి పుట్టింటికి నెట్టేసి ఆడబిడ్డకు జన్మనిచ్చాననే కోపంతో ఆత్మహత్య చేసుకుని చావమంటూ నిందిస్తున్నారంటూ కన్నీరుమున్నీరైంది. అత్తమామల నుంచి రక్షణ కల్పించి తనకు న్యాయం చేయాలని ప్రాధేయపడింది.

వృద్ధాప్యంలో వేధిస్తున్నారు

తోట్లవల్లూరుకు చెందిన నాజర్ అనే వృద్ధుడు ఎస్పీని కలిసి గోడు విన్నవించాడు. తనకు ముగ్గురు కుమారులు ఉండగా ఉన్న ఆస్తి అమ్మించి వాటాలు పంచుకున్నారని వాపోయాడు. వృద్ధాప్యంలో ఉన్న తన భార్యను, తనను పట్టించుకోకపోగా అనరాని మాటలతో అవమానిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. కుమారుల నుంచి రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరాడు. పై అర్జీలపై స్పందించిన ఎస్పీ సంబంధిత అధికారులకు వాటిని సిఫార్సు చేసి బాధితులకు వెంటనే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నాణ్యమైన ఫొటో ఓటర్ల జాబితా తయారీ

కలెక్టర్ రాజాబాబు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): నాణ్యమైన ఫొటో ఓటర్ల జాబితా తయారు చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫొటో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం నిర్వహణపై ఆయన సమీక్షించారు. జిల్లాలో పురోగతిని కలెక్టర్ వివరించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కొత్త ఓటర్ల నమోదుకు వచ్చిన ఫారం-6 వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఏ నియోజకవర్గంలోనైనా ఫారం-6 అధిక సంఖ్యలో వచ్చిన సందర్భాల్లో సమగ్ర పరిశీలన చేయాలని తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఫొటో ఓటరు గుర్తింపుకార్డులను జనరేట్ చేయాలన్నారు. కార్యక్రమాన్ని కేంద్ర ఎన్నికల సంఘం నేరుగా పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమం పటిష్టవంతంగా నిర్వహించి నాణ్యమైన జాబితాను తయారుచేసేందుకు కృషి చేయాలన్నారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఐతవరం స్కీం సమీపంలో వ్యక్తి మృతదేహం

నందిగామ: మండలంలోని ఐతవరం స్కీం సమీపంలో ఓ వ్యక్తి మృతదేహాన్ని సోమవారం స్థానిక రైతులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. హెడ్ కానిస్టేబుల్ పుల్లారావు తెలిపిన సమాచారం ప్రకారం... మండలంలోని కేతవీరునిపాడు గ్రామానికి చెందిన ముత్యాల వెంకటసుబ్బయ్య (39) కొద్ది రోజుల క్రితం ఐతవరం గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడ నుంచి తిరిగి వస్తూ స్కీము సమీపంలో మద్యం తాగాడు. అధికంగా మద్యం తాగడంతో అక్కడ పడిపోయి మృతి చెందినట్లుగా ప్రాథమిక సమాచారం ప్రకారం తెలిసిందన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టిప్పర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

పెనుగంచిప్రోలు:బైక్‌పై వస్తున్న ముగ్గురు వ్యక్తులు టిప్పర్ వెనుక భాగంలో ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మేనేరు అవతల లక్ష్మీ గార్డెన్స్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి తర్వాత చోటుచేసుకుంది. రోడ్డుకు అడ్డంగా నిలిచి ఉన్న టిప్పర్‌ను చీకట్లో గుర్తించలేక ఢీకొట్టటంతో తీవ్ర గాయాలతో ముచ్చింతాల గ్రామానికి చెందిన దారెల్లి సైదేశ్వరరావు (23) మృతి చెందాడు. బచ్చలకూర సాయికుమార్, జక్కులూరి భూపతిలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వాళ్లను 108 వాహనంలో జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ శంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం

7న సైకిల్‌థాన్.. వాక్‌థాన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్, కమిషనర్

పటమట(విజయవాడతూర్పు): ప్రతి జీవికీ జీవనాధారమైన ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, పర్యావరణ పరిరక్షణ చర్యల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. 7వ తేదీన నాలుగో అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి, నీలి ఆకాశ దినోత్సవం సందర్భంగా సోమవారం వీఎంసీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాలిని కాలుష్యం కాకుండా ఎలా కాపాడుకోవాలనే ఉద్దేశంతో సెప్టెంబరు 7న ఉదయం 6.30 కు సైకిల్ థాన్ – వాక్ థాన్‌ను ఈట్ స్ట్రీట్ నుంచి ప్రారంభించి బెంజ్ సర్కిల్ వరకు నిర్వహిస్తున్నామని చెప్పారు. పర్యావరణ అనుకూలమైన రవాణా విధానాల వినియోగం, ఆరోగ్యకరమైన జీవనశైలిని లక్ష్యంగా పెట్టుకోవాలనే సందేశాన్ని తెలుపుతూ కాలి నడకన, సైకిళ్లతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరవాసులందరూ ఆసక్తిగా పాల్గొనాలని కోరారు. డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శైలజా రెడ్డి, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, 43 వ డివిజన్ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి పాల్గొన్నారు.

ఇద్దరు సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్

వన్‌టౌన్: సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన కొత్తమాసు ఈశ్వర మోహన్ గత నెల 27వ తేదీ దుర్గమ్మ దర్శనం నిమిత్తం నగరానికి వచ్చారు. ఆయన రథం సెంటర్‌లో ఉండగా చేతిలోని సెల్‌ఫోన్‌ను ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు లాక్కొని వెళ్లిపోయారు. నిందితులైన వించిపేటకు చెందిన సయ్యద్ ఇర్షాద్, షేక్ మస్తాన్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి 30 వేలు విలువైన సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు.

ట్రాక్టర్ టైరు మీదపడి బాలుడి మృతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం):ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ టైరు కింద పడి రెండేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి కొండపల్లి ఇండస్ట్రీయల్ ఏరియా (ఐడీఏ)లో జరిగింది. అప్పటి వరకు ఆడుకుంటున్న బాలుడు అనూహ్యంగా కళ్ల ముందు మృత్యువాతకు గురికావడంతో తల్లిదండ్రులు విషాదంలో మునిగారు. పొట్ట జోజి, స్వప్న దంపతులు ఐడీఏలో ట్రాక్టర్ విడిభాగాలు తయారుచేసే కంపెనీలో వాచ్‌మెన్‌గా ఉంటున్నారు. వారికి నాలుగేళ్ల జయశ్రీ వాణి, రెండేళ్ల ఇస్సాకు, ఐదు నెలల బాబు ఉన్నారు. ఇస్సాకు నిలబెట్టిన ట్రాక్టర్ టైర్‌లో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు టైరు బాలుడిపై పడి తీవ్ర రక్తస్రావానికి గురవడం గమనించిన తండ్రి బాలుడిని గొల్లపూడిలో ప్రైవేట్ వైద్యశాలకు తరలించాడు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వికటించిన ప్రేమ వ్యవహారం

పెనమలూరు: యువతీ, యువకుడి మధ్య ప్రేమ వ్యవహారం వికటించింది. ఈ వ్యవహారంలో యువతి తల్లి యువకుడిపై కత్తితో దాడి చేసింది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... కానూరు సనత్‌నగర్ రేకులమసీదు వద్ద లంకే నాగరాజు కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. ఆటోనగర్‌లో లారీ బాడీ బిల్డింగ్ పనులు చేస్తాడు. కొద్ది కాలంగా షారూన్ అనే యువతితో ప్రేమ వ్యవహారం నడుపుతున్నాడు. ఇద్దరూ పరస్పరం ప్రేమించుకుని ఫొటోలు దిగి, మెసేజ్‌లు పెట్టుకుంటున్నారు. షారూన్ లా రెండవ సంవత్సరం చదువుతోంది. కొన్ని రోజులుగా నాగరాజు ప్రేమను నిరాకరిస్తూ వస్తోంది. తాను బాగా చదువుకున్న వ్యక్తిని వివాహం చేసుకుంటానని తెలిపింది. ఫోన్‌లో ఫొటోలు, మెసేజ్‌లు తొలగించాలని నాగరాజును కోరగా నిరాకరించాడు. దీంతో ఇద్దరి మధ్య వివాదం ఏర్పడింది. ఆదివారం నాగరాజు ఇంటికి షారూన్, ఆమె తల్లి క్రాంతి వచ్చారు. ఫోన్‌లో ఫొటోలు, మెసేజ్‌లు ఎందుకు తొలగించటంలేదని గొడవపడ్డారు. షారూన్ తల్లి క్రాంతి తన వద్ద ఉన్న కత్తితో నాగరాజుపై దాడి చేసి గాయపరిచింది. నాగరాజు భయంతో అరవగా తల్లి కూతురు స్కూటర్ పై వెళ్లి పోయారు. గాయపడిన నాగరాజును విజయవాడ ప్రభుత్వస్పత్రిలో చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

యాచకుడిని హత్య చేసిన ఇద్దరు మైనర్లు అరెస్ట్

విజయవాడ స్పోర్ట్స్: గాంధీనగర్‌లోని గోరా పార్కులో యాచకుడిని హత్య చేసిన ఇద్దరు మైనర్లను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. గాంధీనగర్ పరిసర ప్రాంతాల్లో యాచక వృత్తి చేసుకుని జీవించే వ్యక్తికి, అదే ప్రాంతంలో యాచక వృత్తి చేసుకుని జీవించే బాలురుకు గత నెల 30వ తేదీన వివాదం తలెత్తినట్లు చెప్పారు. మద్యం మత్తులో తలెత్తిన వివాదం పెద్దది కావడంతో క్షణికావేశంలో ఒంటరిగా ఉన్న యాచకుడిని ఇద్దరు మైనర్లు కర్రలతో మోది హత్య చేసినట్లు వెల్లడించారు. అప్పట్లో ఈ ఘటనను అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు వివరించారు. అయితే రెండు రోజుల క్రితం గాంధీనగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు బాలురను అదుపులోకి తీసుకుని విచారించినట్లు పేర్కొన్నారు. విచారణలో ఇద్దరు మైనర్లు ఈ హత్య చేసినట్లు అంగీకరించారు. హత్య కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను జువైనల్ కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

పంట బోదెలో పడి సెక్యూరిటీ గార్డు మృతి



మృతుడు సతీష్ (ఫైల్)



పంట బోదెలో పడిన బైక్

గన్నవరం: మండలంలోని పురుషోత్తపట్నం సమీపంలో పంట బోదెలో పడి ఓ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం ప్రకారం... మండలంలోని ముస్తాబాదకు చెందిన కైలే సతీష్ (38) ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి బైక్‌పై గన్నవరం వైపు బయలుదేరాడు. పురుషోత్తపట్నం సమీపంలోకి రాగనే రహదారి మలుపు వద్ద బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న పంట బోదెలోకి దూసుకుపోయింది. బైక్ కిందపడిపోయిన సతీష్ పైకి లేవలేని పరిస్థితిలో మృతి చెందాడు. పంట బోదేలో ఉన్న మృతదేహాన్ని సోమవారం పశువుల కాపరులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సతీష్ మృతి చెందిన విషయం బహిర్గతమైంది. ఈ ఘటనపై ఎస్ఐ నాగరాజు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన బ్యాంక్ సెంటర్ వద్ద చోటు చేసుకుంది. హనుమాన్ ఐరన్ కంపెనీ గేటు పక్కన ఓ వ్యక్తి చనిపోయి ఉన్నాడు. షాపు యజమాని గమనించి మృతుడి జేబులో పేపర్‌పై రాసి ఉన్న నంబరుకు ఫోన్ చేశాడు. ఆ ఫోన్ నాలుగు స్తంభాల సెంటర్‌కు చెందిన కార్పెంటర్ సింహాద్రి రమేష్‌కు వెళ్లింది. ఆయన వచ్చి చూసి మృతుడు బెంగళూరుకు చెందిన పుష్పరాజ్‌గా నిర్ధారించాడు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పుష్పరాజ్ తన వద్ద పనికి వచ్చేవాడని, తనకు ఎవరూ లేరని చెప్పాడన్నారు. పనులు ముగించుకుని వచ్చి ప్రతి రోజు రాత్రి కనకదుర్గ ఫ్లైఓవర్ కింద పడుకునేవాడని పేర్కొన్నాడు. మద్యం తాగే అలవాటు ఉందన్నాడు.

క్లుప్తంగా

నేడు నల్లగుడ్డు అంధత్వం ఉన్న వారికి కంటి పరీక్షలు

పటమట(విజయవాడతూర్పు): నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం 4 గంటలకు స్వేచ్ఛ గోరా ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో నల్లగుడ్డు అంధత్వం ఉన్న వారికి వాసవ్య నర్సింగ్ హోంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని ఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జి.సమరం తెలిపారు. ఈ క్యాంప్‌లో నల్లగుడ్డు అంధత్వం ఉన్న వారికి ఐ బ్యాంక్ నేత్ర వైద్యులు పరీక్షలు చేసి కార్నియా గ్రాఫ్టింగ్ అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముమ్మరంగా సిల్ట్ తొలగింపు



ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్‌లోని మురుగు కాలువల్లో సిల్ట్ తొలగింపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గత కొన్నేళ్లుగా డ్రెయినేజీలోని సిల్ట్ తీయకపోవడంతో కాలువలో మట్టి భారీగా పేరుకుపోయింది. కొద్దిపాటి వర్షానికి రోడ్డు మీదుకు మురుగునీరు పారుతుంది. ఐలా నిధులు మంజూరు చేయడంతో సంబంధిత అధికారులు సిల్ట్ తొలగింపు పనులు చేపట్టారు. రెండు రోజులుగా రెండో క్రాస్ రోడ్డులోని కాలువలోని సిల్ట్‌ను తీస్తున్నారు. ఆటోనగర్‌లో షాపుల ముందు డ్రెయినేజీ కాలువపై సిమెంట్ దిమ్మెలతో పూడ్చడంతో ఈ దుస్థితి ఏర్పడింది. సిల్ట్ తొలగింపుతో మురుగు పారుదలకు లైన్ క్లియర్ అయ్యింది.

హోండా ఎలివేట్ కారు మార్కెట్‌లోకి విడుదల



కృష్ణలంక(విజయవాడతూర్పు): హోండా కార్స్ తన సరికొత్త హోండా ఎలివేట్ కారును విజయవాడ మార్కెట్‌లోకి సోమవారం విడుదల చేసింది. ఎంజీ రోడ్డులోని సుందరం హోండా కారు షోరూమ్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆర్టీవో పి.ప్రవీణ్, ఎస్‌బీఐ డీజీఎం మనీష్‌కుమార్ పాల్గొని లాంఛనంగా కారును విడుదల చేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ హెడ్ ప్రసాద్‌రావు మాట్లాడుతూ.. హోండా సంస్థ తొలిసారిగా మిడిసైజ్ సువ్ మోడల్ విత్ మోస్ట్ లగ్జీరియస్ ఫీచర్స్‌తో అందుబాటులో తీసుకువచ్చామన్నారు. గ్రౌండ్ క్లియరెన్స్, బూట్ స్పేస్, ఫ్రంట్ బోల్డ్ అండ్ స్టైలిష్ గ్రిల్, లెగ్ రూం స్పేస్, లెవల్ 2, ఆడాస్ ఫీచర్స్ వంటి అధునాతన సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు.

వైభవంగా కనకదుర్గమ్మ అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నియోజకవర్గ పరిధిలోని 6వ డివిజన్ కోకో కోలా వారి వీధిలో కనకదుర్గమ్మ అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.30,116లను ఆలయ కమిటీ సభ్యులకు అవినాష్ విరాళంగా అందజేశారు. స్థానిక కార్పొరేటర్ అమర్‌నాథ్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇజ్జాడ తేజ, నాయకులు వినాయకుడు, శంకర్, సిమెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

టికెట్ చెకింగ్ సిబ్బందికి గుండె పరీక్షలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆంధ్ర హాస్పిటల్ సహకారంతో విజయవాడ డివిజన్‌లోని టికెట్ చెకింగ్ సిబ్బందికి సోమవారం గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. 1వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఆంధ్ర హాస్పిటల్ ఎమర్జెన్సీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టికెట్ చెకింగ్ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. ఈ శిబిరంలో నిర్వహించిన స్క్రీనింగ్ ప్రక్రియలో అవాంఛనీయ లక్షణాలను ముందుగానే గుర్తించి రాబోయే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఈ శిబిరం 1, 6–7 ప్లాట్‌ఫామ్‌లలోని ఆంధ్ర హాస్పిటల్ ఎమర్జెన్సీ సెంటర్‌లో 7 రోజుల పాటు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పని చేస్తుందన్నారు. శిబిరాన్ని రైల్వే సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో 71 మంది టికెట్ చెకింగ్ సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు.

నగరాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

- ప్రజల సహకారంతోనే సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణ సాధ్యం
- మేయర్ భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు అందజేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్, డిప్యూటీ మేయర్లు శ్రీశైలజ, దుర్గ, కార్పొరేటర్లు

పటమట(విజయవాడతూర్పు): నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరిచాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి కోరారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో 300 పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రజల సహకారంతోనే నగరంలో సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణ సాధ్యమవుతుందన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల వాతావరణం కలుషితం అవ్వటమే కాకుండా పారిశుద్ధ్య నిర్వహణకు తీవ్ర అవరోధం కల్పిస్తోందన్నారు. ప్లాస్టిక్ సంచుల ద్వారా చెత్త, వ్యర్థాలను డ్రెయిన్లలో వేయరాదని చెప్పారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ప్రతి ఒక్కరూ జ్యూట్, పేపర్ లేదా క్లాత్ బ్యాగులు వినియోగించాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో విజయవాడ నగరాన్ని మొదటి ర్యాంక్ సాధించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా సింగల్ యూజ్ ప్లాస్టిక్ నివారించి పర్యావరణాన్ని కాపాడటంలో భాగస్వాములై, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజ, ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, అధికారులు పాల్గొన్నారు.

స్పందనలో 24 అర్జీల స్వీకరణ



అర్జీ స్వీకరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, అధికారులు

పటమట(విజయవాడతూర్పు): డివిజన్ స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలు అక్కడిక్కడే పరిష్కరించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ఆమె నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా, సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. సోమవారం జరిగిన స్పందనలో మొత్తం 24 సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారన్నారు. అందులో పట్టణ ప్రణాళిక విభాగం – 12, పట్టణ సామాజికాభివృద్ధి విభాగం(పీవో యూసీడీ)– 5, ఇంజినీరింగ్ విభాగం – 4, రెవెన్యూ – 2, పబ్లిక్ హెల్త్ విభాగం నుంచి ఒక్క అర్జీ వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ జి.వి.జి.ఎ స్.వి.ప్రసాద్, అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, సీతః ప్రభాకర్, డిప్యూటీ కమిషనర్(రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, జాయింట్ డైరెక్టర్(అమృత్) డాక్టర్ కె.బి.ఎస్.ఎస్ లతా, బయాలజిస్ట్ సూర్యనాయక్, మేనేజర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీ శాఖ నోటీసులపై చంద్రబాబు నోరు విప్పాలి

గడప గడపకు మన ప్రభుత్వంలో దేవినేని అవినాష్



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న దేవినేని అవినాష్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): 118 కోట్ల రూపాయలకు సంబంధించి ఐటీ శాఖ జారీ చేసిన నోటీసులపై చంద్రబాబునాయుడు నోరు విప్పాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ డిమాండ్ చేశారు. 8వ డివిజన్‌లోని 272వ వార్డు సచివాలయం పరిధిలోని సిద్దార్థనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం జరిగింది. అవినాష్ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, కరపత్రాలు అందచేసి, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

యువగళం పేరుతో మోసం

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తాత్కాలిక కట్టడాలు, వివిధ నిర్మాణ పనులను టీడీపీ అనుచరులు, చంద్రబాబునాయుడు బినామీలకు కట్టబెట్టి వందల కోట్లు రూపాయల లంచాలు మింగిన వ్యక్తి చంద్రబాబునాయుడు అని అవినాష్ ఆరోపించారు. వైఎస్సార్ చేయూత, వాహనమిత్ర పథకాలు గురించి టీడీపీకి అనుకూలంగా ఉండే ప్రింట్ మీడియాలో గత రెండు రోజుల నుంచి అసత్య వార్తలు ప్రచురిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఆ రెండు పత్రికలకు నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే ఆ పథకాలు అందుకున్న లబ్ధిదారులతో మాట్లాడి వాస్తవాలు తెలుసుకోవాలని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న టీడీపీ అనుకూల మీడియా వాళ్లు చంద్రబాబునాయుడుకు ఐటీ శాఖ జారీ చేసిన రూ.118 కోట్లకు సంబంధించిన నోటీసుల అంశాన్ని ఎందుకు ప్రచురించడం లేదని అవినాష్ ప్రశ్నించారు. అమరావతిలో రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో కేంద్రం నుంచి వేల కోట్ల రూపాయలను చంద్రబాబునాయుడు నిధులు తెచ్చి వారి బినామీలకు కట్టబెట్టారని అవినాష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ ప్రజలను మోసం చేస్తున్నాడన్నారు. డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్సార్ సీపీ 8వ డివిజన్ ఇన్‌చార్జి యలమంచిలి జయప్రకాష్, నాయకులు రవి, మెహబూబ్, ఝాన్సీ, జైహింద్‌రావు పాల్గొన్నారు.

మోసం చేసిన దంపతులపై కేసు

పెనమలూరు: కారు తీసుకుని మోసం చేసిన దంపతులపై పెనమలూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసరావు కథనం మేరకు.. పెనమలూరు శ్రీహరి గార్డెన్స్‌లో నివసించే తెలప్రోలు శ్రీనివాస్‌కు విజయవాడ ఎస్‌ఆర్‌పేటలో జూమ్‌కార్ సేల్స్ ఇండ్ సర్వీసెస్ యజమాని అల్లూరి శరత్‌చంద్రవర్మ, అతని భార్య జ్యోత్స్నప్రియతో పరిచయం ఉంది. శ్రీనివాస్ గత ఏడాది తన పాతకారును వారి ద్వారా విక్రయించాడు. వారి వద్ద మరో కారు కొన్నాడు. కొన్న కారుపై ఫైనాన్స్ తీసుకున్నాడు. అయితే ఈ ఏడాది జనవరిలో అల్లూరి శరత్‌చంద్రవర్మ, జ్యోత్స్నప్రియ పెనమలూరు వచ్చి చిన్న పని ఉందని శ్రీనివాస్ కొన్న కారును తీసుకెళ్లారు. ఆ తరువాత కారు తీసుకొచ్చి అప్పగించలేదు. అప్పటి నుంచి దంపతులు కనిపించకుండా తిరుగుతున్నారని, తన కారు తీసుకుని మోసం చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు.

మూడేళ్ల కుమారుడితో తల్లి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మూడేళ్ల కుమారుడితో సహా తల్లి అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు...విద్యాధరపురం సితార కన్వెన్షన్ సెంటర్‌కు చెందిన షేక్ బాజీ నాలుగేళ్ల క్రితం అనకాపల్లికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. వారికి బాబు పుట్టాడు. పుట్టుకతోనే బాబుకు వెన్నెముక సమస్య ఉండడంతో అతనిని వైద్యుల వద్ద చూపిస్తున్నారు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో బాజీ తన కుమారుడు గౌతంతో కలిసి తల్లి గారింటి వద్దనే ఉంటుంది. తన కుమారుడుని ఆసుపత్రిలో సరిగా చూపించడం లేదని ఈనెల 2వ తేదీ ఉదయం బాజీ పుట్టింటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై బాజీ తల్లి షేక్ లత ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు

పెనమలూరు: మండలంలోని కానూరులో ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై పెనమలూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. విజయవాడ మాచవరం ఆంజనేయస్వామి గుడి ప్రాంతానికి చెందిన గుడివాడ శ్రావణి కానూరు మహదేవపురంలో ఉన్న తల్లిదండ్రులు డి.సరస్వతి, ఈశ్వరరావు ఇంటికి ఐదు రోజుల క్రితం వచ్చింది. ఈ నెల ఒకటో తేదీన తల్లిదండ్రుల మధ్య సొమ్ము విషయమై గొడవ జరిగింది. రెండో తేదీ ఉదయం తల్లి సరస్వతి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో సరస్వతి అదృశ్యమైందని శ్రావణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమతుల్య ఆహారంతో ఆరోగ్యకర జీవనం

లబ్బీపేట(విజయవాడతూర్పు): శరీర ఎదుగుదల, రోగ నిరోధకశక్తిని పెంపొందించడానికి అవసరమైన పోషకాలను అందించే సమతుల్య ఆహారం తీసుకోవడంపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని హెర్బాలైఫ్ స్పోర్ట్స్ పెర్ఫార్మెన్స్ అండ్ ఫిట్‌నెస్ ఎడ్యుకేషన్ వైస్ ప్రెసిడెంట్ సమంతా క్లేటాన్ పేర్కొన్నారు. జాతీయ పోషకాహార వారాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ పోషక విలువలు కలిగిన ఆహారంపై అవగాహన పెంచుకోవాలని ఆయన ఒక ప్రకటనలో సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి ఆరోగ్యకరమైన ఆహారం ఎంతో అవసరమని తెలిపారు. శారీరక శ్రేయస్సుతో పాటు మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. ఆరోగ్యకరమైన శరీరాన్ని నిర్వహించడానికి క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయాలని పేర్కొన్నారు. సమతుల్య ఆహారం, మానసిక ఆరోగ్యం గురించి తెలుసుకోవాలని ఆయన సూచించారు.

ఇద్దరు వ్యక్తులపై బైండోవర్ కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న గ్రామంలో కోడి పందేలు నిర్వహించేందుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులపై నున్న పోలీసులు బైండోవర్ కేసు నమోదు చేశారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న షేక్.మస్తాన్ అలియాస్ రాజు, మర్రెడ్డి రామకృష్ణారెడ్డిని పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు ప్రశ్నించారు. కోడి పందేలు నిర్వహణకు వచ్చినట్టు తెలిపారు. దీంతో ఇద్దరినీ స్టేషన్‌కు తీసుకొచ్చి బైండోవర్ చేశారు.

● శ్రమైక జీవనం



పెద్దపులిపాక వద్ద సిమెంట్ బట్టీలో ప్రతి రోజు కార్మికులు పెద్ద సంఖ్యలో రాళ్లను తయారు చేస్తారు. బట్టీలో రాళ్లను తరలిస్తున్న కార్మికుల చిత్రాన్ని సాక్షి క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక సంస్థలు సమాజసేవలో భాగస్వాములు కావాలని సినీ దర్శకుడు, సీనియర్ గాయకుడు ఒమ్మి రమాశంకర్ అన్నారు. మురుగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం ఉప్పొంగెలే గోదావరి పేరుతో సినీ సంగీత విభావరి, పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రమాశంకర్ మాట్లాడుతూ సమాజాన్ని దేవాలయంగా భావించి అన్నార్తులకు సేవలను అందించాలని సూచించారు. రూపాశ్రీ, కృష్ణకుమారి, ఆదిరాల జయప్రభు, రాజేష్, నాయక్ పలు హిందీ తెలుగు చిత్రాలతోపాటు భక్తి గీతాలను మధురంగా ఆలపించారు.

ఫ్రీజర్ బాక్స్ వితరణ

హనుమాన్‌జంక్షన్(గన్నవరం): నిజమైన సేవకు మానవత స్వచ్ఛంద సంస్థ నిదర్శనమని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పొట్లూరి సీతారాంప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మానవతా స్వచ్ఛంద సంస్థకు రూ.70 వేల విలువైన ఫ్రీజర్ బాక్స్‌ను తన తల్లిదండ్రులు పొట్లూరి జగన్‌మోహన్‌రావు, రత్నమాణిక్యం జ్ఞాపకార్థం సీతారాంప్రసాద్ అందజేశారు. గుడివాడలోని మానవత సంస్థకు కూడా మరో ఫ్రీజర్‌బాక్స్‌ను అందజేస్తామని ప్రకటించారు. పొట్లూరి పవనకుమార్, చలసాని సతీష్, సంస్థ చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు, కార్యదర్శి కోళ్లపల్లి నారాయణరావు, ఉపాధ్యక్షుడు దయాల ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దేవినేని అవినాష్, నాయకులు

గుణదల(విజయవాడతూర్పు): ప్రభుత్వం అనుసరిస్తున్న విధివిధానాలు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీ నాయకులు తమ పార్టీలోకి వస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గుణదలలోని ఆయన కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో 2, 6 డివిజన్లకు చెందిన టీడీపీ కార్యకర్తలను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజాక్షేత్రంలో ఆదరణ పెరుగుతోందన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఈ ప్రభుత్వంలో లబ్ధి పొందారని చెప్పారు. నిజమైన సంక్షేమ పాలనను గుర్తించిన ఇతర పార్టీ నాయకులు వైఎస్సార్ సీపీలోకి రావటం ప్రారంభమైందన్నారు. ఎన్నికలు దగ్గర పడే సమయానికి టీడీపీ ఖాళీ కావటం ఖాయమని స్పష్టం చేశారు. జనసేన సైనికులు పెద్ద సంఖ్యలో తమ పార్టీ తీర్థం పుచ్చుకుంటారని పేర్కొన్నారు. ఇది చాలా శుభపరిణామమని ఆనందం వ్యక్తం చేశారు. పార్టీ వలసలను బట్టీ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అనంతరం టీడీపీ సీనియర్ మహిళా నాయకులు అబ్దుల్ షకీలా బేగం, కలపాల గాయత్రి, కనకం లక్ష్మిలతో పాటు ఆయా డివిజన్లకు చెందిన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. నాయకులకు కండువాలు కప్పి దేవినేని అవినాష్ పార్టీలోకి ఆహ్వానించారు. 25 మంది నాయకులు చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కడియాల బుచ్చిబాబు, కార్పొరేటర్లు అంబడిపూడి నిర్మలాకుమారి, వియ్యపు అమర్‌నాథ్, తంగిరాల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత చైతన్య రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభించిన కోస్టల్ బ్యాంక్ సీజీఎం రామన్, బ్యాంక్ అధికారులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): బ్యాంక్ ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు తమ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్నామని కోస్టల్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) కేపీ వీ.రామన్ తెలిపారు. గాయత్రీనగర్ ప్రధాన రహదారిలోని కోస్టల్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం దగ్గర ఈ రథాన్ని రామన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ చైతన్య రథం తమ బ్యాంకు శాఖల వద్ద, జనాల రద్దీ ప్రాంతాల్లో బ్యాంక్ పథకాలపై ప్రచార కార్యక్రమాలపై వివిధ రూపాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. ప్రధాన మంత్రి సురక్ష బీమాయోజన పథకంలో సంవత్సరానికి కేవలం రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా లభిస్తోందన్నారు. వార్షిక ప్రీమియం రూ.436లు చెల్లిస్తే ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పథకంలో రూ.2 లక్షల వరకు జీవిత బీమా లభిస్తుందని చెప్పారు. బ్యాంక్ ఖాతాదారులకు ఎంతో సౌలభ్యంగా ఉండే డిజిటల్ బ్యాంకింగ్ లావాదేవీలను సురక్షితంగా, సులభంగా ఎలా నిర్వహించుకోవచ్చు అనే అంశాలపై కూడా ప్రచారం నిర్వహిస్తారన్నారు. మహిళలకు డిపాజిట్లపై అత్యధికంగా 8.5 శాతం వడ్డీని అందజేస్తున్నామని రామన్ చెప్పారు. కోస్టల్ బ్యాంక్ చీఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆఫీసర్ సురేష్ అగ్రావాలాతో పాటుగా బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో నిత్యాన్నదానంకు దాత కాకరపర్తి వెంకట సుబ్బారావు, వారి కుమారులు ఎండోమెంట్ ట్రిబ్యునల్ జడ్జి కేవీఎల్ హరినాథ్, కేవీ రామకృష్ణ రూ. లక్ష 116 విరాళం మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతం రెడ్డి మాట్లాడుతూ భక్తులు, దాతల సహకారంతో మందిరం ఆంధ్రా షిరిడీగా తీర్చిదిద్దామని తెలిపారు. షిరిడీకు వెళ్లి మొక్కులు తీర్చుకోలేని వారు ఇక్కడ తమ మొక్కులను చెల్లించుకుంటున్నారని చెప్పారు. భక్తులు, దాతల మనోభావాలకు అనుగుణంగా తాము షిరిడీ తరహాలో ఆధ్మాత్మికతతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దాత కాకరపర్తి వెంకట సుబ్బారావు, ఎండోమెంట్ ట్రిబ్యునల్ జడ్జి కేవీఎల్ హరినాథ్ మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమంలో తాము కూడా భాగస్వాములం కావాలనే ఉద్దేశంతో విరాళం అందించామని తెలిపారు. మందిర అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి బాబావారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు జయలక్ష్మి, రామానుజరావు, పద్మజ, మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కమిటీ సభ్యులు యాదల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న అతిథులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నేత్రదానం చేయడం వల్ల అంధులకు చూపు ప్రసాదించవచ్చునని, నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కొత్తపేట ఎస్‌ఐ ధనలక్ష్మీ ప్రసన్న, న్యాయవాది బోను జయమ్మ పిలుపునిచ్చారు. నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని లంబాడీపేటలోని సాయిశ్రీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన అనంతరం అతిథులు మాట్లాడుతూ.. ఆగస్ట్ 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. మరణం తర్వాత కూడా జీవించడం ఒక్క నేత్రదానంతోనే సాధ్యమని పేర్కొన్నారు. చిన్నతనం నుంచి విద్యార్థులు సామాజిక స్పృహతో ఉండాలని, సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని స్కూల్ ప్రిన్సిపాల్ బాదినేని రాము పిలుపునిచ్చారు. లంబాడీపేట గాంధీబొమ్మ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కేటీ రోడ్డు, పాలప్రాజెక్టు మీదుగా స్కూల్‌కు చేరింది. ర్యాలీలో 200 మంది విద్యార్థులు, ఏసీబీ రిటైర్డ్ ఎస్‌ఐ నాంచారాయ్య, ఏబీసీడీ ట్రస్ట్ చైర్మన్ ఆవుల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

8న సామూహిక వ్రతాలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల ఎనిమిదో తేదీన ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి సోమవారం తెలిపారు. వ్రతాల్లో పాల్గొనే భక్తులకు ఆలయం తరపున పసుపు, కుంకుమ, గాజులు, ప్రసాదం ఉచితంగా అందజేస్తారని పేర్కొన్నారు. భక్తులు కలశం, కొబ్బరికాయ, రవిక వస్త్రం, ఉద్ధరిణి, పంచపాత్ర, పళ్లెం, హారతి, వత్తులు, నూనె, గంట, తమలపాకులు, అరటి పళ్లు వంటి పూజా సామగ్రి తెచ్చుకోవాలని సూచించారు. ఉదయం 9.30 గంటలకు ఉచిత సామూహిక వ్రతాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

రేపటి నుంచి శ్రీ కృష్ణాష్టమి ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):వీవీ నరసరాజు రోడ్డులోని శ్రీ కృష్ణ దేవాలయంలో ఈ నెల 6వ తేదీ నుంచి 16వ శ్రీ కృష్ణ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ బుధవారం శ్రీలక్ష్మీగణపతి సమేత అష్టలక్ష్మీ కుబేర హోమం, 7వ తేదీ గురువారం స్వామివారికి పంచామృత అభిషేకం, సహస్ర తులసీ దళ అర్చన జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న ప్రసాద వితరణ, సాయంత్రం 5 గంటలకు ఉట్టి కొట్టు కార్యక్రమం సాయంత్రం పల్లకీ సేవ జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

క్లుప్తంగా...

చిన్నారి లక్షిత కుటుంబానికి రూ.10 లక్షల సాయం



లక్షిత తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న, అధికారులు

కోవూరు: తిరుమల దర్శనానికి కాలి నడకన వెళుతూ మార్గంమధ్యలో చిరుత దాడిలో గత నెల 11న మృతి చెందిన శ్రీపాటి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలేనికి చెందిన చిన్నారి లక్షిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు టీటీడీ నుంచి రూ.5 లక్షలు, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు అటవీశాఖ తరఫున రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ.10 లక్షల చెక్కును కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం లక్షిత తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ కన్జర్వేటర్ ఎ.శ్రీనివాసులు, తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారి జి.సతీష్ పాల్గొన్నారు.

ఆదిరెడ్డి అప్పారావు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: జగజ్జనని చిట్‌ఫండ్ కేసులో ఆదిరెడ్డి అప్పారావుకు బెయిల్ రద్దు పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణను వాయిదా వేసింది. అప్పారావుకు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ అసదుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం విచారించింది. అప్పారావు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా విచారణ వాయిదా వేయాలని లెటర్ సర్క్యులేట్ చేసినట్లు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అయితే, వాయిదా ఎక్కువ సమయం ఇవ్వరాదని ఏపీ ప్రభుత్వం తరఫు అడ్వొకేట్ ఆన్ రికార్డ్స్ మెహ్‌ఫూజ్ నజ్కీ కోరారు. ఈ సమయంలో ఇది ఆంధ్రప్రదేశ్‌లో చిట్‌ఫండ్‌కు సంబంధించిన కేసా? మీరు చిట్‌ఫండ్ రన్ చేస్తున్నారా? హైకోర్టు బెయిల్ ఇచ్చిందా.. అని లూథ్రాను ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను 26కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. విచారణ నాలుగు వారాలు వాయిదా వేయాలని లూథ్రా కోరగా, ధర్మాసనం అంగీకరించలేదు. ఇది ఫండ్స్‌కు సంబంధించిన కేసు అని, ఎక్కువ సమయం వాయిదా కోరరాదని పేర్కొంది. తేదీ మార్చడం కుదరదంటూనే బెయిల్‌పై 28 పేజీల తీర్పా... అని జస్టిస్ విక్రమ్‌నాథ్ ప్రశ్నించారు. లార్జర్ రీ ఫండ్స్.. లార్జర్ ఆర్డరా? అని చమత్కరించారు.

చిన్నారిపై లైంగిక దాడి ముద్దాయికి 20 ఏళ్ల జైలు

విశాఖ లీగల్: ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ విశాఖలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనందిని తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలలు సాధారణ శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. బాలికకు ప్రభుత్వం తరఫున రూ.4 లక్షలు పరిహారం చెల్లించాలన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అప్పలరాజు విశాఖ జిల్లా ఆనందపురం మండలం శొంఠ్యాం గ్రామంలో ఉంటున్నాడు. నిందితుడికి మూగ చెముడు, ఉంది. బాలిక కుటుంబం కూడా అదే గ్రామంలో ఉంటోంది. 2016 మార్చి 23న బాధితురాలు పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్ద ఉంది. చిన్నారి ఒంటరిగా ఇంటి దగ్గర ఉండడంతో అప్పలరాజు లైంగిక దాడి చేశాడు. తల్లి దండ్రులు ఆనందపురం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీలో ఎంపీ ఉత్తమ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం నూతనంగా 16 మంది సభ్యులతో కేంద్ర ఎన్నికల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కీలక కమిటీలో తెలంగాణ నుంచి పార్టీ ఎంపీ కెప్టెన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డికి చోటు కల్పించారు. మల్లికార్జున ఖర్గే ఈ కమిటీని ఏర్పాటు చేయగా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అంబికా సోని, అధిర్ రంజన్ చౌదరి, సల్మాన్ ఖుర్షీద్, మధుసూదన్ మిస్త్రీ, ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, టీఎస్ సింగ్ దేవ్, కేజే జార్జ్, ప్రీతమ్ సింగ్, మహమ్మద్ జావేద్, అమీ యాజ్ఞిక్, పీఎల్ పునియా, ఓంకార్ మార్కం, కేసీ వేణుగోపాల్‌లు ఉన్నారు.

హైదరాబాద్ వేదికగా సీడబ్ల్యూసీ భేటీ!

సాక్షి, న్యూఢిల్లీ: సీడబ్ల్యూసీ హైదరాబాద్‌లో తొలిసారిగా సమావేశం కానుంది. తెలంగాణలో ఈ సమావేశాలను ఇక్కడ నిర్వహిస్తోంది. గత నెల 20న కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సీడబ్ల్యూసీని పునర్వ్యవస్థీకరించిన విషయం తెలిసిందే. 16, 17 తేదీల్లో కొత్త కమిటీ తొలి సమావేశం కోసం హైదరాబాద్‌ను ఎంచుకున్నారు. సోమవారం ఢిల్లీలో మీడియా సమావేశంలో పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ విషయం తెలిపారు.

మయూర నాట్యం.. కోకిల గానం

దేశంలో పెరుగుతున్న నెమళ్లు.. కోయిలలు

- పాలపిట్ట, పావురాలు, కాకులు, చిలుకల సంతతి సైతం పెరుగుదల
- తగ్గుతున్న రాబందులు, గద్దలు, వలస పక్షులు, బాతులు
- 217 పక్షి జాతుల్లో వృద్ధి.. 178 జాతులకు అధిక పరిరక్షణ అవసరం
- ఏపీలో అంతరించే దశలో నాలుగు పక్షులు
- స్టేట్ ఆఫ్ ఇండియా బర్డ్స్–2023 నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: మన జాతీయ పక్షి నెమలి వేగంగా వృద్ధి చెందుతోంది. కుహూ.. కుహూ అంటూ కూత పెట్టే కోకిల సంతానం సైతం బాగా పెరుగుతోంది. పాలపిట్ట, పావురాలు, కాకులు, చిలుకల సందడి కూడా ఆశించిన స్థాయిలోనే వృద్ధి చెందుతోంది. కానీ.. రాబందులు, గద్దలు, వలస పక్షులు, బాతుల సంఖ్య మాత్రం వేగంగా తగ్గిపోతోంది. ఇటీవల విడుదలైన స్టేట్ ఆఫ్ ఇండియా బర్డ్స్ –2023 (భారతదేశంలో పక్షుల స్థితి) నివేదికలో దేశంలో పక్షుల గురించి అనేక ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. ఈ నివేదిక రూపకల్పనలో మొట్టమొదటిసారిగా దేశంలోని 13 ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు పాల్గొన్నాయి. బాంబే నేచరల్ హిస్టరీ సొసైటీ, వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా, జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, వైల్డ్ లైఫ్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా, వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు వాటిలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా 30 వేల మంది పక్షి ప్రేమికులు (బర్డ్ వాచర్స్) సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. మొత్తం 942 పక్షి జాతులపై పరిశీలనలు జరిపి వాటి స్థితిగతులను అందులో వివరించారు. 338 జాతులకు సంబంధించి 30 సంవత్సరాల ట్రెండ్‌ను అధ్యయనం చేయగా.. అందులో 60 శాతం జాతులు క్షీణిస్తున్నట్టు తేలింది. 29 శాతం జాతులు స్థిరంగా ఉండగా.. 11 శాతం జాతుల్లో మాత్రమే వృద్ధి కనబడుతోంది. 359 పక్షి జాతుల 7 సంవత్సరాల ట్రెండ్‌ను పరిశీలించినప్పుడు 30 శాతం జాతుల్లో తగ్గుదల ఉండగా.. 18 శాతం పక్షి జాతులు ఇంకా వేగంగా అంతరిస్తున్నాయి. 53 శాతం జాతులు స్థిరంగా ఉండగా.. 8 శాతం జాతులతో మాత్రమే వృద్ధి కనబడింది.



విస్తరించిన నెమళ్లు

జాతీయ పక్షి నెమలి జాతి చాలా వేగంగా వృద్ధి చెందుతోంది. గతంలో ఎప్పుడూ ఇవి కనపడని ప్రాంతాలైన హిమాలయాలు, పశ్చిమ కనుమల్లో వర్షాధార అడవుల్లోనూ వీటి ఆవాసాలు పెరిగాయి. కేరళలో బాగా అరుదుగా కనిపించే ఈ పక్షులు ఇప్పుడు అక్కడ ప్రతి జిల్లాలోనూ ఉన్నాయి. కోయిలలు, పాల పిట్టలు, పావురాలు, కాకులు, చిలుకల సంఖ్య కూడా 2000 సంవత్సరం నుంచి వేగంగా పెరుగుతోంది. ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట వినపడే కోయిల గొంతులు దేశవ్యాప్తంగా పెరుగుతున్నాయి. 2000 సంవత్సరం 70 శాతం పెరుగుదల నమోదైంది. వాటి సంఖ్య పెరుగుదలకు కారణాలు మాత్రం వెల్లడి కాలేదు.

తగ్గడానికి కారణాలివే

అటవీ ప్రాంతం తగ్గిపోవడం, పట్టణీకరణ, విద్యుత్‌కు సంబంధించిన సదుపాయాలు పెరగడం వల్ల దేశవ్యాప్తంగా పక్షుల మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతోందని నివేదిక తేటతెల్లం చేసింది. పర్యావరణ కాలుష్యం, వాతావరణ మార్పులు కూడా వాటిపై ప్రభావాన్ని చూపుతున్నాయి.

ఏపీలో అంతరించే దశలో నాలుగు పక్షులు

మన రాష్ట్రంలో లెస్సర్ ఫ్లోరికాన్ (బట్టమేక పక్షి), టెరిక్ శాండ్‌పైపర్ (ఉల్లంకి పిట్ట), జోర్డాన్స్ క్రూసర్ (కలివికోడి), గ్రీన్ మునియా (ఆకుపచ్చ మునియా) పక్షులు అంతరించిపోయే దశలో ఉన్నట్టు నివేదిక పేర్కొంది.

ఈ ప్రాంతాల్లోనే ఎక్కువ క్షీణత



అన్నిరకాల ప్రాంతాల్లోనూ ఉండే పక్షుల కంటే చిత్తడి నేలలు, వర్షపు అడవులు, గడ్డి మైదానాల్లోని రహస్య ప్రాంతాలను ఆవాసాలుగా చేసుకునే స్పెషలిస్ట్ పక్షుల సంఖ్య బాగా తగ్గిపోతోంది. గడ్డి మైదానాల్లో కనిపించే పక్షులు 50 శాతం తగ్గిపోయాయి. వుడ్ ల్యాండ్ స్పెషలిస్ట్ పక్షులు కూడా బాగా తగ్గిపోతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చే పక్షుల సంఖ్య కూడా బాగా తగ్గిపోతోంది. యూరేషియా, ఆర్కిటిక్ ప్రాంతాల నుంచి వలస వచ్చే పక్షులు 50 శాతానికిపైగా తగ్గిపోయాయి. సముద్రంపై సుదూర ప్రాంతాల నుంచి వలస వచ్చే పక్షులు 80 శాతం తగ్గిపోయాయి. మన దేశంలో కనిపించే 4 రకాల రాబందులు దాదాపు అంతరించిపోయే దశలో ఉన్నాయి. వైట్ రంప్డ్ రాబందులు 98 శాతం క్షీణించాయి. గద్దలు, డేగలు కూడా తగ్గిపోతున్నాయి. పశ్చిమ కనుమలు, శ్రీలంక ప్రాంతాల్లో ఎక్కువ పక్షి జాతులు అంతరిస్తున్నాయి. 232 జాతులు వాటి ఆవాస ప్రాంతాలు దెబ్బతినడంతో తగ్గాయి.

టీడీపీ నేత బోగస్ బాగోతం

డెంకాడ: కారు కొనుగోలు చేసేందుకు టీడీపీ నేత ఒకరు ఏకంగా అధికార పార్టీ ఎమ్మెల్యే పాన్ నంబర్‌ను అక్రమంగా వినియోగించుకున్నాడు. టీడీపీ నేత బోగస్ వ్యవహారంపై ఎమ్మెల్యే సోమవారం డెంకాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డెంకాడ ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాల మేరకు... విజయనగరం జిల్లా మోపాడ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ బంటుపల్లి మురళీధరరావు ఇటీవల విశాఖపట్నంలో కారు కొనుగోలు చేశారు. ఆ సమయంలో ఐటీ పాన్ నంబర్ రాయాలని షోరూం సిబ్బంది కోరగా... మురళీధరరావు ఏకంగా నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పాన్ నంబర్ రాసి ఇచ్చారు. పేరు, ఇతర వివరాలు మాత్రం తనవే నమోదు చేశారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఐటీ రిటర్న్స్ ఫైలింగ్‌కు సిద్ధమవగా, కారు కొనుగోలు చేసినట్లు, దానికి పాన్ నంబర్ కూడా ఇచ్చినట్లు వచ్చింది. దీనిపై ఎమ్మెల్యే ఆరా తీయగా, మురళీధరరావు తన పాన్ నంబర్ దుర్వినియోగం చేశాడని తేలింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

రాజన్నదొరపై అసత్య ఆరోపణలను సహించం

టీడీపీ నేతలకు వైఎస్సార్‌సీపీ ఎస్టీ నేతల హెచ్చరిక

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరపై టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలను రెండు రోజుల్లో నిరూపించలేకపోతే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్, ప్రధాన కార్యదర్శి గుండా సురేంద్ర హెచ్చరించారు. టీడీపీ నేతలకు దమ్ముం, ధైర్యం ఉంటే చంద్రబాబు అవినీతిపై వచ్చిన ఐటీ నోటీసుల గురించి మాట్లాడాలని సవాల్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీడిక రాజన్నదొరపై టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్ చేసిన ఆరోపణలపై హనుమంత్ నాయక్, సురేంద్ర తీవ్రంగా స్పందించారు. నీతి, నిజాయితీలకు మారుపేరుగా నిలిచి గిరిజన ప్రజల మన్ననలు

నేరం చేస్తే అంతే సంగతులు!

నేరస్తుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్న పోలీస్ శాఖ

- కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్‌తో సత్ఫలితాలు
- న్యాయస్థానాల ద్వారా సత్వర శిక్షలు

● 20 నెలల్లోనే ఉరి శిక్ష

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి మండలం గంగిరెడ్డిపల్లికి చెందిన సయ్యద్ మౌలాలి అదే గ్రామానికి చెందిన సరళమ్మ, గంగులమ్మలను హత్య చేసి అనంతరం 12 ఏళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసును కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ విధానంలో సమగ్రంగా దర్యాప్తు చేసిన పోలీసులు తగిన ఆధారాలతో సహా నిరూపించారు. దాంతో కేవలం 20 నెలల్లోనే విచారణ ప్రక్రియ పూర్తి చేసిన న్యాయస్థానం సయ్యద్ మౌలాలికి ఉరి శిక్ష విధించింది.

● ఆ ఇద్దరికీ 20 ఏళ్ల జైలు

2022లో బాపట్ల జిల్లా రేపల్లె రైల్వే స్టేషన్‌లో 2022లో ఓ యువతిపై పాలుబోయిన విజయ్‌కృష్ణ, పాలుచూరి నిఖిల్ సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ కేసును కూడా కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ విధానంలో దర్యాప్తు చేసిన పోలీసులు 15 రోజుల్లోనే చార్జ్‌షీట్ దాఖలు చేశారు. తగిన ఆధారాలతో నేరాన్ని నిరూపించారు. దాంతో న్యాయస్థానం దోషులు పాలుబోయిన విజయ్ కృష్ణ, పాలుచూరి నిఖిల్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది.

సాక్షి, అమరావతి: ఎవరైనా నేరానికి పాల్పడితే శిక్ష పడాల్సిందే అన్న విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తోంది. అందుకోసం కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ (నేరారోపణ ఆధారిత పోలీసింగ్) విధానాన్ని ప్రవేశపెట్టి సత్ఫలితాలు సాధిస్తోంది. నేరస్తుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. ఏళ్ల కొద్దీ దర్యాప్తు.. ఆధారాల సేకరణకు నానా తంటాలు.. సుదీర్ఘ కాలం విచారణ.. వెరసి నేరం జరిగి ఏళ్లు గడుస్తున్నా దోషులు దర్జాగా బయట తిరిగే పరిస్థితి దశాబ్దాలుగా నెలకొంది. ఇలాంటి అస్తవ్యస్త విధానానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముగింపు పలికింది. నేరానికి పాల్పడిన వ్యక్తి తప్పించుకోవడం అసంభవం అన్నట్టుగా పోలీసు వ్యవస్థను బలోపేతం చేసింది. దాంతో గతంలో ఎన్నడూలేని రీతిలో రాష్ట్రంలో నేరాలకు పాల్పడిన వారికి న్యాయస్థానాల ద్వారా సత్వరం శిక్షలు విధిస్తున్నాయి.



కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ ఇలా..

నేరాలకు పాల్పడే వారికి సత్వర శిక్షలు విధించేలా చేయడంపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. అందుకోసం 2022 జూన్ నుంచి పోలీస్ స్టేషన్ల వారీగా ప్రత్యేకంగా కార్యాచరణ చేపట్టింది. పోలీసు అధికారులకు ప్రత్యేకంగా కేసుల బాధ్యతలు అప్పగించింది. పోలీస్ జిల్లా యూనిట్ల అధికారులకు ఐదేసి కేసుల చొప్పున అప్పగించింది. ఆ కేసుల దర్యాప్తు, విచారణను వారు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఎస్‌ఐ, సీఐ, డీఎస్పీలకు పదేసి చొప్పున కేసులు అప్పగించి దర్యాప్తును సత్వరం పూర్తి చేసి చార్జిషీట్లు దాఖలు చేసేలా పర్యవేక్షించింది. దాంతో దోషులను గుర్తించి.. దోషులు చేసిన నేరాన్ని న్యాయస్థానాల్లో నిరూపించి శిక్షలు పడేలా చేస్తోంది.

సత్వరమే శిక్షలు

ఈ విధానం సత్ఫలితాలిస్తోంది. రాష్ట్రంలో ఏడాది కాలంగా నేరస్తులకు న్యాయస్థానాల ద్వారా సత్వరం శిక్షలు విధిస్తుండటమే ఇందుకు నిదర్శనం. అందులోనూ తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారికి అత్యంత కఠిన శిక్షలు విధించేలా చేయడం పోలీసు శాఖ సమర్థతకు అద్దం పడుతోంది. 2022 నుంచి ఇప్పటివరకు కన్విక్షన్ బేస్డ్ విధానంలో 122 కేసులను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. వాటిలో ఏకంగా 109 కేసుల్లో తగిన ఆధారాలతో దోషులను గుర్తించి న్యాయస్థానాలు శిక్షలు విధించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అంటే దాదాపు 90 శాతం కేసుల్లో నేరస్తులకు సత్వరమే శిక్షలుపడటం రాష్ట్ర చరిత్రలోనే ఓ రికార్డు. నేరాల తీవ్రతను బట్టి దోషులకు కఠిన శిక్షలు విధించడం కూడా నేరస్తుల పట్ల పోలీసు వ్యవస్థ ఏమాత్రం ఉదాసీనంగా లేదన్న సందేశాన్నిస్తోంది.

కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ విధానం ద్వారా 2022 నుంచి ఇప్పటి వరకు పడిన శిక్షలు ఇలా..

పర్యవేక్షణకు చేపట్టిన మొత్తం కేసులు: 122	శిక్షలు పడిన కేసులు: 109
మరణశిక్షలు: 4	జీవిత ఖైదు: 39
ఏడేళ్ల నుంచి 20 ఏళ్ల శిక్షలు: 66	

మరో రెండ్రోజులు వానలు

● నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం ● ఉత్తర కోస్తాంధ్ర మీదుగా ద్రోణి



నంద్యాల జిల్లా దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు వద్ద పరవళ్లు తొక్కుతున్న కుందూ నది

సాక్షి, విశాఖపట్నం/సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు వర్షాలు కొనసాగనున్నాయి. ఇప్పటికే కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు గాను, అక్కడక్కడ భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు కోస్తాంధ్రపై సాధారణంగాను, రాయలసీమలో చురుగ్గాను కదులుతున్నాయి. వాయవ్య బంగాళాఖాతం పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో మంగళవారం పశ్చిమ బంగాళాఖాతానికి ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. మరోవైపు ఉపరితల ఆవర్తన ప్రాంతం నుంచి తెలంగాణ వరకు ఉత్తర కోస్తాంధ్ర మీదుగా ద్రోణి పయనిస్తోంది. వీటన్నిటి ఫలితంగా రానున్న రెండు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులకు కూడా ఆస్కారం ఉందని పేర్కొంది.

కొనసాగిన వర్షాలు

రాష్ట్రంలో పలుచోట్ల సోమవారం విస్తారంగా వానలు కురిశాయి. విజయనగరం జిల్లా పినపెంకిలో అత్యధికంగా 9.10 సెం.మీ. వర్షం కురిసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేటలో 7.50 సెం.మీ., కాకినాడ జిల్లా కందరాడలో 7.10, అనకాపల్లి జిల్లా చోడవరంలో 6, ప్రకాశం జిల్లా రాచెర్లలో 5.20, నంద్యాల జిల్లా కొండమనాయనిపల్లెలో 5.10, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో 5 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీ వర్షాలు కురిశాయి. అనంతపురం జిల్లా పెద్దవడుగూరులో 5.94 సెం.మీ. గుత్తి, తాడిపత్రిలో 5.26 సెం.మీ. వర్షపాతం నమోదైంది. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో అత్యధికంగా 8.24 సెం.మీ. వర్షం కురవగా, మిగిలిన మండలాల్లోనూ వర్షాలు కొనసాగాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కరువు తీరా వర్షం కురుస్తోంది. అత్యధికంగా తుగ్గలిలో 6.24 సెం.మీ. వర్షం కురవగా.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3.92 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోనూ చిరుజల్లులు కురిశాయి. మరోవైపు ప్రకాశం జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షం పడింది. గిద్దలూరు నియోజకవర్గంలో కురిసిన వర్షాలకు లోతు వాగు, గుండ్లకమ్మ వాగు, ఎర్ర వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి నియోజకవర్గాల్లోనూ భారీ వర్షం కురిసింది.

తెలంగాణ

హోంగార్డు టు డ్రగ్ కొరియర్

- వివిధ రాష్ట్రాల్లోని పెడ్లర్స్‌కు ఎండీఎంఏ సరఫరా
- హైదరాబాద్‌కు తీసుకొచ్చి డెలివరీ
- వలపన్ని పట్టుకున్న సౌత్‌వెస్ట్ టాస్క్‌ఫోర్స్ టీమ్
- ఇద్దరి అరెస్టు..215 గ్రాముల సరుకు స్వాధీనం



ప్రదీప్‌శర్మ



ఎం.వీరేంద్ర

సాక్షి, హైదరాబాద్: రాజస్థాన్ పోలీసువిభాగంలో హోంగార్డుగా పనిచేస్తున్న ప్రదీప్‌శర్మ.. తనకు ఏర్పడిన పరిచయాలతో డ్రగ్ కొరియర్‌గా మారాడు. దేశవ్యాప్తంగా వివిధనగరాల్లో ఉన్న పెడ్లర్స్‌కు మాదకద్రవ్యాలు... ప్రధానంగా మిథలిన్ డయాక్సీమో థమెఫ్టామైన్ సరఫరా చేస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న సౌత్‌వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు జూబ్లీహిల్స్ అధికారులతో కలిసి వలపన్నారు. ప్రదీప్‌తోపాటు పెడ్లర్ ఎం.వీరేంద్రను పట్టుకున్నట్టు వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్‌డెవిస్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ పి.రాధాకిషన్‌రావు, జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్‌లతో కలిసి సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన పూర్తి వివరాలు వెల్లడించారు.

మామూళ్లు చాలక కమీషన్ల కోసం...

ప్రతాప్‌ఘర్‌కు చెందిన ప్రదీప్‌శర్మ అలియాస్ కమల్‌రాణా అక్కడి ఠాణాలో హోంగార్డు. తన విధుల్లో భాగంగా కొన్నేళ్ల నుంచి అక్కడి చెక్‌పోస్టుల్లో డ్యూటీ చేసేవాడు. పాకిస్థాన్‌తో పాటు పంజాబ్ నుంచి వచ్చే మాదకద్రవ్యాలు ఈ ప్రాంతం మీదుగానే ఇతర చోట్లకు వెళ్లేవి. ఈ నెట్‌వర్క్ నిర్వహించే బడా డ్రగ్ సప్లయర్స్ చెక్‌పోస్టుల్లో ఉన్న వారికి మామూళ్లు ఇచ్చేవారు. ఇలా పెడ్లర్స్‌లో సంబంధాలు ఏర్పాటు చేసుకున్న ప్రదీప్‌శర్మ కమీషన్ ఇస్తే తానూ డ్రగ్ కొరియర్‌గా పనిచేస్తానని చెప్పాడు. దీనికి వారు అంగీకరించడంతో రెండు మూడేళ్లగా డ్రగ్ కొరియర్‌గా మారాడు. ఆపై వివిధ నగరాల్లో ఉన్న డ్రగ్ పెడ్లర్స్‌కు ఎండీఎంఏ డ్రగ్ సరఫరా చేస్తున్నాడు. ఆయా చెక్‌పోస్టులు, పోలీసుల వద్ద తన గుర్తింపుకార్డు చూపిస్తూ బయటపడేవాడు.

కారు డ్రైవింగ్ వదిలి డ్రగ్‌పెడ్లింగ్...

కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం పెద్దదేవాడకు చెందిన మతంవార్ వీరేంద్ర కారుడ్రైవర్. తన వృత్తిలో భాగంగా అనేక మందిని దేశంలోని వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లేవాడు. ఇలా రాజస్థాన్ వెళ్లినప్పుడు ప్రదీప్‌శర్మ ఇతడి కారులో ఎక్కాడు. ఆ పరిచయంలోనే ప్రదీప్ డ్రగ్ కొరియర్ అని తెలియడంతో జట్టు కట్టాడు. మాదకద్రవ్యాలను తీసుకొచ్చి ఇస్తే తాను పెడ్లర్‌గా మారి హైదరాబాద్‌లో విక్రయిస్తానని వీరేంద్ర చెప్పగా, ప్రదీప్ అంగీకరించాడు. ఈ ఒప్పందంలో భాగంగా గతేడాది తమ ప్రాంతానికే చెందిన నరేష్‌చౌదరితో కలిసి 70 గ్రాముల ఎండీఎంఏ తీసుకొచ్చి వీరేంద్రకు ఇచ్చి వెళ్లాడు. గత ఏడాది ఏప్రిల్ 30న హైటెక్ సిటీ ప్రాంతంలో వీరేంద్రను అరెస్టు చేసిన మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు డ్రగ్ స్వాధీనం చేసుకున్నారు. ఆపై నరేష్ పట్టుబడగా, ఈ కేసులో ప్రదీప్‌శర్మ ఇప్పటికీ వాంటెడ్‌గానే ఉన్నాడు.

మళ్లీ డెలివరీకి వచ్చి...

మాదాపూర్ కేసులో బెయిల్‌పై వచ్చిన వీరేంద్ర కొన్నాళ్లు ఖాళీగానే ఉండి, మళ్లీ దందా మొదలెట్టాడు. ప్రదీప్‌కు భారీ మొత్తం డ్రగ్ ఆర్డర్ ఇచ్చాడు. దీంతో 215గ్రా. ఎండీఎంఏ పౌడర్ తీసుకుని ప్రదీప్ బస్సులో హైదరాబాద్ చేరుకున్నాడు. మాదకద్రవ్యంతో అక్కడకు చేరుకున్న ప్రదీప్‌తో పాటు వీరేంద్రను పోలీసులు పట్టుకుని డ్రగ్ స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్‌ను గ్రాము రూ.10 వేల వరకు విక్రయించడానికి వీరేంద్ర పథకం వేశాడు. గతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులే 240 గ్రాములు ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు.

కస్టడీలోకి తీసుకుని విచారిస్తాం

ఈ డ్రగ్‌కు ప్రదీప్‌కు ఎవరు అందించారు? వీరేంద్ర నగరంలో ఎవరెవరికి విక్రయిస్తున్నాడు? అనే అంశాలను దర్యాప్తు చేస్తున్నాం. దీని కోసం నిందితులు ఇద్దరినీ కోర్టు అనుమతితో పోలీసు కస్టడీలోకి తీసుకొని విచారిస్తాం. హైదరాబాద్‌ను డ్రగ్ ఫ్రీ సిటీగా మార్చడంలో అందరూ సహకరించాలి. మాదకద్రవ్యాలపై ఎలాంటి సమాచారం ఉన్నా, వీటికి బానిసలుగా మారిన వారి విషయంలో సహాయం కావాలన్నా 8712671111 నంబరులో సంప్రదించాలి.
– జోయల్ డెవిస్, వెస్ట్‌జోన్ డీసీపీ

తెలంగాణ

డబ్బులు పంపి.. మళ్లీ వెనక్కి తీసేసుకుని..

● జ్యూవెలరీ షాపునకు రూ.1.24 కోట్లు బురిడీ కొట్టిన వైనం

హిమాయత్‌నగర్(హైదరాబాద్): ప్రముఖ జ్యూవెలరీ షోరూం 'మంగత్రాయ్ నీరజ్ జ్యూవెలర్స్'నే బురిడీ కొట్టించాడో ప్రబుద్ధుడు. ఆభరణాలు కొంటానంటూ నమ్మించి ముందుగానే డబ్బు పంపి ఆభరణాలు అందాకడబ్బును వెనక్కి లాక్కున్నాడు. షోరూం నిర్వాహకుడు హరీష్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టారు.

రూ.1.24 కోటి విలువైన ఆభరణాలు తీసుకుని..

మంగత్రాయ్ నీరజ్ జ్యూవెలర్స్ సంస్థ వాట్సప్ నుంచి కూడా ఆర్డర్స్ తీసుకుంటుంది. ఇందులో భాగంగానే విజయవాడకు చెందిన బొడ్డుపల్లి విక్రమ్ షోరూంకు సంబంధించిన వాట్సాప్ నెంబర్‌కు టచ్‌లోకి వచ్చాడు. తనకు కావాల్సిన డిజైన్స్‌ను అడిగి వాటి ధరలు తెలుసుకున్నాడు. ఒక్కో దానికి ఒక్కో రేటుతో కూడిన వివరాలను విక్రమ్‌కు కొటేషన్ ద్వారా ఇచ్చారు. ఇందుకు సంబంధించి రూ.1కోటి 24లక్షలను ముందుగానే షోరూం ఖాతాలకు తన హెచ్‌డీఎఫ్‌సీ ఖాతా ద్వారా బదిలీ చేశాడు. షోరూంకు సంబంధించిన రిప్రజెంటేటివ్స్ విజయవాడ వెళ్లి అక్కడున్న విక్రమ్ మనిషి ప్రవీణ్‌కు వీటిని అప్పగించారు. అప్పగించిన మరుక్షణం తాను షోరూంకు పంపిన డబ్బును స్టాప్ చేయాలంటూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకును అధికారికంగా విక్రమ్ కోరాడు. దీంతో మీకు పంపిన డబ్బును మేం తిరిగి వెనక్కు తీసుకుంటున్నామంటూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి షోరూంకు మెయిల్ వచ్చింది. మెయిల్‌లో చెప్పిన విధంగా విక్రమ్ పంపిన రూ.1కోటి 24లక్షలను పలు విధాలుగా వెనక్కి తీసుకున్నారు. షోరూం యాజమాన్యానికి ఈ విషయం తెలియగా వారు ఆరా తీశారు. విక్రమ్ అకౌంట్ యూఎస్‌లో ఉందని, అతను కూడా అక్కడే ఉంటూ వీరితో ఇండియా నెంబర్ ద్వారా చాట్ చేసినట్లు గుర్తించారు.

గద్వాల ఎమ్మెల్యేగా డీకే అరుణను నియమించండి

తెలంగాణ ప్రభుత్వానికి ఈసీ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్/మహబూబ్‌నగర్/గద్వాల: హైకోర్టు ఆదేశాల మేరకు గద్వాల ఎమ్మెల్యేగా డీకే అరుణను గుర్తిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం గెజిట్ విడుదల చేసింది. ఇటీవల తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పేర్కొంటూ తదుపరి గెజిట్ ప్రచురించాలని తెలంగాణ ఎన్నికల సంఘాన్ని కూడా ఆదేశించింది. గత శాసనసభ ఎన్నికల్లో గద్వాల స్థానం నుంచి గెలుపొందిన బీఆర్‌ఎస్ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తన మొత్తం ఆస్తులు, అప్పుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించకుండా దాచిపెట్టారని రుజువు కావడంతో ఆయన ఎన్నిక చెల్లదని గత నెల 24న రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. కృష్ణమోహన్ రెడ్డి ఎన్నికను సవాలు చేస్తూ సమీప ప్రత్యర్థి డీకే అరుణ వేసిన పిటిషన్‌పై హైకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. డీకే అరుణను ఎమ్మెల్యేగా నియమించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి/శాసనసభ కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వేర్వేరుగా హైకోర్టు తీర్పు ప్రతిని జతచేస్తూ లేఖలు రాశారు.

విద్యుత్ వినియోగానికి

పరిమితులు లేవు

అన్ని వర్గాలకూ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

- సరఫరాలో అంతరాయాలుగానీ, లోడ్ షెడ్డింగ్‌గానీ లేదు
- ఈ నెల 5 నుంచి పరిశ్రమలకు పరిమితులు విధించవచ్చని కమిషన్ అనుమతి
- డిమాండ్ తగ్గడంతో ఆ పరిమితులు ఎత్తివేయాలని డిస్కంల నిర్ణయం
- తాజా మార్పును ఏపీఈఆర్సీకి నివేదించనున్న పంపిణీ సంస్థలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పవర్ హాలిడే లేదని, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాపై ఎలాంటి పరిమితులు అమలు చేయడం లేదని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు సోమవారం ప్రకటించాయి. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా పరిస్థితి మెరుగుపడినందున పరిశ్రమలకు పరిమితులు ఎత్తివేయాలని నిర్ణయించినట్లు తెలిపాయి. రాష్ట్రంలో ఆదివారం అన్ని రంగాలకు ఎలాంటి కోతలు, పరిమితులు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసినట్లు వివరించాయి. ఆదివారం రాష్ట్రంలో మొత్తం 206.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేశాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా సరఫరాలో ఎలాంటి అంతరాయాలుగానీ, లోడ్ షెడ్డింగ్‌గానీ లేదు. సెప్టెంబర్ 1న రాష్ట్రంలో నెలకొన్న గ్రిడ్ డిమాండ్–సరఫరా పరిస్థితులను బట్టి పారిశ్రామిక రంగానికి కొద్దిగా విద్యుత్ సరఫరా తగ్గించి, ప్రాధాన్యతా రంగాలైన గృహ, వ్యవసాయ రంగాలకు అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేశాయి. విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పుడు పరిశ్రమలకు కొంతమేరకు సరఫరా తగ్గించి వ్యవసాయ, గృహ వినియోగదారులకు పూర్తిస్థాయిలో సరఫరా చేస్తామని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ)కి విద్యుత్ పంపిణీ సంస్థలు అభ్యర్థన పంపించాయి. ఆ అభ్యర్థన మేరకు ఈనెల 5 నుంచి రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి స్వల్పంగా విద్యుత్ పరిమితులు విధించ



వచ్చని కమిషన్ అనుమతించింది.

తగ్గిన డిమాండ్‌తో పరిశ్రమలకు ఊరట

రాష్ట్రంలో ప్రస్తుతం అల్పపీడనం కారణంగా పడుతున్న వర్షాల దృష్ట్యా గ్రిడ్ డిమాండ్ కొంత మేర తగ్గింది. గత రెండు రోజులుగా ఎటువంటి విద్యుత్ కొరత లేదు. విద్యుత్ సౌధలో సోమవారం ట్రాన్స్‌కో సీఎండీ, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్.. ట్రాన్స్‌కో, జెన్‌కో, ఏపీపీసీసీ అధికారులతో రాబోయే రెండు వారాలపాటు విద్యుత్ డిమాండ్, సరఫరా పరిస్థితులపై సమగ్రంగా సమీక్షించారు. ప్రస్తుతం లోడ్ కొద్దిగా తగ్గి సరఫరా పరిస్థితి మెరుగుపడినందువల్ల పారిశ్రామిక వినియోగదారులకు అధికారిక లోడ్ షెడ్డింగ్ విధించే అవసరం కలగదని ఈ సమీక్షలో అభిప్రాయానికి వచ్చారు. దీంతో విద్యుత్ పంపిణీ సంస్థలు పారిశ్రామిక రంగానికి విద్యుత్ వాడకంపై పరిమితి అమలు నిర్ణయాన్ని రద్దు చేసుకున్నాయి. మెరుగుపడిన సరఫరా పరిస్థితి కారణంగా.. కమిషన్ ఇచ్చిన పారిశ్రామిక విద్యుత్ వినియోగంలో పరిమితి–నియంత్రణ ఉత్తర్వులను అమలు చేయడం లేదు. ఈ విషయాన్ని కమిషన్‌కు నివేదించాలని పంపిణీ సంస్థలు నిర్ణయించాయి.

రోజుకి 40 మిలియన్ యూనిట్లు కొంటున్నాం

వినియోగదారుల సౌకర్యార్థం సెప్టెంబర్ 15 వరకు స్వల్పకాలిక మార్కెట్ నుంచి యూనిట్‌కు రూ.9.10 వెచ్చించి రోజుకి దాదాపు 40 మిలియన్ యూనిట్లు కొంటున్నాం. సరఫరా పరిస్థితి అదుపు తప్పకుండా చూసేందుకు అధికారులందరూ అప్రమత్తంగా ఉన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది



తలెత్తకుండా గృహ, వ్యవసాయ, వాణిజ్య–పారిశ్రామిక రంగాలకు సరఫరా అంతరాయం లేకుండా చేయడానికి శాయశక్తులా కృషి చేస్తున్నాం. రాష్ట్రంలో ఏవిధమైన లోడ్ షెడ్డింగ్‌గానీ, విద్యుత్ వాడకంలో పరిమితులుగానీ లేవని తెలియజేస్తున్నాం.

– కె.విజయానంద్, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి.

నోటీసుల దశలో అప్పీల్ ఏంటి?

- కోరిన విధంగా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకపోతే అప్పీల్ వేస్తారా?
- అమరావతి రైతు సంఘాలను ప్రశ్నించిన హైకోర్టు ధర్మాసనం
- అంత అత్యవసరంగా విచారించాల్సిన అవసరం ఏముంది?
- అప్పీల్‌కు విచారణార్హతే లేదన్న సీఆర్‌డీఏ న్యాయవాది
- కౌలు చెల్లింపునకు ఏం చేస్తున్నారో చెప్పాలన్న ధర్మాసనం
- తదుపరి విచారణ ఈనెల 12కి వాయిదా



సాక్షి, అమరావతి: తమకు వార్షిక కౌలు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం, ఏపీసీఆర్‌డీఏలను ఆదేశించాలని కోరుతూ హైకోర్టు సింగిల్ జడ్జి ముందు అమరావతి రాజధాని రైతు సంఘాలు దాఖలు చేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే తమ ముందు ఆ సంఘాలు అప్పీల్ దాఖలు చేయడంపై ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది. కోరిన విధంగా సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేదన్న కారణంతో అప్పీల్ దాఖలు చేయడం ఎంత వరకు సబబని పిటిషనర్లను ధర్మాసనం ప్రశ్నించింది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేదన్న కారణంతో అప్పీళ్ల దాఖలుకు అనుమతినిస్తే, ఇకపై అలా దాఖలయ్యే అప్పీళ్లకు అంతూ పొంతూ ఉండదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. నోటీసు దశలో దాఖలయ్యే అప్పీళ్లు ప్రస్తుతం హైకోర్టు కొనసాగిస్తున్న సంప్రదాయ విధి విధానాలకు భంగం కలిగించినట్లు అవుతుందని తెలిపింది. అప్పీల్ దాఖలు చేసి అత్యవసరంగా విచారించాల్సినంత అవసరం ఇందులో ఏముందని, ఇదేమీ ఇళ్ల కూల్చివేత వ్యవహారం కాదు అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇదే సమయంలో సీఆర్‌డీఏ తరఫు న్యాయవాది కాసా జగన్‌మోహన్‌రెడ్డి సైతం ఈ అప్పీల్‌ను వ్యతిరేకించారు. ఈ అప్పీల్‌కే కాక, సింగిల్ జడ్జి ముందు దాఖలు చేసిన పిటిషన్‌కు సైతం విచారణార్హత లేదన్నారు. వార్షిక కౌలు చెల్లించాల్సింది రైతులకే తప్ప, రైతు సంఘాలకు కాదని ఆయన వివరించారు. సీఆర్‌డీఏ ఒప్పందాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రైతు సంఘాల తరఫు సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు స్పందిస్తూ, నోటీసు దశలో అప్పీల్ దాఖలు చేయవచ్చునన్నారు. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పులున్నాయని తెలిపారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం, కౌలు చెల్లించేందుకు ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని సీఆర్‌డీఏను ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 12కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకట శేష సాయి, జస్టిస్ వడ్డిబోయన సుజాతలతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తమకు చెల్లించాల్సిన వార్షిక కౌలు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ సీఆర్‌డీఏలను ఆదేశించాలని కోరుతూ అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య, రాజధాని రైతు పరిరక్షణ సమితి హైకోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలు చేశాయి. సీఆర్‌డీఏ అధికారులు అభ్యర్థించిన విధంగా వార్షిక కౌలు చెల్లింపుల మొత్తాలను ఆమోదించేలా పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరాయి. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి ప్రభుత్వానికి, సీఆర్‌డీఏకు నోటీసులు జారీ చేశారు. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు. తాము కోరిన విధంగా సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో, రైతు సంఘాలు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశాయి. ఈ అప్పీల్ గురించి ఉన్నం మురళీధరరావు గత వారమే సీజే ధర్మాసనం ముందు ప్రస్తావించారు. సీజే సైతం నోటీసుల దశలో అప్పీల్ దాఖలుపై అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

వైద్యానికి శాశ్వత బలం

ఖాళీల భర్తీకి ప్రత్యేకంగా మెడికల్ సర్వీసెస్ బోర్డు

- మన కళ్లెదుటే స్పెషలిస్టు డాక్టర్లు, కొత్త మెడికల్ కాలేజీలు
- 53,126 పోస్టుల భర్తీతో మానవ వనరుల కొరతకు చెక్

సాక్షి, అమరావతి: నాలుగేళ్లలో 53 వేలకు పైగా వైద్య పోస్టులను భర్తీ చేసిన చరిత్ర మన రాష్ట్రంలో గతంలో ఎప్పుడైనా ఉందా? మన కళ్లెదుటే స్పెషలిస్టు డాక్టర్లు, కొత్త మెడికల్ కాలేజీలు కనిపిస్తున్నాయి. ఎప్పటి ఖాళీలు అప్పుడే భర్తీ అవుతున్నాయి. అసలు ఖాళీల భర్తీకే ప్రత్యేకంగా మెడికల్ సర్వీసెస్ బోర్డు ఏర్పాటైందంటే వైద్య ఆరోగ్య రంగంపై ప్రభుత్వం ఎంత శ్రద్ధ వహిస్తోందో వేరే చెప్పాలా? అయినా సరే చీకటి ఒప్పందాలు కుదుర్చుకుని కాకమ్మ కథలు అల్లే రామోజీని ఏమనుకోవాలి?


అంతా ఒప్పందమే..
శాశ్వత ఉద్యోగాలేవి జగన్?

'కాంట్రాక్ట్' క్రమబద్ధీకరణ.. ఏపీ వీవీపీ విలీనం



టీడీపీ అధికారంలో ఉండగా ఐదేళ్లలో చంద్రబాబు అతి కష్టమ్మీద వైద్య, ఆరోగ్య శాఖలో భర్తీ చేసింది కేవలం 1,693 పోస్టులు. ప్రభుత్వాస్పత్రుల వైపు చూడాలంటేనే జనం జంకే పరిస్థితి కల్పించారు. మానవ వనరుల కొరత తీవ్రంగా వేధిస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. పేదలకు ప్రైవేట్ వైద్యాన్నే దిక్కుగా మార్చేశారు. ఇలాంటి దుస్థితిలో ఉన్న వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ సీఎం జగన్ ఏకంగా 53,126 పోస్టులను భర్తీ చేసి జవసత్వాలు చేకూర్చారు. వైద్య రంగంలో మన రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా మార్చారు. వైద్య శాఖలో ఏ ఒక్క పోస్టు ఖాళీ ఏర్పడినా ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే వెంటనే భర్తీ చేసేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యవసర ఉత్తర్వులు ఇచ్చింది. వైద్య శాఖ నియామకాల కోసమే ప్రత్యేకంగా ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్‌ను ఏర్పాటు చేసింది. ఇది గొప్ప ప్రగతిశీల చర్యగా కేంద్ర ప్రభుత్వం సైతం ప్రశంసించింది. పీహెచ్‌సీల్లో వైద్యులు ఎవరైనా దీర్ఘకాలిక సెలవుపై వెళితే సేవలకు అంతరాయం కలగకుండా జిల్లాకు నలుగురు చొప్పున 114 మంది డాక్టర్లను సిద్ధంగా ఉంచగా తాత్కాలిక సెలవుపై వెళ్లిన చోట విధులు నిర్వర్తించేందుకు 175 మంది చొప్పున పూల్ అప్ వైద్యులను అందుబాటులో ఉంచారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరత 61 శాతం కాగా మన రాష్ట్రంలో కేవలం 5 శాతానికే పరిమితమైంది. వైద్య శాఖలో 2014కు ముందు ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు వీలుగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏపీ వైద్య విధాన పరిషత్‌ను ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా వేల మంది ఉద్యోగులకు భద్రత కల్పించింది. మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు (ఎంఎల్‌హెచ్‌పీ) దేశంలో ఎక్కడా లేనివిధంగా పారితోషికం చెల్లిస్తోంది. పనితీరును అంచనా వేసి అదనంగా రూ.15 వేల వరకూ ప్రోత్సాహకం అందిస్తోంది. ప్రోత్సాహకంతో కలిపి గరిష్ఠంగా రూ.40 వేల వరకూ వేతనాలను చెల్లిస్తోంది. మరి ఇలాంటి చర్యలు చంద్రబాబు ప్రభుత్వంలో రామోజీ ఎప్పుడైనా చూశారా? కనీసం ఇప్పుడైనా తెలుసుకుంటున్నారా?

నాలుగేళ్లలో వైద్య పోస్టుల భర్తీ ఇలా

స్పెషలిస్ట్ డాక్టర్	3,899
మెడికల్ ఆఫీసర్‌లు	2,088
ఏఎన్ఎం గ్రేడ్–3	13,540
ఎంఎల్‌హెచ్‌పీలు	10,032
స్టాఫ్ నర్సులు	6,734
పారా మెడికల్ సిబ్బంది	9,751
క్లాస్–4 సిబ్బంది	3,303
డీఈవోలు	249
వైద్య కళాశాలల్లో సిబ్బంది	1,582
ఇతర సిబ్బంది	1,948

తైవాన్ అమ్మాయి.. తెలుగింటి అబ్బాయి


సాయి దినకర్, యూటింగ్ లియూ వివాహ రిసెప్షన్‌లో సంప్రదాయ దుస్తుల్లో తైవాన్ దేశీయులు

చల్లపల్లి(అవనిగడ్డ): ఎల్లలు ఎరుగని ప్రేమతో ఎంతో మంది విదేశీ వనితలు తెలుగింటి అబ్బాయిలను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. తాజాగా చల్లపల్లి గ్రామానికి చెందిన వేమూరి సాయిదినకర్, తైవాన్ దేశానికి చెందిన యూటింగ్ లియూ పెద్దల అనుమతితో ప్రేమ వివాహం చేసుకున్నారు. చల్లపల్లికి చెందిన మెడికల్ షాప్ నిర్వాహకుడు వేమూరి కిషోర్ కుమారుడు సాయి దినకర్ తైవాన్ దేశంలోని సించూ సిటీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. అక్కడే ఫిజియోథెరపిస్ట్ యూటింగ్ లియూతో ప్రేమలో పడ్డారు. వారిద్దరి వివాహానికి వరుడి తండ్రి కిషోర్, వధువు తండ్రి ఈషెంగ్ లియూ అంగీకరించారు. దీంతో ఈ నెల రెండో తేదీ ద్వారకా తిరుమలలో సాయి దినకర్, యూటింగ్ లియూ వివాహం తెలుగు సంప్రదాయంలో వైభవంగా నిర్వహించారు. సోమవారం ఘంటసాల మండలం దేవరకోటలో రిసెప్షన్ జరిగింది. ఈ వేడుకకు వధువు యూటింగ్ లియూ కుటుంబ సభ్యులు, బంధువులైన తైవాన్ దేశస్థులందరూ తెలుగు సంప్రదాయం ప్రకారం మహిళలు పట్టు చీరలు, పురుషులు పట్టు పంచెలు ధరించి ఆకట్టుకున్నారు.

తుంటి కీళ్లకు ఆరోగ్య శ్రీ అభయం

- రుమటాయిడ్ ఆర్థరైటిస్, కోవిడ్‌తో యువకుల్లోనూ తుంటి కీళ్లు అరుగుదల
- గతంలో నడవలేని స్థితిలో మంచానికే పరిమితమైన బాధితులు
- ప్రస్తుతం వైఎస్సార్ ఆరోగ్య శ్రీలో ఉచితంగా తుంటి కీళ్ల మార్పిడి సర్జరీ


అరిగిన తుంటికీలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పోస్టు కోవిడ్ రోగుల్లో తుంటికీళ్లు అరిగిపోతున్నాయి. చిన్న రక్తనాళాల్లో బ్లాకుల కారణంగా తుంటి కీలుకు రక్త ప్రసరణ జరగడంలేదు. ఫలితంగా కీళ్ల అరుగుదల ప్రారంభమవుతోందని వైద్యులు చెబుతున్నారు. దీంతో 30 నుంచి 35 ఏళ్ల వారు సైతం తుంటికీళ్లు అరిగి నడవలేని స్థితికి చేరుకుంటున్నారు. ఇలాంటి వారికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం వరంలా మారింది. ఈ పథకం కింద టోటల్ హిప్ రీ ప్లేస్‌మెంట్ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. ఇప్పటి వరకూ ఎన్టీఆర్ జిల్లాలో 100 మందికిపైగా తుంటికీళ్ల మార్పిడి చికిత్సలు చేశారు. తుంటికీళ్ల మార్పిడి తర్వాత వారి పనులను యథావిధిగా చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. టోటల్ హిప్ రీ ప్లేస్‌మెంట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోగ్య శ్రీలో చేర్చడం ఎంతో మందికి ప్రయోజనంగా మారింది. రూ.3 లక్షలు విలువ చేసే ఆపరేషన్‌ను ఉచితంగా చేస్తున్నారు.

ఇవే నిదర్శనం

- ఏలూరుకు చెందిన 37 ఏళ్ల ప్రశాంత్ కారు నడుపుతూ జీవిస్తున్నాడు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి తుంటిలో నొప్పి ప్రారంభమైంది. వైద్యులను సంప్రదించగా, అరుగుదల ప్రారంభమైందని, ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని సూచించారు. అప్పుడు ఆరోగ్య శ్రీలో లేక పోవడంతో నిరాశ చెందాడు. డిసెంబర్ నుంచి ఆరోగ్య శ్రీ కింద వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో తుంటి కీలు మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు.
- ఉయ్యూరుకు చెందిన 45 ఏళ్ల వెంకట్‌కు కోవిడ్ సోకిన ఆరు నెలలకు తుంటిలో నొప్పి ప్రారంభమైంది. క్రమేణా నొప్పి ఎక్కువై నడవలేని స్థితికి చేరుకున్నాడు. టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్‌ను ఆరోగ్య శ్రీలో చేర్చడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. ప్రస్తుతం మామూలుగా నడవ గలుగుతున్నాడు. వీరు ఇద్దరే కాదు కోవిడ్ సోకిన రెండు శాతం మందిలో తుంటికీలు సమస్యలు వస్తున్నట్లు వైద్యులు చెపుతున్నారు.

ఎందుకిలా...?

కోవిడ్ సోకిన సమయంలో ప్రాణాలు కాపాడేందుకు స్టెరాయిడ్స్‌ను ఎక్కువగా వాడారు. స్టెరాయిడ్స్ అధికంగా వాడటం వల్ల చిన్న రక్తనాళాల్లో బ్లాకులు ఏర్పడి తుంటి ఎముకకు రక్త ప్రసరణ తగ్గిపోయింది. దీంతో ఎముక మెత్తబడి, తుంటి కీలు ఆకారం మారి క్రమేణా అరుగుదల ప్రారంభమవుతుంది. ఈ విధంగా జరిగేదానిని 'ఎ వాస్క్యులర్ నైక్రోసిస్, హెడ్ ఆఫ్ ది ఫీమర్'గా పేర్కొంటారని వైద్యులు తెలిపారు. ఇలాంటి రోగులకు ప్రభుత్వం అభయం ఇస్తూ ఆరోగ్య శ్రీలో టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్ చికిత్సలను చేర్చింది. దీంతో ఎంతో మంది రోగులకు ఉపయోగకరంగా మారింది.

ఆరోగ్య శ్రీలో ఉచితం



తుంటి కీళ్లు అరిగిన వారు ఆస్పత్రులకు ఎక్కువగా వస్తున్నారు. అలాంటి వారిలో 20 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వయసు వారు కూడా ఉంటున్నారు. కొందరిలో కోవిడ్ కారణంగా అరుగుదల కనిపిస్తోంది. మరి కొందరిలో వయస్సు రీత్యా సమస్య ఏర్పడుతోంది. రుమటాయిడ్ ఆర్థరైటీస్, గతంలో గాయాలై కీళ్లు అరుగుదల ఉన్న వారిలో ఈ సమస్య కనిపిస్తోంది. వారందరికీ వైఎస్సార్ ఆరోగ్య శ్రీలో ఉచితంగా తుంటికీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

అరుగుదల లక్షణాలు ఇవీ..

- కారణం లేకుండా తుంటిలో నొప్పి రావడం.
- రెస్ట్‌లో ఉన్నా నొప్పి రావడం.
- రాత్రి నిద్రలో నొప్పి రావడం.
- నడవలేక కుంటడం.
- చివరి స్టేజ్‌లో భరించరాని నొప్పి.
- క్రమేణా దినచర్యలు చేసుకోవడం కూడా కష్టంగా మారుతుంది.

ఏ దశలో సర్జరీ అవసరమంటే..

- కారణం లేకుండా తుంటినొప్పి వస్తుంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. తొలుత ఎక్స్‌రే తీసి, ఎంఆర్‌ఐ స్కాన్ చేస్తారు. తొలిదశలో గుర్తించేందుకు ఎంఆర్‌ఐ స్కాన్ దోహదపడుతుంది.
- మొదటి దశలో నొప్పి నివారణ మాత్రలతోపాటు, ఎముకను బలపరిచే ఇంజెక్షన్లు, రక్తప్రసరణ పెంచే మందులను ఇస్తారు.
- రెండో దశలో ఉన్న వారికి చిన్న ఆపరేషన్ అవసరమవుతుంది. తుంటలో వత్తిడి తగ్గించి రక్తప్రసరణ పెంచడానికి కోర్ డీ కంప్రెషన్ సర్జరీచేసి, ఎముకలోనికి ఇంజెక్షన్ ఇస్తారు.
- భరించలేని నొప్పి ఉన్నా, కీలు పూర్తిగా దెబ్బతిన్నా తుంటి మార్పిడి ఆపరేషన్ చేయాల్సి ఉంటుంది.
- పెద్ద వయస్సు వారికి టైటానియమ్, చిన్న వయస్సు వారికి సిరామిక్, ఆక్సీనియమ్ కృత్రిమ కీళ్లను వేయడం వల్ల 30 ఏళ్లు మనుగడ సాధించొచ్చు.
- ఆపరేషన్ తర్వాత అన్ని పనులూ యథావిధిగా చేసుకోవచ్చు. నొప్పిలేని నడకతో జీవితం సాగించవచ్చు.

పీఎం విశ్వకర్మ యోజనపై అవగాహన కల్పించాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనపై అవగాన కల్పించి వృత్తి పనివారికి మరింత తోడ్పాటు అందించాలని అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సూచించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పథకం అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. ఈ నెల 17వ తేదీన పీఎం విశ్వకర్మ యోజనను ప్రధానమంత్రి మోదీ లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. చేతివృత్తుల వారి అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. వడ్రంగి, స్వర్ణకారులు, కమ్మరి, పడవల తయారీ, శిల్పకారులు, తాపీ కార్మికులు, బుట్టలు, చాపలు అల్లేవారు, క్షురకులు, రజకులు, బొమ్మల తయారీ దారులు, దర్జీలు, చర్మకారులు వంటి 16 రకాల చేతివృత్తుల వారికి ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరుతుందన్నారు. వృత్తుల వారికి శిక్షణ ఇవ్వడం, వారికి అవసరమైన వస్తు సామగ్రి కొనుగోలు చేసుకునేందుకు తొలి దశలో రూ.లక్ష వరకు బ్యాంక్‌ల ద్వారా రుణాలిస్తారని పేర్కొన్నారు. రుణాలను సక్రమంగా తిరిగి చెల్లించే వారికి వ్యాపారాభివృద్ధికి తదుపరి దశల్లో రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తారన్నారు. దీర్ఘకాలంగా వృత్తిలో ఉన్న వారిని అర్హులుగా గుర్తించాలన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా లబ్ధిదారులు గుర్తింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. ముఖ్యంగా అర్బన్ ప్రాంతాల్లో లబ్ధిదారుల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

అసోసియేషన్లతో సమావేశాలు నిర్వహించాలి

విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో సంబంధిత అసోసియేషన్లతో పీఎం విశ్వకర్మ యోజనపై అవగాహన కల్పించేందుకు సమావేశాలు నిర్వహించాలని కార్పొరేషన్ అధికారులను కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఆధార్, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, ఆధార్ లింకయిన మొబైల్ నంబర్ అవసరమని సూచించారు. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉంటే పథకానికి అనర్హులని స్పష్టంచేశారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల క్రెడిట్ ఆధారిత పథకాల ద్వారా రుణాలు పొందకూడదన్నారు. రుణాలు తిరిగి చెల్లించిన వారు ఈ పథకానికి అర్హులని, కుటుంబంలో ఒకరికి మాత్రమే రిజిస్ట్రేషన్ అర్హత ఉంటుందని వివరించారు. డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సుధాకర్, డెప్యూటీ డైరెక్టర్ బి. సాంబయ్య, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ సుబ్బారావు, సహాయ సంచాలకులు డాక్టర్ కె.ఎల్.ఎస్.రెడ్డి, ఎల్డీఎం ప్రియాంక, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పి.నరేష్, యూసీడీ పీఓ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్

ఎన్టీఆర్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. విజయవాడలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆరోగ్య శ్రీ జిల్లా సమన్వయకర్త, క్యాన్సర్ ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులతో సమన్వయ సమావేశం సోమవారం జరిగింది. డాక్టర్ మాచర్ల సుహాసిని మాట్లాడుతూ.. క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి సకాలంలో మెరుగైన చికిత్స అందించేలా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో స్క్రీనింగ్ పరీక్షలు చేస్తామని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్‌లో సేవలు అందించే వైద్యులు, సిబ్బందికి క్యాన్సర్ లక్షణాలు గుర్తించడంపై అవగాహన కలిగించడం, ఆరోగ్య శ్రీ రిఫరల్ ఆస్పత్రులకు పంపించడం వంటి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో మూడు ఆరోగ్య శ్రీ క్యాన్సర్ ఆస్పత్రులు ఉండగా, ఒక్కో ఆస్పత్రిలో నెలకు మూడు క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు నిర్వ హించాలని సూచించారు. నెలకు తొమ్మిది చోట్ల స్క్రీనింగ్ క్యాంప్‌లు జరుగుతాయని తెలిపారు. అంతిమంగా క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించి వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ జె.సుమన్, కుటుంబ డాక్టర్ కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ మోతీబాబు, డీపీఎంఓ డాక్టర్ నవీన్, డాక్టర్ బాలాజీనాయక్, ఆరోగ్య శ్రీ క్యాన్సర్ ఆస్పత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

టీచర్స్ డే

'మా టీచర్ ఇలా చెప్పలేదు'
'మా టీచర్ ఇలాగే చెప్పింది'
'మా టీచర్ కోప్పడుతుంది'
'మా టీచర్ మెచ్చుకుంటుంది'
పిల్లలకు ప్రతి సంవత్సరం ఒక ఫేవరెట్ టీచర్ దొరకాలి.
ఇంట్లో తల్లి తర్వాత
పిల్లలు తమ ఫేవరెట్ టీచర్ మీదే ఆధారపడతారు.
వారి సాయంతో చదువు బరువును సులువుగా మోసేస్తారు.
వారు ట్రాన్స్‌ఫర్ అయి వెళితే వెక్కివెక్కి ఏడుస్తారు.
'టీచర్స్ డే' సందర్భంగా పిల్లలు అభిమానించే టీచర్ల స్వభావాలూ... లక్షణాలు... అవి కలిగి ఉన్నందుకు వారికి ప్రకటించాల్సిన కృతజ్ఞతలు.



థ్యాంక్యూ టీచర్

పిల్లలు స్కూల్‌కు రాగానే తమ ఫేవరెట్ టీచర్ వచ్చిందా రాలేదా చూసుకుంటారు. ఒకవైపు ప్రేయర్ జరుగుతుంటే మరోవైపు ఒక కంటితో ఫేవరెట్ టీచర్‌ను వెతుక్కుంటారు. క్లాసులు జరుగుతుంటాయి. వింటుంటారు. కాని ఆ రోజు టైమ్‌టేబుల్‌లో ఫేవరెట్ టీచర్ క్లాస్ కోసం ఉత్సాహంగా ఎదురు చూస్తారు. స్కూల్లో ఎందరో టీచర్లు. కాని ఒక్కో స్టూడెంట్‌కు ఒక్కో ఫేవరెట్ టీచర్. ఆ టీచర్ మాటను వేదవాక్కుగా భావించేవారు గతంలో ఉన్నారు.. రేపూ ఉంటారు. 'పాప... నువ్వు డాక్టర్ కావాలి' అనంటే డాక్టరైన వారున్నారు. 'బాబూ.. నీకు సైన్స్ బాగా వస్తోంది సైంటిస్ట్ కావాలి' అనంటే ఆ మాటలు మరువక సైంటిస్ట్ అయినవారున్నారు. ఫేవరెట్ టీచర్లు పిల్లలను గొప్పగా ఇన్‌స్పైర్ చేస్తారు. బలం ఇస్తారు. ప్రేమను పంచుతారు. వారే లేకపోతే చదువులు భారంగా మారి ఎందరో విద్యార్థులు కుదేలయి ఉండేవారు.

సబ్జెక్ట్ బాగా వచ్చినవారు

ఫేవరెట్ టీచర్లు ఎవరు అవుతారు? సబ్జెక్ట్ ఎవరికి బాగా వస్తుందో వారు చాలామందికి ఫేవరెట్ టీచర్ అవుతారు. సబ్జెక్ట్ బాగా వచ్చినవారు అది ఎలా చెప్తే పిల్లలకు బాగా అర్థమవుతుందో తెలుసుకుని చెప్తారు. పిల్లలకు అర్థం కావాల్సింది పాఠం సులభంగా అర్థం కావడం. అర్థమైతే పాఠం పట్ల భయం పోతుంది. భయం పోతే ఆ సబ్జెక్ట్ మరింతగా చదవాలనిపిస్తుంది. అందుకు కారణమైన టీచర్‌ను అభిమానించబుద్ధవుతుంది. సబ్జెక్ట్‌ను అందరికీ అర్థమయ్యేలా చెప్తూ, క్లాసయ్యాక కూడా వచ్చి అడిగితే విసుక్కోకుండా సమాధానం చెప్తారనే నమ్మకం కలిగిస్తూ, చెప్తూ, పాఠం అర్థం కాని స్టూడెంట్‌ను చిన్నబుచ్చకుండా గట్టున ఎలా పడేయాలో ఆలోచించే టీచర్ ఎవరికైనా సరే ఫేవరెట్ టీచర్.

మనలాంటి వారు

పిల్లలు తమలాంటి టీచర్లను, తమను తెలుసుకున్న టీచర్లను ఇష్టపడతారు. క్లాస్‌లో రకరకాల పిల్లలు ఉంటారు. రకరకాల నేపథ్యాల పిల్లలు ఉంటారు. వారి మాతృభాషను, ప్రాంతాన్ని, నేపథ్యాన్ని గుర్తెరిగి వారితో ప్రోత్సాహకరంగా మాట్లాడే టీచర్లను పిల్లలు ఇష్టపడతారు. 'మీది గుంటూరా? ఓ అక్కడ భలే ఎండలు. భలే కారం మిరపకాయలు దొరుకుతాయిరోయ్' అని ఒక స్టూడెంట్‌తో ఒక టీచర్ అంటే ఆ స్టూడెంట్ కనెక్ట్ కాకుండా ఎలా ఉంటాడు. 'రేపు మీరు ఫలానా పండగ జరుపుకుంటున్నారా? వెరీగుడ్. ఆ పండగ గురించి నాకు తెలిసింది చెప్తానుండు' అని ఏ టీచరైనా అంటే పిల్లలు వారిని తమవారనుకుంటారు. భాషాపరంగా, సంస్కృతి పరంగా పిల్లలు కలిగి ఉన్నదంతా తమది కూడా అని భావించిన ప్రతి టీచర్ ప్రతి విద్యార్థికీ ఫేవరెట్ టీచరే.

మంచి ఫ్రెండ్

కొందరు టీచర్లు క్లాస్‌లో ఫ్రెండ్‌లా ఉంటారు. 45 నిమిషాల క్లాస్‌లో 40 నిమిషాలు పాఠం చెప్పి ఒక ఐదు నిమిషాలు వేరే కబుర్లు, విశేషాలు మాట్లాడతారు. పిల్లల కష్టసుఖాలు వింటారు. వారి తగాదాలు తీరుస్తారు. ఎవరైనా చిన్నబుచ్చుకుని ఉంటే కారణం తెలుసుకుంటారు. ముఖ్యంగా దిగువ ఆర్థిక పరిస్థితి ఉన్న పిల్లలు ఇలాంటి టీచర్లను చాలా తీవ్రంగా అభిమానిస్తారు. తమ కష్టాలు చెప్పుకోవడానికి ఒక మనిషి ఉన్నట్టుగా భావిస్తారు. అదే మంచి ఆర్థికస్థితి ఉన్న పిల్లలైతే తమకు ఎమోషనల్ సపోర్ట్ కోసం చూస్తారు. పాఠాల అలజడుల నుంచి ధైర్యం చెప్పే టీచర్‌ను అభిమానిస్తారు.

అందరూ సమానమే

ఒక టీచర్‌ను పిల్లలు ఎప్పుడు అభిమానిస్తారంటే వారు అందరినీ సమానంగా చూస్తారనే భావన కలిగినప్పుడు. టీచర్లు ఫేవరిటిజమ్ చూపిస్తే ఆ పిల్లల్ని మాత్రమే వారు ఇష్టపడతారని, తమను ఇష్టపడరని మిగతా పిల్లలు అనుకుంటారు. మంచి టీచర్లు అందరు పిల్లల్నీ ఇష్టపడతారు. 'టీచర్ నిన్నే కాదు నన్ను కూడా మెచ్చుకుంటుంది' అని పిల్లలు అనుకునేలా టీచర్ ఉండాలి. కొంతమంది స్టూడెంట్‌లు మంచి మార్కులు తెచ్చుకుంటే వారిని ఎక్కువ పొగిడి కొంతమంది స్టూడెంట్‌లు ఎంత బాగా చదువుతున్నా మెచ్చుకోకుండా ఉండే టీచర్లు పిల్లలను భావోద్వేగాలకు గురిచేస్తారు. టీచర్ మెచ్చుకోలు, టీచర్‌తో సంభాషణ పిల్లల హక్కు. అది పిల్లలకు ఇవ్వగలిగిన టీచర్ ఫేవరెట్ టీచర్.

క్రమశిక్షణ

పిల్లలు తమ ఫేవరెట్ టీచర్‌లో క్రమశిక్షణ ఆశిస్తారు. టైమ్‌కు సిలబస్ పూర్తి చేయడం, టైమ్‌కి స్కూల్‌కు రావడం, క్లాసులు ఎగ్గొట్టకపోవడం, సరిగ్గా నోట్స్ చెప్పడం, సరిగ్గా పరీక్షలకు ప్రోత్సహించడం, ఎంత సరదాగా ఉన్నా క్లాస్ జరుగుతున్నప్పుడు సీరియస్‌గా ఉండటం... ఇవీ పిల్లలు ఆశిస్తారు. తాము గౌరవించదగ్గ లక్షణాలు లేని టీచర్లను పిల్లలు ఫేవరెట్ టీచర్లు అనుకోరు.

టీచర్ వృత్తి ఎంతో గొప్ప వృత్తి. టీచర్లు కూడా మనుషులే. వారిలోనూ కోపతాపాలు ఉంటాయి. కాని ఎంతోమంది టీచర్లు పిల్లల కోసం తమ జీవితాలను అంకితం చేసి వారి జీవితాలను తీర్చిదిద్దుతారు. 'మీరు పెద్దవాళ్లయి పెద్ద పొజిషన్‌కు వెళితే అంతే చాలు' అంటూ ఉంటారు. మంచి టీచర్లు, గొప్ప టీచర్లు పిల్లల శ్రేయస్సును ఆకాంక్షించి తద్వారా వారి గుండెల్లో మిగిలిపోతారు.

పిల్లల హృదయాల్లో ప్రేమ, గౌరవం పొందిన టీచర్లందరికీ 'టీచర్స్ డే' శుభాకాంక్షలు.

స్ఫూర్తి

విజయం గురించి కలలు కనేవారికి...
విజేతల నోటి నుంచి వచ్చిన మాటలు ఆణిముత్యాలు అవుతాయి.
ఆచరణకు కొత్త మెరుగులు దిద్దుకునే పాఠాలు అవుతాయి.
వరల్డ్స్ యంగెస్ట్ ఫిమేల్ చార్టర్డ్ ఎకౌంటెంట్‌గా గిన్నిస్ బుక్‌లోకి ఎక్కిన నందిని అగర్వాల్ జోష్ టాక్ (ఇన్‌స్పిరేషనల్ టాక్స్)తో వ్యక్తిత్వ వికాస కోణంలో విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన మాటలు చెబుతోంది...

జోష్ టాక్
– కలలకు ఊపిరి



కలలు అనేవి మనకు ఉన్న అతి పెద్ద ఆస్తులు. ఇతరుల అసూయ, ద్వేషాలతో అవి కరిగిపోకుండా చూసుకోవాలి.

నందిని అగర్వాల్‌కు ఎప్పుడూ తొందరే. పరీక్షలు ఇంకో వారంరోజుల్లో ఉంటే 'రేపే అయితే బాగుండేది' అనుకునేది. ఈ తొందర ఆమెను రెండు క్లాసులు జంప్ చేసేలా చేసింది. అలా అన్నకు క్లాస్‌మేట్‌గా మారింది.



మధ్యప్రదేశ్‌లోని మొరెనా జిల్లాకు చెందిన నందిని అగర్వాల్ పందొమ్మిది సంవత్సరాల వయసులో సీఏ ఫైనల్ పరీక్ష ఫలితాలలో (2021)లో ఆలిండియా టాపర్‌గా నిలిచింది. అన్న సచిన్ అగర్వాల్‌కు 18 ర్యాంకు వచ్చింది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ట్విట్టర్‌లో ఈ అన్నాచెల్లెళ్లను ప్రత్యేకంగా ప్రశంసించారు.

ఒకరోజు నందిని చదువుతున్న స్కూల్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ వచ్చారు. ఆ వ్యక్తి అపురూపంగా కనిపించారు. తాను కూడా గిన్నిస్‌బుక్‌లో పేరు సంపాదించాలని ఆ సమయంలోనే కల కన్నది నందిని.

అప్పుడే ఆమె దృష్టి సీఏపై పడింది.

అయితే సీఏ ఎంట్రెన్స్ కోచింగ్ సమయంలో తనను ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. వారి నిర్లక్ష్యం, చిన్నచూపు తనలో మరింత పట్టుదల పెంచింది. అనుకున్న లక్ష్యాన్ని అవలీలగా సాధించి 'ఔరా' అనిపించింది.

'నా విజయంలో మా అన్నయ్యది ప్రధానపాత్ర. మాక్ టెస్ట్‌లో నాకు అత్తెసరు మార్కులు వచ్చాయి. చాలా నిరాశగా అనిపించింది. మాక్ టెస్ట్‌లోనే ఇలా ఉంటే రియల్ టెస్ట్‌లో ఎలా ఉంటుంది అని భయపడ్డాను. ఆ సమయంలో అన్నయ్య ఎంతో ధీమా ఇచ్చాడు. నువ్వు కచ్చితంగా మంచి మార్కులు తెచ్చుకోగలవు అన్నాడు. ఆ మాటలు నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చి ముందుకు నడిపించాయి' అంటుంది నందిని.

'నందినిలోని నాకు బాగా నచ్చిన విషయం... బాగా కష్టపడి చదువుతుంది. ఒకవిధంగా చెప్పాలంటే చెల్లి నాకు స్ఫూర్తి. నందినిని చూసిన తరువాత నేను కూడా చదువుపై బాగా దృష్టి పెట్టాను' అంటాడు సచిన్ అగర్వాల్.

ఇక నందిని అగర్వాల్ 'జోష్ టాక్'లో ఆకట్టుకునే కొన్ని మాటలు...

- కొత్త వ్యక్తులు, కొత్తప్రదేశాలతో నిరంతర పరిచయం మన ప్రపంచాన్ని విస్తృతం చేస్తుంది.
- జీవితం సులభంగా సాగిపోవాలంటే కొన్నిసార్లు కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదు
- వ్యక్తిగత స్వార్థంతో చేసే సహాయానికి విలువ ఉండదు
- 'నువ్వు ఇలాగే ఉంటావు. ఇది మాత్రమే సాధించగలవు' అనే మాటలు అవతలి వ్యక్తుల నుంచి రాకుండా చూసుకోవాలి. మనం ఎలా ఉండాలి అనేది మనం నిర్ణయించుకోవాలి, మనం ఏది సాధించగలమో మనకు తెలిసి ఉండాలి. 'నీవల్ల ఏమవుతుంది!' అనేది ఎంతోమంది విజేతలకు సుపరిచితమైన మాట. ఆ మాటను తేలిగ్గా తీసుకొని 'కచ్చితంగా నా వల్లే అవుతుంది' అని వారు అనుకోవడం వల్లే విజేతలయ్యారు.
- జీవిత సత్యాలను ఎక్కడినుంచైనా నేర్చుకోవచ్చు. చివరికి ఐస్‌క్రీమ్ నుంచి కూడా! 'ఎంజాయ్ ది లైఫ్ బిఫోర్ ఇట్ మెల్ట్స్'
- సక్సెస్‌ఫుల్ లీడర్‌లు వర్క్‌ను ప్లాన్ చేసుకుంటారు. ప్లాన్ చేసుకున్న దానిపై బాగా వర్క్ చేస్తారు.
- నిన్ను నువ్వు కంట్రోల్ చేసుకోలేకపోతే ఇతరులను ఎప్పుడూ కంట్రోల్ చేయలేవు. కలల సాధనకు కష్టాన్ని జోడించకపోతే కల కనే అర్హత కోల్పోతాం
- మన జీవితానికి హ్యాపీ వెర్షన్ ఏమిటంటే బాల్య జ్ఞాపకాల్లోకి వెళ్లడం
- పనిలో తప్పులో చేసినా ఫరవాలేదుగానీ ఏమీ చేయకపోవడమంత తప్పు మరొకటి లేదు.
- మనం ఎక్కువగా భవిష్యత్ గురించి ఆలోచిస్తుంటాం. గతంలో జరిగిన పొరపాట్ల గురించి అదేపనిగా పశ్చాత్తాపపడుతుంటాం. నిజానికి మనం చేయాల్సింది... వర్తమాన జీవితాన్ని ఆనందంగా ఆస్వాదించడం.
- మీ టైమ్‌ను సేవ్ చేసుకోకపోవడం తెలియకపోతే, టైమ్ మిమ్మల్ని సేవ్ చేయదు.

సాగుబడి
పుబ్బ కార్తె: సెప్టెంబర్ 13 వరకు
ఉత్తర కార్తె: సెప్టెంబర్ 14 నుంచి

'కొబ్బరి'లో 'సుగంధా'ల గుబాళింపు!

- కొబ్బరి తోటల్లో కోకో సహా అనేక అంతర పంటల సాగుకు దక్షిణ కోస్తా జిల్లాలు అనుకూలం
- వక్క, మిరియాలు, అల్లం, పసుపు, దాల్చిన చెక్క, జాపత్రి వంటి సుగంధ ద్రవ్య పంటల సాగు
- కొబ్బరికి తోడుగా అంతర పంటలతో రైతులకు చేకూరుతున్న అదనపు ఆదాయం

- 8-10 కూలీలు అవసరమయ్యే పనులను బైక్ ట్రాలీతో ఇద్దరు చేస్తున్నారు.
- కొబ్బరి+ అంతర పంటల ద్వారా ఎకరానికి రూ. 1,05,000 నికరాదాయం
- రైతు సతీశ్‌కు సి.హెచ్. రవీందర్‌రెడ్డి బెస్ట్ ఫార్మర్ అవార్డు ప్రదానం

ఉద్యాన తోటల్లో సైతం ఏదో ఒకే పంటపై ఆధారపడకుండా.. అంతర పంటల సాగు చేస్తేనే రైతులకు వ్యవసాయం గిట్టుబాటవుతుంది. కొబ్బరి రైతుల పాలిట అంతరపంటల సేద్యం కల్పతరువుగా మారింది. దక్షిణ కోస్తా ఆంధ్రా జిల్లాల్లో వాతావరణం కొబ్బరి సాగుకు అనుకూలం. అందువల్లనే ఏపీ కొబ్బరి తోటల విస్తీర్ణంలో 50 శాతానికిపైగా పాత ఉభయ గోదావరి జిల్లాల్లోనే ఉంది. కొబ్బరి తోటల్లో ఉండే పాక్షిక నీడ వల్ల చల్లని వాతావరణం ఏర్పడుతుంది. ఆ వాతావరణం సుగంధ ద్రవ్య పంటల (స్పైసెస్)కు ఎంతో అనువైనది. ముదురు కొబ్బరి తోటల్లో అనేక సుగంధ ద్రవ్య పంటలను అంతర పంటలుగా సాగు చేస్తూ, నేరుగా మార్కెటింగ్ చేసుకుంటున్న రైతుల విజయగాథలెన్నో. విశేష ప్రగతి సాధిస్తున్న అటువంటి ఇద్దరు ప్రకృతి వ్యవసాయదారులు ఉప్పలపాటి చక్రపాణి, జుజ్జూరి సతీశ్‌ల సుసంపన్న అనుభవాలను తెలుసుకుందాం..

కొబ్బరి+ వక్క+ మిరియాలు+ సిలోన్ దాల్చిన చెక్క+ పసుపు..

గత ఐదారేళ్లుగా కొబ్బరిలో అంతర పంటలు సాగు చేస్తూ.. వీటి ద్వారా ప్రధాన పంటకు తగ్గకుండా అదనపు ఆదాయం పొందవచ్చని రైతు శాస్త్రవేత్త ఉప్పలపాటి చక్రపాణి రుజువు చేస్తున్నారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన చక్రపాణి గత 13 సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కొబ్బరి తోటలో వక్క, మిరియాలు, పసుపు అల్లం పండిస్తూ సంతృప్తికరమైన ఫలితాలు సాధిస్తున్నారు. కొబ్బరి తోటలో ఆరేళ్ల క్రితం నాటిన 2,500 వక్క చెట్లు చక్కని ఫలసాయాన్నిస్తున్నాయి. ఈ ఏడాది 700 వక్క చెట్లకు కాపు వచ్చింది. 2 టన్నుల ఎండు వక్కకాయల దిగుబడి ద్వారా రూ. 3 లక్షల 80 వేలు ఆదాయం వచ్చిందని చక్రపాణి వివరించారు. 300 కొబ్బరి చెట్లకు ఐదారేళ్ల క్రితం మిరియాల తీగలను పాకించారు. వీటిద్వారా 500 కిలోల ఎండు మిరియాల దిగుబడి వచ్చింది. కేజీ రూ.600 చొప్పున రిటైల్‌గా అమ్ముతున్నారు.


చక్రపాణి కొబ్బరి తోటలో సాగవుతున్న అంతర పంటలు

గానుగ నూనెతో ఆరోగ్యం

కొబ్బరి చెట్ల మధ్య వక్క చెట్లు పెంచి.. కొబ్బరి చెట్లకు అనేక ఏళ్ల క్రితమే మిరియం మొక్కల్ని పాకించడంతో చక్రపాణి కొబ్బరి తోట వర్టికల్ గ్రీన్ హెవెన్‌గా మారిపోయింది. కొబ్బరి చెట్లకు మిరియం మొక్కలు చుట్టుకొని ఉంటాయి కాబట్టి, మనుషులను ఎక్కించి కొబ్బరి కాయలు దింపే పద్ధతికి స్వస్తి చెప్పారు. కాయల్లో నీరు ఇంకిన తర్వాత వాటికవే రాలుతున్నాయి. రాలిన కాయలను అమ్మకుండా.. సోలార్ డ్రయ్యర్‌లో పూర్తిగా ఎండబెట్టి కురిడీలు తీస్తున్నారు. కురిడీలతో గానుగల ద్వారా సేంద్రియ కొబ్బరి నూనె తీసి నేరుగా వినియోగదారులకు విక్రయిస్తున్నారు. రెండేళ్లుగా తాము ఇంట్లో వంటలకు తమ సేంద్రియ కొబ్బరి నూనెనే వాడుతున్నామని, చాలా ఆరోగ్య సమస్యలు తీరటం గమనించామని చక్రపాణి సంతోషంగా చెప్పారు.

పసుపు ఫ్లేక్స్

కొబ్బరి తోటలో వక్క, మిరియాలతో పాటు రెండేళ్లుగా అటవీ రకం పసుపును కూడా సాగు చేస్తున్నారు చక్రపాణి. ఈ రకం పసుపు వాసన, రంగు చాలా బాగుంది. పచ్చి పసుపు కొమ్ములను పల్చటి ముక్కలు చేసి, సోలార్ డ్రయ్యర్‌లో ఎండబెట్టి, ఆ ఫ్లేక్స్‌ను అమ్ముతున్నారు. వాటి వాసన, రంగు, రుచి అద్భుతంగా ఉన్నాయని వాడిన వారు చెబుతున్నారన్నారు.


కొబ్బరి, వక్క తోటలో అంతరపంటగా పసుపు

సిలోన్ దాల్చిన చెక్క బెటర్

కొబ్బరిలో వక్క వేయడంతో పైకి తోట వత్తుగా కనిపించినా నేలపైన అక్కడక్కడా ఖాళీ ఉంటుంది. ఆ ఖాళీల్లో గత ఏడాది నుంచి అటవీ పసుపుతో పాటు అల్లం, సిలోన్ దాల్చిన చెక్క, నట్‌మగ్‌లను సాగు చేస్తున్నామని చక్రపాణి తెలిపారు. సాధారణంగా మనం ఇళ్లలో వాడే దాల్చిన చెక్క విదేశాల నుంచి దిగుమతయ్యే సాధారణ రకం. సిలోన్ దాల్చిన చెక్క రకం దీనికన్నా మెరుగైనది. ఇది పల్చగా ఉన్నప్పటికీ, ఆరోగ్యకరమైనదని నిపుణులు చెబుతున్నారు. ఇది కూడా కోస్తా ఆంధ్రలో బాగా పండుతోందని చక్రపాణి వివరించారు. కొబ్బరి, పామాయిల్ తోటల్లో అంతర పంటల సాగు ద్వారా అధికాదాయం పొందేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నట్లు పెదవేగి మండల ఉద్యాన అధికారి ఎం. రత్నమాల తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

కేరళ మాదిరిగా ఇక్కడా పండిస్తున్నా!

రైతులు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లోనే పంటలు పండించటం నేర్చుకోవాలి. పశ్చిమ గోదావరి జిల్లాలో అప్‌లాండ్ ఏరియాలో ఉద్యాన తోటలకు అనువైన వాతావరణం ఉంది. ఇవి సారవంతమైన భూములు. ఇక్కడి నీరు కూడా మంచిది. నాలుగైదేళ్లుగా భూగర్భజలాలు పెరగడంతో నీటి సమస్య లేదు. కొబ్బరిలో అంతర పంటలకు అనుకూలంగా ఉండేలా ముందే తగినంత దూరంలో మొక్కలు నాటుకొని సాగు చేసుకోవచ్చు. అంతర పంటలద్వారా సూక్ష్మ వాతావరణం సృష్టించుకొని కేరళలో మాదిరిగా సుగంధ ద్రవ్య పంటలు సాగు చేసుకోవచ్చు. కేరళలో 35 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటే మన దగ్గర 45 డిగ్రీల వరకు వస్తుంది. కొబ్బరిలో అంతర పంటల వల్ల బయటతో పోల్చితే పది డిగ్రీల వరకు ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. ఎండ, గాలిలో తేమ సమపాళ్లలో చెట్లకు అందుతున్నందున కేరళలో మాదిరిగా మిరియాలు, దాల్చిన చెక్క ఇక్కడ మా తోటలోనూ పండుతున్నాయి.


– ఉప్పలపాటి చక్రపాణి (94401 88336), లక్ష్మీపురం, పెదవేగి మం., ఏలూరు జిల్లా

– కొత్తపల్లి వినోద్‌కుమార్, సాక్షి, పెదవేగి, ఏలూరు జిల్లా

బైక్ ట్రాలీ వాడకంతో తగ్గిన కూలీల ఖర్చు




బైక్ ట్రాలీ ఖర్చు రూ. పది వేలు

ద్విచక్ర మోటారు వాహనానికి వెనుక కట్టుకొని బరువులు లాక్కెళ్లేందుకు వీలుగా ఐదేళ్ల క్రితం సతీశ్ బైక్ ట్రాలీని సొంత ఆలోచనతో తయారు చేయించుకొని వినియోగిస్తున్నారు. ఎరువులు వేయటం వంటి పనులకు ఎకరానికి 8–10 మంది కూలీలు అవసరమవుతారని బైక్ ట్రాలీ ఉండటం మూలాన ఇద్దరు కూలీలతోనే వేగంగా పని పూర్తవుతోందని సతీశ్ తెలిపారు. బైక్ ఇంజన్‌తోనే జీవామృతం, పంచగవ్య, ఇతర ద్రావణాలు, కషాయాలను సైతం సులువుగా పిచికారీ చేయగలుగుతున్నానని తెలిపారు. బైక్ ట్రాలీ తయారీకి రూ. పది వేలు ఖర్చయ్యిందని, ఈ ఐదేళ్లలో దాని ద్వారా దాదాపు రూ. 2 లక్షల వరకు డబ్బు ఆదా అయ్యిందన్నారు. దీని ద్వారా ప్రకృతి వ్యవసాయం సులువు కావటం వల్ల ఇతర రైతులు సైతం స్ఫూర్తిని పొందుతున్నారన్నారు. తనను చూసి పాతిక మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టారన్నారు. జీవామృతాన్ని ఫిల్టర్ చేయటం, పిచికారీ చేయటం వంటి పనుల్లో కూడా మనుషుల ప్రమేయం తగ్గించే ఫిల్టర్ వ్యవస్థను నిర్మించటం వల్ల వడకట్టే పని సులువైపోయిందని, పిచికారీ చప్పున పూర్తవుతోందన్నారు. బైక్ స్ప్రేయర్ ద్వారా ఎకరంలో అర గంటలోనే పిచికారీ పూర్తవుతోందన్నారు. టైప్ 2 సూపర్ జీవామృతం తయారీ పద్ధతి రైతులకు వెసులుబాటుగా ఉందన్నారు.

తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం కురుకూరు గ్రామానికి చెందిన జుజ్జవరపు సతీశ్ గత పదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. కొబ్బరి తోటలో ఐదంచెల సాగు ద్వారా ఎకరానికి ఏటా రూ.1,05,000 నికరాదాయం పొందుతున్నారు. మోటార్ బైక్‌తో నడిచే ట్రాలీని, బైక్‌తో నడిచే స్ప్రేయర్‌ను తానే తయారు చేయించుకోవటం ద్వారా కూలీల ఖర్చును భారీగా తగ్గించుకోవటం ఆయన ప్రత్యేకత. రైతుసాధికార సంస్థలో మాస్టర్ ట్రైనర్‌గా పనిచేస్తూ ఇతర రైతులకు మార్గదర్శకుడిగా మారారు. ఆయన స్ఫూర్తితో కురుకూరు గ్రామానికి చెందిన సుమారు పాతిక మంది రైతులు 300 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టారు. రిటైర్డ్ ఐసీఏఆర్ ఉద్యోగుల సంఘం సి.హెచ్. రవీందర్‌రెడ్డి బెస్ట్ ఫార్మర్ అవార్డుతో సతీశ్‌ను ఇటీవల హైదరాబాద్‌లో సత్కరించటం విశేషం. కొబ్బరి తోటలో ఐదంచెల అంతర పంటలను ఆయన సాగు చేస్తున్నారు. మొదటి లేయర్‌గా 27×27 అడుగులకు కొబ్బరి, రెండో లేయర్‌గా కొబ్బరి చెట్ల మధ్యలో 13.5×10 అడుగులలో కోకో సాగు చేస్తున్నారు. మూడో లేయర్‌లో 7×7 అడుగులలో వక్క మొక్కలు వేశారు. నాలుగో లేయర్‌లో వక్క మొక్కలకు మిరియాలు పాకిస్తున్నారు. ఐదో లేయర్ గా ఎండ పడే చోట పైనాపిల్ మొక్కలు నాటారు. కొబ్బరి మొక్కలు లేని చోట్ల జాజికాయ మొక్కలు నాటారు.

ప్రతి 10 రోజులకు జీవామృతం డ్రిప్ ద్వారా ఇస్తున్నారు. పిచికారీ కోసం టైప్ 2 సూపర్ జీవామృతం వాడుతున్నారు. సాధారణంగా జీవామృతం తయారీకి ప్రతి సారీ ఆవు పేడ, మూత్రం అవసరం ఉంటుంది. అయితే, టైప్ 2 జీవామృతం తయారీకి ఒకసారి పేడ, మూత్రం వాడితే చాలు, ఆ తర్వాత 6 నెలల వరకు ఆ అవశేషాలకు 200 లీటర్ల నీటికి లీటరు జీవన ఎరువులతో పాటు బెల్లం జోడిస్తూ మళ్లీ మళ్లీ జీవామృతాన్ని తయారు చేసుకొని వాడటం వల్ల అదే ఫలితాలు వస్తున్నాయన్నారు.

జీవామృతం వడపోతకు తాను రూపొందించిన ఆటోమేటిక్ ఫిల్టర్ సిస్టమ్‌ను మరో 20 మంది రైతులు 200 ఎకరాల తోటల్లో వాడుతున్నారని సతీశ్ (90107 42459) తెలిపారు.

సేంద్రియ సాగుపై రైతు సదస్సులు

'నాబార్డు' సహకారంతో 'రైతునేస్తం ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో సేంద్రియ సాగు పద్ధతులు, కషాయాలు/ద్రావణాల తయారీ, విలువ జోడింపుపై తెలంగాణలో రైతులకు అవగాహన సదస్సులు జరగనున్నాయి. 9న కరీంనగర్ జిల్లా చొప్పదండి మం., పెద్దకురుంపల్లిలోని మల్లిఖార్జున రెడ్డి తోటలో, 10న జగిత్యాల జిల్లా లక్ష్మీపూర్‌లోని ఎడమల మల్లారెడ్డి తోటలో, 11న పెద్దపల్లి జిల్లా రామగిరి మం., కల్వచర్లలోని యాదగిరి శ్రీనివాస్ తోటలో (ఉ.10 గం.-సా. 4 గం.) సదస్సులు జరుగుతాయి. పాల్గొనదలచిన రైతులు తప్పనిసరిగా ముందుగా పేర్లు రిజిస్టర్ చేసుకోవాలి. వివరాలకు.. 70939 73999 (వెంకట్‌రెడ్డి). అందరూ ఆహ్వానితులే. ప్రవేశం ఉచితం.



నేడు భారత ప్రపంచకప్ జట్టు ప్రకటన!

స్వదేశంలో వచ్చే నెలలో జరిగే ప్రపంచకప్ వన్డే క్రికెట్ టోర్నీలో పాల్గొనే భారత జట్టును మంగళవారం మధ్యాహ్నం ప్రకటించనున్నారు. ఆసియా కప్ కోసం ఎంపిక చేసిన జట్టులో ఏమైనా మార్పులు చేసి ప్రపంచకప్‌లో ఇతర ఆటగాళ్లకు సెలక్టర్లు అవకాశం కల్పిస్తారో లేదో వేచి చూడాలి. బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో నిర్వహించిన ఫిట్‌నెస్ పరీక్షలో భారత క్రికెటర్ కేఎల్ రాహుల్ పాస్ అయ్యాడు. దాంతో ఆసియా కప్‌లో మిగిలిన మ్యాచ్‌ల కోసం రాహుల్ మంగళవారం శ్రీలంకకు చేరుకోనున్నాడు.

వెన్నెల-శ్రియాన్షి జోడీకి టైటిల్

ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ గ్రాండ్‌ప్రి బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల అండర్-19 డబుల్స్ ఫైనల్లో వెన్నెల కలగట్ల -శ్రియాన్షి వలిశెట్టి (భారత్) జోడీ టైటిల్ సాధించింది. ఫైనల్లో వెన్నెల-శ్రియాన్షి 21-19, 21-13తో ఉత్సనన్-సబ్రీనా (థాయ్‌లాండ్)లపై గెలిచారు. పురుషుల అండర్-19 డబుల్స్‌లో అరిగెల భార్గవ్ రామ్-విశ్వతేజ్ గొబ్బూరు జోడీ టైటిల్ సాధించింది.



భారత టీటీ జట్టుకు పతకం ఖాయం

ఆసియా చాంపియన్‌షిప్‌లో సెమీస్‌కు



ప్యాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా): ఆసియా టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. సోమవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత జట్టు 3-0తో సింగపూర్ జట్టును ఓడించింది. భారత మహిళల జట్టు క్వార్టర్ ఫైనల్లో 0-3తో జపాన్ చేతిలో ఓడిపోయింది. సింగపూర్‌తో తొలి మ్యాచ్‌లో 41 ఏళ్ల ఆచంట శరత్ కమల్ 11-1, 10-12, 11-8, 11-13, 14-12తో ఇజాక్ క్వెక్‌పై నెగ్గగా... రెండో మ్యాచ్‌లో సత్యన్ జ్ఞానశేఖరన్ 11-6, 11-8, 12-10తో యె ఎన్ కొయెన్ పాంగ్‌ను ఓడించాడు. దాంతో భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో మ్యాచ్‌లో హర్మీత్ దేశాయ్ 11-9, 11-4, 11-6తో జె యు క్లారెన్స్ చ్యూపై గెలవడంతో భారత్ 3-0తో విజయాన్ని ఖాయం చేసుకుంది. బుధవారం జరిగే సెమీఫైనల్స్‌లో చైనీస్ తైపీతో భారత్; దక్షిణ కొరియాతో చైనా తలపడతాయి.

బుమ్రా 'పుత్రోత్సాహం'



ముంబై: భారత పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా తండ్రయ్యాడు. సోమవారం ముంబైలో అతని భార్య సంజనా అబ్బాయికి జన్మనిచ్చింది. తమ మొదటి బిడ్డకు 'అంగద్' అని పేరు పెట్టినట్లు బుమ్రా వెల్లడించాడు. తమ చిన్న కుటుంబం పెద్దదైందని, తమ జీవితంలో కొత్త అధ్యాయానికి సిద్ధమైనట్లు భావోద్వేగంతో ట్వీట్ చేశాడు. డెలివరీ సమయంలో భార్యతో ఉండేందుకే బుమ్రా ఆసియా కప్‌లో నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌కు దూరమయ్యాడు. బుమ్రా కు కొడుకు పుట్టిన సందర్భంగా సహచర క్రికెటర్లు సూర్యకుమార్, పాండ్యా, ధావన్, కోహ్లి భార్య అనుష్క తదితరులు అతనికి అభినందనలు తెలియజేశారు.

టీమిండియా అలవోకగా...

- కుదించిన మ్యాచ్‌లో భారత్ ఘన విజయం
- 10 వికెట్లతో నేపాల్ చిత్తు
- 'సూపర్-4' దశకు రోహిత్ జట్టు

తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్... కాస్త నిరాశపర్చింది. రెండో మ్యాచ్‌లో బౌలింగ్ ప్రాక్టీస్... ఇది అంతంత మాత్రమే! నేపాల్‌లాంటి జట్టును కుప్పకూల్చలేకపోయిన టీమిండియా బౌలింగ్ వైఫల్యం కనిపించింది... మధ్యలో వాన... అయితే ఎట్టకేలకు సాధికారిక బ్యాటింగ్‌తో ఉత్కంఠ లేకుండా భారత్ మ్యాచ్ ముగించింది. కుదించిన పోరులో అలవోక విజయంతో 'సూపర్-4' దశకు ముందంజ వేసింది.



ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ రోహిత్ శర్మ

పల్లెకెలె: ఆసియా కప్ రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ ఘనవిజయాన్ని అందుకుంది. సోమవారం జరిగిన గ్రూప్ 'ఎ' పోరులో భారత్ 10 వికెట్ల తేడాతో నేపాల్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నేపాల్ 48.2 ఓవర్లలో 230 పరుగులకు ఆలౌటైంది. ఆసిఫ్ షేక్ (97 బంతుల్లో 58; 8 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. సోంపాల్ కామి (48; 1 ఫోర్, 2 సిక్స్‌లు), కుశాల్ భుర్తేల్ (38; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. అనంతరం వాన కారణంగా భారత్ లక్ష్యాన్ని 23 ఓవర్లలో 145 పరుగులుగా నిర్దేశించారు. భారత్ 20.1 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 147 పరుగులు చేసి గెలిచింది. రోహిత్ శర్మ (59 బంతుల్లో 74 నాటౌట్; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (62 బంతుల్లో 67 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్) కలిసి అజేయంగా జట్టును గెలిపించారు. ఈ విజయంతో భారత్ 'సూపర్-4' దశకు చేరగా, నేపాల్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.



గిల్

కీలక భాగస్వామ్యాలు...

భారత ఫీల్డింగ్ వైఫల్యాలను సొమ్ము చేసుకుంటూ నేపాల్‌కు ఓపెనర్లు భుర్తేల్, ఆసిఫ్ శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు 65 పరుగులు భాగస్వామ్యం తర్వాత ఎట్టకేలకు పదో ఓవర్లో శార్దుల్ ఈ జోడీని విడదీశాడు. ఆ తర్వాత జడేజా తన బౌలింగ్‌లో 11 పరుగుల వ్యవధిలోనే తర్వాతి 3 వికెట్లు పడగొట్టి నేపాల్‌ను దెబ్బ కొట్టాడు. మరో ఎండ్‌లో ఆసిఫ్ 88 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే కొద్ది సేపటికే ఆసిఫ్‌తో పాటు గుల్షన్ (23)ను సిరాజ్ పెవిలియన్ పంపించడంతో నేపాల్ 144/6 వద్ద నిలిచింది. ఈ దశలో సోంపాల్, దీపేంద్ర సింగ్ (29; 3 ఫోర్లు) ఆరో వికెట్‌కు 50 పరుగులు జత చేయడంతో పరిస్థితి మెరుగైంది. హార్దిక్ ఈ పార్ట్‌నర్‌షిప్‌ను విడగొట్టినా... చివర్లో చెలరేగి ఆడిన సోంపాల్ నేపాల్ స్కోరును 200 దాటించాడు. ఛేదనలో టీమిండియాకు ఎలాంటి ఇబ్బందీ ఎదురు కాలేదు. ఓపెనర్లు రోహిత్, గిల్ తమదైన శైలిలో స్వేచ్ఛగా, అలవోకగా షాట్లు ఆడి జట్టును గెలుపు దిశగా నడిపించారు.

వాన అడ్డు పడుతూ...

మ్యాచ్‌లో నాలుగుసార్లు వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. నేపాల్ ఇన్నింగ్స్ సమయంలో 30 ఓవర్ల తర్వాత, 34 ఓవర్ల తర్వాత వాన కురిసింది. అయితే ఈ రెండు సందర్భాల్లో పెద్దగా ఇబ్బంది రాలేదు కానీ 37.5 ఓవర్ల తర్వాత కురిసిన వానతో సరిగ్గా గంటసేపు ఆట ఆగిపోయింది. అయినా సరే ఓవర్ల కోత లేకుండా నేపాల్ ఇన్నింగ్స్ ముగిసింది. అనంతరం భారత ఇన్నింగ్స్‌లో 2.1 ఓవర్ల తర్వాత వాన పడింది. సుమారు రెండు గంటలు అంతరాయం కలగడంతో చివరకు భారత్ ఇన్నింగ్స్‌ను కుదించి లక్ష్యాన్ని సవరించారు.

ఇదేమి ఫీల్డింగ్?

సునాయాస క్యాచ్‌లు వదిలేయడం, మిస్‌ఫీల్డింగ్, రనౌట్ అవకాశాలు చేజార్చడం, ఓవర్‌త్రోలు... ఇవన్నీ సోమవారం భారత ఫీల్డింగ్‌లో కనిపించాయి. మైదానంలో మన ఆటగాళ్లు ఇంత పేలవంగా కనిపించడం ఆశ్చర్యపర్చింది. తొలి 4.2 ఓవర్లు ముగిసేసరికి భారత ఆటగాళ్లు మూడు క్యాచ్‌లు వదిలేశారు. షమీ బౌలింగ్‌లో భుర్తేల్ ఇచ్చిన క్యాచ్‌లను శ్రేయస్, కిషన్ వదిలేయగా, సిరాజ్ బౌలింగ్‌లో ఆసిఫ్ క్యాచ్‌ను కోహ్లి వదిలేశాడు. చివర్లో సోంపాల్ క్యాచ్‌నూ కిషన్ అందుకోలేకపోయాడు.

స్కోరు వివరాలు

నేపాల్ ఇన్నింగ్స్: కుశాల్ భుర్తేల్ (సి) కిషన్ (బి) శార్దుల్ 38; ఆసిఫ్ (సి) కోహ్లి (బి) సిరాజ్ 58; భీమ్ (బి) జడేజా 7; పౌడేల్ (సి) రోహిత్ (బి) జడేజా 5; కుశాల్ మల్లా (సి) సిరాజ్ (బి) జడేజా 2; గుల్షన్ (సి) కిషన్ (బి) సిరాజ్ 23; దీపేంద్ర సింగ్ (ఎల్బీ) (బి) పాండ్యా 29; సోంపాల్ (సి) కిషన్ (బి) షమీ 48; లమిచానే (రనౌట్) 9; కరణ్ (నాటౌట్) 2; రాజ్‌భన్సీ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (48.2 ఓవర్లలో ఆలౌట్)** 230. **వికెట్ల పతనం:** 1-65, 2-77, 3-93, 4-101, 5-132, 6-144, 7-194, 8-228, 9-229, 10-230. **బౌలింగ్:** షమీ 7-0-29-1, సిరాజ్ 9.2-1-61-3, పాండ్యా 8-3-34-1, శార్దుల్ 4-0-26-1, జడేజా 10-0-40-3, కుల్దీప్ 10-2-34-0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (నాటౌట్) 74; గిల్ (నాటౌట్) 67; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా)** 147. **బౌలింగ్:** కరణ్ 4-0-26-0, సోంపాల్ 2-0-23-0, రాజ్‌భన్సీ 4-0-24-0, సందీప్ లమిచానే 4-0-39-0, దీపేంద్ర సింగ్ ఐరీ 2-0-12-0, కుశాల్ మల్లా 3-0-11-0, గుల్షన్ 1.1-0-11-0.

స్వియాటెక్‌కు షాక్

- ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిన డిఫెండింగ్ చాంపియన్
- ఒస్టాపెంకో సంచలన విజయం
- మూడో సీడ్ జెస్సికా కూడా అవుట్
- క్వార్టర్ ఫైనల్లో జొకోవిచ్



స్వియాటెక్



ఒస్టాపెంకో

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో సోమవారం పెను సంచలనాలు చోటు చేసుకున్నాయి. మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్), మూడో సీడ్ జెస్సికా పెగూలా ప్రిక్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించారు. 2017 ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ ఒస్టాపెంకో (లాత్వియా) మరోసారి స్వియాటెక్‌పై తన ఆధిపత్యం చాటుకొని వరుసగా నాలుగోసారి గెలిచింది. గంటా 48 నిమిషాలపాటు జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో 20వ సీడ్ ఒస్టాపెంకో 3-6, 6-3, 6-1తో టాప్ సీడ్ స్వియాటెక్‌ను, మాడిసన్ కీస్ (అమెరికా) 61 నిమిషాల్లో 6-1, 6-3తో జెస్సికా పెగూలాపై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి చేరారు. ఒస్టాపెంకో ఏడు ఏస్‌లు సంధించడంతోపాటు స్వియాటెక్ సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసింది. ఈ ఓటమితో స్వియాటెక్ వచ్చే సోమవారం విడుదలయ్యే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానాన్ని కోల్పోనుంది. వరుసగా 75 వారాలు టాప్ ర్యాంక్‌లో కొనసాగిన స్వియాటెక్ రెండో ర్యాంక్‌కు పడిపోతుంది. రెండో ర్యాంక్‌లో ఉన్న సబలెంకా (బెలారస్) కొత్త ప్రపంచ నంబర్ వన్ అవుతుంది. మహిళల టెన్నిస్‌లో సింగిల్స్‌తో పాటు డబుల్స్‌లోనూ నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచిన ఎనిమిదో క్రీడాకారిణిగా సబలెంకా గుర్తింపు పొందనుంది. 2021లో సబలెంకా డబుల్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకుంది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో వింబుల్డన్ చాంపియన్, తొమ్మిదో సీడ్ వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6-7 (3/7), 6-3, 6-2తో పేటన్ స్టెర్న్స్ (అమెరికా)పై, ఆరో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6-3, 3-6, 6-1తో వొజ్నియాకి (డెన్మార్క్)పై, సొరానా (రొమేనియా) 6-3, 6-3తో 15వ సీడ్ బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

2005 తర్వాత...

పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ జొకోవిచ్ ఈ టోర్నీలో 13వసారి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో జొకోవిచ్ 6-2, 7-5, 6-4తో బోర్నా గోజో (క్రొయేషియా)పై గెలిచాడు. మరోవైపు 2005 తర్వాత యూఎస్ ఓపెన్‌లో ముగ్గురు అమెరికా క్రీడాకారులు క్వార్టర్ ఫైనల్ చేరారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో పదో సీడ్ టియాఫో (అమెరికా) 6-3, 6-1, 6-4తో హిజికాటా (ఆస్ట్రేలియా)పై, తొమ్మిదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 7-6 (7/2), 6-4, 6-4తో స్ట్రికర్ (స్విట్జర్లాండ్)పై, బెన్ షెల్టన్ (అమెరికా) 6-4, 6-3, 4-6, 6-4తో టామీ పాల్ (అమెరికా)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. మిక్స్‌డ్ డబుల్స్ రెండో రౌండ్‌లో రోహన్ బోపన్న (భారత్)-అల్దిలా సుత్జియాది (ఇండోనేసియా) జోడీ 2-6, 5-7తో బెన్ షెల్టన్-టేలర్ టౌన్‌సెండ్ (అమెరికా) జంట చేతిలో ఓడింది.

రన్నరప్ హంపి... హారికకు మూడో స్థానం





కోల్‌కతా: టాటా స్టీల్ ఇండియా చెస్ టోర్నీలో భాగంగా సోమవారం ముగిసిన బ్లిట్జ్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ హంపి 12 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచింది. 12.5 పాయింట్లతో చైనా గ్రాండ్‌మాస్టర్ జు వెన్‌జున్ చాంపియన్‌గా అవతరించింది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక 10.5 పాయింట్లతో మూడో స్థానం దక్కించుకుంది. పది మంది క్రీడాకారిణుల మధ్య 18 రౌండ్లపాటు జరిగిన బ్లిట్జ్ టోర్నీలో హంపి తొమ్మిది గేముల్లో గెలిచి, ఆరు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మూడు గేముల్లో ఓడిపోయింది. ర్యాపిడ్ ఫార్మాట్‌లో నాలుగో స్థానంలో నిలిచిన హారిక బ్లిట్జ్ ఈవెంట్‌లో ఏడు గేముల్లో నెగ్గి, ఏడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, నాలుగు గేముల్లో ఓటమి చవిచూసింది.

సినిమా

మా నమ్మకం మరింత పెరిగింది



● నవీన్ పొలిశెట్టి, మహేశ్‌బాబు

- నవీన్ పొలిశెట్టి

''మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' యునిక్ రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. మా సినిమా ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన చూస్తుంటే చిత్రం విజయంపై నమ్మకం మరింత పెరిగింది. కృష్ణాష్టమి రోజు సినిమా రిలీజ్ అవుతోంది. కృష్ణుడు ఎలా అల్లరి చేస్తాడో, మా సినిమా కూడా అంతే అల్లరిగా ఉంటుంది'' అని నవీన్ పొలిశెట్టి అన్నారు. మహేశ్‌బాబు .పి దర్శకత్వంలో నవీన్ పొలిశెట్టి, అనుష్కా శెట్టి జంటగా నటించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ– ''జాతి రత్నాలు' తర్వాత చాలా కథలు విన్నాను. కానీ 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' నచ్చింది. నా పాత్రలో మంచి భావోద్వేగాలు ఉన్నాయి. నాగార్జునగారికి మా ట్రైలర్ బాగా నచ్చింది. 'బిగ్ బాస్' హౌస్‌లోకి 15వ కంటెస్టెంట్‌గా వెళ్లాను'' అన్నారు. ''మా సినిమా ట్రైలర్‌లో చూసింది 30 శాతం అనుకుంటే.. సినిమాలో 70 శాతం భావోద్వేగాలు, వినోదం ఉంటాయి'' అన్నారు పి. మహేశ్‌బాబు.

నవ్వుతూనే ఉన్నాను

- కిరణ్ అబ్బవరం




● నేహా శెట్టి, కిరణ్ అబ్బవరం

''రూల్స్ రంజన్' కథ వింటున్నప్పుడు రెండు గంటల పాటు నవ్వుతూనే ఉన్నాను. ప్రేక్షకులు అలాగే నవ్వుకుంటారనే నమ్మకం ఉంది'' అని కిరణ్ అబ్బవరం అన్నారు. రత్నం కృష్ణ దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం 'రూల్స్ రంజన్'. ఏఎం రత్నం సమర్పణలో దివ్యాంగ్ లవానియా, మురళీ కృష్ణ వేమూరి నిర్మించారు. ఈ సినిమాని ఈ నెల 28న విడుదల చేస్తున్నట్లు ఏఎం రత్నం వెల్లడించి, మాట్లాడుతూ– ''నా అనుభవం ప్రకారం ఆడియో హిట్ అయితే సినిమా సగం హిట్ అయినట్లే. మా 'రూల్స్ రంజన్'కి అమ్రిష్ అద్భుతమైన సంగీతం అందించారు'' అన్నారు. ''స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందించదగ్గ చిత్రమిది'' అన్నారు రత్నం కృష్ణ. ''ఏఎం రత్నంగారి ఆశీస్సులతో ముందడుగు వేశాం'' అన్నారు దివ్యాంగ్, మురళీ కృష్ణ.

నా పూర్వజన్మ సుకృతం ఇది

- మూల విరాట్



● మూల విరాట్

తెలంగాణ ప్రజా కవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణ రావు జీవితం ఆధారంగా ప్రభాకర్ జైనీ దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రజాకవి కాళోజీ'. కాళోజీగా మూల విరాట్ నటించారు. విజయలక్ష్మీ జైనీ నిర్మించిన ఈ చిత్రం సెన్సార్‌కు వెళుతోంది. ఈ సందర్భంగా సోమవారం విలేకరుల సమావేశంలో ప్రభాకర్ జైనీ మాట్లాడుతూ– ''కాళోజీలాంటి గొప్ప కవి సినిమా తీయడం సాహసమే అయినప్పటికీ నాకీ అవకాశం రావడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''త్వరలో విడుదల కాబోతున్న మా సినిమాను ప్రేక్షకులు ఆశీర్వదించాలి'' అన్నారు విజయలక్ష్మీ జైనీ. ''ఈ సినిమాలో నటించడానికే సినిమా రంగంలోకి వచ్చినట్లుగా భావిస్తున్నా. కాళోజీ పాత్ర చేశాకే నా జీవితానికి సార్థకత లభించిందనే భావన కలుగుతోంది'' అన్నారు మూల విరాట్.

ఆవకాయ్... సాంబార్

తెలుగు అనగానే గుర్తొచ్చేది ఆవకాయ్... తమిళ్ అంటే సాంబార్... మలయాళంకి కూడా సాంబార్ టచ్ ఉంది. ఇప్పుడు ఆవకాయ్ డైరెక్షన్‌కి సాంబార్ సై అనడంతో క్రేజీ కాంబినేషన్ సెట్ అయింది. అదే నండీ.. మన తెలుగు డైరెక్టర్ల డైరెక్షన్‌లో తమిళ, మలయాళ హీరోలు సినిమాలు చేస్తున్నారు. ఇటు తెలుగు అటు తమిళ, మలయాళంతో పాటు పాన్ ఇండియా స్థాయిలో పలు భాషల్లో ఈ చిత్రాలు విడుదల కానున్నాయి. ఇక తెలుగు డైరెక్టర్లు - పరభాషా హీరోల కాంబో గురించి తెలుసుకుందాం.



● ధనుష్, శేఖర్ కమ్ముల

శేఖర్ కమ్ముల, ధనుష్... డీ 51

వాణిజ్య అంశాల కంటే కథకి, సహజత్వానికి ప్రాధాన్యత ఇచ్చే దర్శకుల్లో శేఖర్ కమ్ముల ఒకరు. ఒక సినిమా తర్వాత మరో సినిమా వెంట వెంటనే చేసేయాలని కాకుండా కొంచెం ఆలస్యమైనా మంచి సినిమాలు తీస్తుంటారు శేఖర్ కమ్ముల. 'ఫిదా, లవ్‌స్టోరీ' వంటి వరుస హిట్లు అందుకున్న ఆయన తన తర్వాతి చిత్రాన్ని తమిళ హీరో ధనుష్‌తో చేస్తున్నారు. 'డీ 51' (వర్కింగ్ టైటిల్) పేరుతో తెలుగు–తమిళ భాషల్లో ఈ సినిమా రూపొందనుంది. ఈ చిత్రంలో ఇంతకు ముందు చూడని సరికొత్త పాత్రలో ధనుష్‌ని చూపించనున్నారట శేఖర్. సోనాలీ నారంగ్ సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రష్మికా మందన్న హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో నాగార్జున కీలక పాత్ర చేస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం రూపొందనుంది. కాగా ధనుష్ చేసిన తొలి తెలుగు స్ట్రయిట్ మూవీ 'సార్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. శేఖర్ కమ్ముల డైరెక్షన్‌లో ధనుష్ చేస్తున్నది సెకండ్ స్ట్రయిట్ తెలుగు మూవీ అవుతుంది.

★ ★ ★



● సూర్య, చందు మొండేటి

చందు, సూర్య కాంబో కుదిరిందా?

'కార్తికేయ 2' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో హిట్ అందుకున్నారు డైరెక్టర్ చందు మొండేటి. ప్రస్తుతం నాగచైతన్య హీరోగా 'ఎన్‌సీ 23' (వర్కింగ్ టైటిల్) సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు చందు. ఇప్పటివరకూ తెలుగు హీరోలతోనే సినిమాలు తీసిన ఆయన తమిళ హీరో సూర్యతో ఓ సినిమా చేయనున్నారు. వీరి కాంబినేషన్లో ఓ సినిమా రానుందంటూ కొన్నాళ్లుగా ప్రచారం జరుగుతోంది. సూర్య–చందు కాంబినేషన్ దాదాపు కుదిరిందని టాక్. సరైన కథ కుదిరితే డైరెక్ట్ తెలుగు సినిమా చేస్తానంటూ చెప్పుకొస్తున్న సూర్య.. చందు మొండేటి చెప్పిన కథ తెలుగు ఎంట్రీకి కరెక్ట్ అని భావించారట. మైథాలజీ నేపథ్యంలో సోషియో–ఫ్యాంటసీ జానర్‌లో ఈ చిత్రకథ ఉంటుందని టాక్.

★ ★ ★



● పరశురామ్, కార్తి

పరశురామ్‌తో కార్తీ?

'గీత గోవిందం, సర్కారు వారి పాట' చిత్రాలతో వరుస హిట్లు అందుకున్నారు డైరెక్టర్ పరశురామ్. 'గీత గోవిందం' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత హీరో విజయ్ దేవరకొండ–డైరెక్టర్ పరశురామ్ కాంబినేషన్‌లో మరో సినిమా షూటింగ్ జరుపుకుంటోంది. కాగా తమిళ హీరో కార్తీతో పరశురామ్ ఓ సినిమా తెరకెక్కించనున్నారనే వార్తలు కొన్నాళ్లుగా వినిపిస్తున్నాయి. ఆ మధ్య చెన్నై వెళ్లి కార్తీకి కథ వినిపించారట ఆయన. 'ఊపిరి' (2016) సినిమా తర్వాత తెలుగులో ఓ సరైన స్ట్రయిట్ ఫిల్మ్ చేయాలని ఎంతో ఆసక్తిగా ఉన్న కార్తీకి పరశురామ్ చెప్పిన కథ నచ్చడంతో పచ్చజెండా ఊపారని టాక్. ఈ సినిమాకు 'రెంచ్ రాజు' అనే టైటిల్ కూడా పరిశీలనలో ఉందట. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో రూపొందించాలని భావిస్తున్నారట పరశురామ్. అటు కార్తీ, ఇటు పరశురామ్ తమ తమ సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయా చిత్రాలు పూర్తయ్యాకే వీరి సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

★ ★ ★



● వెంకీ అట్లూరి, దుల్కర్ సల్మాన్

వెంకీతో దుల్కర్ లక్కీ భాస్కర్

తమిళ హీరో ధనుష్‌తో 'సార్'(తమిళంలో వాత్తి) సినిమాని తెరకెక్కించి, సూపర్ హిట్ అందుకున్నారు డైరెక్టర్ వెంకీ అట్లూరి. తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. తన తాజా చిత్రాన్ని మలయాళ హీరో దుల్కర్ సల్మాన్‌తో తీస్తున్నారు వెంకీ అట్లూరి. 'లక్కీ భాస్కర్' టైటిల్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. పాన్ ఇండియా స్థాయిలో వెంకీ అట్లూరితో 'సార్' నిర్మించిన సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య 'లక్కీ భాస్కర్' నిర్మిస్తున్నారు. 'సార్' సినిమాతో విద్యా వ్యవస్థ నేపథ్యంలో సమాజానికి చక్కని సందేశం ఇచ్చిన వెంకీ అట్లూరి 'లక్కీ భాస్కర్' ద్వారా మరో విభిన్న కథాంశంతో ప్రేక్షకులను మెప్పించనున్నారట. ఒక సామాన్యుడు తనకు అడ్డొచ్చిన అసమానతలను దాటుకుని ఉన్నత శిఖరాలను ఎలా చేరుకున్నాడు? అనే నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. కాగా 'మహా నటి', 'సీతా రామం' వంటి సూపర్ హిట్ చిత్రాల తర్వాత దుల్కర్ సల్మాన్ నటిస్తున్న మరో స్ట్రయిట్ తెలుగు చిత్రం 'లక్కీ భాస్కర్'.

రీల్స్

సిరిమల్లె పువ్వా..



● తన్వి నేగి

'పదహారేళ్ళ వయసు' చిత్రంలోని 'సిరిమల్లె పువ్వా' పాట ఎవర్ గ్రీన్. ఈ పాటలో శ్రీదేవి అభినయం, అందం అద్భుతం. ఈ పాటను 'ఓటు' సినిమా కోసం రీమిక్స్ చేశారు. హృతిక్ శౌర్య, తన్వి నేగి జంటగా నటించిన చిత్రం ఇది. ఫ్లిక్ నైన్ స్టూడియోస్ నిర్మాణంలో రవి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'సిరిమల్లె పువ్వా..' పాటను దర్శకుడు కె. రాఘవేంద్రరావు రిలీజ్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. ''ఒరిజినల్ పాటలోని మాధుర్యాన్ని మరింత పెంచుతూ అద్భుతంగా ఈ పాటని రీమిక్స్ చేశారు సిద్ధార్థ్. తన్వి విజువల్స్ ప్లెజెంట్‌గా ఉంటాయి'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: అగస్త్య.

పెదకాపు రెడీ



● విరాట్ కర్ణ

విరాట్ కర్ణ, ప్రగతి శ్రీవాస్తవ జంటగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వం వహించిన చిత్రం 'పెదకాపు-1'. మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రాన్ని ఈ నెల 29న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''న్యూ ఏజ్ పొలిటికల్ థ్రిల్లర్‌గా 'పెదకాపు-1' రూపొందింది. అణచివేత, ఘర్షణల నేపథ్యంలో కథ సాగుతుంది. ఇద్దరు శక్తివంతమైన వ్యక్తులకు వ్యతిరేకంగా ఒక సామాన్యుడి పోరాటం ఆసక్తిగా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: మిర్యాల సత్యనారాయణ రెడ్డి, సంగీతం: మిక్కీ జె మేయర్, కెమెరా: ఛోటా కె. నాయుడు.

గురు బ్రహ్మ.. గురు విష్ణు



● వికాష్ వశిష్ట, కుషిత

వికాష్ వశిష్ట హీరోగా, మోక్ష, కుషిత కళ్లపు హీరోయిన్లుగా అంజిరామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'నీతోనే నేను'. ఎమ్. సుధాకర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రానికి కార్తీక్ బి. కడగండ్ల సంగీతం అందించారు. నేడు ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఈ సినిమా నుంచి 'గురు బ్రహ్మ.. గురు విష్ణు..' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ని రిలీజ్ చేశారు. ఈ పాటను సుద్దాల అశోక్ తేజ రాయగా, మనో పాడారు. ''మంచి సమాజం కావాలంటే గొప్ప ఉపాధ్యాయుల వల్లే సాధ్యమవుతుంది. అలాంటి వారి గొప్పతనాన్ని తెలియజేసేలా ఈ పాట ఉంటుంది. త్వరలో చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అన్నారు ఎమ్. సుధాకర్ రెడ్డి.

ఇడియట్ ప్రేమకథ



● యశ్వంత్, త్రిప్తి

యశ్వంత్ యజ్జవరపు, త్రిప్తి శంకర్ జంటగా వెంకట్ కదలి తెరకెక్కించిన చిత్రం 'ఓయ్ ఇడియట్'. శ్రీనుబాబు పుల్లేటి, సత్తిబాబు మోటూరి నిర్మించారు. శ్రీనుబాబు పుల్లేటి, సత్తిబాబు మోటూరి మాట్లాడుతూ– ''చక్కని ప్రేమకథా చిత్రం 'ఓయ్ ఇడియట్'. టీనేజ్ లవ్ స్టోరీని వెంకట్ కదలి ఆహ్లాదకరంగా చూపించారు. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
5-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▲	241	65,628
నిఫ్టీ ▲	94	19,529

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	14,032	▼	3
డోజోన్స్	34,838	▲	116
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,453	▼	12
డాక్స్	15,825	▼	15
షాంఘై	3,177	▲	44
నికాయ్	32,939	▲	229

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	59,393
బంగారం (99.5 స్వచ్ఛత)	59,155
వెండి (కేజీ)	73,298

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.93	83.60
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	102.65	106.03
€	యూరో	ఎస్‌బీఐ	87.74	90.85
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.76	57.51
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.43	54.77
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.19	62.15
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.11	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.63	23.43
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.26	12.33

హోండా ఎలివేట్ వచ్చేసింది



- ధరల శ్రేణి రూ.10.99–15.99 లక్షలు
- మైలేజీ 15.31–16.92 కిలోమీటర్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ హోండా కార్స్ ఇండియా భారత మార్కెట్లోకి మధ్యస్థాయి ఎస్‌యూవీ ఎలివేట్ ప్రవేశపెట్టింది. ఎలివేట్‌కు భారత్ తొలి మార్కెట్ కాగా, ఈ మోడల్ ద్వారా కంపెనీ మధ్యస్థాయి ఎస్‌యూవీల్లోకి ఎంట్రీ ఇచ్చింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.10.99–15.99 లక్షలు ఉంది. 121 పీఎస్ పవర్, 145 ఎన్‌ఎం టార్క్‌తో 6–స్పీడ్ మాన్యువల్, 7–స్పీడ్ సీవీటీ ట్రిమ్స్‌లో 1.5 లీటర్ ఐ–వీటీఈసీ పెట్రోల్ ఇంజన్ పొందుపరిచారు. లీటరుకు మైలేజీ మాన్యువల్ ట్రిమ్ 15.31, సీవీటీ 16.92 కిలోమీటర్లు అని కంపెనీ తెలిపింది. అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టంతో తయారైంది. 6 ఎయిర్‌బ్యాగ్స్, లేన్ వాచ్ కెమెరా, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ, ట్రాక్షన్ కంట్రోల్‌తో వెహికిల్ స్టెబిలిటీ అసిస్ట్, హిల్ స్టార్ట్ అసిస్ట్, మల్టీ యాంగిల్ రేర్ వ్యూ కెమెరా, 458 లీటర్ల కార్గో స్పేస్, 7 అంగుళాల హెచ్‌డీ ఫుల్ కలర్ టీఎఫ్‌టీ మీటర్ క్లస్టర్, 10.25 అంగుళాల ఐపీఎస్ హెచ్‌డీ ఎల్సీడీ టచ్ స్క్రీన్ డిస్‌ప్లే ఆడియో, డ్రైవ్ వ్యూ రికార్డింగ్ వంటి హంగులు ఉన్నాయి. హ్యుందాయ్ క్రెటా, మారుతీ సుజుకీ గ్రాండ్ విటారా, కియా సెల్టోస్, టయోటా అర్బన్ క్రూజర్ హైరైడర్‌కు పోటీనిస్తుంది.

అయిదు ఎస్‌యూవీలు: భారత్‌లో 2030 నాటికి అయిదు ఎస్‌యూవీలను ప్రవేశపెట్టనున్నట్టు హోండా కార్స్ ఇండియా ప్రెసిడెంట్, సీఈవో టకూయా సుమురా తెలిపారు. 'భారత ప్యాసింజర్ కార్ల పరిశ్రమలో ఎస్‌యూవీల వాటా ఏడాదిలో 43 నుంచి 48 శాతానికి చేరింది. ఈ విభాగం కంపెనీకి చాలా కీలకం కానుంది. ఎలివేట్ చేరికతో కంపెనీకి కొత్త కస్టమర్లు తోడు కానున్నారు. ఎస్‌యూవీ విభాగంలో లేకపోవడంతో చాలా కోల్పోయాం. అందుకే ఎలివేట్‌ను పరిచయం చేయడం గొప్పగా భావిస్తున్నాం' అని వివరించారు. రాజస్తాన్‌లోని ప్లాంటు సామర్థ్యాన్ని పెంచామని, ప్రస్తుతం రోజుకు 660 యూనిట్లు ఉత్పత్తి చేయగలమని చెప్పారు. జూలై నుంచి ఎలివేట్ బుకింగ్స్ ప్రారంభం అయ్యాయి.

ప్రకృతి ఆధారిత ప్రాజెక్టులపై భారీగా పెట్టుబడులు: అమెజాన్



న్యూఢిల్లీ: ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ప్రకృతి ఆధారిత ప్రాజెక్టులలో పెట్టుబడుల కోసం 15 మిలియన్ డాలర్ల ఫండ్‌ను ఏర్పాటు చేసినట్లు ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ తెలిపింది. ఇందులో ప్రాథమికంగా 3 మిలియన్ డాలర్ల మొత్తాన్ని భారత్‌లో ఇన్వెస్ట్ చేయనున్నట్లు వివరించింది. 'తొలి ప్రాజెక్టు కింద, అనేక వన్యప్రాణులకు ఆలవాలంగా ఉండే పశ్చిమ కనుమల పరిరక్షణకు కృషి చేస్తున్న సెంటర్ ఫర్ వైల్డ్‌లైఫ్ స్టడీస్ (సీడబ్ల్యూఎస్)తో కలిసి పని చేయనున్నాం' అని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. సీడబ్ల్యూఎస్ చేపట్టే 'వైల్డ్ కార్బన్' ప్రోగ్రామ్ కోసం 1 మిలియన్ డాలర్లు అందించనుంది. ఫల, కలప, ఔషధ అవసరాలకు ఉపయోగపడే పది లక్షల పైచిలుకు మొక్కలను నాటి, పెంచడంలో 10,000 మంది రైతులకు తోడ్పాటు అందించేందుకు దీన్ని ఉద్దేశించారు. విస్తారమైన అడవులు, తీరం గల ఆసియా–పసిఫిక్ ప్రాంతానికి వాతావరణం పరమైన మార్పుల రిస్కులూ గణనీయంగా ఉంటాయని అమెజాన్ గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్ కెరా హస్ట్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-9-2023	
విశాఖ	500–00
చిత్తూరు	468–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485–00
విజయవాడ	485–00
రిటైల్ ధర (డజను)	72.00
4-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	440–00
వరంగల్	442–00
రిటైల్ ధర	5.00

మెటల్, ఐటీ షేర్ల జోరు

- నెల గరిష్టానికి నిఫ్టీ
- సూచీలకు రెండో రోజూ లాభాలే
- ఆల్ టైం హైకి ఇన్వెస్టర్ల సంపద

ముంబై: మెటల్, ఐటీ, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు రాణించడంతో సోమవారం స్టాక్ సూచీలు నెల గరిష్ట స్థాయి వద్ద ముగిశాయి. దేశీయంగా ప్రోత్సాహకర స్థూల ఆర్థిక గణాంకాల నమోదు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల అంశాలు కలిసొచ్చాయి. ఫలితంగా సోమవారం సెన్సెక్స్ 241 పాయింట్లు 65,628 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 94 పాయింట్లు పెరిగి 19,529 వద్ద నిలిచింది. సూచీలకు ఇది రెండో లాభాల ముగింపు. ఉదయం సానుకూల ప్రారంభం తర్వాత అమ్మకాల ఒత్తిడికి లోనైన సూచీలు వెంటనే తేరుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 297 పాయింట్లు ర్యాలీ చేసి 65,684 వద్ద, నిఫ్టీ 110 పాయింట్లు బలపడి 19,545 వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి. ఎఫ్‌ఎంసీజీ, కన్జూమర్ డ్యూరబుల్స్ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు దాదాపు ఒకశాతం పెరిగాయి. సెన్సెక్స్ రెండు రోజుల ర్యాలీతో బీఎస్‌ఈలో రూ.5.42 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవిత కాల గరిష్ట స్థాయి రూ.315 లక్షల కోట్లకు చేరింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.3367 కోట్ల ఈక్విటీలను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2563 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియాలో థాయిలాండ్ తప్ప అన్ని దేశాల సూచీలు 0.50% నుంచి 2.50% పెరిగాయి. యూరప్ ఇండెక్సులు అరశాతం బలపడ్డాయి. లేబర్ డే సందర్భంగా సోమవారం అమెరికా మార్కెట్లకు సెలవు.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందనేందుకు సంకేతంగా బలమైన స్థూల గణాంకాల నమోదుతో మెటల్ షేర్లకు డిమాండ్ నెలకొంది. నాల్కో, సెయిల్, ఎన్ఎండీసీ షేర్లు 6% ర్యాలీ చేశాయి. టాటా స్టీల్, హిందాల్కో, జేఎస్ఎల్, వేదాంత, హిందుస్తాన్ కాపర్ షేర్లు 4–2% పెరిగాయి. హిందుస్తాన్ జింక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, జిందాల్ స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్లు ఒకశాతం లాభపడ్డాయి.



ఈఎంఎస్ ఆఫర్.. రూ.200–211

సీరు, మురుగునీటి పారుదల మౌలిక కార్యకలాపాల్లోని ఈఎంఎస్ ఐపీవో ఈ నెల 8న ప్రారంభం కానుంది. ఈ నెల 12న ముగియనుంది. ఒక్కో షేరుకు ధరల శ్రేణిగా రూ.200–211ను ప్రకటించింది. ఐపీవో ద్వారా కంపెనీ రూ.321 కోట్లు సమీకరించనుంది.

నాస్కామ్ చైర్‌పర్సన్‌గా రాజేశ్ నంబియార్



ముంబై: కాగ్నిజెంట్ ఇండియా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) రాజేశ్ నంబియార్‌ను తన చైర్‌పర్సన్‌గా నియమిస్తున్నట్లు టెక్నాలజీ ఇండస్ట్రీ బాడీ నాస్కామ్ సోమవారం ప్రకటించింది. ప్రస్తుతం నాస్కామ్ చైర్‌పర్సన్‌గా మైక్రోసాఫ్ట్ ఇండియా మాజీ ప్రెసిడెంట్ అనంత్ మహేశ్వరి బాధ్యతలు నిర్వహిస్తుండగా, నంబియార్ వైస్ చైర్‌పర్సన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజాగా అనంత్ మహేశ్వరి నుంచి నంబియార్ బాధ్యతలు స్వీకరిస్తున్నారు. నాస్కామ్ భారత్‌కు సంబంధించి ఐటీ, టెక్ ట్రేడ్ సంస్థ. ప్రభుత్వం, ఐటీ పరిశ్రమ మధ్య సమన్వయం పెంపొందడానికి ఈ సంస్థ విశేష కృషి చేస్తోంది. ''నాస్కామ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌కు చైర్‌పర్సన్‌గా నియమితులు కావడాన్ని గౌరవప్రదమైన అంశంగా భావిస్తున్నాను. ప్రపంచానికి అత్యంత విశ్వసనీయమైన సాంకేతిక భాగస్వామిగా భారతదేశ నాయకత్వాన్ని బలోపేతం చేయడానికి సంబంధిత అన్ని వర్గాలతో కలిసి పనిచేయడానికి ఎదురు చూస్తున్నాను'' అని తన నియామకం సందర్భంగా నంబియార్ పేర్కొన్నారు.

ఈ కామర్స్‌లో కొలువుల పండుగ

దక్షిణాదిన 4,00,000 నియామకాలు • హైదరాబాద్‌లో 30 శాతం • టీమ్‌లీజ్ సర్వీసెస్ వెల్లడి

హైదరాబాద్: నిరుద్యోగులకు కొలువుల పండుగ రానుంది. పండుగల విక్రయాలకు ముందు ఈ కామర్స్ రంగంలో పెద్ద ఎత్తున నియామకాలు చోటు చేసుకోనున్నాయి. ఏటా దసరా, దీపావళి సమయాల్లో ప్రముఖ ఈ కామర్స్ సంస్థలు భారీ తగ్గింపులు, ఆఫర్లతో ప్రత్యేక విక్రయ కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. దీంతో ఏడాది పండుగల సీజన్ సమయంలో డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తులు అందించేందుకు ఈ కామర్స్ సంస్థలు నెట్‌వర్క్ బలోపేతంపై దృష్టి సారించనున్నాయి. ముఖ్యంగా దక్షిణాదిలో ఈ కామర్స్ రంగంలో తాత్కాలిక ఉద్యోగాలు పెద్ద ఎత్తున రానున్నాయని నియామక సేవలు అందించే టీమ్‌లీజ్ సర్వీసెస్ సంస్థ తెలిపింది. పరిశ్రమలో నెలకొన్న ధోరణుల ఆధారంగా ఈ అంచనాకు వచ్చింది. కేవలం దక్షిణాదిలోనే 4 లక్షల తాత్కాలిక ఉద్యోగాలు వస్తాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా 7,00,000 తాత్కాలిక ఉద్యోగాలు ఏర్పడతాయని తెలిపింది. హైదరాబాద్‌లో 30 శాతం, బెంగళూరులో 40 శాతం, చెన్నైలో 30 శాతం చొప్పున కొలువులు ఏర్పడతాయని తెలిపింది. పండుగల సందర్భంగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర టైర్–1 పట్టణాల్లో నియామకాలు పెద్ద ఎత్తున ఉంటాయని, కోయంబత్తూర్, కొచి, మైసూర్ తదితర ద్వితీయ శ్రేణి పట్టణాలకు సైతం నియామకాలు విస్తరించొచ్చని అంచనా వేసింది. వేర్‌హౌస్ కార్యకలాపాల్లో (గోదాములు) 30 శాతం, డెలివరీ విభాగంలో 60 శాతం, కాల్‌సెంటర్ కార్యకలాపాల కోసం 10 శాతం నియామకాలు ఉంటాయని పేర్కొంది. ''గడిచిన త్రైమాసికం నుంచి ప్రముఖ ఈకామర్స్ సంస్థలు పండుగల సీజన్‌కు సంబంధించి ఆశావహ ప్రణాళికలను ప్రకటించాయి. వినియోగదారులు భారీగా ఉండడం, భారత్‌లో తయారీని కేంద్ర సర్కారు ప్రోత్సహిస్తుండడం, ఎఫ్‌డీఐ, డిజిటైజేషన్ తదితర చర్యలు దేశంలో తాత్కాలిక కార్మికుల పని వ్యవస్థను అధికంగా ప్రభావితం చేస్తున్నాయి''అని టీమ్‌లీజ్ సర్వీసెస్ బిజినెస్ హెడ్ బాలసుబ్రమణియన్ తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది తాత్కాలిక కార్మికులు దేశవ్యాప్తంగా 25 శాతం మేర పెరుగుతారని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. దక్షిణాదిలో అయితే ఇది 30 శాతంగా ఉంటుందన్నారు.



ఫ్లిప్‌కార్ట్‌లో లక్ష సీజనల్ ఉద్యోగాలు

రానున్న పండుగల సీజన్ నేపథ్యంలో, వినియోగదారుల నుంచి వచ్చే డిమాండ్‌ను అనుగుణంగా తాము సరఫరా వ్యవస్థలో లక్ష తాత్కాలిక (సీజనల్) ఉద్యోగ నియామకాలు చేపడుతున్నట్టు ఫ్లిప్‌కార్ట్ ప్రకటించింది. ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలు, సార్టేషన్ కేంద్రాలు, డెలివరీ హబ్‌లలో ఈ నియామకాలు చేపట్టనుంది. స్థానిక కిరాణా డెలివరీ భాగస్వాములు, మహిళలు, వికలాంగులను సైతం నియమించుకోనున్నట్టు తెలిపింది. తద్వారా వైవిధ్యమైన సరఫరా చైన్‌ను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొంది. ''బిగ్ బిలియన్ డేస్ (డిస్కౌంట్ సేల్) నిజంగా భారీ స్థాయిలో జరుగుతుంది. ఈ కామర్స్‌లో ఉండే మంచి గురించి లక్షలాది మంది కస్టమర్లు తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది. ఎక్కువ మంది మొదటిసారి కస్టమర్లే ఉంటున్నారు''అని ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ హేమంత్ బద్రి తెలిపారు. బిగ్ బిలియన్ డేస్‌లో భాగంగా ఫ్లిప్‌కార్ట్ భారీ తగ్గింపులు, ఆకర్షణీయమైన ఆఫర్లతో విక్రయాలు చేపడుతుంటుంది. బిగ్ బిలియన్ డేస్ సందర్భంగా ఉండే సంక్లిష్టతలు, స్థాయికి అనుగుణంగా తాము సామర్థ్యాన్ని, నిల్వ స్థాయి, సార్టింగ్, ప్యాకేజింగ్, మానవవనరులను, డెలివరీ భాగస్వాములను పెంచుకోవాల్సి ఉంటుందని బద్రి పేర్కొన్నారు. ఈ ఏడాది 40 శాతానికి పైగా షిప్‌మెంట్‌లను స్థానిక కిరాణా భాగస్వాములతో డెలివరీ చేసే ప్రణాళికతో ఉన్నట్టు చెప్పారు.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఢిల్లీ పోలీసు విభాగంలో 7547 కానిస్టేబుల్ పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. ఢిల్లీ పోలీసు విభాగంలో.. కానిస్టేబుల్ (ఎగ్జిక్యూటివ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 7547
» **పోస్టుల వివరాలు:** కానిస్టేబుల్(ఎగ్జిక్యూటివ్)–**పురుషులు:** 5056(జనరల్–3053,ఈడబ్ల్యూఎస్–542, ఓబీసీ–287,ఎస్సీ–872, ఎస్టీ–302). **కానిస్టేబుల్(ఎగ్జిక్యూటివ్)–మహిళలు:** 2491(జనరల్–1502, ఈడబ్ల్యూఎస్–268, ఓబీసీ–142, ఎస్సీ–429, ఎస్టీ–150).
» **అర్హత:** 10+2(సీనియర్ సెకండరీ) ఉత్తీర్ణతతో పాటు వ్యాలిడ్ డ్రైవింగ్ లైసెన్స్(ఎల్ఎంవీ) కలిగి ఉండాలి. » **వేతనం:** పే లెవల్-3 (రూ.21,700 నుంచి రూ.69,100)
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్(పీఈటీ),ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్(పీఎంటీ), మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ద్వారా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఆబ్జెక్టివ్ విధానంలో 100 ప్రశ్నలు–100 మార్కులకు ఉంటుంది. జనరల్ నాలెడ్జ్/కరెంట్ అఫైర్స్, రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, కంప్యూటర్ ఫండమెంటల్స్, ఎంఎస్ ఎక్సెల్, ఎంఎస్ వర్డ్, కమ్యూనికేషన్, ఇంటర్నెట్, వెబ్ బ్రౌజింగ్ తదితర అంశాల్లో ప్రశ్నలుంటాయి. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.09.2023.
» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష:** 2023 డిసెంబర్‌లో.
» **వెబ్‌సైట్:** https://ssc.nic.in

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో 22 ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టులు

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(సీఎస్ఎల్).. ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 22
» **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఐటీ.
» **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కనీసం రెండేళ్ల పని అనుభవం ఉండాలి. **వయసు:** 30 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.37,000 నుంచి రూ.40,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 05.09.2023.
» **వెబ్‌సైట్:** www.cochinshipyard.in

ఎస్‌బీఐలో 6160 అప్రెంటిస్‌లు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సెంట్రల్ రిక్రూట్‌మెంట్ -ప్రమోషన్ డిపార్ట్‌మెంట్, కార్పొరేట్ సెంటర్.. అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం ఖాళీల సంఖ్య:** 6160
» **తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్–390, తెలంగాణ–125.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. **శిక్షణ వ్యవధి:** ఒక సంవత్సరం. **వయసు:** 01.08.2023 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు రూ.15,000.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ రాతపరీక్ష, స్థానిక భాష పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:**21.09.2023
» **ఆన్‌లైన్ పరీక్ష తేదీలు:**అక్టోబర్/నవంబర్2023
» **వెబ్‌సైట్:** https://karmic.andaman.gov.in

ఏపీ సివిల్ సప్లైస్, కోనసీమ జిల్లాలో 993 పోస్టులు

కోనసీమలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, జిల్లా కార్యాలయం.. డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ధాన్య సేకరణకు సంబంధించి రెండు నెలల కాలానికి ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 993
» **పోస్టుల వివరాలు:** టెక్నికల్ అసిస్టెంట్–331, డేటాఎంట్రీ ఆపరేటర్–331, హెల్పర్–331.
» **టెక్నికల్ అసిస్టెంట్:** బీఎస్సీ(అగ్రికల్చర్ /మైక్రో బయాలజీ/బయోకెమిస్ట్రీ/ బయోటెక్నాలజీ)/ బీఎస్సీ(బీజెడ్‌సీ)/బీఎస్సీ(లైఫ్ సైన్సెస)/డిప్లొమా(అగ్రికల్చర్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **డేటాఎంట్రీ ఆపరేటర్:** ఏదైనా డిగ్రీతో పాటు పీజీడీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **హెల్పర్:** 8, 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** టీఏ/డీఈవో పోస్టులకు 21 నుంచి 40 ఏళ్లు,హెల్పర్‌కు 18నుంచి 35ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కులు, పని అనుభవం, అదనపు విద్యార్హతలు (టీఏ/డీఈవో పోస్టులకు) ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** నోటిఫికేషన్ ప్రకారం నిర్ణీత నమూనాలో ఆఫ్‌లైన్ దరఖాస్తులను సంబంధిత ధ్రువపత్రాల నకళ్లను జతచేసి రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, ఎయిమ్స్ కాలేజ్, మొదటి అంతస్తు, ముమ్మిడివరం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 08.09.2023.
» **వెబ్‌సైట్:** konaseema.ap.gov.in

గ్రూప్స్‌పై గురి పెడతారా!

» త్వరలో గ్రూప్-1, 2 పోస్టుల భర్తీకి సన్నాహాలు
» రెండు కేటగిరీల్లో కలిపి మొత్తం 597 పోస్టులకు ఆమోదం
» డిగ్రీ ఉత్తీర్ణతతో గ్రూప్స్‌కు పోటీ పడే అర్హత
» విశ్లేషణాత్మక అధ్యయనంతోనే సక్సెస్‌కు మార్గం

గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలంటే.. ఎంతో క్రేజ్! రాష్ట్ర స్థాయిలో ఉన్నత ప్రభుత్వ ఉద్యోగాలివి!! అందుకే వీటిని దక్కించుకునేందుకు లక్షల మంది పోటీపడుతుంటారు. ఇలాంటి అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీపి కబురు అందించింది. గ్రూప్1లో 89 పోస్టులు, గ్రూప్ 2లో 508 పోస్టుల భర్తీకి రాష్ట్ర సర్కారు తాజాగా ఆమోదం తెలిపింది. దీంతో ఏపీలో త్వరలోనే గ్రూప్-1, గ్రూప్-2 పోస్టుల భర్తీకి నగారా మోగనుంది. ఈ నేపథ్యంలో.. ఏపీపీఎస్సీ గ్రూప్-1, గ్రూప్-2 పోస్టులకు ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ,ప్రిపరేషన్ గైడెన్స్ తదితర వివరాలు..

గత నాలుగేళ్లుగా నిరంతరం ఏదో ఒక నోటిఫికేషన్‌తో ఉద్యోగార్థులను పలకరిస్తున్న ఏపీపీఎస్సీ.. తాజాగా గ్రూప్స్ అభ్యర్థులకు ఆనందం కలిగించే కబురు చెప్పింది. మరికొద్ది రోజుల్లోనే గ్రూప్-1, గ్రూప్-2 పోస్టుల భర్తీకి సన్నాహాలు ప్రారంభిస్తామని కమిషన్ వర్గాలు పేర్కొన్నాయి.

మొత్తం 597 పోస్టులు

ఏపీ ప్రభుత్వం ఆమోదించిన ప్రకారం-త్వరలో విడుదల చేయనున్న గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్ల ద్వారా మొత్తం 597 పోస్టులు భర్తీ చేయనున్నారు. గ్రూప్-1లో డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ, సీటీఓ తదితర 89 ఉన్నత స్థాయి పోస్టులు.. గ్రూప్-2లో డిప్యూటీ తహశీల్దార్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-3 వంటి 508 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడనుంది.

సిలబస్‌పై అవగాహన

మరికొద్ది రోజుల్లోనే ఏపీపీఎస్సీ గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్లు రావడం ఖాయమని స్పష్టమైంది. కాబట్టి ప్రిపరేషన్‌కు ఉపక్రమించే ముందు అభ్యర్థులు సిలబస్‌పై సంపూర్ణ అవగాహన ఏర్పరచుకోవాలి. తాము పోటీ పడదలచుకుంటున్న పరీక్షకు సంబంధించిన సిలబస్‌ను లోతుగా పరిశీలించాలి. గత ప్రశ్న పత్రాలను అధ్యయనం చేయాలి. ఆ తర్వాత ప్రిపరేషన్ ప్రణాళిక రూపొందించుకోవాలి. ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహించే గ్రూప్-1ను లక్ష్యంగా చేసుకునే అభ్యర్థులు మరింత పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగాలి. ముందుగా ప్రిలిమ్స్, మెయిన్ సిలబస్‌ను పూర్తిగా అవగాహన చేసుకోవాలి. ఆ తర్వాత ఆయా అంశాలకు కల్పిస్తున్న వెయిటేజీని గమనించాలి. దీనికి అనుగుణంగా ప్రామాణిక పుస్తకాలను ఎంపిక చేసుకొని దీర్ఘకాలిక ప్రిపరేషన్ ప్రారంభించాలి.

మూడు దశల్లో గ్రూప్ 1

గ్రూప్-1 ఎంపిక ప్రక్రియలో ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ ఉంటాయి. ప్రిలిమ్స్ రెండు పేపర్లుగా ఉంటుంది. ప్రతి పేపర్‌లో 120 ప్రశ్నలు-120 మార్కులు చొప్పున మొత్తం 240 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ప్రతి పేపర్‌కు పరీక్ష సమయం రెండు గంటలు. ప్రిలిమ్స్‌లో అర్హత పొందిన వారిని మెయిన్‌కు అనుమతిస్తారు. మెయిన్ పరీక్ష పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో అయిదు పేపర్లుగా 750 మార్కులకు నిర్వహిస్తారు.మెయిన్‌లో పొందిన మార్కుల ఆధారంగా 1:2 నిష్పత్తిలో చివరి దశ పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూకు 75 మార్కులు ఉంటాయి. మెయిన్, ఇంటర్వ్యూలో సాధించిన మార్కుల ఆధారంగా తుది ఎంపిక చేస్తారు.

గ్రూప్ 2 ఇలా

గ్రూప్-2 పరీక్షను రెండు దశలుగా(స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామ్) నిర్వహిస్తారు. పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష జరుగుతుంది. మొదటి దశ స్క్రీనింగ్ టెస్ట్ 150 మార్కులకు ఉంటుంది. స్క్రీనింగ్ టెస్ట్‌లో అర్హత సాధించిన వారికి 1:50 నిష్పత్తిలో రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్‌లో ఒక్కో పేపర్‌కు 150 మార్కుల చొప్పున రెండు పేపర్లు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటుంది.

సమన్వయం అవసరం

గ్రూప్-1, గ్రూప్-2 సిలబస్‌లో దాదాపు 80 శాతం ఉమ్మడి అంశాలే! కాబట్టి అభ్యర్థులు గ్రూప్-1 ఓరియెంటేషన్‌తో, డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో ప్రిపరేషన్ సాగిస్తే... గ్రూప్-2 సిలబస్‌పైనా పట్టు లభించే అవకాశం ఉంది. ఆయా టాపిక్‌లను చదివేటప్పుడు కోర్ సబ్జెక్ట్‌ను విస్తృతంగా అన్ని కోణాల్లో చదువుతూ.. సమకాలీన పరిణామాలతో సమన్వయం చేసుకోవాలి. తద్వారా ఏకకాలంలో గ్రూప్ 1, గ్రూప్ 2ల్లో రాణించేందుకు వీలవుతుంది.

విశ్లేషణాత్మక అధ్యయనం

గ్రూప్స్ అభ్యర్థులు విశ్లేషణాత్మక అధ్యయనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రిలిమ్స్ నుంచే ఆయా అంశాలను విశ్లేషించుకుంటూ చదవాలి. సమకాలీన అంశాలపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలి. ముఖ్యమైన టాపిక్స్‌కు సంబంధించి సినాప్సిస్, నేపథ్యం, ప్రభావం, ఫలితం, పర్యవసానాలు.. ఇలా అన్ని కోణాల్లో పట్టు సాధించాలి. ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు.. ముఖ్యంగా నవరత్నాలు, లక్షిత వర్గాలు, బడ్జెట్ కేటాయింపులు తదితర వివరాలను అవపోసన పట్టాలి. అదే విధంగా రాష్ట్ర స్థాయిలో అమలవుతున్న ఆర్థిక విధానాలు, వాటిద్వారా జరుగుతున్న అభివృద్ధిపై దృష్టి సారించాలి. దీంతోపాటు జాతీయ స్థాయిలో తాజా రాజ్యాంగ సవరణలు, నూతన జాతీయ విద్యా విధానం, ఇటీవల కాలంలో కీలకమైన తీర్పుల గురించి అవగాహన పెంచుకోవాలి.



అప్లికేషన్ అప్రోచ్

గ్రూప్స్ అభ్యర్థులు ప్రతి అంశాన్ని చదివేటప్పుడు అన్వయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి. ముఖ్యంగా సమకాలీన అంశాలు సమ్మిళితంగా ఉండే ఎకానమీ, పాలిటీ, జాగ్రఫీ, సైన్స్ అండ్ టెక్నాలజీలో ఇది ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది. అదే విధంగా చదివే సమయంలోనే రైటింగ్ ప్రాక్టీస్ చేయాలి. నిరంతరం తమ సామర్థ్యాలను అంచనా వేసుకునేందుకు మోడల్ టెస్ట్‌కు హాజరు కావడం మేలు చేస్తుంది.

ప్రీవియస్ పేపర్స్

గ్రూప్స్ అభ్యర్థులు ప్రిపరేషన్ ప్రారంభించే ముందు గత ప్రశ్న పత్రాలను పరిశీలించాలి. గత ప్రశ్న పత్రాల ద్వారా పరీక్షలో సదరు అంశాలకు లభిస్తున్న వెయిటేజీపై అవగాహన లభిస్తుంది. అంతేకాకుండా ప్రశ్నలు అడుగుతున్న తీరు తెలుస్తుంది. ఆయా టాపిక్స్‌పై తమకున్న పట్టు, ఇంకా మెరుగుపరచుకోవాల్సిన విషయాల్లోనూ స్పష్టత లభిస్తుంది.

సిలబస్‌పై పట్టు.. కొలువుకు మెట్టు

- **చరిత్ర:** రాష్ట్ర చరిత్ర, సంస్కృతికి సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలి. ప్రాచీన చరిత్ర మొదలు ఆధునిక చరిత్ర వరకూ..ముఖ్యమైన అంశాలపై సంపూర్ణ అవగాహన అవసరం. జాతీయోద్యమంలో ఆంధ్రప్రదేశ్ పాత్ర గురించి అధ్యయనం చేయాలి. అదేవిధంగా భారత దేశ చరిత్రకు సంబంధించిన అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.
- **భౌగోళిక శాస్త్రం:** దీనికి సంబంధించి రాష్ట్రంలోని భౌగోళిక వనరులు, అడవులు, జీవ సంపద, వ్యవసాయ వనరుల గురించి తెలుసుకోవాలి. వీటిని తాజా పరిస్థితులతో అన్వయం చేసుకోవాలి. గత ఏడాది కాలంలో చేపట్టిన వ్యవసాయ, నీటి పారుదల ప్రాజెక్ట్‌లు.. వాటి ద్వారా లబ్ధి చేకూరే ప్రాంతాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి.
- **పాలిటీ:** రాజనీతి శాస్త్రం, రాజ్యాంగానికి సంబంధించి ప్రాథమిక అంశాలు, భావనలు మొదలు తాజా పరిణామాల(రాజ్యాంగ సవరణలు వాటి ప్రభావం) వరకూ అన్నింటినీ తెలుసుకోవాలి. గవర్నెన్స్, లా, ఎథిక్స్‌కు సంబంధించి సుపరిపాలన దిశగా చేపడుతున్న చర్యలు, పబ్లిక్ సర్వీస్‌లో పాటించాల్సిన విలువలు, ప్రజాసేవలో చూపించాల్సిన నిబద్ధత, అంకిత భావం వంటి విషయాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి. న్యాయపరమైన అంశాలపైనా పట్టు సాధించాలి. ప్రాథమిక హక్కులు, విధులు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు.. వీటికి సంబంధించి న్యాయ వ్యవస్థకున్న అధికారాల గురించి తెలుసుకోవాలి. అదే విధంగా సివిల్, క్రిమినల్ లా, కార్మిక చట్టాలు, సైబర్ చట్టాలు, ట్యాక్స్ లాస్ గురించి అధ్యయనం చేయాలి.
- **ఎకానమీ:** మౌలిక భావనలు మొదలు తాజా వృద్ధి రేట్ల వరకూ.. గణాంక సహిత సమాచారం సేకరించుకుని పరీక్షకు సన్నద్ధం కావాలి. ఇటీవల కాలంలో చేపట్టిన ప్రధాన ఆర్థిక సంస్కరణలు, వాటిద్వారా లబ్ధి చేకూరే వర్గాలు; జాతీయ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా తాజాగా తీసుకొచ్చిన విధానాలపై పట్టు సాధించాలి. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు, ఎకనామిక్ సర్వేలపై అవగాహన పొందాలి.
- **సైన్స్ అండ్ టెక్నాలజీ:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో అమలవుతున్న కొత్త విధానాలు, ప్రధాన సంస్థలు, రాష్ట్ర స్థాయిలో ఐసీటీ విధానాలు, ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్, డీఆర్‌డీఓ, ఇంధన వనరులు, విపత్తు నిర్వహణకు అనుసరిస్తున్న సాంకేతిక విధానాలు తదితర అంశాలపై పట్టు సాధించాలి. దీంతో పాటు పర్యావరణ సంబంధిత అంశాలపైనా దృష్టి సారించాలి. అంతర్జాతీయ పర్యావరణ ఒప్పందాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో అమలు చేస్తున్న చట్టాలు, విధానాలపై పట్టు సాధించాలి.
- **సంక్షేమ పథకాలు:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లక్షిత వర్గాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి. నవరత్నాలు.. వాటి పరిధిలో అమలు చేస్తున్న పథకాలు, లబ్ధిదారులు, కేటాయించిన నిధులు వంటి వాటిపై గణాంక సహిత సమాచారంతో సన్నద్ధమవ్వాలి.

పునర్విభజన చట్టం

గ్రూప్స్ అభ్యర్థులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన మరో కీలక అంశం.. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014. జనరల్ స్టడీస్, ఎకానమీ, హిస్టరీ పేపర్లు అన్నింటిలోనూ.. ఈ చట్టం నుంచి ప్రశ్నలు అడిగే అవకాశముంది. కాబట్టి అభ్యర్థులు ఈ చట్టాన్ని ప్రత్యేక దృష్టితో చదవాలి. విభజన తర్వాత ఎదురవుతున్న సవాళ్లు, సమస్యలు.. వాటి పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి అవగాహన పెంచుకోవాలి.

క్లుప్తంగా...

బ్రెయిలీ ప్రెస్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థకు చెందిన బ్రెయిలీ ప్రెస్(గుంటూరు)లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.ఎ.కుమారరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రెయిలీ ప్రెస్‌లో మెషిన్ ఆపరేటర్, బైండరు పోస్టుల భర్తీకి 18 ఏళ్ల నుంచి 42 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారు ఈ నెల 11వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. బయోడేటా, విద్యార్హతలు, అనుభవం వంటి ధ్రువపత్రాలతో 'మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ, డోర్ నంబర్ 74-14-2, రాజనరేంద్ర బిల్డింగ్, మొదటి అంతస్తు, యనమలకుదురు రోడ్డు, కృష్ణ నగర్, విజయవాడ-520007'కు దరఖాస్తు పంపాలని కోరారు. వివరాలకు www.apdascac.ap.gov.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చునని తెలిపారు.

ముగిసిన పాలిటెక్నిక్ ప్రవేశాలు

సాక్షి, అమరావతి: పాలిసెట్-2023 తుది దశ కౌన్సెలింగ్‌లో 2,174 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించినట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, పాలిటెక్నిక్ అడ్మిషన్ల కన్వీనర్ చదలవాడ నాగరాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 67 కళాశాలల్లో 41.4శాతం మేర 34,050 సీట్లు భర్తీ చేశామని పేర్కొన్నారు. కన్వీనర్ కోటాలో 88 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 54.2 శాతం మేర 9,835 సీట్లు, 179 ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలో 37.8 శాతం మేర 24,215 సీట్లను తెలిపారు. తుది దశలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 7వ తేదీలోగా ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాలని సూచించారు.

'ఎస్ఐ' దేహదారుఢ్య పరీక్ష 21కి వాయిదా

కర్నూలు(టౌన్): భారీ వర్షం కారణంగా సోమవారం నిర్వహించాల్సిన రాయలసీమ జోన్ ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఏపీఎస్పీ రెండవ బెటాలియన్‌లో ఎనిమిది రోజులుగా రాయలసీమ జోన్ పరిధిలో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణ

ముఖంపై కోతలు... కడుపులో కత్తిపోట్లు

- ప్రేమోన్మాది చేతిలో గాయపడిన యువతికి శాశ్వత వైకల్యం!

సాక్షి, హైదరాబాద్: ప్రేమోన్మాది శివకుమార్ చేతిలో కత్తిపోట్లకు గురైన యువతికి చికిత్స కొనసాగుతోందని గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దారుణమైన రీతిలో యువతి శరీరంలో అనేక చోట్ల కత్తిపోట్లకు గురైందని వెల్లడించారు. తమ ఆస్పత్రికి తీసుకొచ్చే సమయానికి ఆమె ముఖంపైన కోతలతో సహా అనేకచోట్ల కత్తిపోట్లు ఉన్నాయని, ప్లాస్టిక్ సర్జన్ ముఖానికి అవసరమైన కుట్లు వేసి, ముఖం రూపు మారకుండా చూస్తున్నామని తెలిపారు. కానీ తీవ్రమైన కత్తి దాడి ఫలితంగా గర్భాశయ ప్రాంతానికి సమీపంలో వెన్నుపాముకు ప్రాణాంతకమైన గాయమై ప్రధాన నరాలను తీవ్రంగా ప్రభావితం చేసిందని, దీనివల్ల ఆమె వైకల్యం బారిన పడే ప్రమాదం ఉందని, ఆ పరిస్థితి రాకుండా తమ వైద్యులు కృషి చేస్తున్నారనిచెప్పారు.

ప్రేమోన్మాది శివకుమార్ అరెస్టు

యువతిపై దాడి చేసి, ఆమె తమ్ముడిని హతమార్చిన కేసులో సోమవారం రాత్రి నిందితుడు శివకుమార్‌ను ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పృథ్వీ తండ్రి సురేందర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శివకుమార్‌పై పలు సెక్షన్ల కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎల్‌బీనగర్ సీఐ అంజిరెడ్డి తెలిపారు.

కొడుకు అమ్మకానికి తల్లి బేరసారాలు

ఖలీల్‌వాడి: రూ.లక్షకు కొడుకునుఅమ్మకానికి పెట్టింది ఓ తల్లి. ఇద్దరి వద్ద రూ. 5 వేల చొప్పున అడ్వాన్స్‌గా వసూలు చేసింది. బాబును అప్పగించే విషయంతో జరిగిన గొడవతో విషయం వెలుగుచూసింది. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన అంద్రాగి అలియాస్ గోసంగి దేవి ఈనెల 3న జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే బిడ్డ అమ్మకానికి దేవి ముందుగానే హుబేరాబేగంతో రూ.లక్షకు ఒప్పందం కుదుర్చుకుంది. అడ్వాన్స్‌గా రూ.5 వేలు తీసుకుంది. ఇదే సమయంలో షబానాబేగంతో రూ.లక్షకు ఒప్పందం కుదుర్చుకుని ఆమె వద్ద కూడా రూ.5వేలు అడ్వాన్స్‌గా తీసుకుంది. దేవి సోమవారం ఆస్పత్రి నుంచి ఇంటికి చేరుకుంది. బాబును తమకే ఇవ్వాలని హుబేరా బేగం, షబానాబేగం అంబేడ్కర్ కాలనీలోని దేవి ఇంటి వద్ద గొడవకు దిగారు. విషయం పోలీసులకు చేరడంతో వెళ్లి అందరిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. షబానాబేగం, హుబేరా బేగం, దేవిలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాబు అమ్మకానికి సంజీవ్‌నగర్ కాలనీకి చెందిన ఆశవర్కర్ సహాయం చేసినట్టు పోలీసులు గుర్తించి విచారణ చేపట్టారు.

ప్రైవేటు బస్సుపై ఏనుగు దాడి



ఇటీవల ఏనుగుల గుంపు నుంచి విడిపోయిన ఒంటరి ఏనుగు (హరి) పార్వతీపురం నుంచి రాయగడ వెళ్లే అంతర్ రాష్ట్ర రహదారిపై సోమవారం బీభత్సం సృష్టించింది. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం గదబవలస నుంచి ఆర్తాం గ్రామం వైపు ఒంటరి ఏనుగు వస్తుండగా జనం కేకలు వేశారు. దీంతో ఆంధ్రా-ఒడిశా అంతర్ రాష్ట్ర రహదారిలో వస్తున్న ప్రైవేటు బస్సును డ్రైవర్ నిలిపివేశారు. ఏనుగు ఒక్కసారిగా ఆ బస్సుపై దాడి చేసి అద్దాలు ధ్వంసం చేసింది. రోడ్డుపై కాసేపు హల్‌చల్ చేసి పంట పొలాల్లోకి వెళ్లిపోయింది. – కొమరాడ

పిడుగు పాటుతో కుంగిన భూమి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం బి.దొడ్డవరం గ్రామంలో పిడుగుపాటుకు భూమి కుంగిపోయింది. గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి భారీ ఉరుములు, మెరుపులతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చిమ్మ చీకట్లో అకస్మాత్తుగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయ సమీపంలో ప్రధాన రహదారి పక్కన పిడుగులు పడ్డాయి. సోమవారం ఉదయం లేచి చూసేసరికి పిడుగు పడిన చోట భూమి కుంగిపోయిందని ఆ గ్రామ సర్పంచ్ రామశివ సుబ్రహ్మణ్యం చెప్పారు. – మామిడికుదురు

శ్రీకొండల రాయుడికి తేళ్లే నైవేద్యం



కర్నూలు జిల్లా కోడుమూరులోని శ్రీకొండల రాయుడి సన్నిధిలో వింత ఆచారం దశాబ్దాలుగా కొనసాగుతోంది. తేలు కనిపిస్తేనే భయంతో వణికిపోయే జనం శ్రావణమాసంలో వచ్చే మూడో సోమవారం ఇక్కడ తేళ్లను పట్టుకునేందుకు పోటీపడతారు. కొండపై ఉన్న చిన్న చిన్న రాళ్లను ఎత్తుతూ వాటి కింద చేరిన తేళ్లను ఎలాంటి జంకూబొంకూ లేకుండా చేతులతో పట్టుకుని శ్రీకొండల రాయుడికి ప్రత్యేక పూజలు జరిపి నైవేద్యంగా సమర్పిస్తారు. తేలును పట్టుకునే సమయంలో అది కుట్టినా స్వామి వారి ఆలయం చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణలు చేస్తే తగ్గిపోతుందన్నది ఇక్కడి భక్తుల నమ్మకం. కాగా, సోమవారం శ్రీకొండల రాయుడి సన్నిధిలో భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపి తేళ్లను నైవేద్యంగా సమర్పించారు. – కోడుమూరు రూరల్(కర్నూలు)

ఊరూరా ఆటల పండుగ

38 రోజుల పాటు ఆడుదాం ఆంధ్ర

- దేశ చరిత్రలోనే మెగా క్రీడా టోర్నీకి శ్రీకారం
- గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం
- క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ విభాగాల్లో బాలబాలికలకు పోటీలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'ఆడుదాం ఆంధ్ర' మెగా టోర్నీకి క్రీడాకారులను సమాయత్తం చేస్తోంది. గ్రామ, వార్డు సచివాలయ స్థాయి నుంచి క్రీడా ప్రతిభను ప్రోత్సహించేలా ప్రత్యేక కార్యచరణను రూపొందించింది. దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 34.20 లక్షల మందికిపైగా క్రీడాకారులతో అతిపెద్ద క్రీడా సంబరానికి చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. 17 ఏళ్లకు పైబడిన బాలబాలికలను క్రీడా పోటీలకు ఆహ్వానిస్తోంది. పోటీల నిర్వహణకు వివిధ స్థాయిల్లో అధికారులతో ప్రత్యేక కమిటీలను నియమించింది. క్రీడాకారులు, ఆటస్థలాల గుర్తింపు, వివరాల నమోదు, కిట్ల పంపిణీ, శిక్షణ, పోటీల నిర్వహణ, ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు విజేతలకు బహుమతులు ప్రదానం చేసే బాధ్యతలను ఈ కమిటీలకు అప్పగించింది.

తుదిపోటీలు నవంబర్ 4 నుంచి 8 వరకు

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నారు. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2వ తేదీన ప్రారంభమయ్యే ఈ పోటీలు నవంబర్ 8వ తేదీ వరకు 38 రోజులు జరగనున్నాయి. సచివాలయాల పరిధిలో 8 రోజుల్లో పోటీలను పూర్తిచేస్తారు. అనంతరం 680 మండలాల స్థాయి పోటీలను 12 రోజుల్లోను, 175 నియోజకవర్గాల స్థాయి పోటీలను 6 రోజుల్లోను నిర్వహిస్తారు. తరువాత 26 జిల్లాల స్థాయి పోటీలను వారం రోజుల్లో నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీలకు జట్లను ఎంపిక చేస్తారు. తుది పోటీలను నవంబర్ 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తారు. టోర్నీలో 6,060 ట్రోఫీలతో పాటు 69,084 మెడల్స్, సర్టిఫికెట్లను క్రీడాకారులకు ప్రదానం చేయనున్నారు.

కలెక్టర్ నుంచి సచివాలయ ఉద్యోగి వరకు..

ఆడుదాం ఆంధ్ర మెగా టోర్నీలో ప్రభుత్వం అధికారుల్ని, ఉద్యోగుల్ని భాగస్వాములను చేసింది. కలెక్టర్ నుంచి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగి వరకు టోర్నీని పర్యవేక్షించనున్నారు. గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో పోటీ నిర్వహణ కమిటీలో పంచాయతీ సెక్రటరీ/వార్డు అడ్మిన్ సెక్రటరీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. గ్రామ రెవెన్యూ అధికారి/వార్డు రెవెన్యూ కార్యదర్శి, పాఠశాల హెచ్‌ఎం/ప్రిన్సిపాల్/ సీనియర్ ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు/వైద్యశాఖ సిబ్బంది సభ్యులుగా ఉంటారు. మండలస్థాయిలో ఎంపీడీవో/మున్సిపల్ చైర్మన్ నిర్వహణ కమిటీ చైర్మన్‌గా, తహసీల్దార్, ఎండీవో, ఈవోపీఆర్డీ, ఎస్ఐ, మెడికల్ ఆఫీసర్ సభ్యులుగా ఉంటారు. నియోజకవర్గస్థాయిలో ఆర్డీవో/నియోజకవర్గ ప్రత్యేక అధికారి లేదా ఇతర విభాగాల్లో హెచ్‌వోడీని చైర్మన్‌గా నియమిస్తారు. డీఎల్‌డీవో/ఎంపీడీవో/మున్సిపల్ కమిషనర్, నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దార్, డిప్యూటీ ఈవో/ఎంఈవో, సీఐ, డిప్యూటీ డీఎంహెచ్‌వో సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ వైస్ చైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్ నోడల్ ఆఫీసర్‌గా పోటీలను పర్యవేక్షించనున్నారు. వీరితోపాటు స్టెప్ సీఈవో, డీఈవో, జెడ్పీ సీఈవో, ఉన్నతవిద్య, సాంకేతికవిద్య ఆర్జేడీలు, బీసీ, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖల డీడీలు, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ డీసీవో, డీఆర్‌డీఏ పీడీ/మెప్మా పీడీ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వరకు పోటీలను ప్రణాళిక ప్రకారం నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయి పోటీలను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు.

ఒక్కో సచివాలయం నుంచి 228 క్రీడాకారుల పోటీ

ఆడుదాం ఆంధ్రలో భాగంగా ప్రభుత్వం క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విభాగాల్లో విజేతలకు నగదు ప్రోత్సాహకాలతో పోటీలను నిర్వహించనుంది. వీటితో పాటు 3కే మారథాన్, యోగా, టెన్నికాయిట్ వంటి సంప్రదాయ క్రీడాపోటీలను ఏర్పాటు చేస్తోంది. రాష్ట్రంలో మొత్తం 15,004 గ్రామ, వార్డు సచివాలయాలున్నాయి. ఒక్కో సచివాలయం పరిధిలో.. ఒక్కో క్రీడా విభాగంలో బాలబాలికల నుంచి రెండేసి జట్లు పాల్గొంటాయని అంచనా వేస్తోంది. ఈ క్రమంలోనే ఒక్కో సచివాలయం నుంచి 228 మంది క్రీడాకారులు పోటీపడనున్నారు.

క్రీడల వారీ ఒక్కో జట్టులో సభ్యుల సంఖ్య ఇలా..

క్రికెట్	16
బ్యాడ్మింటన్	02
వాలీబాల్	12
కబడ్డీ	12
ఖోఖో	15

పాల్గొనే క్రీడాకారుల సంఖ్య

గ్రామ/వార్డు సచివాలయ స్థాయి:	34.20 లక్షలు
మండల స్థాయి:	17.10 లక్షలు
నియోజకవర్గ స్థాయి:	77,520
జిల్లా స్థాయి:	19,950
రాష్ట్ర స్థాయి:	2,964

పోటీల నిర్వహణ షెడ్యూల్

గ్రామ/వార్డు సచివాలయస్థాయి: అక్టోబర్ 2 నుంచి 9 వరకు	నియోజకవర్గస్థాయి: అక్టోబర్ 22 నుంచి 27 వరకు
మండలస్థాయి: అక్టోబర్ 10 నుంచి 21 వరకు	జిల్లాస్థాయి: అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3 వరకు
రాష్ట్రస్థాయి: నవంబర్ 4 నుంచి 8వ తేదీ వరకు	

వైద్య విద్య పీజీ సీట్ల కేటాయింపు

- తొలి దశలో నాన్ సర్వీస్ విద్యార్థులకు..
- కన్వీనర్ కోటాలో 1,085కు 999 సీట్లు భర్తీ
- 8న కళాశాలల్లో రిపోర్ట్ చేయాలి



సాక్షి, అమరావతి: వైద్య విద్య పీజీ కోర్సుల్లో 2023-24 విద్యా సంవత్సరానికి కన్వీనర్, యాజమాన్య కోటా సీట్ల భర్తీలో భాగంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సోమవారం నాన్-సర్వీస్ విద్యార్థులకు తొలి దశ కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయించింది. విద్యార్థులు ఈ నెల 8 మధ్యాహ్నం మూడు గంటల్లోగా కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని సూచించింది. కన్వీనర్ కోటాలో 1,085 సీట్లకు గాను 999 సీట్లు, యాజమాన్య కోటాలో 784కు గాను 551 సీట్లు భర్తీ అయ్యాయి. పలు వైద్య కళాశాలల్లో పీజీ సీట్ల పెంపునకు సంబంధించి నకిలీ అనుమతులు వెలువడిన నేపథ్యంలో ఇప్పటివరకు నిర్వహించిన కౌన్సెలింగ్ మొత్తాన్ని వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రద్దు చేసిన సంగతి తెలిసిందే. మళ్లీ మొదటి నుంచి కౌన్సెలింగ్ చేపట్టింది. నకిలీ అనుమతులు వెలువడ్డ 113 సీట్లను కౌన్సెలింగ్ నుంచి తొలగించి నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) వాస్తవంగా అనుమతించిన 2,422 సీట్లకు తిరిగి కౌన్సెలింగ్ నిర్వహిస్తోంది.

ఆగస్టు 30న నంద్యాల జిల్లా శాంతిరాం కళాశాలలో నకిలీ అనుమతులతో పీజీ సీట్ల పెంపుదల అంశం వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం దృష్టికి వచ్చింది. ఈ క్రమంలో వెంటనే అప్రమత్తమైన ప్రభుత్వం కౌన్సెలింగ్ ప్రక్రియను రద్దు చేసింది. ఎన్ఎంసీ నుంచి ఎటువంటి ఆదేశాలు లేనప్పటికీ మన విద్యార్థులకు అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతో మిగిలిన కళాశాలల్లో పీజీ సీట్ల వ్యవహారంపై దృష్టి పెట్టింది. దీంతో జీఎస్ఎల్, మహారాజా కళాశాలల్లోనూ నకిలీ సీట్ల పెంపుదల వ్యవహారం వెలుగు చూసింది. ఈ అంశాన్ని ప్రభుత్వం ఎన్ఎంసీ దృష్టికి తీసుకెళ్లగా ఆ రెండు కళాశాలల్లో పెరిగిన సీట్లకు అనుమతులు లేవని వివరణ ఇచ్చింది. ఈ నేపథ్యంలో మొత్తం కౌన్సెలింగ్ ప్రక్రియను వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రద్దు చేసింది.

విజయవాడలో కస్టమ్స్ ప్రివెంటివ్ డివిజన్

- స్మగ్లింగ్ కట్టడికి కార్యాచరణ

సాక్షి, అమరావతి: విదేశాల నుంచి రాష్ట్రంలోని తీరప్రాంతం ద్వారా స్మగ్లింగ్ నిరోధానికి కేంద్ర కస్టమ్స్ శాఖ సమాయత్తమవుతోంది. పొడవైన తీరప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్‌ను స్మగ్లింగ్ దుర్భేద్యంగా చేసేందుకు కార్యాచరణ రూపొందించింది. అందుకోసం రాష్ట్రంలో తొలిసారిగా మోడల్ కస్టమ్స్ ప్రివెంటివ్ డివిజన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈమేరకు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) రూపొందించిన విస్తృత ప్రణాళికలో రాష్ట్రానికి తగిన ప్రాధాన్యమిచ్చింది. దేశంలో తొలిసారిగా ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయనున్న ఏడు మోడల్ కస్టమ్స్ ప్రివెంటివ్ డివిజన్లలో విజయవాడకు స్థానం కల్పించింది. విజయవాడ కేంద్రంగా రాష్ట్రంలో మోడల్ కస్టమ్స్ ప్రివెంటివ్ డివిజన్‌ను ఏర్పాటు చేయనున్నారు. తూర్పు తీరంలో తమిళనాడు, పశ్చిమ తీరంలో గుజరాత్ నుంచి అత్యధికంగా స్మగ్లింగ్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. వాటిని నిరోధించేందుకు నౌకాదళం, మెరైన్ పోలీస్ విభాగాలను సమన్వయం చేసుకుంటూ అక్రమ రవాణా, చొరబాట్లను అడ్డుకునేందుకు కార్యాచరణకు ఉపక్రమించాలని అధికారులు నిర్ణయించారు.

డివిజన్‌కు వంద ఆయుధాలు

ఆగ్నేయాసియా దేశాల నుంచి బంగారం, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, ఇతర ఉత్పత్తులను అక్రమంగా దేశ తూర్పు తీరంలోని పశ్చిమబెంగాల్ నుంచి తమిళనాడు వరకు చేరుస్తున్నారు. ఆ స్మగ్లింగ్ దందాను అరికట్టేందుకు సంప్రదాయ విధానాల స్థానంలో ఆధునిక వ్యవస్థను ప్రవేశపెట్టాలని కేంద్రం నిర్ణయించింది. అందుకోసమే ఏడు మోడల్ కస్టమ్స్ ప్రివెంటివ్ డివిజన్లను రూపొందించింది. ఈ డివిజన్లకు దాదాపు 30 మంది అధికారులు, సిబ్బందిని కేటాయించనుంది. వారికి గుజరాత్‌లోని 'నేషనల్ అకాడమీ ఆఫ్ కోస్టల్ పోలీసింగ్' కేంద్రంలో శిక్షణనిస్తారు. సముద్రంలో గస్తీ విధుల కోసం అత్యాధునిక డ్రోన్లను సమకూరుస్తారు. జెట్టీలు ఏర్పాటు చేసి స్పీడ్ బోట్లు, ఆధునిక ఇన్‌స్పెక్షన్ వెసల్స్, నావిగేషన్ పరికరాలు, ప్రివెంటివ్ కిట్లు, బైనాక్యులర్స్, సెర్చ్‌లైట్లు మొదలైనవి ఏర్పాటు చేస్తారు. సముద్రంలోను, తీరప్రాంతంలోను గస్తీ విధులు నిర్వర్తించే కస్టమ్స్ అధికారులకు ఆయుధాలు సమకూర్చనున్నారు. డివిజన్‌కు దాదాపు 100 ఆయుధాలు కేటాయించాలని కస్టమ్స్ శాఖ ఇప్పటికే నిర్ణయించింది.

లొంగిపోయిన టీడీపీ నేత చల్లా బాబు

మరో 66 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా లొంగుబాటు



అరెస్టయిన నిందితులు

పుంగనూరు/చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా పుంగనూరు విధ్వంసం కేసులో ప్రధాన నిందితుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి(చల్లా బాబు) సహా 67 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆగస్టు 4వ తేదీన టీడీపీ అధినేత చంద్రబాబు అన్నమయ్య జిల్లాలోని అంగళ్లులో, చిత్తూరు జిల్లా పుంగనూరులో రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. అప్పటికే పన్నిన పక్కా కుట్రతో టీడీపీ నేతలు, కార్యకర్తలు, కిరాయి మూకలు రాళ్లు, కట్టెలతో దాడి చేసి సుమారు 47 మంది పోలీసులను గాయపరిచారు. రెండు పోలీస్ వాహనాలను తగలబెట్టారు. రణధీర్ అనే కానిస్టేబుల్ కంటి చూపు కోల్పోయాడు. ఈ విధ్వంసానికి సంబంధించి ఇప్పటివరకు 277 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు చల్లా బాబు సహా నిందితులంతా పారిపోగా.. పోలీసులు ఇప్పటికే 110 మందిని అరెస్టు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

గత్యంతరం లేని పరిస్థితుల్లో...

టీడీపీ నేత చల్లా బాబును అదుపులోకి తీసుకునేందుకు జిల్లా పోలీస్ శాఖ 4 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించింది. పోలీసులకు దొరకకుండా ఉండేందుకు చల్లా బాబు తన సెల్‌ఫోన్ పడేసి.. కొత్త ఫోన్ తీసుకున్నాడు. సిమ్‌కార్డులు మార్చేస్తూ ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో తిరిగినట్లు తెలిసింది. ఎన్నిసార్లు మకాం మార్చేసినా పోలీసులు సమీపిస్తుండటంతో చల్లా బాబుతో పాటు టీడీపీ మూకల్లో ఆందోళన తలెత్తింది. ఈ నేపథ్యంలో తనపై నమోదైన 7 కేసుల్లో బెయిల్ కోరుతూ చల్లా బాబు హైకోర్టుకు వెళ్లగా.. న్యాయస్థానం మూడు కేసుల్లో బెయిల్ నిరాకరించింది. ఇక తిరగలేక, తప్పించుకోలేక చల్లా బాబు సహా 67 మంది నిందితులు సోమవారం పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. వారికి మద్దతుగా టీడీపీ నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పల్లె రఘునాథరెడ్డి, దొరబాబు, సుగుణమ్మ తదితరులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్తలు కొద్దిసేపు పోలీస్‌స్టేషన్ వద్ద నినాదాలు చేస్తూ హల్‌చల్ చేశారు. కాగా, ఆదివారం రాత్రి పుంగనూరుకు చెందిన సద్దామ్ హుస్సేన్, ఇమ్రాన్, ఫయాజ్, షామీర్, నూరుల్లాను రిమాండ్‌కు పంపించారు.



పుంగనూరు పోలీస్‌స్టేషన్ వద్ద చల్లా బాబు. పక్కన పల్లె రఘునాథరెడ్డి తదితరులు

పూచీకత్తు సమర్పించిన దేవినేని ఉమా

మదనపల్లె: అంగళ్లులో జరిగిన అల్లర్ల కేసులో బెయిల్ పొందిన టీడీపీ నేత దేవినేని ఉమా సోమవారం మదనపల్లె డీఎస్పీ కార్యాలయంలో రూ.2 లక్షల బాండ్, ఇద్దరు జామీనుదారులను పూచీకత్తుగా సమర్పించారు.

మారుతున్న ఎన్‌సీఈఆర్టీ సిలబస్

నేటి అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాల్లో సమూల మార్పులు

- బోధనాభ్యసన మెటీరియల్‌లోనూ మార్పులు
- 3 నుంచి 12వ తరగతి వరకు పాఠ్య పుస్తకాల పునఃసమీక్ష.. వివిధ రంగాల ప్రముఖులతో ఎన్ఎస్‌టీసీ పేరుతో కమిటీ
- కమిటీలో సుధామూర్తి, శంకర్ మహదేవన్ తదితర 19 మంది
- వచ్చే విద్యాసంవత్సరానికల్లా కొత్త పుస్తకాలు
- నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్ మార్గదర్శకాలను అనుసరించి కసరత్తు
- అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు, దేశ సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట



సాక్షి, అమరావతి: దేశంలో విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చి దిద్దే లక్ష్యంతో 3 నుంచి 12 తరగతుల సిలబస్, పాఠ్య పుస్తకాల రూపురేఖల్లో సమూల మార్పులు తేవాలని జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) నిర్ణయించింది. నూతన విద్యా విధానానికి అనుగుణంగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలుండేలా వీటిని రూపొందించనుంది. పిల్లల్లో భారతీయ సాంస్కృతిక వారసత్వం, జాతీయతా భావాలను పెంపొందించడం, సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, వంటి వాటిపై అవగాహన పెంచడం, అంతర్జాతీయ స్థాయిలో మారుతున్న పరిజ్ఞానం, సాంకేతిక విజ్ఞానాన్ని అందుకొనేలా తీర్చిదిద్దే లక్ష్యంతో నూతన పాఠ్యాంశాలకు రూపకల్పన చేస్తోంది. ఇందుకోసం 19 మంది సభ్యులతో కమిటీని ఇటీవల ఏర్పాటు చేసింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలో నేషనల్ సిలబస్ అండ్ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ కమిటీ (ఎన్ఎస్‌టీసీ)గా దీనిని వ్యవహరిస్తారు. వచ్చే విద్యాసంవత్సరానికి కొత్త పాఠ్యపుస్తకాలను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టనున్నారు. దీంతోపాటు 1, 2 తరగతుల పాఠ్యాంశాలను కూడా ఈ కమిటీ పరిశీలన చేస్తుందని ఎన్‌సీఈఆర్టీ ఇటీవల విడుదల చేసిన ఒక నోట్‌లో పేర్కొంది. ఎన్‌సీఈఆర్టీ పాఠ్య పుస్తకాల్లో కొన్ని పాఠ్యాంశాలను తొలగించి, కొత్త అంశాలను చేర్చడంతో ఇటీవల కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. కేంద్రంలోని అధికార పార్టీ రహస్య అజెండా ప్రకారం పాఠశాల స్థాయి సిలబస్‌ను నచ్చిన రీతిలో మార్చేసి, చారిత్రకపరమైన అనేక అంశాలను తొలగిస్తోందని, చరిత్రను వక్రీకరిస్తోందని మేధావుల నుంచి విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఎన్ఎస్‌టీసీ పేరుతో ఈ కొత్త కమిటీని ఏర్పాటుచేసింది.

11 అంశాలపై కమిటీ దృష్టి

- ఈ కమిటీ 3 నుంచి 12వ తరగతి వరకు ఉన్న ఎన్సీఈఆర్టీ సిలబస్‌ను క్షుణ్నంగా పరిశీలించి, నూతన పాఠ్యాంశాలపై సూచనలు చేస్తుంది.
- పాఠ్యపుస్తకాల సిలబస్, బోధనాభ్యసన మెటీరియల్‌తో సహా అన్ని అంశాలపైనా కసరత్తు చేస్తుంది.
- నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్‌లోని మార్గదర్శకాలకు అనుగుణంగా మార్పులు చేస్తుంది
- గణితం, సైన్సు, ఫిజికల్ ఎడ్యుకేషన్, సాంఘిక శాస్త్రం సహా నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్‌లో పొందుపరిచిన 11 అంశాలపై ఈ కమిటీ దృష్టి సారిస్తుంది.
- సమగ్ర విద్యావిధానానికి వీలుగా ఈ కమిటీ 11 కరిక్యులమ్ ఏరియా గ్రూపు (సీఏజీ)లను ఏర్పాటుచేస్తుంది.
- ఈ గ్రూపులు సిలబస్‌లోని వివిధ సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలు, బోధనాభ్యసన మెటీరియల్ అభివృద్ధికి ఎన్ఎస్‌టీసీకి సహకారాన్ని అందిస్తాయి.
- కొత్త పాఠ్యాంశాల రూపకల్పనలో ఆయా సబ్జెక్టుల్లోని నిపుణులను భాగస్వాములను చేస్తారు.

ఇదీ కమిటీ..

- చైర్‌పర్సన్: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఐఈపీఏ) చాన్సలర్ పంత్
- కో చైర్‌పర్సన్: ప్రిన్స్‌టన్ (యూఎస్) యూనివర్సిటీ ప్రొఫెసర్ మంజుల్ భార్గవ్
- సభ్యులు: ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి, ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్, ప్రధాన మంత్రి ఆర్థిక సలహామండలి (ఈఏసీపీఎం) చైర్మన్ బిబేక్ దేబ్రాయ్, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ మాజీ డైరెక్టర్ జనరల్ శేఖర్ మండే, ప్రకాశ్ పడుకొనే బ్యాడ్మింటన్ అకాడమీ డైరెక్టర్ విమల్‌కుమార్, భారతీయ భాషా సమితి చైర్‌పర్సన్ చాము కృష్ణ శాస్త్రి, ఈఏసీపీఎం సభ్యుడు సంజీవ్ సన్యాల్, ప్రముఖ గణిత శాస్త్రవేత్త సుజాత రాందొరై, సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ చైర్‌పర్సన్, ఎండీ శ్రీనివాస్ తదితరులు

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.